

'పారిశ్రామిక రంగానికి దీటుగా సేద్యరంగం ఎదగాలి. వ్యవసాయ ఫలాలు పదింతలు పెరగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 168

గురువారం 7-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పెట్రో ధరలు పెరిగే అవకాశం!

2023లో మొదటిసారి 90 డాలర్ల చేరువకు క్రూడ్ -13లో



సీఎం సార్.. ఆశీర్వదించండి..

అమెరికాకు చదువుకునేందుకు వెళ్లిన ఏపీ గురుకుల విద్యార్థుల మనోగతం. -11లో



ఆ 9 అంశాలపై చర్చించండి..

పార్లమెంటు సమావేశాల్లో ధరలు, మణిపూర్‌లో హింస తదితర కీలకాంశాలపై చర్చించాలని ప్రధాని మోదీకి సోనియా లేఖ రాశారు.

- వివరాలు 6లో



ఆ ఒక్క బిస్కెట్ విలువ రూ. లక్ష !

ప్యాకెట్‌లో ఒక్క బిస్కెట్ తగ్గినందుకు తయారీ సంస్థకు తమిళనాడు వినియోగ దారుల ఫోరమ్ జరిమానా విధించింది.

- వివరాలు 6లో



ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేలపై కేసు

మతవిశ్వాసాలకు భంగం కలిగించినందుకు డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్, ప్రియాంక్ ఖర్గేలపై ఉత్తరప్రదేశ్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది.

- వివరాలు 6లో



ఐఐటీ మండీలో ర్యాగింగ్ ఘటన

ఐఐటీ–మండీలో జూనియర్‌లను ర్యాగింగ్ చేసిన 10 మంది సీనియర్లను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది.

- వివరాలు 6లో

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు..

16న జాతికి అంకితం



కృష్ణాతీరంలో కోతి గుండు (జీరోపాయింట్) వద్ద పూర్తయిన హెడ్ రెగ్యులేటరీ నిర్మాణ పనులు

- మోటార్లు ఆన్ చేసి, రిజర్వాయర్ వద్ద పూజలు చేయనున్న సీఎం కేసీఆర్
- ఇన్‌టేక్‌వెల్ నుంచి నార్లాపూర్ జలాశయంలోకి కృష్ణా జలాల ఎత్తిపోత
- అనంతరం మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతులతో బహిరంగ సభ
- ప్రాజెక్టు ప్రగతిపై సీఎం సమీక్ష
- 'పాలమూరు'తో దక్షిణ తెలంగాణ తాగు, సాగునీటి అవసరాలు తీరుతాయి
- ఈ ప్రాంత ప్రజలకు ఇది పండుగ రోజు..
- ప్రతి పల్లెకు కృష్ణా జలాలను కలశాలలో తీసుకెళ్లి మొక్కులు తీర్చుకోవాలన్న కేసీఆర్

ప్రపంచంలోనే భారీ పంపులతో..

ప్రపంచంలో మరెక్కడా లేనంత భారీ పంపులతో నిర్మించిన 'పాలమూరు' ప్రాజెక్టుతో దక్షిణ తెలంగాణ ప్రజల తాగు, సాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఉమ్మడి పాలనలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాజెక్టుకు స్వరాష్ట్రంలో మోక్షం లభించడం చరిత్రాత్మకం. దశాబ్దాల కల సాకారమవుతున్న ఈ సందర్భంలో దక్షిణ తెలంగాణ రైతాంగానికి, ప్రజలకు ఇది గొప్ప పండుగ రోజు. ప్రాజెక్టును ప్రారంభించిన మరునాడు (సెప్టెంబర్ 17 న) ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో పల్లెపల్లెనా ఊరేగింపులతో సంబురంగా జరుపుకోవాలి.

- సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పాలమూరు-రంగారెడ్డి' ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ నెల 16న మధ్యాహ్నం ఈ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. తొలుత బటన్ నొక్కి నార్లాపూర్ ఇన్‌టేక్ వెల్ వద్దనున్న బాహుబలి పంపులను కేసీఆర్ ఆన్ చేస్తారు. పంపుల నుంచి కృష్ణా జలాలు సమీపంలోని నార్లాపూర్ రిజర్వాయర్‌కు చేరుతాయి. సీఎం కేసీఆర్ వెంటనే రిజర్వాయర్ వద్దకు చేరుకుని.. కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో సీఎం కేసీఆర్ సమీక్షించారు. ఈ భేటీలో సీఎం చెప్పిన అంశాలు, సూచనలు ఆయన మాటల్లోనే..



''తలాపున కృష్ణమ్మ పారుతున్నా.. నాటి ఉమ్మడి పాలకుల నిర్లక్ష్యం, వివక్షతో తాగు, సాగునీటికి నోచుకోక ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలు అనేక కష్టాలను అనుభవించాయి. పాలమూరులో గంజి కేంద్రాలను నడిపించిన దుస్థితి నాటి పాలకులది. ఎటుచూసినా వలసలే కనిపించేవి. జిల్లా ప్రజల బాధలను చూసిన గోరటి వెంకన్న వంటి పాలమూరు కవులు

మిగతా 10వ పేజీలో ▶

100 సీట్లలో ఒక్కో పేరే!

- అసెంబ్లీ అభ్యర్థుల ఎంపికపై కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ నిర్ణయం
- తాజ్‌కృష్ణలో భేటీ.. హాజరైన మురళీధరన్, ఠాక్రే, ఉత్తమ్, రేవంత్, భట్టి, ఏఐసీసీ కార్యదర్శులు
- పీఈసీ నివేదికపై విస్తృతంగా చర్చ..
- టికెట్ల ఖరారు ప్రాథమ్యాలను వివరించిన ఉత్తమ్, రేవంత్, భట్టి
- ఏమీ తేల్చకుండానే ముగిసిన భేటీ

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖరారు ప్రక్రియను దాదాపుగా రాష్ట్రంలోనే పూర్తి చేయాలని.. 100 నియోజకవర్గాలకు ఒక్కో అభ్యర్థి పేరుతోనే అధిష్టానానికి జాబితాలను పంపాలని కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ నిర్ణయించింది. బుధవారం హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశమై ఈ అంశంపై చర్చించింది. కమిటీ చైర్మన్ మురళీధరన్‌తోపాటు సభ్యులు మాణిక్‌రావ్ ఠాక్రే, సిద్ధిఖీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి,

మిగతా 2వ పేజీలో ▶



ఎల్‌బీ స్టేడియంలో ఉత్తమ్‌కుమార్‌తో మాట్లాడుతున్న కేసీ వేణుగోపాల్. చిత్రంలో మాణిక్ రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, పొంగులేటి

తుక్కుగూడలో కాంగ్రెస్ సభ

- వివరాలు 2లో

సాగుకు పగలు మాత్రమే విద్యుత్!

- దేశంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్రం సూచనలు
- సూర్యాస్తమయం తర్వాత కూడా భారీగా వినియోగం
- అందువల్ల వ్యవసాయ విద్యుత్‌ను పగటిపూటకే పరిమితం చేయాలి
- అన్ని ప్లాంట్లలో గరిష్ట సామర్థ్యంతో ఉత్పత్తి చేయాలి - 5లో
- జల విద్యుదుత్పత్తిపై ఆచితూచి వ్యవహరించాలని స్పష్టీకరణ

రాష్ట్రంలో 'తబ్రీద్' పెట్టుబడి

రూ.1,600 కోట్లు

డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం ఏర్పాట్ల కోసం ముందుకొచ్చిన సంస్థ

- తెలంగాణలో 1.25 లక్షల టన్నుల రిఫ్రిజిరేషన్ కూలింగ్ వసతుల కల్పన
- దుబాయ్‌లో కేటీఆర్ సమక్షంలో ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం
- పారిశ్రామిక పార్కులు, వాణిజ్య ప్రాంతాలకు కూలింగ్, మౌలిక వసతుల కల్పన చేపట్టనున్న తబ్రీద్

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత శీతలీకరణ కార్యకలాపాల సంస్థ తబ్రీద్ తెలంగాణలో భారీ పెట్టుబడులకు ముందుకొచ్చింది. రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల అభివృద్ధిలో భాగంగా చేపట్టే కూలింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆయా పారిశ్రామిక పార్కుల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలకు అవసరమైన శీతలీకరణ మౌలిక వసతుల) కోసం దాదాపు రూ.1600 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించింది. హైదరాబాద్ ఫార్మా సిటీతో పాటు రాష్ట్రంలోని పారిశ్రామిక పార్కుల అవసరాల మేరకు ఈ సంస్థ కూలింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయనుంది. ఈ క్రమంలో సంస్థ 1.25 లక్షల రిఫ్రిజిరేషన్ టన్నుల కూలింగ్ మౌలిక వసతులను రాష్ట్రంలో అభివృద్ధి చేయనుంది. తద్వారా 24 మిలియన్ టన్నుల మిగతా 3వ పేజీలో ▶

ఎక్కడి దొంగలు.. అక్కడే!

అడ్డంగా దొరికి... అరెస్టు చేస్తారేమోనంటూ బాబు మంత్రం
ఐటీ నోటీసులపై, అవినీతి వ్యవహారంపై ష్.. గప్‌చుప్



- ఐటీ శాఖ సాక్ష్యాధారాలతో సహా నోటీసులిచ్చినా బుకాయింపు
- పదేపదే వాళ్ల అధికారాన్ని ప్రశ్నిస్తూ... అవినీతిపై మాత్రం మాట్లాడని తీరు
- పైపెచ్చు నన్ను అరెస్టు చేస్తారంటూ కార్యకర్తలను రెచ్చగొట్టే యత్నం
- తద్వారా శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలన్నది ప్రణాళిక
- నిర్మాణ కాంట్రాక్టులు, స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికిన టీడీపీ నేత
- రెండుచోట్లా ఒకటే నెట్‌వర్క్; బాబు ఇంటికి ముడుపులు చేర్చింది వారే
- పుణె, ముంబై, ఢిల్లీ మీదుగా హైదరాబాద్ ఇంటికి అక్రమ నిధులు
- విదేశాల నుంచి సైతం హవాలా మార్గంలో బాబు బంగ్లాకే తరలింపు
- దేశమంతా గగ్గోలు పుడుతున్నా నోరువిప్పని పెదబాబు, చినబాబు

10లో

అరెస్టు.. పదేళ్ల జైలు!




- లేదంటే చంద్రబాబుకు జీవిత ఖైదు విధించే చాన్స్
- ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎలాంటి పదవులూ చేపట్టకుండా అనర్హత వేటు పడుతుంది
- గతంలో మాదిరిగా ఆయన ఈసారి తప్పించుకోలేరు
- ఐటీ నోటీసులో ఉన్నవి తీవ్ర ఆరోపణలు
- ఈ కేసులో స్టే తెచ్చుకోవడం సాధ్యం కాదు
- లోకేష్ పాత్రపైనా ఆధారాలు.. విచారణ ఎదుర్కోక తప్పదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు బీఎస్ రాంబాబు

10లో

న్యూస్‌రీల్

కోమటిరెడ్డి అలక



ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అలకపాన్పు ఎక్కారు. కాంగ్రెస్ అభ్యర్థుల ఖరారులో భాగంగా జరిగిన తొలి పీఈసీ భేటీకి కోమటిరెడ్డి హాజరు కాగా, ఇటీవల జరిగిన మలి సమావేశానికి డుమ్మా కొట్టారు. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌తో జరిగిన భేటీకీ రాలేదు.

- వివరాలు 2లో

15 కొత్త రైల్వే లైన్లకు మోక్షం



రాష్ట్రంలో 15 కొత్త రైల్వే ప్రాజెక్టులను నిర్మించేందుకు రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. 2,647 కి.మీ. నిడివితో నిర్మించే ఆ ప్రాజెక్టులకు రూ.50,848 కోట్లు వ్యయం కానున్నట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ప్రకటించింది.

- వివరాలు 2లో

త్వరలో ఇంటర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్ల బదిలీలు..



ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బంది బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని విద్యాశాఖ మంత్రి సబిత ఆదేశించినట్టు తెలిసింది.

- వివరాలు 3లో

18న వినాయకచవితి.. 28న నిమజ్జనం



వినాయకచవితి ఎప్పుడు జరుపుకోవాలనే విషయంలో నెలకొన్న గందరగోళానికి భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ్ సమితి తెరదించింది. ఈనెల 18వ తేదీన వినాయకచవితి.. 28న నిమజ్జనం ఉంటుందని వెల్లడించింది.

- వివరాలు 14లో

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Venco Chicken | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

Eggs Retail Rate	Ex Farm Live Bird	134 kg	Dressed with Skin	226 kg
₹ 60 per dozen	Retail Live Bird	156 kg	Skin Less	257 kg

Issued in the interest of consumers



అలాగే బీహార్ సీఎంకు కూడా ఫోన్ చేయమంటున్నారు!



రియల్ బాహుబలి సీన్ | కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్‌లో చిన్నారిని చేతులతో ఎత్తిపట్టుకుని వాగు దాటుతున్న చిన్నారి బాబాయి.. - 14లో

నైరుతి వానలన్నీ పడ్డట్టే!

- మొత్తం సీజన్ సాధారణ వర్షపాతానికి సరిపడా ఇప్పటికే కురిసిన వానలు
- సెప్టెంబర్ 30 వరకు కురవాల్సింది 72.1 సెం.మీ. ఇప్పటికే కురిసినది 74.35 సెంటీమీటర్లు
- ఇకపై పడేదంతా అధికవర్షపాతమే

వర్షం ఉంటే బడులకు సెలవులివ్వండి..

- జిల్లా అధికారులకు విద్యాశాఖ ఆదేశం.. పరిస్థితిని బట్టి జిల్లా యంత్రాంగమే నిర్ణయం తీసుకోవాలని సూచన
- సాధారణ సెలవులు తగ్గించి సిలబస్ పూర్తి చేయాలని స్పష్టీకరణ

14లో

వరద గోదావరి ఉగ్ర రూపం ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత..



ఢిల్లీలో విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్న జీ-20 సమావేశాలు జరిగే భవనం

అధికారిక కార్లు వాడొద్దు

జీ-20 సమావేశాల నేపథ్యంలో కేంద్ర మంత్రులకు ప్రధాని ఆదేశం..



న్యూఢిల్లీ: జీ–20 సమావేశాల్లో విందు వేదికను చేరుకోవడానికి అధికారిక కార్లను వాడొద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గ సహచరులకు సూచించారు. బుధవారం జరిగిన భేటీలో మంత్రులకు ప్రొటోకాల్‌ను వివరించారు. భారత్‌కు వస్తున్న వివిధ దేశాల బృందాలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా మసలుకోవాలని సూచించారు. ప్రధాన వేదిక భారత మండపం, ఇతర వేదికలను చేరుకోవడానికి షటిల్ సర్వీసును ఉపయోగించుకోవాలని చెప్పారు.తాము బాధ్యత వహిస్తున్న విదేశీ బృందాలకు సంబంధించి ఆచారవ్యవహారాలను తెలుసుకోవాలని మంత్రులను కోరారు. వారి సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని.. అందుకు అనుగుణంగా ఆతిథ్యమివ్వాలని చెప్పారు. జీ–20 సమావేశాలకు సంబంధించి అధీకృత వ్యక్తులు తప్పితే మరెవరూ మీడియాతో మాట్లాడవద్దని సూచించారు. ఈనెల 9న జరిగే రాత్రి విందుకు ఆహ్వానించిన ముఖ్యమంత్రులందరూ సొంత కార్లలో మిగతా 6వ పేజీలో ▶

జీ20: ఎందుకు.. ఏమిటీ?

- వివరాలు 6లో

భారత మూలాలు... నాకెంతో గర్వకారణం..!

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ - 6లో

డీపీల మార్ఫింగ్! ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- గడ్డిమందు తాగిన ఇద్దరు డిగ్రీ విద్యార్థినులు
- ఎవరో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆత్మహత్యాయత్నం
- నల్లగొండ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- కాలేజీకి వెళ్తున్నామని ఇంట్లో చెప్పి వెళ్లిన స్నేహితులు



శివాని, మనీషా (ఫైల్)

నల్లగొండ క్రైం/ నార్కట్‌పల్లి: ఇన్‌స్టా గ్రామ్ ప్రొఫైల్‌లో తమ ఫొటోలను మార్ఫింగ్ చేసి ఎవరో బెదిరిస్తున్నారని మనస్తాపం చెందిన ఇద్దరు విద్యార్థినులు బలవన్మరణానికి పాల్పడ్డారు. సెలవుల అనంతరం మంగళవారం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిన స్నేహితులు విగతజీవులుగా మారడం కుటుంబాల్లో విషాదం నింపింది. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దొంతరబోయిన శివాని (18), అదే మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన అనుగూతల మనీషా (18)లు ఇంటర్ కలిసి చదివారు. ప్రస్తుతం నల్లగొండలోని ప్రభుత్వ మహిళా మిగతా 5వ పేజీలో ▶

జయరాజ్‌కు కాళోజీ పురస్కారం

ఈ నెల 9న ప్రదానం



సాక్షి, హైదరాబాద్/మహబూబాబాద్: ఈ ఏడాది కాళోజీ పురస్కారానికి ప్రముఖకవి, పాటల రచయిత, గాయకుడు జయరాజ్ ఎంపికయ్యారు. ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు పేరుమీద ప్రతిఏటా రాష్ట్ర ప్రభుత్వం సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో కృషి చేసిన వారికి పురస్కారం అందజేస్తున్న విషయం తెలిసిందే. పురస్కార కమిటీ ప్రతిపాదనల మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ జయరాజ్‌ను ఎంపిక చేశారు. ఈ నెల 9న నిర్వహించే కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమంలో ఆయనకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. రూ. 1,01,116నగదుతోపాటు జ్ఞాపిక అందించి దుశ్శాలువాతో సత్కరిస్తారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన జయరాజ్ చిన్ననాటి నుంచి పేదరికంతోపాటు ఎన్నో కష్టాలు అధిగమించి కవిగా పేరు తెచ్చుకున్నారు. తెలంగాణ ఉద్యమకాలంలో తన ఆటపాటలతో ప్రజల్లో

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

మాజీ పీసీసీ అధ్యక్షులకు టికెట్లివ్వండి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన నేతలెవరైనా ఈసారి ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటే వారికి టికెట్లు ఇవ్వాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. పార్టీ అభ్యర్థుల ఖరారులో కూడా పీసీసీ మాజీ అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకురాలు దీపాదాస్ మున్షీని బుధవారం తాజ్‌కృష్ణ హోటల్‌లో కలిసి జగ్గారెడ్డి మూడు లేఖలు అందజేశారు. పొన్నాల లక్ష్మయ్యతో సహా ఇతర మాజీ పీసీసీలు ఎవరు టికెట్ అడిగినా ఇవ్వాలని ఆ లేఖలో కోరారు. టీపీసీసీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, చైర్మన్లకు కూడా టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యత నివ్వాలని, పార్టీలోకి కొత్తగా వస్తున్న నేతలను ప్రోత్సహిస్తూనే ఏళ్ల తరబడి పార్టీకి విధేయులుగా పనిచేస్తున్న వారికి తగిన అవకాశాలు కల్పించాలని జగ్గారెడ్డి విన్నవించారు.

మాదిగలకు 25 శాతం సీట్లివ్వండి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో మాదిగల జనాభా మేరకు 25 శాతం స్థానాలను కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సభ్యుడు దామోదర రాజనర్సింహకు తెలంగాణ ఎంఆర్‌పీఎస్ విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లో బుధవారం ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌లు.. ఇటీవల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా నియమితులైన రాజనర్సింహను అభినందించారు. కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన ఎస్సీ డిక్లరేషన్‌పై హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం అధిష్టానాన్ని ఒప్పించాలని పాపయ్య, శ్రీనివాస్‌లు రాజనర్సింహకు విజ్ఞప్తి చేశారు.

మార్పు మీ నుంచే మొదలు కావాలి

మహిళా రిజర్వేషన్లపై కల్వకుంట్ల కవిత లేఖకు ప్రతిస్పందనగా వైఎస్.షర్మిల లేఖ



సాక్షి, హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ విషయంలో మార్పు మీ నుంచే మొదలు కావాలని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అన్నారు. ఆ బిల్లుకు మద్దతు కూడగట్టే ముందు మీ తండ్రితో ఈ విషయం చర్చించాలని కవితకు సూచించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళాబిల్లుకు మద్దతు కోరుతూ రాసిన లేఖకు బుధవారం షర్మిల స్పందించారు. మహాత్మాగాంధీ చెప్పినట్టు.. చూడాలనుకుంటున్న మార్పు మీ నుంచే మొదలు పెట్టండి అంటూ షర్మిల బహిరంగలేఖ రాశారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టిన దగ్గర నుంచి 5శాతం సీట్లు కూడా మహిళలకు ఇవ్వలేదన్నారు. తెలంగాణలో మహిళలకు న్యాయం చేయకుండా ఈ పోరాటాన్ని జాతీయవేదికపై ఎలా తీసుకెళ్తారని ప్రశ్నించారు. మంత్రివర్గంలోనూ మహిళలకు ప్రాధాన్యం లేదని గుర్తు చేస్తూ.. సీఎం కూతురిగా మీ తండ్రిని ఏనాడూ ఈ అంశంపై ప్రశ్నించింది లేదని చెప్పారు. పార్టీలో, ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇవ్వకుండా ఢిల్లీ వేదికగా ఉద్యమం చేయడం హాస్యాస్పదమన్నారు. మహిళా రిజర్వేషన్‌పై ముందు మీ చిత్తశుద్ధి నిరూపించుకోవాలని చెప్పారు. వచ్చే అసెంబ్లీలో ఎక్కువ మందికి సీట్లు కేటాయించడమే.. ఉద్యమానికి మొదటి అడుగు అవ్వాలని, కవిత ముందు ఇంట గెలిచి తర్వాత రచ్చ గెలవాలని షర్మిల అన్నారు.

11న సగర సంఘ ఆత్మగౌరవ భవనానికి భూమి పూజ

పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు గంగుల, శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సగర (ఉప్పర) సంఘ ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ఈనెల 11న భూమి పూజ జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రులు గంగుల కమలాకర్, వి.శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. కోకాపేటలో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఉదయం 9 గంటలకు శంకుస్థాపన అనంతరం బహిరంగసభ ఉంటుందని ట్రస్టు బాధ్యులు వెల్లడించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆత్మగౌరవ భవన్ ట్రస్ట్ చైర్మన్ ఆస్కాని మారుతీసాగర్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్‌సాగర్, గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సాగర్, ప్రధాన కార్యదర్శి గోరక్ష సత్యం సాగర్‌లతో పాటు రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

15 కొత్త రైల్వే లైన్లకు మోక్షం

- 2,647 కి.మీ నిడివి.. రూ.50,848 కోట్ల వ్యయం
- మరో 11 డబ్లింగ్, ట్రిప్లింగ్ ప్రాజెక్టుల సర్వేకూ ఓకే
- దక్షిణ మధ్య రైల్వే వెల్లడి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 15 కొత్త రైల్వే ప్రాజెక్టులను నిర్మించేందుకు రైల్వే శాఖ సన్నద్ధమవుతోంది. 2,647 కి.మీ. నిడివితో నిర్మించే ఆ ప్రాజెక్టులకు రూ.50,848 కోట్లు వ్యయం కానున్నట్టు దక్షిణ మధ్య రైల్వే బుధవారం ప్రకటించింది. వీటితోపాటు రూ.32,695 కోట్లు వ్యయమయ్యే 2,588 కి.మీ. 11 డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులకు కూడా ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైనట్టు వెల్లడించింది. రీజినల్ రింగ్ రైల్, ఆదిలాబాద్-పటాన్‌చెరు, ఘట్కేసర్ - యాదాద్రి, తాండూరు-జహీరాబాద్, మణుగూరు - రామగుండం, ఉందానగర్ - జగ్గయ్యపేట, కరీంనగర్ - హసన్‌పర్తి, డోర్నకల్ - మిర్యాలగూడ, భూపాలపల్లి-కాజీపేట, పాండురంగాపురం-మల్కన్‌గిరి, కొత్తగూడెం-కిరండోల్, బోధన్ - లాతూరు రోడ్ ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వేలు మంజూరైనట్టు వెల్లడించింది.

కీలకం.. రీజినల్ రింగ్ రైల్

నగరానికి 50 కి.మీ. నుంచి 70 కి.మీ. వెలుపల దాదాపు 338 కి.మీ. నిడివితో నిర్మించబోయే రీజినల్ రింగ్ రోడ్డు వెలుపల దానికి సమాంతరంగా రింగ్ రైల్ ప్రాజెక్టు రాబోతోంది. రూ.12,408 కోట్ల వ్యయంతో దాదాపు 564 కి.మీ. నిడివితో ఈ ప్రాజెక్టు ఉంటుందని రైల్వే ప్రకటించింది. వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, అక్కన్నపేట్, సిద్దిపేట, గజ్వేల్, యాదాద్రి-భువనగిరి, రామన్నపేట, చిట్యాల, షాద్‌నగర్, షాబాద్ తదితర పట్టణాలను అనుసంధానిస్తూ ఇది రూపొందనుంది. అక్కన్నపేట, యాదాద్రి, చిట్యాల, బూర్గుల, వికారాబాద్, మెదక్, సిద్దిపేట, గజ్వేల్ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న రైల్వే లైన్ల మీదుగా కొత్త లైన్లు నిర్మించనుండటం విశేషం. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగర శివారు ప్రాంతాలకు మెరుగైన రవాణా వసతి కలగటంతోపాటు సరుకు రవాణా రైళ్లకు కూడా అడ్డంకులు లేని సాఫీ ప్రయాణానికి వెసులుబాటు కలుగుతుందని రైల్వే చెబుతోంది.

ఇక 317 కి.మీ. నిడివితో రూ.5,706 కోట్లతో నిర్మితమయ్యే పటాన్‌చెరు (నాగులపల్లి) - ఆదిలాబాద్ ప్రాజెక్టు కూడా ఇందులో కీలకం కానుంది. ఇచ్చోడ, నేరేడుగొండ, ధానూరు, నిర్మల్, బాల్కొండ, ఆర్మూరు, బోధన్, రుద్రూరు, బాన్సువాడ, నిజాంసాగర్, సంగారెడ్డి, పటాన్‌చెరు తదితర ప్రాంతాలకు రైల్వే లైన్ అందుబాటులోకి వచ్చినట్టు అవుతుంది. దీంతోపాటు హైదరాబాద్-ఢిల్లీ ప్రధాన లైన్‌తో వీటికి అనుసంధానం కూడా కలుగుతుంది. వ్యవసాయాధారిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున, ధాన్యం తరలింపునకు ప్రధాన రవాణా సాధనం అందుబాటులోకి వచ్చినట్టు కూడా అవుతుందని రైల్వే తెలిపింది.

'భారత్'గా పేరు మార్పు రాజ్యాంగబద్ధమే!

- ఉదయనిధి వెంటనే క్షమాపణలు చెప్పాలి
- రాహుల్ మౌనానికి అర్థం ఏమిటి?
- రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్



సాక్షి, హైదరాబాద్: దేశం పేరును 'భారత్'గా మార్చడమనేది రాజ్యాంగబద్ధమేనని రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యానించారు. భారత్ అనేది ఈ దేశం అసలు (ఒరిజినల్) పేరు అని స్పష్టం చేశారు. బుధవారం జవదేకర్ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగంలోనూ ఇదే రాసి ఉందని దానికి లోబడే పేరు మార్పు జరుగుతోందన్నారు. శతాబ్దాలుగా ఎవరు ముందుగా దేశాలను ఆక్రమించినా వాటి పేర్లను మార్చడం జరిగిందనీ, సుదీర్ఘ చరిత్ర ఉన్న అమెరికాలోనూ ఇది చోటుచేసుకుందని చెప్పారు. ఇక్కడికి బ్రిటీషర్లు వచ్చాక తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు...కోల్‌కతా పేరును కలకత్తాగా, చెన్నైను మద్రాస్‌గా, తిరువనంతరం పేరును త్రివేండ్రం, ముంబైను బాంబేగా మార్చారని ఆయన గుర్తుచేశారు. ఇప్పుడు గతంలోని వలసవాద భావజాలం నుంచి బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

పేరు మార్పునకు, ఎన్నికలకు సంబంధం లేదు

దేశం పేరుమార్పు అంశానికి ఎన్నికలతో ఎలాంటి సంబంధం లేదని జవదేకర్ పేర్కొన్నారు. తన వ్యాఖ్యలతో సనాతన ధర్మాన్నే కాకుండా దేశ ప్రజలను, అన్ని ధర్మాలను అవమానించిన తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ వెంటనే క్షమాపణలు చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని జవదేకర్ డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలపై ఇండియా కూటమిలోని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ కూడా ఎందుకు మౌనం వహించారో చెప్పాలని నిలదీశారు. ఈ విధంగా సనాతన ధర్మాన్ని అవమానించడం కాంగ్రెస్ పార్టీకి ఆమోదమేనా అని ప్రశ్నించారు.

తుక్కుగూడలో కాంగ్రెస్ సభ!

ఈనెల 17న సభ నిర్వహణపై మల్లగుల్లాల అనంతరం నిర్ణయం

- పరేడ్‌గ్రౌండ్స్‌కు అనుమతి నిరాకరణ నేపథ్యంలో పలు ప్రత్యామ్నాయాల పరిశీలన
- టీపీసీసీ నేతలతో కలసి స్థలాలు పరిశీలించిన కేసీ వేణుగోపాల్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 17వ తేదీన బహిరంగ సభ ఎక్కడ నిర్వహించాలన్న దానిపై కాంగ్రెస్ పార్టీ ఓ నిర్ణయానికి వచ్చింది. సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ వేదికగా భారీ సభ నిర్వహించాలని మొదట భావించినప్పటికీ అనుమతి లభించకపోవడంతో హైదరాబాద్ నగర శివార్లలో ఎక్కడైనా ఖాళీ స్థలంలో సభ ఏర్పాటు చేయాలా? లేదా ఎల్బీ స్టేడియం, గచ్చిబౌలి స్టేడియాలలో ఒకదాన్ని ఎంచుకోవాలా అన్న దానిపై మల్లగుల్లాలు పడిన టీపీసీసీ నేతలు చివరకు తుక్కుగూడలోని ఖాళీ స్థలంలో సభ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. సభను ఎక్కడ నిర్వహించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు గాను ఏకంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ రంగంలోకి దిగారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గచ్చిబౌలి స్టేడియంతో పాటు తుక్కుగూడ ఈ-సిటీ సమీపంలోని 350 ఎకరాల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. వాస్తవానికి, రానున్న ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఐదు గ్యారెంటీ కార్డు స్కీంలను ఈ సభ వేదికగా పార్టీ అగ్రనేత సోనియా గాంధీ చేత ప్రకటించేందుకు భారీ సభ నిర్వహించాలని కాంగ్రెస్ భావించింది. పరేడ్‌గ్రౌండ్స్‌లో సభకు అనుమతి లభించని నేపథ్యంలో ఎల్బీ స్టేడియంలో అనుమతి కోసం దరఖాస్తు చేసుకుంది. ఈ స్టేడియంలో సభ నిర్వహణకు స్పోర్ట్స్ అథారిటీ అనుమతి లభించినప్పటికీ పార్టీ పునరాలోచనలో పడింది. ఇక్కడ సభ నిర్వహిస్తే భారీ జనసమీకరణ సాధ్యం కాదని, అలాంటి పరిస్థితుల్లో పార్టీ అగ్రనేతలు పాల్గొనే సభను పెద్ద ఎత్తున నిర్వహించాల్సి ఉన్నందున నగర శివార్లలోని ఖాళీ స్థలంలోనే ఏర్పాటు చేయాలని ఆ పార్టీ నేతలు నిర్ణయించారు.

ముఖ్య నేతలతో కె.సి.వేణుగోపాల్ భేటీ

ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ వేదికగా జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల ఏర్పాట్లను సమీక్షించేందుకు బుధవారం కె.సి.వేణుగోపాల్ హైదరాబాద్‌కు వచ్చారు. సాయంత్రం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు పార్టీ నేతలు ఠాక్రే, రేవంత్, భట్టి, పొంగులేటి తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి బహిరంగసభ నిర్వహణ ప్రదేశాలను పరిశీలించిన అనంతరం సీడబ్ల్యూసీ సమావేశాలను నిర్వహించే తాజ్‌కృష్ణ హోటల్‌కు వేణుగోపాల్ చేరుకున్నారు. అక్కడ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలతో ఆయన సమావేశమయ్యారు. సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణలో ఏఐసీసీ నిబంధనలు, ప్రొటోకాల్ నిబంధనలను స్థానిక నేతలకు వివరించారు. పార్టీ అగ్రనేతలు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు బస చేసే ప్రదేశాలను పరిశీలించారు. సభ ఎక్కడ నిర్వహిస్తే బాగుంటుందన్న దానిపై కూడా రాష్ట్ర నాయకత్వంతో చర్చించారు. తుక్కుగూడలోనే సభ నిర్వహించాలన్న మెజార్టీ నేతల అభిప్రాయం మేరకు అక్కడే నిర్వహించాలని నిర్ణయించారు. ఖమ్మం సభకు దీటుగా జన సమీకరణ చేయాలని, సభ అనంతరం అందరూ నియోజకవర్గాలకు వెళ్లి గ్యారెంటీ కార్డు స్కీంలతో పాటు బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని వేణుగోపాల్ పిలుపునిచ్చారు. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్వహించిన భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది అవుతున్న సందర్భంగా నేడు మండల, జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ర్యాలీలను విజయవంతం చేయాలని కోరారు. సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణపై రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు దిశానిర్దేశం చేసిన ఆయన రాత్రి అక్కడే బస చేశారు. గురువారం ఉదయం ఆయన ఢిల్లీకి వెళ్లనున్నారు. కాగా, కేసీ వేణుగోపాల్‌తో సమావేశం అనంతరం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సభ ఎక్కడ నిర్వహించాలన్న దానిపై రెండు మూడు చోట్ల స్థలాలు పరిశీలించామని వీటిలో ఎక్కడ సభ పెట్టాలన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పడం గమనార్హం. మరోవైపు కేసీ వేణుగోపాల్‌ను కలవాలని కాంగ్రెస్ నేతలు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణను ఫోన్ ద్వారా ఆహ్వానించారు. దీంతో నారాయణ తాజ్‌కృష్ణ హోటల్‌లో కేసీ వేణుగోపాల్‌తో కొద్దిసేపు భేటీ అయ్యారు. అనంతరం నారాయణ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు జాతీయస్థాయిలో పనిచేస్తూనే ఉన్నాయని, రాష్ట్రస్థాయిలోనూ కలసి పనిచేయాలనుకుంటున్నామని వెల్లడించారు. ఇందుకు రెండు పార్టీలు సానుకూలంగానే ఉన్నాయని తెలిపారు. అయితే రాష్ట్రస్థాయిలో పనిచేసేందుకు ఏవిధంగా ముందుకు వెళ్లాలన్నదానిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

కోమటిరెడ్డి అలక

- అధిష్టానం తనకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆవేదన
- పీఈసీ సమావేశానికి గైర్హాజరు... స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌ను కూడా కలవని వైనం
- బుజ్జగింపునకు ఆయన నివాసానికి వెళ్లిన ఠాక్రే, భట్టి, సంపత్
- కేసీ.వేణుగోపాల్‌తో ఫోన్‌లో మాట్లాడించిన ఠాక్రే



సాక్షి, హైదరాబాద్: భువనగిరి ఎంపీ, టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మరోమారు అలకపాన్పు ఎక్కారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఖరారు ప్రక్రియలో భాగంగా జరిగిన తొలి ప్రదేశ్‌ఎన్నికల కమిటీ (పీఈసీ) సమావేశానికి కోమటిరెడ్డి హాజరు కాగా, ఇటీవల జరిగిన మలి సమావేశానికి డుమ్మా కొట్టారు. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్‌తో జరిగిన ముఖాముఖి భేటీకి కూడా ఆయన రాలేదు. ఏఐసీసీ ప్రకటించిన పలు కమిటీల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న కారణంతోనే ఆయన సమావేశాలకు దూరంగా ఉన్నారని సన్నిహితులు చెబుతున్నారు. ఇటీవలే విదేశీ పర్యటనకు వెళ్లి వచ్చిన వెంకట్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉన్నా సమావేశాలకు వెళ్లలేదు. దీంతో కాంగ్రెస్ పెద్దలు ఆయన్ను బుజ్జగించేపనిలో పడ్డారు. బుధవారం హైదరాబాద్‌లోని కోమటిరెడ్డి నివాసానికి పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఠాక్రే, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌లు వెళ్లి చాలాసేపు మాట్లాడారు. కోమటిరెడ్డి నివాసంలోనే అందరూ కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపై వారు చర్చించారు.

పార్టీలో నేనేంటి?

కాంగ్రెస్ పెద్దలతో కోమటిరెడ్డి కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడారని, అసలు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో తానేంటో చెప్పాలని ప్రశ్నించినట్టు తెలిసింది. గతంలో జరిగిన పరిణామాలు ఎలా ఉన్నా చాలాకాలంగా పార్టీలో తాను క్రియాశీలంగా ఉన్నానని, తన నియోజకవర్గమైన నల్లగొండతో పాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న భువనగిరి లోక్‌సభ సెగ్మెంట్‌లో పర్యటిస్తూ పార్టీ కేడర్‌ను కాపాడుకుంటున్నానని, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన ఉచిత కరెంటు వ్యాఖ్యలను బీఆర్ఎస్ రాద్ధాంతం చేసేందుకు ప్రయత్నిస్తే తాను సమర్థవంతంగా అడ్డుకున్నానని చెప్పుకొచ్చారు. ఇంతచేస్తున్నా సీడబ్ల్యూసీలో కానీ, ఇతర కమిటీల్లో స్థానం కల్పించడం లేదని, తాను ఏంచెప్పి క్షేత్రస్థాయికి వెళ్లాలని పార్టీ పెద్దలను ఆయన ప్రశ్నించినట్టు తెలిసింది. దీంతో ఠాక్రే ఏఐసీసీ కీలకనేత కేసీ.వేణుగోపాల్‌కు ఫోన్ చేసి కోమటిరెడ్డితో మాట్లాడించారని సమాచారం. ఈ సందర్భంగా కోమటిరెడ్డి తన ఆవేదనను వేణుగోపాల్‌కు చెప్పారని, అంతా తాను చూసుకుంటానని, పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని, తనపై భరోసా ఉంచాలని హామీ ఇచ్చినట్టు సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశాలు హైదరాబాద్‌లో జరుగుతున్న తరుణంలో పార్టీ సీనియర్ నేత కోమటిరెడ్డి అలకపాన్పు ఎక్కడం, ఆయన్ను పార్టీ పెద్దలు బుజ్జగించేందుకు ఉపక్రమించడం చర్చనీయాంశమవుతోంది.

మూడోరోజు 306 దరఖాస్తులు

బీజేపీలో కొనసాగుతున్న సందడి



పార్టీ కార్యాలయంలో ఇంద్రసేనారెడ్డికి టికెట్ కోసం దరఖాస్తును అందజేస్తున్న విక్రమ్‌గౌడ్

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల సంఖ్య ఊహించిన దాని కంటే ఎక్కువగా పెరుగుతోంది. దరఖాస్తుల స్వీకరణ మొదలైన మూడోరోజు బుధవారం ఆశావహుల నుంచి ఏకంగా 306 అప్లికేషన్స్ దాఖలయ్యాయి. మొత్తంగా ఈ మూడు రోజులు కలిపి ఇప్పటివరకు 666 దరఖాస్తులు అందినట్టుగా పార్టీవర్గాలు వెల్లడించాయి. గోషామహల్ నుంచి పోటీకి తనకు అవకాశం కల్పించాలని కోరుతూ ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి, దివంగత ఎం.ముఖేష్‌గౌడ్ తనయుడు ఎం.విక్రమ్‌గౌడ్ తన దరఖాస్తును బీజేపీ సీనియర్‌నేత నల్లు ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. మహేశ్వరం నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన అందెల శ్రీరాములు యాదవ్ కూడా ఆ స్థానానికే పోటీకి అవకాశం కల్పించాలని దరఖాస్తు చేసుకున్నారు.

9.10 తేదీల్లోనే ముఖ్యనేతల దరఖాస్తులు...

9న దశమి, 10వ తేదీన ఏకాదశి ఉన్న నేపథ్యంలో ఆ రోజుల్లో భారీగా అప్లికేషన్లు వచ్చే అవకాశం ఉంది. అంబర్‌పేట నుంచి బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ముషీరాబాద్ నుంచి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, గద్వాల నుంచి జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, హుజూరాబాద్ నుంచి రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఎంపీ ధర్మపురి అర్వింద్ (ఆర్మూర్), ఎమ్మెల్యే ఎం.రఘునందన్ రావు (దుబ్బాక), మాజీ ఎంపీలు వివేక్ (చెన్నూర్), ఏపీ జితేందర్ రెడ్డి (మహబూబ్ నగర్) ఆ రెండు, మూడు రోజుల్లో పోటీకి దరఖాస్తు చేసుకునే అవకాశాలున్నాయి. సీనియర్ నేతలు విజయశాంతి, మురళీధర్ రావు, గరికపాటి మోహన్ రావు, చాడ సురేశ్ రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఏ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి దరఖాస్తు చేసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.

బండి అమెరికాలో ఉండటంతో..

ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న బండి సంజయ్ 12న తిరిగి నగరానికి రానున్నారు. ఈ నేపథ్యంలో సంజయ్ దరఖాస్తును మరొకరు ఆయన తరఫున అందజేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది. కాగా దరఖాస్తుల స్వీకరించే కేంద్రాన్ని బుధవారం రాష్ట్ర బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, ఎంపీ ప్రకాష్ జవదేకర్ సందర్శించారు. ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే నాయకులు ప్రతీ ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

జయరాజ్‌కు కాళోజీ పురస్కారం

▶ మొదటి పేజీ తరువాయి

చైతన్యం తేవటానికి కృషి చేశారు. మనిషి-ప్రకృతి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని తన సాహిత్యం ద్వారా స్పృశించారు. ఆయన రచించిన పలు పుస్తకాలు ప్రజాదరణ పొందాయి.

జయరాజ్ ప్రొఫైల్..

- **స్వస్థలం:** గుమ్మడూరు(మహబూబాబాద్ జిల్లా)
- **తల్లిదండ్రులు:** గొడిశాల చెన్నమ్మ, కిష్టయ్య
- **చదువు:** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం గంధంపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి వరకు, మహబూబాబాద్‌లో డిగ్రీకి మధ్యలోనే స్వస్తి చెప్పి, కొత్తగూడెంలో ఐటీఐ పూర్తి చేశారు.
- **ప్రస్తుతం:** ఐటీఐతోనే సింగరేణిలో ఉద్యోగం సంపాదించి, హైదరాబాద్‌లోని సింగరేణి కార్యాలయంలో పనిచేస్తున్నారు.
- **రచనలు:** వసంతగీతం, రేపటి వసంతమై, అవని పాటల సంపుటి. 'పల్లెల్లో అక్షరదీపం వెలగాలి'అంటూ నిరక్షరాస్యత నిర్మూలన కోసం జయరాజ్ రాసిన పాట పాపులర్ అయ్యింది. అడవిలోఅన్న, దండోరా సినిమాలకు పాటలు రాసి ప్రాణం పోశారు.
- **అవార్డులు:** సుద్దాల జానకమ్మ పురస్కారం, సుద్దాల హనుమంతు అవార్డు, సింధు ఎల్లమ్మ అవార్డు, బెజవాడ గోపాల్‌రెడ్డి, తెలంగాణ ఉత్తమకవిత, ముగ్దుం మోహినొద్దిన్ అవార్డులతో పాటు పలు పురస్కారాలు అందుకున్నారు.

సీడబ్ల్యూసీ కోసం కమిటీల ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నిర్వహిస్తోన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాల కోసం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టీపీసీసీ పలు కమిటీలను ఏర్పాటు చేసింది. సమావేశాల సమన్వయం, నిర్వహణ కమిటీ బాధ్యతలను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్‌కు అప్పగించింది. కమిటీ కో చైర్మన్‌గా సంపత్ కుమార్, కన్వీనర్లుగా శివసేనారెడ్డి, బల్మూరి వెంకట్‌లను నియమించింది. ట్రాన్స్‌పోర్ట్ కమిటీకి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఫుడ్ కమిటీకి మాజీ మంత్రి షబ్బీర్ అలీ, మీడియా కమిటీకి సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, అకామడేషన్ కమిటీకి అంజన్‌కుమార్ యాదవ్‌లకు బాధ్యతలను అప్పగించింది.


కాంట్రాక్టు లెక్చరర్ల పెండింగ్ వేతనాలు చెల్లించండి

సీఎం కేసీఆర్‌కు టీపీసీసీ చీఫ్ రేవంత్ లేఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న లెక్చరర్లకు వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సీఎం కేసీఆర్‌కు బహిరంగ లేఖ రాశారు. 'కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని 2014 ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు. కానీ ఇప్పటివరకు వారి వెతలు తీరలేదు. క్రమబద్ధీకరణ జరగకపోగా, కాంట్రాక్టు లెక్చరర్లు జీతాలు ఇవ్వండి మహాప్రభో అని అర్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది' అని పేర్కొన్నారు. కాగా, భారీ వర్షాల కారణంగా హైదరాబాద్ లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. వర్షపు నీరు నిండిన ఫోటోలను జత చేసిన రేవంత్, ఈ వాస్తవాలను ట్విట్టర్‌లో పెట్టే దమ్ముందా?' అని మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి పోస్టు చేశారు.

విద్య, ఉపాధిపైనే ప్రత్యేక దృష్టి

- బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ బీసీ డిక్లరేషన్
- గాంధీభవన్‌లో మాజీ ఎంపీ పొన్నం అధ్యక్షతన సమావేశమైన కమిటీ



సాక్షి, హైదరాబాద్: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీసీ డిక్లరేషన్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. తాము అధికారంలోకి వస్తే బీసీ వర్గాలకు విద్య, ఉపాధి కల్పనలపై ప్రత్యేక దృష్టి సారించి పనిచేయాలని తీర్మానించింది. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో మాజీ ఎంపీ, డిక్లరేషన్ కమిటీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయించారు. బీసీల్లోని ప్రధాన కులాల ఉపాధి కల్పనకు కులాల వారీగా ఫైనాన్స్ కార్పొరేషన్లు, ఎంబీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, కులవృత్తులకు చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు, బీసీ వర్గాలకు సంక్షేమ కార్యక్రమాల అమలు, రాజకీయ ప్రాధాన్యం తదితర అంశాలపై చర్చించారు. కమిటీ సలహాదారుడు పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, కమిటీ సభ్యులు గాలి అనిల్‌కుమార్, కత్తి వెంకటస్వామి, అంజన్ కుమార్ యాదవ్ సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, నూతి శ్రీకాంత్‌గౌడ్, మెట్టు సాయికుమార్, ఈర్లపల్లి శంకర్, కేతూరి వెంకటేశ్, సునీతారావు, ఈరవత్రి అనిల్, పున్నా కైలాశ్ నేత, ఈర్ల కొమురయ్యలు సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించారు. కాగా, ఈనెల 17వ తేదీన సోనియాగాంధీ ప్రకటించనున్న ఐదు గ్యారంటీ కార్డు స్కీమ్‌ల్లో కూడా బీసీలకు సంబంధించిన ఒక ప్రధాన హామీని చేర్చాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ బలహీనవర్గాలకు కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరుగుతుందని, బీఆర్ఎస్ తరహాలో తూతూమంత్రపు ప్రకటనలు ఉండవని చెప్పారు.

100 సీట్లలో ఒక్కో పేరే!

మరో రెండు వారాలు పడుతుంది

"అభ్యర్థుల ఎంపిక కసరత్తు ఇంకా పూర్తి కాలేదు. సమావేశంలో భాగంగా అన్ని అంశాలపై నిశితంగా పరిశీలన చేశాం. కసరత్తు పూర్తయ్యేందుకు మరో రెండు వారాల సమయం పడుతుంది. మెజార్టీ స్థానాలకు ఒక్కటే పేరు పంపాలని నిర్ణయించాం. త్వరలోనే మరోమారు సమావేశం జరుగుతుంది."

– కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్

ఇంకా చర్చించాల్సినవి ఉన్నాయి

"పీఈసీ సమావేశంలో వచ్చిన అభిప్రాయాలు, పీఈసీ ఇచ్చిన నివేదికపై సుదీర్ఘంగా చర్చించాం. పీఈసీ సభ్యులతోపాటు డీసీసీలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతల సలహాలను పరిగణనలోకి తీసుకుంటాం. స్క్రీనింగ్ కమిటీలో ఇంకా చర్చించాల్సిన అంశాలు చాలా ఉన్నాయి.

– పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే

ప్రామాణికాలపై చర్చించాం

స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ రాష్ట్ర నేతల దగ్గర అభిప్రాయాలు తీసుకున్నారు. ఆ అభిప్రాయాలపై సమావేశంలో మాట్లాడాం. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి ప్రామాణికాలు అనుసరించాలన్న దానిపై చర్చించాం. త్వరలో మరోమారు సమావేశమై కసరత్తు పూర్తిచేస్తాం.

– సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



తాజ్ కృష్ణలో జరిగిన సమావేశంలో పాల్గొన్న సిద్ధిఖీ, మురళీధరన్, మాణిక్‌రావ్ ఠాక్రే

▶ మొదటి పేజీ తరువాయి

భట్టి విక్ర మార్క, మన్సూర్ అలీఖాన్, విష్ణునాథ్, రోహిత్‌చౌదరి తదితరులు ఇందులో పాల్గొన్నారు. మరో సభ్యుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ అనారోగ్యం కారణంగా హాజరుకాలేదు. ఈ సమావేశంలో భాగంగా 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు, ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) ఇచ్చిన నివేదికలను నేతలు పరిశీలించారు.

ఇక్కడే కసరత్తు పూర్తి చేద్దాం..

తొలుత స్క్రీనింగ్ కమిటీలో రాష్ట్రం నుంచి సభ్యులుగా ఉన్న రేవంత్, ఉత్తమ్, భట్టి ఆయా చోట్ల టికెట్ల ఖరారు ప్రాథమ్యాలను వివరించారు. అనంతరం రాష్ట్రంలో సామాజిక వర్గాల వారీగా టికెట్ల కేటాయింపు ఆవశ్యకత, మహిళలకు కేటాయించాల్సిన సీట్లు, యువతకు టికెట్లు, పార్టీ అనుబంధ సంఘాలకు అవకాశం తదితర అంశాలపై చర్చించారు. ఎక్కడెక్కడ ఏ కేటగిరీ నాయకులకు అవకాశం కల్పించగలమనేదానిని పరిశీలించారు. ఏఐసీసీకి పంపే జాబితాను అన్ని కోణాల్లో క్షుణ్ణంగా నిర్ధారించి పంపాలని, మెజార్టీ స్థానాల్లో ఒక్కటే పేరు సూచించేలా కసరత్తును ఇక్కడే పూర్తి చేయాలని భేటీలో నిర్ణయానికి వచ్చారు. దాదాపు రెండు గంటలకుపైగా ఈ సమావేశం జరిగినా.. నియోజకవర్గాల వారీగా కసరత్తు పూర్తి కాకపోవడంతో త్వరలో మరోమారు సమావేశం కావాలని నిర్ణయించారు. భేటీ ముగిశాక మురళీధరన్, ఠాక్రే, భట్టి మీడియాతో మాట్లాడారు.

దివ్యాంగులను ఓటు బ్యాంక్‌గా మార్చుకున్నారు

ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్



అయిజ (జోగుళాంబ గద్వాల జిల్లా): ఎన్నికల ముందు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పింఛన్ల పెంపు వంటి హామీలు ఇచ్చి దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులను ఓటుబ్యాంక్‌గా మార్చుకున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో బుధవారం నిర్వహించిన దివ్యాంగుల భరోసా సభకు ఆయన హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్‌కు మద్యం టెండర్లపై ఉన్న సోయి ఆసరా పింఛన్ల చెల్లింపుపై లేదన్నారు. కేసీఆర్ పాలనలో సదరం క్యాంపులు పూర్తయినా దివ్యాంగుల సర్టిఫికెట్లు జారీ చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. బీఎస్పీ అధికారంలోకి రాగానే దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించి, వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తామన్నారు. బుద్వేల్‌లో తరతరాలుగా సేద్యం చేసుకుంటున్న 256 ఎకరాల దళితుల అసైన్డ్ భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని కేసీఆర్ తన బినామీ కంపెనీలకు కట్టబెట్టారని దుయ్యబట్టారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించి..కార్యకర్తల చేత ప్రతిజ్ఞ చేయించారు.

క్షమాభిక్షపై చిగురిస్తున్న ఆశలు

దుబాయ్‌లో జైల్లో ఉన్న తెలంగాణ వాసుల విడుదలకు మంత్రి కేటీఆర్ ప్రయత్నం
- దుబాయ్ అధికారులు, స్థానిక న్యాయవాదితో సమావేశం
- భారత కాన్సులేట్ అధికారులతోనూ భేటీ
- రాజు క్షమాభిక్ష ప్రసాదించేలా ప్రయత్నించాలని సూచన

సాక్షి, హైదరాబాద్/ సిరిసిల్ల: దుబాయ్‌లోని అవీర్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న తెలంగాణ ఎన్నారైలకు క్షమాభిక్ష కోసం రాష్ట్ర మంత్రి కేటీఆర్ మరోసారి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. దుబాయ్ పర్యటనలో ఉన్న మంత్రి సిరిసిల్ల జిల్లాకు చెందిన ఐదుగురు ఖైదీల విడుదల అంశాన్ని అక్కడి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దుబాయ్ అధికారులతో పాటు ఖైదీల కుటుంబ సభ్యులు, బంధువులు, ఈ కేసుని వాదిస్తున్న అరబ్ లాయర్, దుబాయ్‌లో భారత కాన్సుల్ జనరల్ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. దుబాయ్ రాజు షేక్ మహమ్మద్ క్షమాభిక్ష ప్రసాదించేలా ప్రయత్నం చేయాలని వారికి సూచించారు.

17 ఏళ్లుగా శిక్ష అనుభవిస్తున్న సిరిసిల్ల వాసులు

2006లో దుబాయ్‌లోని జబల్ అలీ పారిశ్రామిక ప్రాంతంలోని ఓ సంస్థ ఆవరణలో నేపాల్‌కు చెందిన దిల్‌ప్రసాద్ రాయ్ అనే సెక్యూరిటీ గార్డు హత్యకు గురయ్యాడు. దొంగతనాన్ని అడ్డుకునేందుకు సెక్యూరిటీ గార్డు ప్రయత్నించగా పది మంది కలిసి హత్య చేశారనేది ఆరోపణ. కాగా ఈ కేసు నిందితుల్లో నలుగురు పాకిస్తానీయులు కాగా మిగిలిన ఆరుగురు తెలంగాణకు చెందినవారు. ఈ పది మందిని అక్కడి కోర్టు దోషులుగా నిర్ధారించి పాకిస్తానీయులకు తొమ్మిదేళ్ల చొప్పున, తెలంగాణ వారికి పదేళ్ల చొప్పున శిక్ష విధించింది. అయితే శిక్ష పూర్తి చేసుకున్న నలుగురు పాకిస్తానీయులు, కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నమిలికొండకు చెందిన సయ్యద్ కరీంలు విడుదలయ్యారు. కానీ తెలంగాణకు చెందిన మిగతా ఐదుగురు..రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన శివరాత్రి రవి, శివరాత్రి మల్లేష్, గొల్లెం నాంపల్లి, దుండగుల లక్ష్మణ్, శివరాత్రి హనుమంతులు మాత్రం 17 ఏళ్లుగా జైలులోనే మగ్గుతున్నారు.


దుబాయ్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

అప్పీలుకు వెళ్తే.. పెరిగిన శిక్ష

ఈ ఐదుగురు హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లడం శాపంగా మారింది. ఈ కేసులు విచారించిన ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం (అరబ్బీ భాషలో 'నజ్జ ఖజాయా) ఈ హత్యను క్రూరమైనది (జినయా)గా పరిగణించింది. కింది కోర్టు విధించిన పదేళ్ల శిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చింది. ఈ కారణంగానే వీరు మరో ఎనిమిదేళ్ల వరకు శిక్ష అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దీర్ఘకాలంగా కేటీఆర్ ప్రయత్నాలు

ఐదుగురు ఖైదీల విడుదల కోసం మంత్రి కేటీఆర్ చాలాకాలంగా ప్రయత్నిస్తున్నారు. నేపాల్‌లోని బాధిత కుటుంబం దగ్గరికి స్వయంగా వెళ్లి దియ్య సొమ్ము పరిహారం (బ్లడ్ మనీ) అందించారు. ఆ కుటుంబం ఇచ్చిన క్షమాభిక్ష అంగీకార పత్రాన్ని దుబాయ్ ప్రభుత్వానికి సమర్పించి క్షమాభిక్ష కోరారు. అయితే నేరం తీవ్రతను దృష్టిలో ఉంచుకొని దుబాయ్ ప్రభుత్వం ఇప్పటివరకు క్షమాభిక్షను ప్రసాదించలేదు. ఆరు నెలల కిందట మరోసారి మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా దుబాయ్ లాయర్‌కు అవసరమైన ఫీజులు చెల్లించి, తన కార్యాలయ అధికారులను దుబాయ్ పంపించి మరీ ఈ వ్యవహారం తాలూకు పురోగతిని సమీక్షించారు. ఈ క్రమంలోనే ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న మంత్రి మరోసారి తనప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇప్పటికే సుదీర్ఘ కాలం పాటు శిక్ష అనుభవించి జైలు అధికారుల ద్వారా మంచి ప్రవర్తన కలిగిన ఖైదీలుగా నివేదిక కూడా కలిగి ఉన్న తెలంగాణ ఎన్నారైలకు వెంటనే క్షమాభిక్ష లభించేలా చూడాలని అక్కడి అధికారులను కోరారు. అంతకుముందు జరిగిన బిజినెస్ భేటీల సందర్భంగా దుబాయ్ రాజ కుటుంబానికి సన్నిహితంగా వ్యవహరించే పలువురు వ్యాపారవేత్తల వద్ద కూడా మంత్రి ఈ విషయాన్ని ప్రస్తావించి మానవతా దృక్పథంతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు బాధిత కుటుంబాలను కలిసి ప్రభుత్వం తరఫున, వ్యక్తిగతంగా అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి కేటీఆర్ చేస్తున్న తాజా ప్రయత్నాలు, స్థానిక వ్యాపారవేత్తల నుంచి లభించిన సానుకూల హామీ నేపథ్యంలో తెలంగాణ ఖైదీల విడుదలపై కుటుంబసభ్యుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

'తబ్రీద్' పెట్టుబడి రూ.1,600 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించేందుకు వీలు కలుగుతుంది. ఈ మేరకు తబ్రీద్ సంస్థ సీఈఓ ఖలీద్ అల్ మర్జుకి, ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో దుబాయ్‌లో జరిగిన సమావేశంలో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. సమావేశంలో పరిశ్రమ లశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, హైదరాబాద్ ఫార్మాసిటీ సీఈవో శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

6,800 గిగావాట్ల విద్యుత్ పొదుపు

తబ్రీద్ సంస్థతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఈ కూలింగ్ సొల్యూషన్స్ వల్ల పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ లక్ష్యాల మేరకు దాదాపు 6,800 గిగావాట్ల కరెంటుతో పాటు 41,600 మెగా లీటర్ల నీటిని పారిశ్రామిక రంగంలో పొదుపు చేసే అవకాశం కలుగుతుంది. దీంతో పాటు 6.2 మిలియన్ టన్నుల కార్బన్ డ యాక్సైడ్ ఉద్గారాలను అరికట్టేందుకు వీలుంది. ముఖ్యంగా ఫార్మా రంగంలో ఉన్న బల్క్ డ్రగ్ తయారీ కేంద్రాలకు స్వచ్ఛమైన హరిత పరిష్కారాలు లభించే అవకాశం ఏర్పడుతుంది. భవిష్యత్తులో హైదరాబాద్‌లో కాలుష్యం, ఉష్ణోగ్రతలు తగ్గి అత్యుత్తమ నగరాలకు కావలసిన అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్న ఆశాభావాన్ని సంస్థ వ్యక్తం చేసింది.

పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రభుత్వ చర్యలు: కేటీఆర్

రాష్ట్రంలో భారీగా కొనసాగుతున్న పారిశ్రామికీకరణ, వేగంగా విస్తరిస్తున్న వ్యాపార వాణిజ్య ప్రాంతాలను దృష్టిలో ఉంచుకొని స్థిరమైన భవిష్యత్తు కోసం తబ్రీద్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందం ఎంతగానో ఉపకరిస్తుందని మంత్రి కేటీఆర్ తెలిపారు. డిస్ట్రిక్ట్ కూలింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, తక్కువ విద్యుత్ శక్తిని ఉపయోగించుకునే శీతలీకరణ పరిష్కారాలు, కూల్ రూఫ్ పాలసీ వంటి విధానాల ద్వారా తెలంగాణ 2047 నాటికి నెట్ జీరో లక్ష్యాన్ని అందుకునే దిశగా ముందుకుసాగుతోందన్నారు. తబ్రీద్ సంస్థ చైర్మన్ ఖాలిద్ అబ్దుల్లా అల్ ఖుబాసి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఈ ఒప్పందం రాష్ట్రానికే కాకుండా భారత దేశ సస్టైనబుల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కాలుష్య రహిత ఫార్మాసిటికల్ క్లస్టర్ హైదరాబాద్ ఫార్మాసిటీతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని ఇతర పారిశ్రామిక పార్కులు, వాణిజ్య ప్రాంతాలకు తమ కూలింగ్ టెక్నాలజీలను అందిస్తామన్నారు. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రాం ఇండియా హెడ్ అతుల్ బగాయి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రశంసలు కురిపించారు.


తబ్రీద్ సంస్థ సీఈఓ ఖలీద్ అల్ మర్జుకితో కేటీఆర్

హైదరాబాద్‌కు చేరుకున్న కేటీఆర్

దాదాపు 20 రోజుల పాటు విదేశాల్లో పర్యటించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుధవారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకున్నారు. నగరానికి చేరుకున్న కేటీఆర్ మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మాతో భేటీ అయ్యారు. గత నెల ఆగస్టు 19న అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లిన ఆయన న్యూయార్క్, చికాగో నగరాల్లో జరిగిన పలు పెట్టుబడి సమావేశాల్లో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాల అనంతరం తన కుమారుడు హిమాన్షు అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సు ప్రవేశానికి సంబంధించిన కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రెండ్రోజుల పాటు దుబాయ్‌లో పెట్టుబడులకు సంబంధించి వరుస సమావేశాలు నిర్వహించారు. దుబాయ్ చివరి రోజు పర్యటనలో భాగంగా హాట్ ప్యాక్ ఎండీ అబ్దుల్ జబ్బార్‌ను కలిశారు. కాగా, కేటీఆర్ నగరానికి వచ్చిన నేపథ్యంలో అసంతృప్త నేతలు ఆయనతో భేటీ అయ్యేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.

త్వరలో ఇంటర్, డిగ్రీ కాలేజీ లెక్చరర్ల బదిలీలు

సీనియారిటీ జాబితా రూపొందిస్తున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: దీర్ఘ కాలికంగా వస్తున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో టీచింగ్, నాన్–టీచింగ్ సిబ్బంది బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకు సంబంధించిన కార్యాచరణ సిద్ధం చేయాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. వాస్తవానికి అధ్యాపక సంఘాల నేతలు గత కొంతకాలంగా బదిలీల కోసం ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. పాఠశాల విద్యలో బదిలీలు చేపట్టడం, ఈ వ్యవహారం కోర్టు స్టేతో ఆగిపోవడం తెలిసిందే. తాజాగా స్పౌజ్ కేసులను పరిశీలించిన కోర్టు బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, కాలేజీ సిబ్బందినీ బదిలీ చేయాలని సూత్రప్రాయ అంగీకారానికి వచ్చినట్టు తెలిసింది. విద్యా మంత్రి ఆదేశాల మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఇటీవల ఇంటర్, కాలేజీ విద్య ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. బదిలీలకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని కోరారు. ఈ నేపథ్యంలో అధికారులు బదిలీల ప్రక్రియపై కసరత్తు మొదలుపెట్టినట్టు విశ్వసనీయ సమాచారం.

బదిలీల్లేక ఐదేళ్లు: 2018 జూన్ నెలాఖరులో సాధారణ బదిలీలు చేపట్టారు. అప్పటి మార్గదర్శకాలను అనుసరించి 500 మంది ఉద్యోగులకు బదిలీలు జరిగాయి. 2016–17లో జూనియర్ లెక్చరర్స్‌కు ప్రిన్సిపల్స్‌గా పదోన్నతులు కల్పించారు. ఈ విధంగా పదోన్నతులు రావడంతో 2018లో జరిగిన బదిలీల్లో కనీసం రెండేళ్ల పనిచేసిన సర్వీస్ లేకపోవడంతో వారికి బదిలీ అవకాశం రాలేదు. కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 317 జీవో అమలు చేశారు. పదవీ విరమణ వయసును ప్రభుత్వం 58 నుంచి 61 సంవత్సరాలకు పెంచింది. దీంతో చాలామంది దూర ప్రాంతాల్లో ఉంటూ, ఆర్థికంగా, ఆరోగ్య పరంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని కాలేజీ అధ్యాపక సంఘాలు ప్రభుత్వం దృష్టికి తెచ్చాయి. తాజా నిర్ణయం వల్ల 6 వేల మందికిపైగా న్యాయం జరుగుతుంది.

మార్గదర్శకాలపై కసరత్తు: బదిలీలు చేపట్టాలనే యోచన చేసిన నేపథ్యంలో మార్గదర్శకాలపై కూడా స్పష్టత ఉండాలని విద్యాశాఖ కార్యదర్శి అధికారులకు సూచించినట్టు సమాచారం. 317 జీవో తర్వాత ఏర్పడిన పరిస్థితులు, ఎన్ని సంవత్సరాలను కనీస, గరిష్ట అర్హతగా తీసుకోవాలనే అంశాలపై అధికారులు తర్జనభర్జనలో ఉన్నారు. స్పౌజ్ కేసులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి జాబితాను, ఏయే జిల్లాల్లో ఎన్ని ఖాళీలున్నాయి? అనే అంశాలపై వివరాలు తెప్పిస్తున్నారు. వచ్చేవారం బదిలీలపై స్పష్టత రావొచ్చని చెబుతున్నారు.

క్లుప్తంగా...

బదిలీ కోసం 81 వేల మంది టీచర్లు దరఖాస్తు

సాక్షి, హైదరాబాద్: బదిలీల కోసం రాష్ట్రవ్యాప్తంగా 81069 మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారు 6968 మంది ఉన్నారు. జనవరిలో వచ్చిన దరఖాస్తుల సంఖ్య 70,762 కాగా 3,339 మంది ఉపాధ్యాయులు దరఖాస్తుల గడువు ముగిసే నాటికి ఎలాంటి డేటా ఎడిటింగ్ చేయలేదని విద్యాశాఖ వెల్లడించింది. టీచర్ల బదిలీ ప్రక్రియను ఈ ఏడాది జనవరిలో చేపట్టారు. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో అప్లై చేసి, ప్రక్రియ జరుగుతుండగానే నాన్–స్పౌజ్‌లు కోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానం స్టే ఇవ్వడంతో ప్రక్రియ నిలిచిపోయింది. తిరిగి కోర్టు స్టేను ఎత్తివేడంతో ఈ నెల 3వ తేదీ నుంచి బదిలీలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఫిబ్రవరి 1ని కటాఫ్‌గా నిర్ణయించారు. ఇప్పుడు సెప్టెంబర్ 1ని కటాఫ్ తేదీగా పెట్టారు. దీంతో రెండేళ్ళకు పైబడి ఒకే చోట పనిచేస్తున్న ఉపాధ్యాయులు దర ఖాస్తులు చేసుకున్నారు. బదిలీలకు వచ్చిన దరఖాస్తుల్లో రంగారెడ్డి జిల్లాలో (4722) ఎక్కువగా ఉన్నాయి. ములుగు జిల్లాల్లో అతి తక్కువ (781) దరఖాస్తులొచ్చాయి.


రాష్ట్ర న్యాయశాఖ నూతన కార్యదర్శి రేండ్ల తిరుపతి సీఎం కేసీఆర్‌ను బుధవారం సచివాలయంలో కలిశారు. తనకు అవకాశం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

9న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, హైదరాబాద్: ఎన్ఐ యాక్ట్ కేసులు, ఎక్సైజ్ కేసులు, కార్మిక వివాదాలు, వివాహ సంబంధ, సివిల్ కేసుల్లో రాజీ కోసం ఈనెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. ఈ మేరకు తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ(టీఎస్ఎల్ఎస్ఏ) సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్ర కటన విడుదల చేశారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమా న్ని ఫిజికల్‌గా, ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టుతో పాటు తాలూకా కోర్టుల్లోనూ ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. కేసులను పరిష్కరించుకోవాలనుకునే వారు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, న్యాయసేవా సదన్, మండల న్యాయసేవా కమిటీలను సంప్రదించాలని సూచించారు.

'ఫీజు' నిధులు విడుదల చేయాలి : ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్రంలో ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు చదివే 14 లక్షలమంది విద్యార్థులకు రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బుధవారం బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ చేపట్టిన ధర్నాకు ఆర్.కృష్ణ య్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం మాదిరిగా కాలేజీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో కళాశాల యాజమాన్యాలు ఫీజులు కట్టాలని విద్యార్థులను ఒత్తిడి చేస్తున్నాయన్నారు.

16 నుంచి ఎస్సై అభ్యర్థులకు శిక్షణ!

- 10 నుంచి పోలీస్ అకాడమీలో రిపోర్ట్ చేయనున్న ఎస్సై అభ్యర్థులు
- పోలీస్ అకాడమీ ఉన్నతాధికారులతో డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీలో సివిల్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) అభ్యర్థులకు మరికొద్ది రోజుల్లోనే శిక్షణ ప్రారంభం కానుంది. ఈ నెల 16 నుంచి పూర్తిస్థాయిలో శిక్షణను అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిసింది. కాగా, ఈనెల 9న రేంజ్ కార్యాలయాల్లో ఎస్సై అభ్యర్థులు అపాయింట్‌మెంట్ లెటర్లు తీసుకుని 10వ తేదీన తెలంగాణ పోలీస్ అకాడమీలో రిపోర్టు చేయనున్నారు. ఈ నేపథ్యంలో డీజీపీ అంజనీకుమార్ పోలీస్ అకాడమీలో సంస్థ డైరెక్టర్ సందీప్ శాండిల్య, పోలీస్ నియామక మండలి చైర్మన్ వీవీ శ్రీనివాస్‌రావు, అకాడమీ ఉన్నతాధికారులు, ట్రైనర్లతో కలసి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ...సమస్యల పరిష్కారంలో నిపుణత పెంచేలా ఎస్సైల శిక్షణ ఉండాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా రాజేందర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యా యవాది మంతెని రాజేందర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు బుధవారం జీవో నంబర్ 406ను విడుదల చేసింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మూడేళ్లు లేదా ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు వెలువరించే వరకు.. ఏది ముందైతే అప్పటివరకు ఆయన బాధ్యతల్లో కొనసాగుతారు. రాజేందర్‌రెడ్డి స్వస్థలం నిర్మల్ జిల్లా మందపురి గ్రామం. 2006 నుంచి 2012 వరకు ఆయన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ తరఫున కొనసాగారు. రెండు పర్యాయాలు రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. పదేళ్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహించారు. 2009 నుంచి తెలంగాణ ఉద్యమంలో అడ్వొకేట్ జేఏసీ చైర్మన్‌గా రాజేందర్‌రెడ్డి కీలకపాత్ర పోషించారు. రాజేందర్‌రెడ్డి నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తంచేశారు.

'వర్సిటీ' అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి

భిక్కనూరు: విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం డిమాండ్ చేశారు. కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాల క్రమబద్ధీకరణతోనే విద్యావ్యవస్థ పటిష్టం అవుతుందన్నారు. బుధవారం కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలకు చెందిన కాంట్రాక్టు అధ్యాపకుల ఆధ్వర్యంలో 'సీఎం కేసీఆర్‌కు నివేదన' పేరుతో సభ నిర్వహించారు. అనంతరం పరశురాం మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం.. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులను మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో 1,445 మంది కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వర్సిటీ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కవితా తోరస్, కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నారాయణ గుప్తా, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.





మెడికల్ సీట్ల కేటాయింపు వివాదంపై తీర్పు రిజర్వు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కొత్త మెడికల్ (ఎంబీబీఎస్, డెంటల్) కాలేజీల్లో సీట్ల కేటాయింపు వివాదంపై వాదనలు పూర్తి కావడంతో హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. కొత్త మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో నంబర్ 72ను కొట్టివేయాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్‌కు సవరణ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జూలైలో ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం 2014, జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలోని 100 శాతం ఎంబీబీఎస్ సీట్లు తెలంగాణ విద్యార్థులకే రిజర్వు కానున్నాయి. ఈ మేరకు జూలై 3న రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 72ను విడుదల చేసింది. అంతకుముందు జాతీయ కోటా 15 శాతం పోగా.. మిగిలిన సీట్లలో 85 శాతం స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం అన్ రిజర్వుడుగా ఉండేది. అన్ రిజర్వుడులో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు కూడా పోటీపడేవారు. ప్రభుత్వ తాజా జీవోతో అన్ రిజర్వుడు అనేది ఉండదు. దీంతో ప్రభుత్వ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గంగినేని సాయి భావనతో పాటు మరికొందరు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. జీవో నంబర్ 72 చట్టవిరుద్ధమని, దానిని కొట్టివేయడంతో పాటు కౌన్సెలింగ్‌లో పాత విధానాన్నే అనుసరించేలా ఆదేశాలివ్వాలని కోరారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫున న్యాయవాది వాదించారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన రాష్ట్ర విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, వర్సిటీ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. పునర్‌వ్యవస్థీకరణ చట్టానికి, రాజ్యాంగానికి ప్రభుత్వ నిర్ణయం వ్యతిరేకం కాదని చెప్పారు. విభజనకు ముందు ఉన్న కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు కూడా అవకాశం ఇస్తున్నామన్నారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం.. కొత్త కాలేజీల్లోని సీట్ల వివరాలు ఇవ్వాలని ఆదేశించింది.

జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ కోర్సులకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ స్కూళ్లలో 2023–24 విద్యా సంవత్సరానికి జనరల్ నర్సింగ్, మిడ్‌వైఫరీ ట్రైనింగ్ కోర్సుల్లో ప్రవేశానికి తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఈనెల 16 వరకు అందుబాటులో ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తులను ప్రభుత్వ స్కూళ్లలో ఈనెల 19 లోగా, ప్రైవేటు స్కూళ్లలో వచ్చే నెల 10వ తేదీలోగా సమర్పించాలని పేర్కొంది. తరగతులు వచ్చే నెల 15 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించింది. వివరాల కోసం http://dme.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.





అసాధ్యమైనది పొందాలంటే,
ఒక మనిషి అసంగతమైనది ప్రయత్నించాలి.
– ముగెల్ సెర్వాంటిజ్

సాక్షి

గురువారం, 7 సెప్టెంబర్ 2023

నిజం చెబితే నేరమా?

విద్వేషాగ్నిని రెచ్చగొట్టి, విధ్వంసానికి పాల్పడి, మహిళల్ని నగ్నంగా ఊరేగించిన వారిపై కేసులు పెట్టి, ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి పాలకులకు వారాలు, నెలలు పడుతుంది. కానీ, నిజ నిర్ధారణ కమిటీలో భాగంగా వాస్తవ స్థితిని బాహ్య ప్రపంచానికి వెల్లడించి, తప్పులను ఎత్తిచూపిన పత్రికా ప్రముఖులపై కేసులు పెట్టడమైతే మాత్రం తక్షణమే జరిగిపోతుంది. ఘనత వహించిన మన మణిపుర్ పాలకుల తీరు ఇది. కేసులు మీద పడ్డ జర్నలిస్టులు చివరకు దేశ అత్యున్నత న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తే కానీ బుధవారం తాత్కాలిక రక్షణ, సాంత్వన లభించని పరిస్థితి. ఒక్కమాటలో తెచ్చిన సమాచారం వినకుండా, ఆ సమాచారం తెచ్చిన దూతను పాలకులు కొట్టడమంటే ఇదే!

ఈశాన్య రాష్ట్రంలోని ఘర్షణలపై మీడియాలో వార్తల నివేదన ఎలా ఉందన్న అంశంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నిజనిర్ధారణ సంఘం శనివారం వెలువరించిన నివేదిక ఇంత రచ్చకు దారి తీసింది. సదరు నివేదిక పక్షపాత వైఖరితో, తప్పుదోవ పట్టించేలా ఉందని ఆరోపిస్తూ, ఓ సోషల్ మీడియా ఉద్యమకారుడు కేసు పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేసు పెట్టడంతో నిజనిర్ధారణ సంఘంలోని ముగ్గురు సభ్యుల పైన, అలాగే ఎడిటర్స్ గిల్డ్ అధ్యక్షుడిపైన ఒకటికి రెండు ఎఫ్.ఐ.ఆర్.లు దాఖలయ్యాయి. గత నాలుగు నెలల్లో మణిపూర్‌లో పరిస్థితిపైన నోరు విప్పి మాట్లాడడానికి తీరిక లేని ఆ రాష్ట్ర సీఎంకు ఈ విషయంపై మాత్రం విలేఖరులందరినీ కూర్చోబెట్టుకొని మనసులో మాట పంచుకొనే తీరిక, ఓపిక వచ్చాయి. ఎడిటర్స్ గిల్డ్‌ను తీవ్రస్వరంతో హెచ్చరించే సాహసమూ చేశారు.

నిజానికి, మెజారిటీ వర్గమైన మైతేయ్‌లకూ, మైనారిటీలైన కుకీ–చిన్‌లకూ మధ్య ఘర్షణలో మణిపుర్ మీడియా 'మెయితీల మీడియా'గా మారి పక్షపాత వైఖరితో ప్రవర్తిస్తోందని క్షేత్రస్థాయిలో పర్యటించి ఎడిటర్స్ గిల్డ్ అందించిన నిజనిర్ధారణ సంఘం తన నివేదికలో పేర్కొంది. ఆ మేరకు భారత ఆర్మీకి చెందిన 3వ కోర్ దళం కేంద్రకార్యాలయం సహా వివిధ వర్గాల నుంచి ఫిర్యాదు లొచ్చాయనీ గిల్డ్ తెలిపింది. ఇంటర్నెట్‌పై నిషేధంతో మణిపుర్ నుంచి వార్తల నివేదన కష్టమైందని అభిప్రాయపడింది. మీడియా ఫేక్‌న్యూస్ అందిస్తూ, తప్పుడు సమాచారాన్ని వ్యాపింపజేస్తున్నట్టు కనీసం 10 సందర్భాల్లో తమ ఫ్యాక్ట్–చెకింగ్ బృందం తేల్చినట్టు వెల్లడించింది. మణిపూర్ సర్కార్ మాత్రం ఈ నివేదిక అవాస్తవమనీ, ప్రాయోజితమనీ, వండి వడ్డించినదనీ ఆరోపిస్తోంది. తగలబడుతున్న ఓ భవనాన్ని కుకీల గృహంగా పేర్కొన్నారనీ, నిజానికది ఓ అటవీ అధికారి ఆఫీసనీ, నివేదిక మొత్తం 'కుకీ తీవ్రవాదుల' ప్రాయోజితమనేది గిల్డ్‌పై దాఖలైన ఫిర్యాదు. ఫోటో ఎడిటింగ్‌లో ఆ పొరపాటు జరిగిందని గిల్డ్ విచారం వ్యక్తం చేసి, వివరణ ఇచ్చినా కేసులు ఆగలేదు.

మరి, మే 3 నుంచి నాలుగు నెలల పైగా రాష్ట్రం తగలబడుతూ, కనీసం 160 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి, వేలమంది నిరాశ్రయులైనా నిమ్మకు నీరెత్తిన నీరో చక్రవర్తిని తలపిస్తున్న పాలకులపై ఎన్ని కేసులు పెట్టాలి? విధి నిర్వహణలో, శాంతిభద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైనా సరే నైతిక బాధ్యత వహించక కుర్చీ పట్టుకు వేళ్ళాడుతున్న సీఎంను ఏమనాలి? అందరినీ సమభావంతో చూడాల్సిన సదరు వ్యక్తే తాను ఒక వర్గానికి ప్రతినిధి అన్నట్టు నిర్లజ్జగా వ్యవహరించడాన్ని ఎలా సమర్థించాలి? ఇళ్ళు, స్కూళ్ళు, చర్చీలు తగలబడుతూ ఘర్షణలు రేగుతున్నా అంతా ప్రశాంతంగా ఉందనీ, సాధారణ పరిస్థితులు తిరిగొస్తున్నాయనీ అసత్యాలు చెబుతుంటే సిసలైన జర్నలిస్టులు ఏం చేయాలి?

ఎప్పుడైనా, ఎక్కడైనా ఏకపక్షంగా వార్తలు రాస్తూ, వాస్తవాలను వక్రీకరించడం ఘోరం, నేరం. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రికారంగంలో అలాంటి పగుళ్ళు పెరిగితే, ప్రజాస్వామ్య సౌధం కుప్పకూలుతుంది. అస్సామ్ రైఫిల్స్‌పై నిరంతర దుష్ప్రచారం అందుకు చిరు ఉదాహరణ. ఘర్షణలకు సరిగ్గా రెండు నెలల ముందే కుకీ వేర్పాటువాద బృందాలతో కాల్పుల విరమణ ఒప్పందం లాంటి త్రైపాక్షిక 'చర్యల సస్పెన్షన్' ఒప్పందం నుంచి బీజేపీ రాష్ట్ర సర్కార్ ఎందుకు ఉపసంహరించుకుందన్నది దేవరహస్యం. ఇలాంటి వాస్తవాల్ని గిల్డ్ నివేదిక ఎత్తిచూపితే, కేసులు వేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యం? కానీ, ప్రజాస్వామ్యంలో ఆరు నెలలకు ఒకసారైనా అసెంబ్లీ సమావేశం కావాలన్న రాజ్యాంగ నిబంధనను ఉల్లంఘిస్తే తిప్పలొస్తాయని పాలకులు తంటాలు పడ్డారు. రాష్ట్రం తగలబడుతున్నా భేటీ కాని సభ గత నెలాఖరులో ఒక్కరోజే అదీ 11 నిమిషాలే సమావేశమైంది.

ఎడిటర్స్ గిల్డ్ వెలువరించిన నివేదికలో అవాస్తవాలు ఉంటే ప్రభుత్వం ఆ మాటే స్పష్టం చేయవచ్చు. అసలు నిజాలేమిటో బహిరంగంగా వివరించి, ఎడిటర్ల బృందం తప్పని నిరూపించనూ వచ్చు. అంతేకానీ, క్షేత్రస్థాయి పర్యటనతో వాస్తవాల్ని బయటపెట్టేందుకు ప్రయత్నిస్తే 'మరిన్ని ఘర్షణల్ని ప్రోత్సహిస్తున్నార'నడం సమర్థనీయం కాదు. మీడియా పనితీరుకు పరిమితం కాక, ఘర్షణలకు కారణాల్నీ గిల్డ్ పరిశీలించడమేమిటని ప్రశ్నించడమూ అర్థరహితం. పైపెచ్చు, అదే నేరమన్నట్టు క్రిమినల్ ఛార్జీలు నమోదు చేయడం ఏ రకంగానూ సరికాదు. ఈ వైఖరి అప్రజాస్వామికం, తర్కరహితమే కాదు, అక్షరాలా అధికార దుర్వినియోగం! మణిపుర్ సర్కార్ ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి. ఎడిటర్స్ గిల్డ్ ప్రతినిధులపై కేసును ఉపసంహరించుకోవాలి. ముదిరిన జాతి విద్వేషాల్ని తగ్గించడమెలాగన్న దానిపై దృష్టి పెట్టాలి. ఆ అసలు సమస్యను వదిలేసి, కొసరు కథను పట్టుకొని వేళ్ళాడడం ప్రజలకూ, ప్రజాస్వామానికీ ఏ విధంగానూ మేలు చేయదు. కానీ, మన పాలకులు ఇవన్నీ చెవికెక్కించుకొనే స్థితిలో ఉన్నారా అన్నది బేతాళ ప్రశ్న.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.అష్టమి రా.7.56 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రోహిణి ప.3.09 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** ఉ.6.59 నుండి 8.36 వరకు, తిరిగి రా.8.55 నుండి 10.35 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.54 నుండి 10.43 వరకు, తదుపరి ప.2.51 నుండి 3.40 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.51 నుండి 1.31 వరకు.

సూర్యోదయం: 5.49
సూర్యాస్తమయం: 6.08
రాహుకాలం: ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం: ఉ.6.00 నుండి 7.30 వరకు

అవనిని తోడ్కొని ఆఖరి మైలు వరకు!

సందర్భం



నరేంద్ర మోదీ
భారత ప్రధాని

వసుధైక కుటుంబం! ఈ రెండు పదాల్లో యావత్ ప్రపంచాన్నీ ఏకం చేసే లోతైన తాత్త్వికత దాగి ఉంది. 'ప్రపంచమంతా ఒకే కుటుంబం' అన్నదే ఈ రెండు మాటలు బోధించే విశాల భావన. ప్రాదేశిక సరిహద్దులు, భాషలు, భావజాలాలకు అతీతంగా మనమంతా ఒకే సార్వజనీన కుటుంబంగా పురోగమించేలా మనల్ని ప్రోత్సహిస్తూ అందరినీ ప్రపంచ ప్రజానీకంతో మమేకం చేసే విశ్వ దృక్పథమిది. భారత్ జి–20 అధ్యక్షతన ఈ దృక్పథం ప్రాతిపదికగానే మానవ కేంద్రీకృత పురోగమనం అనే భావన ఒక పిలుపుగా రూపొందింది. ఒక భూమిపై నివసించేవారిగా మన గ్రహాన్ని తీర్చిదిద్దుకోవడానికి మనమంతా ఏకమౌదాం. ఒకే కుటుంబంగా... అభివృద్ధి సాధనలో పరస్పరం మద్దతిచ్చుకుందాం. సమష్టి భవిష్యత్తే ఏకైక భవిష్యత్తు అన్నది ఈ పరస్పర అనుసంధాన యుగంలో తోసిపుచ్చలేని వాస్తవం.

మహమ్మారి అనంతర ప్రపంచ క్రమం అంతకు ముందున్న ప్రపంచానికి ఎంతో భిన్నమైనది. ఈ మేరకు సంభవించిన మార్పులలో ముఖ్యమైనవి మూడు ఉన్నాయి: మొదటిది, ప్రపంచ జీడీపీ కేంద్రీకృత దృక్పథం నుంచి మానవ కేంద్రీకృత దృక్పథానికి మారడం అవసరమనే అవగాహన పెరగడం. రెండవది, వస్తూత్పత్తి సరఫరా, పంపిణీల క్రమంలో ఒడిదుడుకులను తట్టుకుని కోలుకునే సామర్థ్యాన్ని, నమ్మకమైన నిలకడల ప్రాముఖ్యాన్ని ప్రపంచం గుర్తిస్తుండటం. మూడవది, అంతర్జాతీయ వ్యవస్థలలో సంస్కరణల ద్వారా బహుపాక్షికతకు ఉత్తేజమిచ్చే దిశగా సామూహిక గళం వినిపిస్తుండటం. ఈ మూడు రకాల మార్పులకు సంబంధించి జి–20కి భారత అధ్యక్షత ఉత్ప్రేరక పాత్రను పోషించింది. ఈ మేరకు ఇండోనేషియా నుంచి 2022 డిసెంబరులో మనం అధ్యక్ష బాధ్యతను స్వీకరించిన వేళ ప్రపంచ ఆలోచనా వైఖరులలో మార్పులకు జి–20 ఉత్ప్రేరకం కావాల్సి ఉంటుందని నేనొక వ్యాసంలో రాశాను. వర్ధమాన, దక్షిణార్ధ గోళ దేశాలు సహా ఆఫ్రికా ఖండంలోని బడుగు దేశాల ఆకాంక్షలను ప్రధాన స్రవంతిలో చేర్చాల్సిన నేపథ్యంలో ఇదొక ప్రత్యేక అవసరం.

ఈ మేరకు జి–20కి మన అధ్యక్షతన తొలి కార్యాచరణలో భాగంగా దక్షిణార్ధ గోళ దేశాల గళం వినిపించేందుకు నిర్వహించిన శిఖరాగ్ర సదస్సులో 125 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. దక్షిణార్ధ గోళ దేశాల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించడంలో అదొక కీలక కసరత్తు. అంతేకాకుండా మన అధ్యక్షత సమయాన ఆఫ్రికా దేశాలనుంచి భారీ సంఖ్యలో ప్రతినిధులు పాల్గొనడంతోపాటు ఆఫ్రికా సమాఖ్యకు జి–20 శాశ్వత సభ్యత్వం కల్పించే ప్రతిపాదన కూడా వచ్చింది. పరస్పర సంధానిత ప్రపంచమంటే వివిధ రంగాల్లో మన సవాళ్లు కూడా పరస్పరం ముడిపడి ఉంటాయి. ఇక 2030 గడువుతో సాధించాల్సిన లక్ష్యాలకుగాను మనమిప్పుడు మధ్య కాలంలో ఉన్నాం. అయినప్పటికీ సుస్థిర ప్రగతి లక్ష్యాల (ఎస్.డి.జి.) దిశగా పురోగమనం లేదన్న ఆందోళన చాలా దేశాల్లో కనిపిస్తోంది. ఈ క్రమంలో ఎస్.డి.జి. ప్రగతిని వేగిరం చేయడంపై జి–20 కూటమి 2023 కార్యాచరణ ప్రణాళిక అన్ని దేశాలనూ భవిష్యత్తు వైపు నడిపిస్తుంది.

ప్రకృతితో సామరస్యపూరిత జీవనశైలి భారతదేశంలో ప్రాచీన కాలం నుంచీ కొనసాగుతున్నదే. అదే సమయంలో ఈ ఆధునిక యుగంలోనూ వాతావరణ కార్యాచరణకు మన వంతు సహకారం అందిస్తున్నాం. ప్రగతికి సంబంధించి దక్షిణార్ధ గోళంలోని అనేక దేశాలు వివిధ దశలలో ఉన్నాయి. అందువల్ల వాతావరణ కార్యాచరణ కావడం తప్పనిసరి. లక్ష్యసాధన ఆకాంక్షలు నెరవేరాలంటే ఇందుకు తగినట్లు వాతావరణ నిధుల సమీకరణ, సాంకేతికత బదిలీ కూడా అవశ్యం. 'పరిస్థితి చక్కబడాలంటే మనం ఏం చేయకూడదు?' అనే నిర్బంధాత్మక ధోరణి నుంచి మనం పూర్తిగా బయట పడాలన్నది మన దృఢ విశ్వాసం. అలాంటి ధోరణికి భిన్నంగా వాతావరణ మార్పుల పోరాటంపై చేయాల్సింది ఏమిటనే దిశగా నిర్మాణాత్మక ఆలోచనలపై మనం దృష్టి సారించాలి. సుస్థిర, నిలకడ గల నీలి ఆర్థిక వ్యవస్థ కోసం చెన్నై 'హెచ్ఎల్పీ'లు మన మహా సముద్రాలను ఆరోగ్య కరంగా ఉంచడంపై దృష్టి పెట్టాలి. హరిత ఉదజని ఆవిష్కరణ కేంద్రంతోపాటు పరిశుభ్ర హరిత ఉదజని కోసం అంతర్జాతీయ పర్యావరణ వ్యవస్థ మన జి–20 అధ్యక్షత నుంచి ఆవిష్కృతమౌతుంది.

2015లో మనం అంతర్జాతీయ సౌర కూటమికి నాంది పలికాం. నేడు ప్రపంచ జీవ ఇంధన కూటమి ద్వారా, వర్తుల ఆర్థిక వ్యవస్థ ప్రయోజనాలకు తగినట్లు ఇంధన పరివర్తనకు శ్రీకారం చుట్టడంలో ప్రపంచానికే మనం ఆసరా అవుతున్నాం. వాతావరణ ఉద్యమానికి ఊపునివ్వడంలో వాతావరణ కార్యాచరణను ప్రజాస్వామీకరించడం ఉత్తమ మార్గం. వ్యక్తులు తమ దీర్ఘకాలిక ఆరోగ్యం ప్రాతిపదికగా రోజువారీ నిర్ణయాలు తీసుకున్న రీతిలోనే మన భూమి దీర్ఘకాలిక ఆరోగ్యంపై ప్రభావం ప్రాతిపదికగా జీవనశైలిపై నిర్ణయాలు తీసుకోవచ్చు. మానవ శ్రేయస్సుకు యోగాభ్యాసం ఒక అంతర్జాతీయ ఉద్యమంగా రూపొందిన తరహాలోనే మనం కూడా 'సుస్థిర పర్యావరణం కోసం జీవనశైలి'(లైఫ్)తో ప్రపంచవ్యాప్తంగా కదలిక తెచ్చాం.

వాతావరణ మార్పుల ప్రభావం నేపథ్యంలో ఆహారం–పౌష్టికతల భద్రతకు హామీ ఇవ్వడం ఎంతో కీలకం. ఈ హామీతో పాటు వాతావరణ అనుకూల వ్యవసాయ వృద్ధికి చిరుధాన్యాలు లేదా 'శ్రీ అన్న' కూడా తోడ్పడతాయి. ప్రస్తుత అంతర్జాతీయ చిరుధాన్య సంవత్సర నేపథ్యంలో మనం చిరుధాన్యాలను అంతర్జాతీయ ప్రజానీకం కంచాల్లోకి తీసుకెళ్లగలిగాం ఆహార భద్రత–పౌష్టికతపై దక్కన్ ఉన్నత స్థాయి సూత్రాలు కూడా ఇందుకు సాయపడతాయి.

సాంకేతిక పరిజ్ఞానంలో పరివర్తన సర్వసాధారణమే. అదే సమయంలో అది సార్వజనీనం కూడా కావాలి. లోగడ సాంకేతిక పురోగమన ప్రయోజనాలు సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందలేదు. అయితే, అసమానతల విస్తరణలోగాక తొలగింపులో సాంకేతికత వినియోగం ఎంత ప్రయోజనకరమో కొన్నేళ్లుగా భారత్ ససాక్ష్యంగా నిరూపించింది. ఉదాహరణకు ప్రపంచవ్యాప్తంగాబ్యాంకింగ్ సదుపాయం లేదా డిజిటల్ గుర్తింపు లేని కోట్లాది ప్రజలకు డిజిటల్ ప్రభుత్వ మౌలిక సదుపాయాలు (డి.పి.ఐ.) కల్పించడం ద్వారా ఆర్థిక సార్వజనీనతలో వారిని భాగస్వాములను చేయవచ్చు. ఈ మేరకు డి.పి.ఐ. ఆధారిత పరిష్కారాలకు నేడు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు వర్ధమాన దేశాలు సార్వజనీన వృద్ధి సాధనలో డి.పి.ఐ. ని స్వీకరించి, తమకు తగిన స్థాయిలో వాటిని రూపొందించుకునేలా మనం చేయూతనిస్తాం.

భారతదేశం అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ కావడం యాదృచ్ఛికమేమీ కాదు. బలహీన/అట్టడుగు వర్గాలు మన పురోగమన పయనాన్ని నడిపించగలిగేలా మనం అమలు చేసిన సరళ, అనుసరణీయ, సుస్థిర పరిష్కారాలు శక్తినిచ్చాయి. అంతరిక్షం నుంచి క్రీడారంగం వరకు; ఆర్థిక వ్యవస్థ నుంచి పారిశ్రామిక ఔత్సాహికత దాకా భారత మహిళలు వివిధ రంగాల్లో ముందంజ వేశారు. మహిళల నేతృత్వంలో ప్రగతికి వారు సరికొత్త అర్థం చెప్పారు. ఈ విధంగా లింగపరంగా డిజిటల్ విభజన తొలగింపు, శ్రామిక శక్తి పరంగా అంతరం తగ్గింపు సహా నాయకత్వం–నిర్ణయాత్మకతలో మహిళలు కీలక పాత్ర పోషించేలా ఇవి ప్రోత్సహిస్తున్నాయి.

భారత్‌కు జి–20 అధ్యక్షత ఉన్నతస్థాయి దౌత్య కర్తవ్యం మాత్రమే కాదు; ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లుగా, వైవిధ్యానికి నమూనాగా యావత్ ప్రపంచం మన అనుభవాలను పంచుకునేందుకు ద్వారాలు తెరిచాం. వివిధ అంశాల్లో విజయసాధన అన్నది నేడు భారతదేశ సహజ లక్షణంగా మారింది. ఇందుకు జి–20 అధ్యక్ష బాధ్యత మినహాయింపు కాబోదు. ఇప్పుడీ బాధ్యత ప్రజాచోదక ఉద్యమంగా రూపొందటమే ఇందుకు కారణం. ఈ మేరకు దేశ వ్యాప్తంగా 60 నగరాల్లో 200కు పైగా సమావేశాలు, సదస్సులు నిర్వహించాం. వీటితోపాటు మన అధ్యక్ష బాధ్యతలు ముగిసేలోగా వీటిలో పాలుపంచుకున్న 125 దేశాలకు చెందిన 1,00,000 మందికిపైగా ప్రతినిధులకు మన ఆతిథ్యం రుచి చూపాం. ఇప్పటిదాకా ఏ దేశమూ ఇంత భౌగోళిక వైవిధ్యంతో జి–20 అధ్యక్ష బాధ్యతలు నిర్వర్తించింది లేదు.

భారతదేశ జనాభా, ప్రజాస్వామ్యం, వైవిధ్యం, ప్రగతిపై ఇతరుల నుంచి ప్రశంసలు వినడం ఒక అంశమైతే, అంతకన్నా ముందే వాటిని ప్రత్యక్షంగా అనుభవించడం పూర్తిగా భిన్నం. మన జి–20 ప్రతినిధులు దీనికి ప్రత్యక్ష సాక్షులుగా నిలుస్తారని నేను కచ్చితంగా నమ్ముతున్నాను. మన జి–20 అధ్యక్షత ప్రధానంగా విభజన రేఖల తుడిచివేతకు, అడ్డంకుల ఛేదనకు, విభేదాలకు భిన్నంగా ప్రపంచంలో సామరస్యం దిశగా సహకార బీజాలు వేయడానికి కృషి చేస్తుంది. 'ఎవరికివారే యమునాతీరే' అనే పరిస్థితికన్నా ఉమ్మడి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవడమే మన లక్ష్యం. ఆ దిశగా ప్రతి స్వరం వినిపించేలా, ప్రతి దేశం సహకరించేలా అంతర్జాతీయ వేదిక విస్తరణకు మనం శపథం చేశాం. తదనుగుణంగా మన కార్యాచరణ, ఫలితాలు చెట్టాపట్టాలతో సాగుతున్నాయని నేను ఘంటాపథంగా చెప్పగలను.

(సెప్టెంబర్ 9, 10 తేదీల్లో జి–20 న్యూఢిల్లీ శిఖరాగ్ర సమావేశం జరగనుంది.)

సోషల్ మీడియా

ఇలా చేస్తారా?



ఒక నటుడు నా సినిమా చేయడానికి అంగీకరించారు. ఇంతలో ఒక ఏజెన్సీ (అది ఏది? ఇదీ ఇప్పుడు ప్రశ్న) ఆయన ఆ ప్రాజెక్ట్‌ను తిరస్కరించేలా చేసింది. ఇదీ సినీ పరిశ్రమ తీరు! ఇదీ సీనియర్ దర్శకులకు ఇచ్చే సోకాల్డ్ గౌరవం!

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

ఆటవిక హీరోలు



అఫ్గాన్లను ఎవరూ జయించలేరనేది ఒక మిథ్య. మహారాజా రంజిత్ సింగ్ మొత్తం కేపీకే (ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా), ఖైబర్ కనుమ, కశ్మీర్, జీబీ (గిల్‌గిత్–బాల్టిస్తాన్) గెలుచుకున్నారు. హరి సింగ్ నలవా (సిక్కు సేనాధిపతి) అంటే ఇప్పటికీ అఫ్గాన్ తల్లులు భయపడతారు. ఖైబర్ కనుమ వ్యాప్తంగా ఆటవికులను మన ఐకాన్లుగా మార్చుకున్నాం కాబట్టే, మన సమాజం నాశనమైంది.

– సయ్యద్ షబ్బార్ జైదీ, ఆర్థికవేత్త

కొత్త వంటకం



ముందు తుర్కియే. ఇప్పుడు భారత్. ఒకవేళ ఇండియా తన పేరును భారత్ అని మార్చుకుంటే, వచ్చే సంవత్సరంలో చేరే కొత్త ఆహ్వానిత దేశాల (అర్జెంటీనా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ)తో 'బ్రిక్స్' కాస్తా 'బార్బిక్యూస్' అవుతుంది.

– వెలీనా చకరోవా, జర్నలిస్ట్

నాశన రంగం



పోషణ రంగంలోకి బిల్ గేట్స్ అడుగుపెడుతున్నారంటే, భారతదేశ వైవిధ్యభరిత, జీవావరణ సంబంధ ఆహారాలను ఆయన ధ్వంసం చేస్తారని కచ్చితంగా చెప్పవచ్చు. జన్యు మార్పిడి పంటలు, గోల్డెన్ రైస్ లాంటి ఆయనకు లాభాలనిచ్చే కృత్రిమ, కర్మాగార తయారీ ఆహారాలను బొప్పిస్తారు. మన ఆహార వారసత్వాన్ని తప్పక కాపాడుకోవాలి.

– వందనా శివ, పర్యావరణవేత్త

వన్యప్రాణి ప్రేమికుడు



ఆదిత్య డికీ సింగ్ (ప్రసిద్ధ వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్) మరణించాడన్న దారుణ వార్తతో నిద్ర లేచాను. పులులకూ, వన్య ప్రాణులకూ ఆయన నిజమైన మిత్రుడు. ఫొటోగ్రఫీ సూచనల విషయంలో చాలా ఉదారంగా ఉండేవాడు. మొత్తంగా అద్భుతమైన మనిషి. స్నేహితుడా! నీ ఆత్మకు శాంతి కలగాలి.

– నేహా సిన్హా, కన్జర్వేషన్ బయాలజిస్ట్

ఖండిత భారత్



ఇండియా పేరు భారత్‌గా మార్పు చేయడంలో ఏ సమస్యా లేదు. అది (వారి) అంతర్గత అంశం. కానీ సమస్యంతా 'అఖండ్ భారత్' ప్రాజెక్టుతో ఉంది. ఇప్పటి ఇండియా, బంగ్లాదేశ్, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, నేపాల్, శ్రీలంక, మయన్మార్ దేశాలన్నీ ఇందులోకి వస్తాయి. బీజేపీ నేతృత్వంలో ఈ కల ఏమోగానీ, ఇండియా మరింత విభజనకు గురవుతుంది.

– అబ్దుల్లా అలమాది, కాలమిస్ట్

ఇది మాత్రమే అభివృద్ధి కాదు!

అభిప్రాయం



సి. రామచంద్రయ్య

76 ఏళ్ల స్వతంత్ర భారతదేశం సాధించిన ఘనతల పరంపరలో తాజాగా 'చంద్రయాన్–3' వచ్చి చేరడం కేంద్రంలోని పాలక పార్టీ బీజేపీకి కలిసొచ్చే అంశమే. ఇస్రో శాస్త్రవేత్తలు సల్పిన నిర్విరామ కృషి ఎన్డీఏ ప్రభుత్వ విజయంగా మారింది. కొన్ని దశాబ్దాల క్రితం రాకెట్లను ఎడ్ల బండ్లపై తీసుకెళ్లిన ఇస్రో శాస్త్రవేత్తలు కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా... తమ కృషిని కొనసాగిస్తూనే ఉన్నారు. శాస్త్ర సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రభాగాన నిలిపేందుకు వారు నిస్వార్థంగా కృషి చేస్తూనే ఉన్నారు. చంద్రయాన్–3 విజయం భారత్ ప్రతిష్ఠను అమాంతం ఆకాశం అంత ఎత్తుకు పెంచేసింది. చంద్రయాన్–3 తర్వాత సూర్యయాన్ వైపు ఇస్రో శాస్త్రవేత్తలు తమ కృషిని సాగించడమూ భారతీయులందరికీ గర్వకారణమే.

అయితే, దేశ శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన ఈ ఘనత, అభివృద్ధి అన్ని రంగాలలో ప్రతిఫలిస్తున్నాయా? అనివార్యంగా వేసుకోవలసిన ప్రశ్న ఇది.

అభివృద్ధిని నిర్ధారించడానికి ప్రపంచంలోని అన్ని దేశాలు కొలమానంగా మానవాభివృద్ధి సూచిక, శిశు మరణాల రేటు, పార్లమెంట్‌లో మహిళల భాగస్వామ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఈ అంశాల ఆధారంగా భారత్‌తోపాటు ఇంచుమించుగా అదే సమయంలో స్వాతంత్ర్యం పొందిన దేశాలు, ఇతర అభివృద్ధి చెందిన దేశాల ప్రగతిని బేరీజు వేసుకోవలసిన అవసరం ఉంది. ఇటీవల ప్రపంచ బ్యాంకు వెల్లడించిన అభివృద్ధి నివేదికలలో పలు ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెల్లడయ్యాయి. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, చైనా, సౌత్ ఆఫ్రికాలు; జీ7 కంట్రీస్‌గా పిలవబడే కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్‌లు; ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలైన అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈజిప్ట్, హంగరీ, ఇండోనేషియా, ఇరాన్, మలేసియా, మెక్సికో, ఫిలిప్పీన్స్, పోలెండ్, సౌదీ అరేబియా, థాయ్‌లాండ్, టర్కీ, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తోపాటు భారత ఉపఖండంలోని బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, పాకిస్తాన్, శ్రీలంక దేశాలు సాధించిన ర్యాంకింగ్‌ల ఆధారంగా అక్కడి స్థితిగతులు అర్థమవుతాయి.

పైన పేర్కొన్న దేశాల జాతీయ స్థూల ఉత్పత్తి



(జీడీపీ)ని పరిశీలిస్తే, 1960 నుంచి 2022 మధ్య కాలంలో తలసరి ఆదాయంలో భారత్‌ది అడుగు నుంచి మూడవ స్థానం. కేవలం పాకిస్తాన్, నేపాల్ మాత్రమే భారత్ కంటే దిగువన ఉన్నాయి. 1950 నుంచి 2021 మధ్య కాలంలో 31 దేశాల మానాభివృద్ధి సూచికలను పరిశీలించినప్పుడు భారత్ 1950లో 26వ స్థానంలో ఉండగా, 2021 నాటికి 29వ స్థానానికి పడిపోయింది. 32 దేశాల్లో శిశు మరణాలకు సంబంధించి 1960–1975 మధ్య కాలంలో, ఆ తర్వాత 2021 వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే... 1960–1975 మధ్య అత్యధిక శిశు మరణాలు నమోదైన దేశాలలో భారత్ 7వ స్థానంలో ఉంది. ఆ తర్వాత 2021 నాటికి ఆ స్థానం మరింత దిగజారి కింది నుంచి 3వ స్థానానికి చేరుకొంది.

పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం అంశంలో 31 దేశాలలో 1997 నుంచి 2022 మధ్యకాలంలో భారత్‌ది 21వ స్థానం. 1997–98లో భారత్ పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం 7 శాతం ఉండగా, 2022 నాటికి అది 14.9 శాతంకు పెరిగింది. 140 దేశాల కంటే భారత్ పార్లమెంట్‌లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉంది. ఎక్కడైతే మహిళల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందో, ఆ దేశాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఇక.. విద్యుత్, ఇంటర్నెట్ సేవల రంగాలలో మాత్రం భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. 1993–2000 మధ్య కాలంలో దేశంలో 50 శాతం జనాభాకు మాత్రమే విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉండగా, ప్రస్తుతం దేశంలో 99 శాతం మందికి విద్యుత్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఇక, ఇంటర్నెట్ సేవల రంగాన్ని పరిశీలిస్తే, 2020 నాటికి భారత్‌లో 43 శాతం జనాభాకు ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరుపడిన భారత్ పౌరహక్కులు, లింగ సమానత్వం, స్వేచ్ఛ వంటి అంశాలలో ఎంతో వెనుకబడింది. మానవాభివృద్ధి సూచికల్లో ప్రధానమైన అంశంగా పౌరహక్కులను పరిగణిస్తారు. పౌరహక్కులలో భారత్ స్థానం 92గా ఉంది. అంటే, భారత్ కంటే 91 దేశాలు మెరుగైన పరిస్థితుల్లో ఉన్నట్లుగా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

భారతదేశంలో ప్రజాస్వామ్య మనుగడకు పలు రాజ్యాంగ వ్యవస్థలు దోహదం చేస్తాయి. అయితే, గత కొంతకాలంగా దేశంలోని పలు రాజ్యాంగ వ్యవస్థలను బలహీన పరిచే ప్రయత్నాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ఎన్నికల నిర్వహణ అతి ముఖ్యమైన అంశం. ఆ బాధ్యతను నిర్వహించే స్వతంత్ర సంస్థ 'భారత ఎన్నికల కమిషన్'నే పూర్తిగా తమ చెప్పుచేతల్లో పెట్టుకునే ప్రయత్నాలను కేంద్రంలో అధికారంలో ఉన్నవారు చేయడం ఆశ్చర్యకరం. భారత ఎన్నికల కమిషన్ తరఫున చీఫ్ ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు బాధ్యతలు నిర్వహిస్తారు. వారి నియామకాలను చేపట్టే విధానాన్ని సమూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా ఓ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. దాని ప్రకారం ఆ ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడితోపాటు భారత ప్రధాన న్యాయమూర్తి బదులుగా ఒక కేంద్ర మంత్రి నియమితులవుతారు. ఆ కేంద్రమంత్రిని ప్రధాన మంత్రే సభ్యుడిగా నియమిస్తారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఎన్నికల నిర్వహణ తీరుతెన్నులు పూర్తిగా మారిపోతాయి. దేశంలో ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగడం అన్నది ఇకపై ఉండకపోవచ్చు. ఇది దేశ ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా ప్రమాదంలోకి నెట్టే చట్టం.

శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన అభివృద్ధిని, ఐటీని, సేవల రంగంలోని అభివృద్ధినీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా అందుబాటులోకి వచ్చిన అభివృద్ధినీ చూపి ఇదే దేశాభివృద్ధిగా చాటుకుంటే అంతకంటే ఆత్మవంచన మరొకటి ఉండదు. అభివృద్ధికి నిర్వచనం మార్చేసి మేడిపండు లాంటి అభివృద్ధి చూపి అదే అభివృద్ధి అని ప్రచారం చేస్తే ఎలా? ఇది కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి చేస్తున్న ప్రయత్నమని వేరే చెప్పవలసిన అవసరం లేదు.

వ్యాసకర్త ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు

గోకులాష్టమి

శ్రీకృష్ణుడనగానే మనకు ముందు గుర్తుకు వచ్చేది, 'శ్రీభగవాన్ ఉవాచ'గా గీతను బోధించిన జగద్గురువైన జగన్నాథుడు కాదు. ధర్మగ్లాని తొలగించి, సాధురక్షణా, దుష్టశిక్షణా చేసేందుకు చనుదెంచిన అఘటన ఘటనా సమర్థుడైన అసాధ్యుడూ, అవతార పురుషుడూ కాదు. 'చేత వెన్నముద్ద–చెంగల్వ పూదండ,/ బంగరు – మొలతాడు, పట్టు దట్టి, / సందె తాయెతులును– సరిమువ్వ గజ్జెలు' సాంప్రదాయికంగా ధరించి, చక్కని శిశురూపంలో అలరించే చిన్ని కృష్ణుడు. పసివాడిని చంపేందుకు వచ్చిన రక్కసి దాని చేత, 'ఇతర బాలుర క్రియ వాడవీవు కావు,/ చన్ను విడువుము, విడువుము, చాలుననుచు,' కుయ్యోమనిపించి, కూల్చివేసిన లీలాబాలుడు.

'...ఏడ వాడు? వాని పట్టి తెచ్చి పొట్ట నిండ పాలు పోయరే?' అంటూ యశోదమ్మ వెంబడిస్తూ మురిసిపోయే 'ముద్దులాడి బాలుడు'.

జ్యోతిర్మయం

'గోకులంలో హరి ఆరగించుటకు పాలు కురిసిన ధేనువులను కూడా ముక్తి కొనలకు చేర్చిన' ముకుందమూర్తి. నవనీత చోర బాలక చరితం,/నందాది వ్రజ పుణ్య తరు ఫలితం,/ధ్రువపద ఫలం, ఏతత్, అతి లలితం,/ భువి నారాయణ తీర్థ యతి ఫణితమ్ అని, భక్త్యావేశంతో నారాయణ తీర్థులచేత నాట్యమాడించిన నంద కిశోరుడు. మద శిఖి పింఛ అలంకృతమైన ముంగురులు కలవాడుగా, ముద్దు చెక్కిళ్ళ నునుపుతో మెరుగుటద్దాన్ని చిన్నబుచ్చేవాడుగా, పరిపూరిత మురళీ రవం వినిపిస్తూ, సదాశివ బ్రహ్మేంద్రులకు సాక్షాత్కరించిన పరబ్రహ్మ. 'కాళింది మడుగున విషమును కలిపే / కాళియు తలపై నాట్యములాడి,/ ఆ విష సర్పము నంతము చేసి,/ గోవుల చల్లగ కా'చిన గోపాలకృష్ణుడు.

అధరం, వదనం, నయనం, హసితం... అన్నీ మాధుర్యమయాలు కాగా, గోపస్త్రీలను పరమాత్మ కామోత్కంఠతతో పరవశింపజేసిన మోహనాకారుడు. 'నల్లని వాడు, పద్మ నయనంబుల వాడు, కృపారసంబు పై చల్లెడి వాడు, మౌళి పరిసర్పిత పింఛము వాడు, నవ్వు రా/జిల్లెడి మోము' వాడూ అయిన బృందావన గోవిందుడు.

గోకులాష్టమి సుముహూర్త సందర్భంలో, 'సంసార పయోనిధి తరణంబులు(ఓడలు), పాపపుంజ దళనంబులు, శ్రీ/ కరణంబులు, ముక్తి సమాచరణంబులు అయిన బాలకృష్ణ సంస్మరణంబులు', కృష్ణ భక్తులకు సకల శుభాలు కలగజేయాలని ఆకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాగుకు పగలు మాత్రమే విద్యుత్!

దేశంలో రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నేపథ్యంలో రాష్ట్రాలకు కేంద్రం సూచన



సాక్షి, హైదరాబాద్: దేశంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో పెరిగిపోయిందని.. రాత్రిపూట కూడా భారీగా వినియోగం ఉంటోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అందువల్ల వ్యవసాయానికి పగటివేళల్లో మాత్రమే విద్యుత్ సరఫరా చేయాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. పగటివేళల్లో ఎక్కువ డిమాండ్ ఉంటే సౌర, పవన విద్యుత్‌తో తీర్చవచ్చని వివరించింది. ఈ నెల 1న దేశంలో పగటిపూట విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో 241 గిగావాట్లకు (ఒక గిగావాట్ అంటే వెయ్యి మెగావాట్లకు సమానం) పెరిగిపోయినా తీర్చడం సాధ్యమైందని పేర్కొంది. దేశంలో కేవలం 0.1 శాతమే విద్యుత్ కొరత ఉందని తెలిపింది. కొంతకాలం నుంచి సూర్యాస్తమయం తర్వాతి వేళల్లోనూ భారీగా విద్యుత్ డిమాండ్ ఉంటోందని.. ఈ నెల 1న ఆ సమయంలో రికార్డు స్థాయిలో 218.4 గిగావాట్ల డిమాండ్ నమోదైందని వెల్లడించింది. సౌర విద్యుత్ లభ్యత లేకపోవడంతో రాత్రిపూట కొరత ఏర్పడుతోందని.. అందువల్ల వ్యవసాయ విద్యుత్ సరఫరాను పగటి వేళలకే పరిమితం చేయాలని సూచించింది. ఈ మేరకు భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్‌ను తీర్చడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తూ కేంద్ర విద్యుత్ శాఖ ఈ నెల 5న అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. ఆ లేఖలోని వివరాల మేరకు..

23 శాతం పెరిగిన డిమాండ్

దేశంలో ఆగస్టులో 23 శాతం డిమాండ్ పెరిగినా తీర్చగలగడం ప్రపంచ స్థాయిలో రికార్డు. ఆ నెలలో ఏడు రోజులపాటు రోజువారీగా 5 బిలియన్ యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగం జరిగింది. 16 రోజుల పాటు రోజువారీ గరిష్ట డిమాండ్ 220 గిగావాట్లకుపైనే రికార్డు అయింది. కొన్ని రాష్ట్రాలు డిమాండ్‌ను తీర్చలేకపోయాయి. ఆగస్టులో రాత్రి వేళల్లో డిమాండ్‌తో పోల్చితే సరఫరాలో 10 గిగావాట్ల లోటు ఏర్పడింది. 700 మి.యూనిట్ల కొరత ఏర్పడింది. రోజువారీగా 6 నుంచి 9 గిగావాట్ల కొరత నెలకొంది. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరపాలని కేంద్రం ఆదేశించడంతో 30–32 గిగావాట్ల విద్యుత్ లభ్యత పెరిగింది.

దక్షిణాదిలోనే కొరత అధికం

దేశవ్యాప్తంగా చూస్తే.. దక్షిణాది రాష్ట్రాల్లో విద్యుత్ కొరత ఎక్కువగా ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో రిజర్వాయర్లలో నిల్వలు అడుగంటిపోవడంతో జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. గతేడాది ఇదే కాలంలో 45 గిగావాట్ల జలవిద్యుదుత్పత్తి జరగగా.. ఈసారి 40 గిగావాట్లలోపే ఉండటం గమనార్హం. జూన్–సెప్టెంబర్ మధ్య పవన విద్యుదుత్పత్తి అధికంగా జరగాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది తగ్గిపోయింది. 43.9 గిగావాట్ల పవన విద్యుత్ కేంద్రాలు ఉండగా.. 2–3 గిగావాట్ల ఉత్పత్తి మాత్రమే ఉంటోంది. 25 గిగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలుండగా.. గ్యాస్ కొరతతో 8.7 గిగావాట్లకు మించి ఉత్పత్తి జరగడం లేదు.

విద్యుత్ డిమాండ్ తీర్చడానికి కేంద్రం సూచించిన చర్యలివీ..

- విద్యుత్ కేంద్రాల్లో జరుగుతున్న మరమ్మతులను సత్వరంగా పూర్తిచేసి ఉత్పత్తిని పునరుద్ధరించాలి.
- షెడ్యూల్ ప్రకారం విద్యుత్ కేంద్రాల్లో చేపట్టాల్సిన మరమ్మతులను డిమాండ్ తక్కువగా ఉండే కాలానికి వాయిదా వేసుకోవాలి.
- ఏదైనా కారణాలతో ఉత్పత్తి నిలిచిపోయిన విద్యుత్ కేంద్రాల్లో సత్వరంగా ఉత్పత్తి ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలి. అన్ని రకాల విడిభాగాలను ముందుగానే సమీకరించి పెట్టుకోవాలి.
- నాణ్యత లేని బొగ్గు, యాష్ పాండ్, ఇతర చిన్న సమస్యలతో చాలా కేంద్రాల్లో పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి జరగక.. 12–14 గిగావాట్ల విద్యుత్ లభ్యత లేకుండా పోయింది. పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేలా చూడాలి.
- ఈ నెల 1న జారీ చేసిన అడ్వైజరీ మేరకు అన్నిరాష్ట్రాల జెన్‌కోలు విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలి.
- విద్యుత్ కొనుగోలు ఒప్పందం కింద తీసుకోవాల్సిన విద్యుత్‌ను ఏదైనా రాష్ట్రం వదులుకుంటే.. ఆ విద్యుత్‌ను పవర్ ఎక్స్ఛేంజీల్లో ఇతర రాష్ట్రాల కోసం అందుబాటులో ఉంచాలి.
- డిమాండ్ అధికంగా ఉండే వేళల్లో, రాత్రివేళల్లో గ్యాస్ ఆధారిత ప్లాంట్లలో ఉత్పత్తి జరిగేలా రాష్ట్రాలు చర్యలు తీసుకోవాలి.
- నిర్మాణంలోని థర్మల్, సౌర, పవన విద్యుత్ కేంద్రాలను వేగవంతంగా పూర్తి చేయాలి.

క్లుప్తంగా...

గవర్నర్ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాన్ని భగవంతుడిపై వదిలేసి ఎలాంటి లాభాపేక్ష లేకుండా తమ కర్తవ్యాన్ని నిర్వహించాలని కృష్ణ భగవానుడు సందేశమిచ్చారని గవర్నర్ పేర్కొన్నారు. నీతి, నిజాయితీ, అంకితభావం, తపనతో కర్తవ్య బాధ్యతలను నిర్వర్తించాలని కృష్ణుడి బోధనలు పేర్కొంటున్నాయని తెలిపారు.

ప్రజలందరికీ శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలు అందాలి: సీఎం కేసీఆర్

ఉట్ల పండుగగా పిలుచుకుంటూ యువతీ, యువకులు కేరింతలతో శ్రీకృష్ణ జన్మాష్టమిని ఆనందోత్సాహాలతో జరుపుకుంటారని సీఎం కేసీఆర్ తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితాన్ని అవలోకనం చేసుకుంటే స్థితప్రజ్ఞులుగా ఎదగవచ్చని పేర్కొన్నారు. భగవద్గీత ద్వారా కర్తవ్యబోధన, లక్ష్య సాధన వంటి పలు ఆదర్శాలను మానవాళికి అందించిన శ్రీకృష్ణుడి కృపాకటాక్షాలు ప్రజలందరికీ అందాలని ప్రార్థించారు.

వర్షాల బాధితులకు రెడ్‌క్రాస్ సేవలందించాలి: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు రెడ్‌క్రాస్ కార్యకర్తలు, వలంటీర్లు సేవలందించాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సూచించారు. ప్రాణ, ఆస్తుల నష్టంపై ఆందోళన వ్యక్తం చేసిన గవర్నర్.. బుధవారం రెడ్‌క్రాస్ స్టేట్ బ్రాంచ్, అన్ని జిల్లా యూనిట్లతో వర్చువల్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమిళిసై మాట్లాడుతూ బాధితులు సహాయం కోసం కాల్ చేయడానికి హెల్ప్‌లైన్ నంబర్‌తో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని అన్ని జిల్లా శాఖలను ఆదేశించారు. జిల్లా యంత్రాంగం నిరంతరం ప్రజలకు సహాయం చేయడానికి ముందుండాలని కోరారు. ఏదైనా సహాయం కావాలంటే రాజ్ భవన్‌ను సంప్రదించాలని రెడ్‌క్రాస్ వలంటీర్లకు సూచించారు. ఆహార పంపిణీ, షెల్టర్ సదుపాయం, మందులు, బట్టల పంపిణీ, అంబులెన్స్ సేవలను అందించడంలో రెడ్‌క్రాస్ వలంటీర్ల కృషిని గవర్నర్ అభినందించారు.

గద్దర్ విగ్రహావిష్కరణ



అల్వాల్(హైదరాబాద్): ప్రజా గాయకుడు గద్దర్ మృతి బాధాకరమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పేర్కొన్నారు. అల్వాల్ వెంకటాపురం డాక్టర్.జి.వి. చంద్రకిరణ్ కాలనీ యాదమ్మనగర్‌లో పాలమూరు ప్రజలు కొత్తగా ఏర్పాటు చేసిన గద్దర్ విగ్రహాన్ని బుధవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మైనంపల్లి మాట్లాడుతూ ప్రజా గాయకుడిగా ఎల్లప్పుడూ ప్రజల గుండెల్లో గద్దర్ నిలిచిపోతారన్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు, కళాకారులు ప్రదర్శించిన ఆటపాటలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గద్దర్ కుమార్తె వెన్నెల, కుమారుడు సూర్యం, కార్పొరేటర్ జితేంద్రనాథ్, గాయకుడు ఏపూరి సోమన్న, సీఎల్ యాదగిరి, బచ్చలకూర స్వామి, అశోక్, రేలారేరేలా గంగ, ప్రొఫెసర్ కాశీం, బైరి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిటర్ బుచ్చిబాబును విచారించిన ఈడీ

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణానికి సంబంధించి హైదరాబాద్‌కు చెందిన ఆడిటర్ బుచ్చిబాబును ఈడీ అధికారులు విచారించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మద్యం విధానం రూపకల్పనలో ఎవరెవరి భాగస్వామ్యం ఉంది? ఎవరి లబ్ధి కోసం మార్పులుచేర్పులు చేశారు? అనే అంశాలపై సుదీర్ఘంగా విచారించినట్లు సమాచారం. మరోవైపు, హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త బినోయ్‌బాబుకు ఢిల్లీ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. బినోయ్‌బాబు కుమార్తె ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని పదిరోజుల పాటు బెయిల్ పొడిగిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

▶ మొదటి పేజీ తరువాయి

డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతూ పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్నారు. ఇటీవల గ్రామాల్లో బోనాల పండుగ ఉన్నందున ఇరవై రోజుల క్రితం స్వగ్రామాలకు వెళ్లారు.

ఇంటి నుంచి వెళ్లి..

సెలవుల అనంతరం మంగళవారం కళాశాలకు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పిన శివాని, మనీషా వారి గ్రామాల నుంచి తొలుత నార్కట్‌పల్లికి చేరుకున్నారు. అక్కడినుంచి ఇద్దరు కలిసి నల్లగొండకు బయలు దేరారు. నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో బస్సు దిగి నడుచుకుంటూ ప్రకాశం బజార్‌లోని ఎరువుల దుకాణానికి వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. షాపులో గడ్డి మందు (కలుపు మందు)తో పాటు మెడికల్ షాపులో నిద్రమాత్రలు కూడా కొనుగోలు చేశారు. అక్కడినుంచి నడుచుకుంటూ ఎన్జీ కళాశాల వెనుక రాజీవ్ పార్కులోకి వెళ్లి గడ్డి మందు తాగారు. అనంతరం శివాని తన తండ్రికి ఫోన్ చేసి 'సారీ నాన్నా.. నేను గడ్డిమందు తాగిన' అని చెప్పింది. శివాని తండ్రి సైదులు వెంటనే జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. మనీషా కూడా తన తల్లికి ఫోన్ చేసి తనకు కడుపులో తిప్పుతోందని, తల బరువుగా ఉందని చెప్పింది. అయితే వెంటనే స్పందించిన నరేందర్‌రెడ్డి తన పీఏను మరి కొందరిని రాజీవ్‌పార్కు వద్దకు పంపడంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే పార్కు వద్ద పడిపోయి ఉన్న శివాని, మనీషాను ఆస్పత్రికి తరలించారు.

వాడెవడో బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు

గడ్డిమందు తాగిన తరువాత శివాని తమ ఇంటి పక్కన ఉండే మరో వ్యక్తికి కూడా ఫోన్ చేసి గడ్డి మందు తాగినట్లు చెప్పింది. ఎందుకు? ఎవరు ఏమన్నారు? అని ఆ వ్యక్తి అడగడంతో.. ఇన్‌స్టాగ్రామ్‌లో మా ఇద్దరి డీపీ తీసుకొని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు. వాడు ఎవడో మాకు తెలియదు అని చెప్పింది. 'సారీ అన్నా హ్యాపీగా ఉండు' అంటూ ఫోన్ కట్ చేసింది. ఈ సంభాషణ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శివాని, మనీషా బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

నాకు ఏమీ బాధ లేదు..

మంగళవారం ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న సమయంలో శివాని, మనీషా నుంచి జడ్జి వాంగ్మూలం తీసుకున్నారు. ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేశారా? అని అడగడంతో అవునని చెప్పారని, ఎవరు అనే వివరాలు మాత్రం వెల్లడించలేదని తెలిసింది. పోలీసులు కూడా విద్యార్థినుల నుంచి వారు ఆత్మహత్యాయత్నం చేయడానికి గల కారణాలను రాబట్టే ప్రయత్నం చేశారు. మాట్లాడే పరిస్థితి లేకపోవడంతో మనీషాకు పేపర్ పెన్ను ఇవ్వగా 'నాకు ఏమీ బాధ లేదు.. అంతా శివానే చేసింది' అని రాసింది. దీంతో ఇద్దరు స్నేహితుల మరణం మిస్టరీగా మారింది. కాగా ఇద్దరి వద్ద ఉన్న ఫోన్లలోని ఇన్‌స్టాగ్రామ్‌లో శివాని, మనీషాలు కలసి ఉన్న ఫొటో డీపీ మాత్రమే ఉందని పోలీసులు చెప్పారు. ఫోన్లను హైదరాబాద్ సైబర్‌క్రైం విభాగానికి అప్పగించారు.

'అసైన్డ్' సవరణపై వివరాలు అందజేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు



సాక్షి, హైదరాబాద్: అసైన్డ్‌దారులకు హక్కులు కల్పించే తెలంగాణ అసైన్డ్ భూముల చట్ట సవరణపై వివరాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన న్యాయమూర్తి, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శితోపాటు చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ)కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం–1977కు 2018లో సవరణ చేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ రిపబ్లికన్ పార్టీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసింది. చట్టంలోని సెక్షన్ 4(1)(b) ప్రకారం నిర్దేశించిన విధంగా 2007, జనవరి 29 నుంచి థర్డ్ పార్టీలకు అనుకూలంగా అసైన్డ్ భూముల రీఅసైన్‌మెంట్ కోసం కటాఫ్ తేదీని 2017, డిసెంబర్ 31 వరకు పొడిగించిందని.. ఇది చట్టవిరుద్ధమని, రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం తీసుకొచ్చిన యాక్ట్ నంబర్ 12ను కొట్టివేయాలని కోరారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పేదల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం అర్హులైన వారికి 1969లో సాగు భూమిని అందజేసిందని చెప్పారు. అయితే వారి నిరక్షరాస్యత, అజ్ఞానం, సామాజిక, ఆర్థిక వెనుకబాటును అలుసుగా తీసుకున్న కొందరు వారి భూములను స్వల్ప ధరలకు కొనుగోలు చేశారన్నారు. రూ.50 లక్షల నుంచి కోటి విలువైన భూములను రూ.5 లక్షలు చెల్లించి పలుకుబడి ఉన్న వారు సొంతం చేసుకున్నారని వెల్లడించారు. అసలు లబ్ధిదారులు ఆ భూముల ద్వారా లబ్ధిపొందలేకపోయారని పేర్కొన్నారు. లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసిన వ్యక్తుల నుంచి భూములను స్వాధీనం చేసుకుని, అంతకు ముందు కేటాయించిన వారికి తిరిగి ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 1977, తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం సెక్షన్ 3 ప్రకారం అసైన్డ్ భూముల అమ్మకం చెల్లదన్నారు. ఇప్పుడు అసైన్డ్ భూములను థర్డ్ పార్టీల (ఇప్పుడు అధీనంలో ఉన్న వారు)కు అప్పగించేలా ప్రభుత్వం చట్ట సవరణ చేయడం సమర్థనీయం కాదని చెప్పారు. ఇలాంటి భూములు రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల ఎకరాలు ఉండగా, ఒక్క రంగారెడ్డి జిల్లాలోనే 74 వేల ఎకరాలున్నాయన్నారు. వాదనలు విన్న ధర్మాసనం .. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

అవమానించడంతోనే పెట్రోల్ పోసుకున్నా

- ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హోంగార్డు రవీందర్ వెల్లడి
- ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స

అఫ్జల్‌గంజ్/సంతోష్‌నగర్: న్యాయంగా రావాల్సిన జీతాన్ని అడిగేందుకు వెళ్లిన తనను హోంగార్డు కార్యాలయ సిబ్బంది దూషించడంతోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు హోంగార్డు రవీందర్ తెలిపారు. చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న రక్షాపురం నివాసి రవీందర్ తనకు రావాల్సిన జీతం కోసం గోషామహల్‌లోని హోంగార్డు కార్యాలయానికి మంగళవారం వెళ్లారు. అక్కడి సిబ్బంది అసభ్య పదజాలంతో దూషించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. తీవ్రగాయాలు కాగా వైద్య చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రవీందర్ బుధవారం మీడియాతో మాట్లాడారు. హోంగార్డు అంటే ప్రతి నెలా 1వ తారీఖునే జీతాలిచ్చేయాలా అని చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు జరిగిన అవమానం రాష్ట్రంలోని ఏ హోంగార్డుకూ జరగకూడదన్నారు. కాగా ఉస్మానియాలో చికిత్స పొందుతున్న రవీందర్‌ను రాష్ట్ర హోంగార్డు జేఏసీ చైర్మన్ నారాయణ పరామర్శించారు. రవీందర్ భార్య సంధ్యతో మాట్లాడి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం అపోలో డీఆర్‌డీఓ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. రవీందర్‌కు న్యాయం జరిగేలా పోరాటం చేస్తామన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 16 వరకు విధులు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు.

నిరసన తెలిపిన హోంగార్డులు..: సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం హోంగార్డులను వెంటనే పర్మనెంట్ చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం అపోలో డీఆర్‌డీఓ ఆసుపత్రి ఆవరణలో హోంగార్డులు ఆందోళనకు దిగారు. రవీందర్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకోవాలనీ, మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.



అపోలో డీఆర్‌డీఓ ఆసుపత్రి బయట నిరసన తెలుపుతున్న హోంగార్డులు

సీఎందే బాధ్యత: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రవీందర్ ఆత్మహత్యాయత్నానికి కేసీఆరే బాధ్యత వహించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా 2017లో సీఎం కేసీఆర్ హోంగార్డులను పర్మనెంట్ చేస్తానని మాట ఇచ్చి తప్పారని మండిపడ్డారు. హోంగార్డులకు బీజేపీ మద్దతు ఉంటుందని భరోసా ఇచ్చారు.

సీసీ టీవీ ఫుటేజీ బయటపెట్టాలి: బండి

అమెరికా పర్యటనలో ఉన్న ఎంపీ బండి సంజయ్ బుధవారం రాత్రి (భారత సమయం) హోంగార్డు కుటుంబ సభ్యులతోపాటు హోంగార్డ్ అసోసియేషన్ జేఏసీ జనరల్ సెక్రటరీ రాజశేఖర్ వీడియోకాల్ చేసి మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ ఫుటేజీ దృశ్యాలను వెంటనే బయటపెట్టాలని సంజయ్ డిమాండ్ చేశారు.

ఉదయనిధి లాంటి వారికి గుణపాఠం చెప్పాలి: బండి



సాక్షి, హైదరాబాద్: సనాతన ధర్మాన్ని కించపరుస్తూ తమిళనాడు సీఎం కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఖండించారు. సనాతన ధర్మానికి విఘాతం కలిగిస్తే..సోనియాగాంధీ కొడుకైనా, స్టాలిన్ కొడుకైనా తీవ్రమైన పరిణామాలుంటాయని హెచ్చరించారు. 'దీనిపై నిఖార్సైన హిందువని చెప్పుకున్న కేసీఆర్ ఎందుకు స్పందించరు? హిందూధర్మాన్ని కించపర్చడం, హిందువులను హేళన చేయడమే ఐఎన్డీఐఏ కూటమి ఎజెండాగా కనిపిస్తోంది. ఉదయనిధి స్టాలిన్ వంటి వారికి తగిన గుణపాఠం చెప్పాలని హిందూసమాజాన్ని కోరుతున్నాం' అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా అమెరికాలో పర్యటనలో భాగంగా బండి సంజయ్ నార్త్ కరోలినాలోని చార్లెట్‌లోని హిందూ సెంటర్‌లో 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ' నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ ర్యాలీలో పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్



సాక్షి, హైదరాబాద్: ఉచిత చేప పిల్లల పంపిణీలో అప్రమత్తంగా ఉండాలని, సీడ్స్ పంపిణీలో కాంట్రాక్టర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా తిరస్కరించే అధికారం మత్స్య సహకార సంఘాలకు ఉంటుందని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ తేల్చి చెప్పారు. బుధవారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్ కార్యాలయంలో 33 జిల్లాలకు చెందిన మత్స్య సహకార సంఘాల బాధ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ వైస్‌చైర్మన్ దీటి మల్లయ్య గంగపుత్ర, అన్ని జిల్లాల మత్స్య సహకార సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులను, లాభాపేక్షతో చేప పిల్లల పంపిణీ కాంట్రాక్టర్లు చేస్తున్న అక్రమ పద్ధతులను అరికట్టాలని జిల్లా మత్స్య సహకార సంఘాల బాధ్యులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. రవీందర్ మాట్లాడుతూ చేప పిల్లల పంపిణీ సమయంలో స్థానిక మత్స్యకారులు, మత్స్యకార సొసైటీలు, జిల్లా సహకార సంఘాలు అప్రమత్తంగా ఉండాలని, సైజు, సంఖ్య, నాణ్యత సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకం ఫలితంగా రాష్ట్రంలోని 5 లక్షల మంది మత్స్యకార కుటుంబాలు ప్రయోజనం పొందుతున్నాయన్నారు. చేప పిల్లల పంపిణీలో మెరుగైన ఫలితాలు సాధించడంలో జిల్లా మత్స్య సహకార సంఘాలు అప్రమత్తంగా వ్యవహరించాలని రవీందర్ సూచించారు.

ప్రేమ వేధింపులకు ఇంజనీరింగ్ విద్యార్థిని బలి!

ఖలీల్‌వాడి: ప్రేమ వేధింపులు తాళలేక స్నేహ తివారీ (18) అనే ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోల్ హనుమాన్ ప్రాంతానికి చెందిన పూనం తివారీకి ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లున్నారు. చిన్న కూతురు స్నేహ తివారీ ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోంది. పూనం భర్త 15 ఏళ్ల క్రితం చనిపోయారు. దీంతో ఆమె ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అక్క స్నేహ తివారీ ఇంటి తలుపులు తీయడం లేదంటూ స్కూల్‌లో ఉన్న తల్లికి కుమారుడు సమాచారం ఇచ్చాడు. దీంతో ఆమె వచ్చి పక్కింటివారి సహాయంతో ఇంటి తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లి చూడగా స్నేహ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. తన కూతురును అదే కళాశాలకు చెందిన సోఫియాన్ అనే వ్యక్తి తరచూ ఫోన్ చేసి వేధించేవాడని మృతురాలి తల్లి ఆరోపించింది. సోఫియాన్‌ను మందలించానని, అయినా అతడు మారకుండా వేధించడంతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని నిజామాబాద్ రెండో టౌన్ ఎస్సై అశోక్ తెలిపారు.

అగ్రిగోల్డ్ కుంభకోణంలో ఈడీ చార్జిషీట్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన అగ్రిగోల్డ్ కుంభకోణంలో ఈడీ బుధవారం చార్జిషీట్ దాఖలు చేసింది. కంపెనీ ప్రమోటర్లు ఏవీ రామారావు, శేషునారాయణరావు, హేమసుందర వరప్రసాద్ పేర్లను అందులో పేర్కొంది. అలాగే అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్లు సహా 11 అనుబంధ కంపెనీలపై కూడా నాంపల్లి ఎంఎస్‌జే న్యాయస్థానంలో ఈడీ చార్జిషీట్ దాఖలు చేసింది. వీటిని కోర్టు విచారణకు స్వీకరించింది. ఈ సందర్భంగా అక్టోబర్ 3న న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని అగ్రిగోల్డ్ ప్రమోటర్లు, కంపెనీల ప్రతినిధులకు కోర్టు సమన్లు జారీ చేసింది. అగ్రిగోల్డ్ సంస్థ పెట్టుబడుల పేరుతో దేశవ్యాప్తంగా డిపాజిట్లు సేకరించిన సంగతి తెలిసిందే. ప్లాట్ల కొనుగోళ్లు, అమ్మకాలు, పెట్టుబడులకు ఎక్కువ వడ్డీ ఇస్తామంటూ ఈ సంస్థ 32 లక్షల మంది డిపాజిటర్ల నుంచి సుమారు రూ.6,380 కోట్లు వసూలు చేసింది. అగ్రిమెంట్ల ప్రకారం డిపాజిటర్లకు సొమ్ము తిరిగి చెల్లించకుండా మోసం చేసింది. బాధితుల ఫిర్యాదులతో ఏపీ సీఐడీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐడీ కేసు ఆధారంగా ఈడీ కూడా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ (పీఎంఎల్ఏ) యాక్ట్ కింద కేసు రిజిస్టర్ చేసింది. 2020 ఏప్రిల్ 3న హైదరాబాద్, విజయవాడ, గుంటూరులలో ఏకకాలంలో సోదాలు జరిపింది. ప్రమోటర్లు, మేనేజర్లు, ఆడిటర్ల ఇళ్లలో తనిఖీలు చేసింది. డిపాజిట్ల రూపంలో సేకరించిన డబ్బుతో సొంత ఆస్తులను కూడబెట్టారని గుర్తించింది. షెల్ కంపెనీలు, బినామీల పేర్లతో మనీలాండరింగ్ చేసినట్లు ఆధారాలు సేకరించింది. వీటికి సంబంధించిన డాక్యుమెంట్లను, ఆడిట్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. దర్యాప్తులో భాగంగా 4,141 కోట్ల విలువ చేసే స్థిరచరాస్తులను రెండు విడతలుగా అటాచ్ చేసింది.

తెలంగాణ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
NIT No.06/TS/T5/1530/2023-24, తేది: 04-09-2023
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద (1) పని అనగా వికారాబాద్ జిల్లాలోని తాండూర్ మున్సిపాలిటీలో గ్రీనరీ అభివృద్ధి మరియు మీడియన్ ప్లాంటేషన్ ఏర్పాటు కోసం ఆన్‌లైన్ టెండర్లు కోరబడుతున్నవి. సుమారు ECV: రూ.76.76 లక్షలు. ఆఖరి తేది: 14-09-2023న సా.4.00 గం. వరకు. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in లో చూడవచ్చును. ఇ-మెయిల్ ఐడి:serurakircle@gmail.com
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (R&B), రూరల్ రీజియన్, హైదరాబాద్
DIPR RO No.1555-DP/CL/Advt/1/2023-24, Dt: 06.09.2023

కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం, వరంగల్
సవరణ ప్రకటన నం. D/594/2022 తేది : 05.09.2023
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ID No.450156 & ప్రకటన నం. D/594/2022, Dt. 17.08.2023 కొరకు సవరణ. పనుల పేరు : ప్రస్తుతమున్న TSRTC వరంగల్ బస్ స్టేషన్‌లో మరియు GWMC భూమి సమీపాన ఆధునిక బస్ స్టేషన్ నిర్మాణం. బయానా : టెండరు సమయంలో అంచనా వ్యయంలో 1%. బిడ్ దాఖలు ముగింపు తేది పొడిగింపు : 11.09.2023 ఉ.11.00 గం. సాంకేతిక బిడ్ తెరుచు తేది : 11.09.2023 ఉ.11.01 గం. ధర బిడ్ తెరచు తేది : 12.09.2023 మ.3.00 గం. పూర్తి వివరాల కోసం www.tender.eprocurement.gov.in సైట్‌లో చూడవచ్చును.
సం/- వైస్ చైర్మన్, KUDA, వరంగల్
DIPR RO No.6242-PP/CL/Advt/1/2023-24, Dt: 06.09.2023

మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం, తుర్కయాంజాల్, రంగారెడ్డి జిల్లా
ఆసక్తి వ్యక్తీకరణ / కొటేషన్ నోటీసు
No.TKJL/EOI/4/2023 తేది:05-09-2023
అనెక్సర్-I ప్రకారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో వివిధ పార్కులు (పాత్‌వే, గ్రీనరీ, ఓపెన్ జిమ్, చిల్డ్రన్ ప్లే ఎక్విప్‌మెంట్, నీటి సరఫరా మొ॥వి) అభివృద్ధి చేసేందుకు ఆసక్తి గల సంస్థలు/ఆర్గనైజేషన్లు / ప్రముఖ ఏజెన్సీలు/ నమోదిత కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ కొటేషన్లు కోరబడుతున్నవి. ఏజెన్సీలు సంబంధిత డాక్యుమెంట్లతో మున్సిపల్ కమిషనర్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పేరున తీసిన షెడ్యూల్ వ్యయం నిమిత్తం రూ.500/- మొత్తం కోసం వాపసు రాని DDని 11-09-2023న మ.3.00 గం.లకు లేదా ఆలోగా డిపాజిట్ చేయవలెను. తదుపరి వివరాల కోసం మున్సిపల్ కమిషనర్ (7799011775) / మున్సిపల్ ఇంజినీర్ (9963613622) వారిని కార్యాలయ వేళలలో సంప్రదించవలెను.
సం/- కమిషనర్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ
DIPR RO No.6240-PP/CL/Advt/1/2023-24, Dt:06.09.2023

తెలంగాణ ప్రభుత్వం
నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక అభియంత కార్యాలయం, నీటిపారుదల వలయం నెం.2, మహబూబ్‌నగర్ జిల్లా
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్
టెండరు నోటీసు సంఖ్యలు: 02, 03/2023-24 తేది: 04-09-2023
క్రమ సంఖ్య, పని పేరు, పని విలువ రూ. కోట్లలో వరుసగా: 1) పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం - ఉదండపూర్ రిజర్వాయర్ - త్రాగునీరు అవసరాల కోసం ఉన్న మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లను నింపడం కొరకు - కుడి ప్రధాన కాలువ - కి.మీ. 0.000 నుండి కి.మీ. 25.500 వరకు మట్టి త్రవ్వడం మరియు CM & CD నిర్మాణ పనులు. రూ.870.00 కోట్లు. 2) పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం - ఉదండపూర్ రిజర్వాయర్ - త్రాగునీరు అవసరాల కోసం ఉన్న మైనర్ ఇరిగేషన్ ట్యాంక్‌లను నింపడం కొరకు - ఎడమ ప్రధాన కాలువ - కి.మీ. 0.000 నుండి కి.మీ. 10.000 వరకు మట్టి త్రవ్వడం మరియు CM & CD నిర్మాణ పనులు. రూ.635.60 కోట్లు. స్వీకరించు చివరి తేది మరియు సమయం అన్ని పనులకు: Dt: 26-09-2023, 5.00 PM. చిరునామా మరియు ఫోన్ నెంబర్ అన్ని పనులకు: కె. శ్రీనివాస్, పర్యవేక్షక అభియంత, నీటి పారుదల వలయం నెం.2, మహబూబ్‌నగర్ జిల్లా, Ph No.7331180570 / 9701456666. తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ వెబ్‌సైట్ సందర్శించగలరు www.tender.telangana.gov.in
సం/- పర్యవేక్షక అభియంత కార్యాలయం, నీటి పారుదల వలయం నెం.2, మహబూబ్‌నగర్ జిల్లా
DIPR RO No.6246-PP/CL/ADVT/1/2023-24, Dt:06.09.2023

ట్రైబల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (TRIFED)
(గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం)
ప్రధాన కార్యాలయం: NSIC బిజినెస్ పార్క్, NSIC ఎస్టేట్, ఓఖ్లా ఫేజ్ -III, ఓఖ్లా ఇండస్ట్రియల్ ఏరియా, న్యూఢిల్లీ-110020
ప్రకటన నం.06/2023
10 మంది కన్సల్టెంట్లను నియమించేందుకు 7వ CPC మరియు తత్సమానంలో లెవెల్ 6 నుండి లెవెల్ 10 వరకు పదవీ విరమణ పొంది ఉండి కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ మినిస్ట్రీస్/శాఖలు/స్వయం ప్రతిపత్తి గల/చట్టబద్ధ సంస్థలు/PSU లలో పదవీ విరమణ పొందిన సిబ్బంది నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి.
TRIFED (గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, GoI పరిధిలోని సంస్థ) వారు కాంట్రాక్ట్ ప్రాతిపదికన కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ మినిస్ట్రీస్/శాఖలు/స్వయం ప్రతిపత్తి గల/చట్టబద్ధ సంస్థలు/PSU లలో పదవీ విరమణ పొందిన సిబ్బంది నుండి పర్సనల్/ఆడిట్/ఫైనాన్స్/HR/ప్రాజెక్ట్ మొ॥ వాటిలో అనుభవం కలిగిన 10 మంది కన్సల్టెంట్లను నియమించాలని ప్రతిపాదిస్తోంది. దరఖాస్తు స్వీకరణకు ఆఖరి తేది: 25-09-2023.
తదుపరి వివరాల కోసం TRIFED వెబ్‌సైట్ https://trifed.tribal.gov.in లో opportunities-careers section క్రింద దర్శించండి లేదా 011-20883014/15/16 వద్ద పర్సనల్ డివిజన్, TRIFED, హెడ్ ఆఫీస్, న్యూఢిల్లీ వారిని సంప్రదించండి.
CBC 43104/12/0016/2324 జనరల్ మేనేజర్ (పర్సనల్)

SEBI
Securities and Exchange Board of India
ప్రకటన
ఆఫీసర్ గ్రేడ్ A (అసిస్టెంట్ మేనేజర్) నియామకం-లీగల్ స్ట్రీమ్ 2023 ఫేజ్ II ఎగ్జామినేషన్
అసలుగా 09 సెప్టెంబర్, 2023న నిర్వహించేందుకు షెడ్యూల్ చేయబడిన ఫేజ్ II ఎగ్జామినేషన్ ఇప్పుడు పరిపాలనా ఆవశ్యకతల కారణంగా 17 సెప్టెంబర్, 2023కి వాయిదా వేయబడింది.
ఫేజ్ II ఎగ్జామినేషన్ కోసం అర్హత సాధించిన అభ్యర్థులందరూ త్వరలోనే SEBI వెబ్‌సైట్ నుండి సవరించిన కాల్ లెటర్‌ను డౌన్‌లోడ్ చేసుకోగలరు. అభ్యర్థులకు ఇ-మెయిల్/SMS ద్వారా ఆవశ్యక సమాచారం అందుతుంది.
CBC 15204/11/0144/2324

Azadi Ka Amrit Mahotsav | G20 | Jigyasa
1 week One Lab
04th - 09th September 2023
సీఎస్ఐఆర్-జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ
सीएसआईआर-राष्ट्रीय भूभौतिकीय अनुसंधान संस्थान
CSIR - NATIONAL GEOPHYSICAL RESEARCH INSTITUTE
Cordially Invites You to
CSIR-NGRI Open Day
On 8th September 2023 (Friday)
(9:30 am to 3:00 pm)
Free Entry !
Near NGRI Metro Station
Attractions:
Open Air Rock Museum ❖ Earthquake Observatory ❖ Live Demos of research activities ❖ Posters ❖ Models ❖ Videos ❖ Quiz Competition ❖ Nukkad Natak (Street Play) and more...
Follow us on
https://www.ngri.res.in/ https://www.facebook.com/csirngrihyd https://twitter.com/csirngri https://www.youtube.com/@csir-ngri6/featured
Ph: +91-40-27012364; Fax: +91-40-23434651; +91-40-27171564
For more information, reach us at email: owol2023@ngri.res.in

క్లుప్తంగా...

ఆ నటరాజ ప్రతిమ... మన ప్రతిభకు తార్కాణం: మోదీ

న్యూఢిల్లీ: జీ 20 సదస్సుకు వేదిక అయిన భారత్ మండపం వద్ద ఏర్పాటు చేసిన భారీ నటరాజ ప్రతిమ ప్రాచీన కాలం నుంచీ వస్తున్న భారతీయ కళా నైపుణ్యానికి, ప్రతిభకు నిదర్శనమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో ఆయన కామెంట్ చేశారు. అనంత విశ్వ శక్తికి సంకేతమైన నటరాజ విగ్రహం జీ 20 సదస్సు వేదిక వద్ద ప్రధాన ఆకర్షణగా నిలవనుందన్నారు. అష్ట ధాతుమయమైన 27 అడుగుల ఎత్తు, 18 వేల కిలోల ఎత్తుతో నటరాజ ప్రతిమ అందరినీ ఆకట్టుకుంటోంది. దీన్ని తమిళనాడుకు చెందిన ప్రఖ్యాత శిల్పి రాధాకృష్ణన్ బృందం రికార్డు స్థాయిలో కేవలం 7 నెలల్లో రూపొందించింది. ఆయన కుటుంబీకులు చోళుల హయాం నుంచీ, అంటే ఏకంగా 34 తరాలుగా శిల్పులుగా ఉంటూ వస్తున్నారు.

పర్యావరణ హామీలపై దృష్టి

జీ20 సదస్సులో బైడెన్ ప్రాథమ్యాలపై అమెరికా

వాషింగ్టన్: వర్ధమాన దేశాలకు చేసిన వాగ్దానాలను, పర్యావరణం సహా కీలక అంశాలపై హామీలను నెరవేర్చడం తదితరాలు జీ20 సదస్సులో అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రాథమ్యాలు కానున్నాయి. ఆయన భారత పర్యటనకు సంబంధించి బుధవారం చేసిన ప్రకటనలో వైట్‌హౌస్ ఈ మేరకు పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో జీ20 సదస్సు గొప్పగా విజయవంతం అవుతుందని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులివన్ ఆశాభావం వెలిబుచ్చారు. బైడెన్ గురువారం భారత్ రానున్నారు. శుక్రవారం ఆయన మోదీతో భేటీ అవుతారు. శని, ఆదివారాల్లో జీ20 భేటీలో పాల్గొంటారు.

పాత భవనంలో ప్రారంభమై... కొత్త భవనంలోకి

పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు

న్యూఢిల్లీ: ఈ నెల 18న మొదలై ఐదురోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుగనున్న విషయం విదితమే. ఈ సమావేశాలు పాత పార్లమెంటు భవనంలో ప్రారంభమై.. మరుసటి రోజు 19న కొత్త పార్లమెంటు భవనంలోకి మారుతాయని అధికారవర్గాలు బుధవారం తెలిపాయి. 19న వినాయక చవితి శుభదినం కాబట్టి ఆ రోజునుంచి కొత్త పార్లమెంటు భవనంలో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 9, 10 తేదీల్లో జరిగే జీ-20 సదస్సు తర్వాత పార్లమెంటు ప్రత్యేక సమావేశాల ఎజెండా ఖరారు చేస్తారని ప్రభుత్వవర్గాలు వెల్లడించాయి. సమావేశాల అజెండాపై స్పష్టత ఇవ్వాలని, అజెండా ఏమిటో కేంద్ర ప్రభుత్వం చెప్పాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఈ వివరణ రావడం గమనార్హం.

జీ20: ఎందుకు.. ఏమిటి!

జీ20 సదస్సుకు సర్వం సిద్ధం



ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన దేశాల కూటమిగా ఖ్యాతికెక్కిన జీ20 సదస్సుకు హస్తిన ముస్తాబైంది. ఈనెల 9, 10 తేదీల్లో జీ20 శిఖరాగ్ర సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు చకచకా జరుగు తున్నాయి. జీ20కి భారత సారథ్య బాధ్యతలు త్వరలో ముగుస్తున్న తరుణంలో ఢిల్లీలో జరిగే సదస్సులో విప్లవాత్మక తీర్మానా లు జరిగే అవకాశముంది. వర్కింగ్ గ్రూప్ సెషన్స్‌లో తీసుకున్న నిర్ణయాలు, వివిధ శాఖల జీ20 మంత్రుల విడివిడి సమావేశాల్లో చేసిన తీర్మానాలు ఈ శిఖరాగ్ర సదస్సు ముందుకు రానున్నాయి. ఈ నేపథ్యంలో జీ20 గురించి కొన్ని విషయాలను గుర్తుచేసుకుందాం.

– నేషనల్ డెస్క్, సాక్షి

ఈసారి ఇతివృత్తమేంటి ?

వసుధైక కుటుంబం అనేది ఈ ఏడాదికి జీ20 సదస్సు ఇతివృత్తం. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు అనే భావనను స్ఫూర్తిగా తీసుకున్నారు. మహా ఉపనిషత్తులోని సంస్కృత రచనల్లో పేర్కొన్నట్లు సూక్ష్మజీవులు మొదలు మనుషులు, జంతుజాలం అంతా ఈ భూమిపైనే ఒకే కుటుంబం జీవిస్తూ ఉమ్మడి భవిష్యత్తుతో ముందుగు సాగుతాయనేది 'వసుధైక కుటుంబం' అంతరార్థం. భూమిపై మనగడ సాగిస్తున్న జీవజాలం మధ్య అంతర్గత బంధాలు, సంపూర్ణ సమన్వయ వ్యవస్థల సహాహారమే వసుధైక కుటుంబం అని చాటిచెపుతూ దీనిని జీ20 సదస్సుకు ఇతివృత్తంగా తీసుకున్నారు. లైఫ్(లైఫ్ స్టైల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్).. అంటే పర్యావరణహిత జీవన విధానాన్ని అవలంభించాలని సదస్సు ద్వారా జీ20 దేశాలు ప్రపంచానికి పిలుపునిచ్చాయి. వ్యక్తిగత స్థాయిలోనే కాదు దేశాల స్థాయిల్లో ఇదే విధానాన్ని కొనసాగించాలని జీ20 సదస్సు అభిలషిస్తోంది. 'లైఫ్'తోనే శుద్ధ, పర్యావరణ హిత, సుస్థిర ప్రపంచాభివృద్ధి సాధ్యమని జీ20 కూటమి భావిస్తోంది.

జీ20 సారథ్య బాధ్యతలను ఎలా నిర్ణయిస్తారు?

19 దేశాలు, ఐరోపా సమాఖ్యల కూటమే జీ20. ప్రపంచం స్థూల వస్తూత్పత్తిలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతులు జీ20 దేశాల్లోనే ఉంది. జీ20లో అంతర్గతంగా ఐదు గ్రూప్‌లు ఉన్నాయి. ఒక్కో గ్రూప్ నుంచి ఒక దేశం జీ20 సారథ్యం కోసం పోటీపడొచ్చు. ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో ఒక గ్రూప్‌కు సారథ్య బాధ్యతల అవకాశం దక్కుతుంది. తమ గ్రూప్ తరఫున సారథ్య అవకాశం వచ్చినపుడు ఆ గ్రూప్ నుంచి ఎవరు ప్రెసిడెన్సీకి పోటీ పడాలనేది అంతర్గతంగా ఆ దేశాలు విస్తృతంగా చర్చించుకుని నిర్ణయించుకుని ఉమ్మడి నిర్ణయం ప్రకటిస్తాయి. అలా తదుపరి సారథి ఎవరో నిర్ణయమైపోతుంది. సారథ్యం వహించే దేశం అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుంది. జీ20 అజెండా ఖరారు, శిఖరాగ్ర సదస్సుసహా మంత్రిత్వ శాఖల స్థాయిలో విడివిడిగా జీ20 గ్రూప్ సమావేశాలను వేర్వేరు పట్టణాల్లో నిర్వహించాలి. సమావేశాల తాలూకు అన్ని రకాల నిర్వహణ ఖర్చులు, సిబ్బంది తరలింపు బాధ్యత సారథ్య దేశానిదే. శాశ్వత సచివాలయం లేని సందర్భాల్లో జీ20 సదస్సు సంబంధ వ్యవహారాలనూ ఆతిథ్య దేశమే చూసుకోవాలి.

తొలి సదస్సు ఎక్కడ ?

2008 నాటి ఆర్థిక సంక్షోభం కారణంగా జీ20 ఉద్భవించింది. ఆనాడు యురోపియన్ యూనియన్‌కు సారథ్యం వహిస్తున్న ఫ్రాన్స్.. ప్రపంచం ఆర్థిక మాంద్యం నుంచి గట్టెక్కి ఆర్థికవ్యవస్థ మళ్లీ ఉరకలెత్తాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చింది. అప్పటికే జీ8 దేశాలైన కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, రష్యా, బ్రిటన్, అమెరికాలు పరిస్థితిని చక్కదిద్దలేకపోయాయి. దీంతో మరిన్ని దేశాలతో కలిపి జీ20ని కొత్తగా ఏర్పాటుచేశారు. 'ఫైనాన్షియల్ మార్కెట్లు- ప్రపంచ ఆర్థికవ్యవస్థ' ఇతివృత్తంతో తొలి జీ20 సదస్సు 2008 నవంబర్‌లో అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో జరిగింది.

ఈసారి సదస్సుకు ఎవరెవరు వస్తున్నారు?

అమెరికా అధ్యక్షుడు బైడెన్

పర్యావరణ మార్పులను అడ్డుకుంటూ శుద్ధ ఇంధనం వైపు ప్రపంచ దేశాలను ఎలా నడిపించాలనే అంశంపై ప్రసంగించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ఈ సదస్సులో పాల్గొనబోతున్నారు. బహుళజాతి అభివృద్ధి బ్యాంకుల సామర్థ్యం పెంపుతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, సామాజిక అంశాలపై ఉక్రెయిన్ యుద్ధ ప్రభావాన్ని సమీక్షించనున్నారు.

చైనా తరఫున లీ కియాంగ్

ఈసారి సదస్సులో చైనా తరఫున ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ రావట్లేదు. ఆయన బదులు చైనా ప్రధాని లీ కియాంగ్ వస్తున్నారు.

బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్

భారత్–బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్యం లక్ష్యంగా బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్ ఈ శిఖరాగ్ర సదస్సులో పాల్గొంటున్నారు. మోదీతో విడిగా భేటీ కానున్నారు.

ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

ఢిల్లీలోని క్లారిడ్జ్ హోటల్‌లో ఈయన బస చేయనున్నారు.

కెనడా ప్రధాని ట్రూడో

రష్యాతో యుద్ధంలో తాము ఉక్రెయిన్‌కు మద్దతుగా నిలుస్తున్నట్లు ఈ అంతర్జాతీయ వేదికపై ఈయన ప్రకటన చేయనున్నారు.

ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్

ఇండోనేసియా, ఫిలిప్పీన్స్‌లోనూ పర్యటిస్తూ ఈయన భారత్‌లో జీ20లో పాల్గొననున్నారు.

- టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాలూ సదస్సులో పాల్గొంటారు.

రానివారెవ్వరు ?

ఆహ్వానం అందని కారణంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ రావట్లేదు. సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, మెక్సికో, జపాన్, ఇటలీ, జర్మనీ, ఇండోనేసియా, బ్రెజిల్, అర్జెంటీనాల అగ్రనేతలు సదస్సుకు రావట్లేదు.

అతిథులు వస్తున్నారు..

అతిథి హోదాలో కొన్ని దేశాల నేతలు ఈ భేటీలో పాల్గొంటారు. నెదర్లాండ్స్, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ), ఒమన్, బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నైజీరియా ఈ జాబితాలో ఉన్నాయి.

- శిఖరాగ్ర సదస్సు మొదలవగానే ఈ భేటీలో అగ్రరాజ్యాధినేతలు ఏమేం నిర్ణయాలు తీసుకోబోతున్నారు? ఎలాంటి తీర్మానాలు చేస్తారు ? ఏం వాగ్దానాలు చేస్తారు? అని ప్రపంచ దేశాలు ఉత్సకతతో ఎదురుచూడటం ఖాయం. పెను వాతావరణ మార్పులు, ఆర్థిక అనిశ్చితి, మాంద్యం భయాలు మొదలు ఉక్రెయిన్ యుద్ధం దాకా ఎన్నో అంతర్జాతీయ అంశాలు ఈ భేటీలో చర్చకురానున్నాయి. సదస్సులో భాగంగా విచ్చేసే దేశాధినేతలు విడివిడిగా ద్వైపాక్షిక చర్చలు, ఒప్పందాలు, ఉమ్మడి ప్రణాళికలు చేసుకునేందుకు చక్కని అవకాశం దక్కనుంది. ఇది ఆయా దేశాల పురోభివృద్ధికి ఎంతో దోహదపడనుంది.

భారత మూలాలు... నాకెంతో గర్వకారణం...!

బ్రిటన్ ప్రధాని రిషి సునాక్

అత్తమామలతో క్రికెట్ గురించే మాట్లాడుకుంటాం

రాజకీయాల ఊసే ఉండదు



న్యూఢిల్లీ: ఆయన రిషి సునాక్. బ్రిటన్ ప్రధాని. ఆ పీఠమెక్కిన తొలి భారత మూలాలున్న నేత. అత్తామామలు ఇన్ఫోసిస్ వంటి దిగ్గజం ఐటీ కంపెనీ వ్యవస్థాపకులు. అంతా కలిస్తే భోజనాల బల్ల దగ్గర వాళ్ల మధ్య ఏ అంశాలు చర్చకు వస్తాయి? రాజకీయాలా? అస్సలు కాదట. కేవలం క్రికెట్ గురించి మాత్రమే మాట్లాడుకుంటారట. చివరికి రిషి ఇద్దరు కూతుళ్లు కూడా క్రికెట్ అంటే ప్రాణం పెడతారట. ఎంతగా అంటే, సర్వ కాల సర్వావస్థల్లోనూ భారత జట్టునే సమర్థించేటంతగా. అయితే, ఫుట్‌బాల్‌లో మాత్రం ఇంగ్లాండ్ జట్టును సమర్థించాలన్నదే వారికి ఆయన విధించే ఏకైక షరతు! సునాక్ తల్లిదండ్రులు ఇద్దరూ భారత మూలాలున్న వారే. తూర్పు ఆఫ్రికా నుంచి ఇంగ్లాండ్ వెళ్లారు. ఇక ఆయన భార్య అక్షతా మూర్తి నారాయణ మూర్తి, సుధా మూర్తి దంపతుల ఏకైక సంతానం. జీ 20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు భారత్ వస్తున్న నేపథ్యంలో బుధవారం పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇ– మెయిల్ ఇంటర్వ్యూలో రిషి పలు అంశాలు పంచుకున్నారు. సరదా సంగతుల నుంచి భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక బంధం దాకా అన్ని అంశాలనూ స్పృశించారు. భారత మూలాలు తనకెంతో గర్వకారణమని పునరుద్ఘాటించారు రిషి. బ్రిటన్ ప్రధానిగా తాను బాధ్యతలు చేపట్టినప్పుడు భారతీయుల నుంచి వ్యక్తమైన హర్షాతిరేకాలు చెప్పలేని అనుభూతి ఇచ్చాయని గుర్తు చేసుకున్నారు. అత్తామామలతో ముచ్చటించేటప్పుడు భారత రాజకీయాలు, టెక్నాలజీ, ప్రధానిగా బ్రిటన్‌ను నడిపించడంలో ఆయన ఎదుర్కొంటున్న సమస్యల వంటివి ఎంత మాత్రమూ ప్రస్తావనకు రావని ఒక ప్రశ్నకు బదులుగా రిషి చెప్పారు. 'రాజకీయాలను, కుటుంబాన్ని విడిగా ఉంచడం ముఖ్యమని అభిప్రాయపడ్డారు.

మోదీతో భేటీ కోసం ఎదురు చూస్తున్నా...

ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నట్టు రిషి చెప్పారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో భారత్, ఇంగ్లాండ్ ద్వైపాక్షిక కృషి పాత్రపై లోతుగా చర్చిస్తామన్నారు. గత ఏడాది కాలంలో భారత్‌లో పర్యటించిన తన మంత్రివర్గ సహచరులు రెట్టించిన ఉత్సాహంతో తిరిగొచ్చారని చెప్పారు.

స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

భారత్–ఇంగ్లాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరేందుకు మరి కాస్త సమయం పడుతుందని రిషి అభిప్రాయపడ్డారు. కానీ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 కల్లా రెట్టింపు చేయడమే లక్ష్యంగా అధునాతన ఒప్పందం కుదురుతుందని విశ్వాసం వెలిబుచ్చారు. 'బ్రిటన్ వాణిజ్య మార్కెట్లో 4.8 కోట్లకు పైగా భారతీయ చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలున్నాయి. భారత ఎగుమతిదారులకు వాటితో యాక్సెస్ కల్పించేలా ఒప్పందం ఉండాలి. వార్షిక ద్వైపాక్షిక వర్తకం ఇప్పటికే రూ.3.5 లక్షల కోట్లు దాటేసింది' అని అన్నారు. ఇంగ్లాండ్‌లో 16 లక్షలకు పైగా భారతీయులున్నారు.

భారత్‌కు జీ 20 సారథ్యం...

జీ 20 సారథ్యానికి భారత్ సరైన దేశమని రిషి అన్నారు. అపార వైవిధ్యానికి నెలవు భారత్. కొన్నేళ్లుగా అన్ని రంగాల్లోనూ అసాధారణ విజయాలు సాధిస్తూ ప్రపంచ దేశాలన్నింటికీ ఆదర్శంగా నిలుస్తోంది. అలాంటి దేశం జీ 20 సదస్సుకు సారథ్యం వహిస్తుండటం సరైన సమయంలో జరుగుతున్న చక్కని ఘటన' అని అభిప్రాయపడ్డారు. మోదీ నాయకత్వ సామర్థ్యానికి నిజంగా సెల్యూట్ చేస్తున్నా. ప్రపంచ సారథిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్ర నిజంగా శ్లాఘనీయం' అన్నారు.

> బ్రిటన్ ప్రధాని కాగానే నేను చేసిన మొదటి పని అధికార నివాసం 10, డౌనింగ్ స్ట్రీట్‌లో దీపావళి విందు ఇవ్వడమే. భవనమంతా విద్యుద్దీపాలు, పూలతో మెరిసిపోతుంటే చూసి చెప్పలేనంత భావోద్వేగానికి లోనయ్యా. ఒక భారతీయునిగా నాకెంతో గర్వకారణమైన విషయమది.
>
> నా గాథ నిజానికి లోతైన భారత మూలాలున్న ఎంతోమంది బ్రిటన్ వాసుల కథే. ఈ భిన్నత్వంలో ఏకత్వం బ్రిటన్ బలం.
>
> నేను పాటించే విలువలకు నా భార్య, ఇద్దరు కూతుళ్లు, తల్లిదండ్రులు, అత్తామామలు దారి చూపే దీపాలుగా నిలుస్తారు. ముఖ్యంగా అత్తామామల ఘనతలు చూసి నేనెంతో గర్విస్తాను. ఏమీ లేని స్థితి నుంచి మొదలై ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఐటీ దిగ్గజ కంపెనీని స్థాపించే దాకా వాళ్ల ప్రస్థానం అందరికీ స్ఫూర్తిదాయకం. భారత్, ఇంగ్లాండ్‌ల్లో వేలాది మందికి అది ఉపాధి కల్పిస్తోంది. ప్రతి పౌరుడూ అలాంటి విజయాన్ని సాధించేందుకు వీలు కల్పించేలా బ్రిటన్‌ను తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం.
>
> జీ 20 సదస్సు కోసం భార్య అక్షతతో కలిసి భారత్ లో పర్యటించనుండటం పట్ల ఎంతో ఉత్సాహంగా ఉన్నా. బిజీ బిజీగా గడిపేలా ఇప్పటికే మొత్తం ప్లానింగ్ చేసుకున్నాం. భారత్‌లో మేం గతంలో వెళ్లాలని అనుకున్న పలు ప్రాంతాలకు వెళ్తాం.

సమావేశాల్లో ఆ 9 అంశాలపై చర్చించండి

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధానికి సోనియా గాంధీ లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఎలాంటి ఎజెండాను ప్రకటించకుండానే ఈనెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈసారి సమావేశాల్లో మణిపూర్‌లో హింస, దేశవ్యాప్తంగా పెరిగిన ధరలు తదితర కీలకాంశాలపై చర్చించాలని డిమాండ్‌చేస్తూ ప్రధాని మోదీకి సోనియా లేఖ రాశారు. ముఖ్యంగా తొమ్మిది అంశాలపై చర్చ జరగాల్సిందేనని ఆమె పట్టుబట్టారు. 'మణిపూర్‌లో హింస, పెరిగిన ధరవరలు, రాష్ట్రాలు– కేంద్రం మధ్య క్షీణిస్తున్న సత్సంబంధాలు, చైనాతో సరిహద్దు వెంట కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, అదానీ గ్రూప్‌లో అవినీతి లావాదేవీల బహిర్గతం కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు వంటి అంశాలను చర్చించాలి' అని లేఖలో పేర్కొన్నారు. 'ఇతర రాజకీయ పార్టీలతో ఎలాంటి సంప్రతింపులు జరపకుండానే ఎలాంటి ఎజెండా ప్రకటించకుండానే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను ప్రభుత్వం నిర్వహించబోతోంది. ఈ సమావేశాల్లో ప్రభుత్వ ఎజెండా ఏమిటో ఎవ్వరికీ తెలియదు. సమావేశాలు జరిగే ఈ మొత్తం ఐదు రోజులూ ప్రభుత్వ ఎజెండాపైనే చర్చ జరగనుందని మాకు సమాచారం వచ్చింది' అని సోనియా వ్యాఖ్యానించారు.

ఇదో చక్కని అవకాశం

'ఇదో చక్కని అవకాశం. ప్రజాసమస్యలు, ప్రాముఖ్యత దృష్ట్యా ఈసారి సమావేశాల్లో మేం తప్పకుండా పాల్గొంటాం. ఈ అంశాలపై చర్చకు సమయం కేటాయిస్తారనే భావిస్తున్నాను' అని సోనియా అన్నారు. 'ఉభయ సభల్లో ఏ అంశాలపై చర్చిస్తారో అనే విషయాన్ని ముందుగా తెలపకుండానే సెషన్‌ను ప్రారంభిస్తుండటం బహూశా ఇదే తొలిసారి అనుకుంటా' అని కాంగ్రెస్ మరో నేత జైరామ్ రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతర రాజకీయ పార్టీలు చేస్తున్న డిమాండ్లకు తగ్గట్లు దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని సోనియా కోరారు. ప్రకృతి విపత్తుల కారణంగా కొన్ని రాష్ట్రాల్లో భారీ వరదలు సృష్టించిన విలయం, మరి కొన్ని రాష్ట్రాల్లో కరువు కాటకాలు వంటి ఘటనలను చర్చించాలని సోనియా డిమాండ్‌చేశారు. 'పెరుగుతున్న నిరుద్యోగిత, సమాజంలో అసమానతలు, సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమలు సమస్యల వలయంలో చిక్కుకోవడం వంటి అంశాలనూ చర్చించాలి. రైతుల డిమాండ్ మేరకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం, రైతాంగం సమస్యలు చర్చకు రావాలి' అని సోనియా అన్నారు. 'ఈసారి సమావేశాలను మేం బాయ్‌కాట్ చేయబోం. సభలోనే ఉండి సమస్యలపై పోరాడతాం' అని ఢిల్లీలో మీడియా సమావేశంలో జైరాం రమేశ్ చెప్పారు.

ఆ తొమ్మిది అంశాలు

1. ప్రస్తుత దేశ ఆర్థిక పరిస్థితితో పాటు నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, పెరుగుతున్న నిరుద్యోగం, అసమానతల పెరుగుదల, ఎస్ఎంఈలపై దుస్థితి
2. రైతులు, రైతు సంస్థలు లేవనెత్తిన కనీస మద్దతు ధర అంశంతో పాటు వారు లేవనెత్తిన ఇతర డిమాండ్ల పరిష్కారం కోసం మోదీ సర్కార్ చూపే నిబద్ధత
3. అదానీ వ్యాపార సమూహం లావాదేవీలను దర్యాప్తు చేయడానికి జేపీసీ ఏర్పాటు
4. మణిపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న నిరంతర వేదన, రాజ్యాంగ వ్యవస్థల విచ్ఛిన్నం, అక్కడ నెలకొల్పాల్సిన సామాజిక సామరస్యం
5. హరియాణా వంటి వివిధ రాష్ట్రాల్లో మతపరమైన ఉద్రిక్తతలు పెరగడం
6. భారత భూభాగాన్ని చైనా ఆక్రమించడం, లద్దాఖ్, అరుణాచల్ ప్రదేశ్‌లోని మన సరిహద్దుల్లో దేశ సార్వభౌమాధికారానికి ఎదురైన సవాళ్లు
7. దేశవ్యాప్తంగా కుల గణన
8. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య దిగజారుతున్న సంబంధాలు
9. ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో కొన్ని రాష్ట్రాల్లో విపరీతమైన వరదలు, మరికొన్ని రాష్ట్రాల్లో కరువు కారణంగా పెరిగిన కష్టాలు

అధికారిక కార్లు వాడొద్దు

▶ మొదటి పేజీ తరువాయి

రావాలని, వేదిక వద్ద షటిల్ సర్వీసును ఉపయోగించుకొని విందు జరిగే ప్రదేశానికి చేరుకోవాలని ఇదివరకే సూచనలు వెళ్లాయి. కేంద్ర మంత్రులందరూ జీ–20 యాప్‌ను డౌన్ లోడ్ చేసుకోవాలని, ఇందులో జీ–20 దేశాల భాషలతో పాటు భారతీయ భాషలన్నింటిలోనూ అనువాద సదుపాయం ఉందని ప్రధాని వివరించారు. వివిధ దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 40 మంది ప్రపంచ నాయకులు సెప్టెంబరు 9, 10వ తేదీల్లో జరిగే జీ–20 సదస్సుకు హాజరవుతారని విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్‌మోహన్ క్వాత్రా మంత్రులకు తెలిపారు. పాటించాల్సిన ప్రొటోకాల్ నిబంధనల గురించి వివరించారు. భారత్, ఇండియా వివాదంపై అధీకృత వ్యక్తులు మాత్రమే మాట్లాడాలని ప్రధాని మోదీ మంత్రివర్గ సహచరులకు సూచించారు. చరిత్రలోకి వెళ్లకుండా రాజ్యాంగానికి లోబడి వాస్తవాలను మాట్లాడాలని కోరారు. సనాతన ధర్మాన్ని డెంగ్యూ, మలేరియాలతో పోల్చిన డీఎంకే నాయకుడు, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్‌కు తగురీతిలో సమాధానమివ్వాలని ప్రధాని ఈ భేటీలో అభిప్రాయపడ్డారు.

సుప్రీం రిటైర్డ్ జడ్జీలకు కూలింగ్ ఆఫ్ పీరియడ్.. పిల్ కొట్టేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులు రిటైరయాక రెండేళ్ల పాటు రాజకీయ, ప్రభుత్వ పదవులను స్వీకరించకుండా ఆదేశించాలంటూ దాఖలైన పిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టేసింది. ఈ అంశాన్ని జడ్జీల విచక్షణకే వదిలేయాలని న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సుధాన్షూ ధూలియాల ధర్మాసనం అభిప్రాయపడింది. దీనిపై పిటిషన్‌దారులు కోరినట్టుగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం ఎలాంటి నిర్దేశాలూ ఇవ్వలేమని స్పష్టం చేసింది.

'భారత్'గా మారిన అక్షయ్ కొత్త సినిమా పేరు



ముంబై: భారతదేశం పేరును అధికారికంగా ఇండియా నుంచి భారత్‌కు మార్చాలన్న ప్రతిపాదనలు, వివాదాల నేపథ్యంలో బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కొత్త సినిమా పేరు మారింది. 'మిషన్ రాణీగంజ్: ది గ్రేట్ ఇండియన్ రెస్క్యూ' పేరులోని ఇండియా పదాన్ని తొలగించి భారత్ పదాన్ని చేర్చారు. దీంతో సినిమా పేరు 'మిషన్ రాణీగంజ్: ది గ్రేట్ భారత్ రెస్క్యూ'గా మారింది. ఈ రోజే(గురువారం) ఈ సినిమా థియేటర్లలో విడుదలకాబోతోంది. 1989 నవంబర్‌లో పశ్చిమబెంగాల్‌లోని రాణీగంజ్‌లో వరదమయమైన బొగ్గు గనిలో చిక్కుకున్న వారిని సాహసోపేతంగా రక్షించిన సహాయక బృందానికి సారథ్యం వహించిన మైనింగ్ ఇంజనీర్ దివంగత జస్వంత్ సింగ్ గిల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు.

4 లక్షల భారతీయులు... గ్రీన్ కార్డ్ కళ్లజూడలేరు!



వాషింగ్టన్: అమెరికాలో ఉంటున్న భారతీయుల్లో 4 లక్షల మందికి పైగా తమ జీవిత కాలంలో గ్రీన్ కార్డ్ కళ్లజూడలేరని తాజా అధ్యయనం ఒకటి పేర్కొంది! ఆ లోపే వారు కన్ను మూస్తారని అభిప్రాయపడింది. అమెరికాలో ఈ ఏడాది ఉద్యోగాధారిత గ్రీన్ కార్డ్ పెండింగు దరఖాస్తులు ఏకంగా 18 లక్షలు దాటాయి. వీటిలో ఏకంగా 63 శాతం, అంటే 11 లక్షలకు పైగా భారతీయులవే! దాదాపు 2.5 లక్షలు, అంటే 14 శాతంతో చైనా రెండో స్థానంలో ఉంది. కానీ ఏటా గరిష్ఠంగా జారీ చేసే గ్రీన్ కార్డుల్లో ఏ దేశానికీ 7 శాతం కంటే ఇవ్వరు. ఈ నిబంధన వల్ల భారతీయులకు తీవ్ర అన్యాయం జరుగుతూ వస్తోంది. ఈ కారణంగా జీవిత కాలంలో గ్రీన్ కార్డు పొందలేని 4.24 లక్షల మందిలో ఏకంగా 90 శాతానికి పైగా భారతీయులే ఉంటారని అధ్యయనం చెబుతోంది. 83 లక్షల కుటుంబ ఆధారిత గ్రీన్ కార్డు పెండింగ్ దరఖాస్తులు వీటికి అదనం!

ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేలపై కేసు నమోదు

రాంపూర్: మతవిశ్వాసాలకు భంగం కలిగించినందుకు డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేలపై ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని స్టాలిన్ ఇటీవల వ్యాఖ్యానించడం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను సమర్థించినందుకు ప్రియాంక్ ఖర్గేపై కూడా కేసు నమోదైంది. సనాతన ధర్మాన్ని ఉదయనిధి డెంగ్యూ, మలేరియాలతో పోల్చిన విషయం విదితమే. ఉదయనిధి వ్యాఖ్యలు తమ మతవిశ్వాసాలకు విఘాతం కలిగించాయని న్యాయవాదులు హర్ష్ గుప్తా, రామ్‌సింగ్ లోధిలు స్థానిక సివిల్ లైన్స్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో ఉదయనిధి, ప్రియాంక్ ఖర్గేలపై ఐపీసీ సెక్షన్ 295 ఎ (మతవిశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా కించపర్చడం), 153 ఎ (భిన్న మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడం) కింద కేసులు నమోదయ్యాయి.

ఐఐటీ మండీలో ర్యాగింగ్ ఘటన

10 మంది విద్యార్థుల సస్పెన్షన్

న్యూఢిల్లీ/మండీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ–మండీలో జూనియర్లను ర్యాగింగ్ చేసిన 10 మంది సీనియర్లను కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసింది. మరో 62 మందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. విద్యార్థి విభాగం ఆఫీస్ బేరర్స్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ర్యాగింగ్ చేసిన సీనియర్ విద్యార్థులకు రూ.15వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధించారు. 20 నుంచి 60 గంటలపాటు సమాజసేవ చేయాలని ఆదేశించినట్లు ఐఐటీ–మండీ ఉన్నతాధికారులు బుధవారం వెల్లడించారు. ముగ్గురు విద్యార్థి విభాగం ఆఫీస్ బేరర్లతోపాటు 10 మంది విద్యార్థులను తరగతి గదులు, వసతి గృహాల నుంచి డిసెంబర్‌దాకా సస్పెండ్ చేశారు. బీ.టెక్ కోర్సుల్లో కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం పరిచయ కార్యక్రమాన్ని ఇటీవల కాలేజీలో నిర్వహించారు. 'ఈ ఘటనలో 72 మంది సీనియర్ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకున్నాం' అని కాలేజీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.

యూరప్ పర్యటనలో రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ యూరప్‌లో వారంపాటు పర్యటించనున్నారు. మంగళవారమే ఆయన భారత్ నుంచి బయల్దేరారు. సెప్టెంబర్ ఏడున బ్రస్సెల్స్‌లో యురోపియన్ యూనియన్ పార్లమెంటేరియన్లతో రాహుల్ భేటీ అవుతారు. ఆ తర్వాత అక్కడే కొందరు ప్రవాస భారతీయులతో సమావేశమవుతారు. తర్వాతి రోజు ఉదయం కొందరు భారతీయ పారిశ్రామికవేత్తలతో భేటీ జరగనుంది. మధ్యాహ్నం పత్రికా సమావేశంలో పాల్గొంటారు. తర్వాత ఆయన పారిస్‌కు చేరుకుని సెప్టెంబర్ ఎనిమిదో తేదీన మరో పత్రికా సమావేశంలో పాల్గొంటారు. సెప్టెంబర్ తొమ్మిదో తేదీన ఫ్రాన్స్ పార్లమెంటేరియన్లతో ముచ్చటిస్తారు. తర్వాత అక్కడి సైన్స్ పొ విశ్వవిద్యాలయం విద్యార్థులతో మాట్లాడతారు. సెప్టెంబర్ పదో తేదీన రాహుల్ నెదర్లాండ్స్‌కు వెళ్తారు. 400 ఏళ్ల నాటి లీడెన్ యూనివర్సిటీలో పర్యటించి అక్కడి విద్యార్థులతో మాట్లాడతారు. సెప్టెంబర్ 11వ తేదీన నార్వేకు వెళ్తారు. ఓస్లోలో ఆ దేశ పార్లమెంటేరియన్లతో సమావేశమవుతారు. తర్వాత అక్కడి ప్రవాస భారతీయులతో, ఓస్లో వర్సిటీ విద్యార్థులతోనూ మాట్లాడతారు. సెప్టెంబర్ 12వ తేదీన రాత్రి రాహుల్ భారత్‌కు తిరుగుపయనమవుతారు.

ఆ ఒక్క బిస్కెట్ విలువ రూ.1 లక్ష !

ప్యాకెట్‌లో ఒక్క బిస్కెట్ తగ్గినందుకు తయారీ సంస్థకు జరిమానా విధించిన వినియోగదారుల ఫోరమ్ • తమిళనాడులో ఘటన



తిరువళ్లూర్(తమిళనాడు): చిన్న బిస్కెట్ ప్యాకెట్ కొంటే అందులో ఒక బిస్కెట్ మిస్సయింది. ప్యాకెట్‌లో లేని ఆ ఒక్క బిస్కెట్ విలువ ఎంత ఉంటుంది?. నిజానికి అదేం బంగారు బిస్కెట్ కాదు కాబట్టి దాని విలువ చాలా తక్కువే ఉంటుంది. కానీ ఆ ఒక్క బిస్కెట్ కోసం ఐటీసీ ఫుడ్స్ వారు రూ.1 లక్ష జరిమానాను ఎదుర్కోవాల్సి వచ్చింది. ఏమిటీ బిస్కెట్ బాగోతం అనేగా మీ సందేహం. వివరాల్లోకి వెళ్తే అంతా తెలుస్తుంది. తమిళనాడు రాజధాని చెన్నైలో పి.దిల్లిబాబు అనే వ్యక్తి ఇటీవల సన్‌ఫీస్ట్ మ్యారీ లైట్ అనే బిస్కెట్ ప్యాకెట్ కొన్నాడు. 'ఈ ప్యాకెట్‌లో 16 బిస్కెట్లు ఉంటాయి' ఆ ప్యాకెట్ రేపర్‌పై ఉంది. అది చూసిన దిల్లిబాబు సరదాకి ప్యాకెట్‌లోని బిస్కెట్లు లెక్కించాడు. ఒక బిస్కెట్ లెక్క తగ్గింది. తప్పుడు ప్రచారం చేస్తూ కంపెనీ మోసం చేస్తోందంటూ నేరుగా ఆయన తిరువల్లూర్ జిల్లా వినియోగదారుల ఫోరమ్ వద్దకెళ్లి కేసు వేశారు. ప్యాకెట్‌ను తయారుచేసిన ఐటీసీ ఫుడ్స్ సంస్థపై రూ.100 కోట్ల పెనాల్టీ వేయాలని కోరారు. సరైన వ్యాపార విధానాలు అవలంభించని కారణంగా రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో సేవా లోపాన్ని ఎత్తిచూపారు. ప్యాకెట్‌ను బరువు ఆధారంగా విక్రయిస్తామేగానీ అందులో ఉన్న బిస్కెట్ల సంఖ్యను బట్టి కాదు అంటూ తయారీసంస్థ చేసిన వాదనలను వినియోగదారుల ఫోరమ్ పట్టించుకోలేదు. 'రేపర్‌పై ఉండే సమాచారంతో సంతృప్తి చెందిన వినియోగదారులే ఆయా వస్తువులను కొంటారు. బరువును చూసి కాదు ఇందులోని బిస్కెట్ల సంఖ్యను చూసే కొనండి అని రేపర్‌పై ప్రత్యేకంగా ముద్రించి ఉంది' అంటూ కోర్టు గుర్తుచేసింది. వినియోగదారునికి రూ.1 లక్ష నష్ట పరిహారం చెల్లించాలని ఆదేశించింది. కోర్టు ఖర్చుల కింద మరో రూ.10 వేలు అందించాలని సూచించింది. దిల్లిబాబు కొన్న ప్యాకెట్ బ్యాచ్(0502 ఇ36)తో ఉన్న అన్ని ప్యాకెట్ల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించింది. 'తూనికలు, కొలతల చట్టం– 2011 ప్రకారం 50 నుంచి 100 గ్రాముల్లోపు బరువున్న ప్యాకేజీ వస్తువు 4.5 గ్రాములు బరువు ఎక్కువ/తక్కువ ఉన్నా సరే అది చట్టప్రకారం నేరం కాదు. ఈ కోణంలో చూసినా 76 గ్రాముల ఆ ప్యాకెట్ 71.5 గ్రాముల నుంచి 80.5 గ్రాముల వరకు ఉండొచ్చు' అని కంపెనీ చేసిన వాదనలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదు.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 8 । సెప్టెంబర్ । 2023



ధ్యానం, యోగాతో మానసిక ప్రశాంతత

ధ్యానం, యోగా వంటి అలవాట్లతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు భిక్షమయ్య గురూజీ అన్నారు. -8లో



కోర్టు ఆదేశాలను పాటించండి

గణేష్ విగ్రహాల నిమజ్జనానికి సంబంధించి గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను పాటించాలని కొత్వాల్ సీవీ ఆనంద్ ఉత్సవాల నిర్వాహకులకు సూచించారు. -8లో

'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్'పై ఎన్ఐఏ కన్ను!



సోషల్ మీడియా యాప్స్ టెలిగ్రాం, వాట్సాప్ ద్వారా పార్ట్ టైమ్ జాబ్స్, వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ప్రకటనలు ఇచ్చి, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.712 కోట్లు వసూలు చేసిన భారీ ఫ్రాడ్‌పై ఎన్ఐఏ దృష్టి పెట్టింది. -8లో

న్యూస్‌రీల్

పాప్‌కార్న్ యంత్రంలో బంగారం పట్టివేత



శంషాబాద్: ప్రయాణికుడు అక్రమంగా తరలించేందుకు తీసుకొచ్చిన బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి లగేజీని తనిఖీ చేయగా అందులో ఉన్న పాపకార్న్ యంత్రం బయటపడింది. దాన్ని విప్పి చూడగా అందులోనే ఓ భాగాన్ని పరిశీలించి బంగారంగా గుర్తించారు. 206 గ్రాములున్న బంగారం విలువ 12.57 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఆడుకుంటూ.. అనంత లోకాలకు..

- ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి బాలుడి మృతి



సుభాష్‌నగర్: భవనంపై ఆడుకుంటున్న బాలుడు ప్రమాదవశాత్తు 3వ అంతస్తు నుంచి కిందపడి మృతి చెందిన ఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన మూర్తమ్మ కొన్ని సంవత్సరాలుగా సూరారం రాజీవ్ గృహకల్ప 29/27వ బ్లాక్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. ఆమెకు ఒక్కగానొక్క కుమారుడు తులసీనాథ్ (13) ఉన్నాడు. స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు సెలవు కావడంతో తులసీనాథ్ రాజీవ్ గృహకల్ప 27వ బ్లాక్‌లోని భవనంపైన ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ తగాదాలతో బాలుడి తండ్రి కనకరత్నం కొంత కాలంగా కుటుంబానికి దూరంగా ఉంటున్నాడు. తల్లి మూర్తమ్మ టైలరింగ్ చేస్తూ కుమారుడిని పోషిస్తోంది.

అపార్ట్‌మెంట్‌లోకి కొండచిలువ



నిజాంపేట్: ఓ అపార్ట్‌మెంట్‌లోకి కొండచిలువ ప్రవేశించడంతో స్థానికంగా కలకలం రేపింది. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని సాయి ఎలైట్ అపార్ట్‌లోని పార్కింగ్ ప్రదేశంలోకి కొండ చిలువ ప్రవేశించడంతో అపార్ట్‌మెంట్ వాసులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఫ్రెండ్స్ స్నేక్ సొసైటీ సభ్యుడు అంకిత్‌శర్మకు ఫోన్ చేయడంతో వెంటనే అపార్ట్‌మెంట్ వద్దకు చేరుకుని చాకచక్యంగా కొండ చిలువను పట్టుకున్నాడు. తన వెంట తెచ్చిన బ్యాగ్‌లో కొండ చిలువను తీసుకుని సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలి పెట్టాడు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వరద నీటితో కొండ చిలువ కొట్టుకుని వచ్చి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

సికింద్రాబాద్‌లోని ఇస్కాన్ టెంపుల్‌లో..



అబిడ్స్‌లోని ఇస్కాన్ టెంపుల్ వద్ద కిక్కిరిసిన భక్తులు





హరేకృష్ణ టవర్ కోకాపేట్‌లో

ఆనంద గోవిందం

ఆబాల గోపాలం ఆనంద డోలికల్లో మునిగితేలింది. ఆ నంద నందనుడిని మదిలో స్మరించుకుంది. గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని నగర వాసులు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. సికింద్రాబాద్, అబిడ్స్‌లోని ఇస్కాన్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలు ప్రాంతాల్లో చిన్ని కృష్ణుడు, గోపెమ్మల వేషధారణలతో చిన్నారులు ముద్దుముద్దుగా ముచ్చటగొలిపారు. ఉట్లు కొట్టి నవనీత చోరుడిని తలపించారు.



నార్సింగిలో..

కూలిన బతుకులు

నిర్మాణంలో ఉన్న పిట్టగోడ కూలి ముగ్గురి మృతి

- మరో ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
- అనుమతులకు మించి అదనంగా ఫ్లోర్ నిర్మాణం
- నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో తప్పిన పెను ప్రమాదం



రోడ్డుపై పడిపోయిన కార్మికుల మృతదేహాలు, పిట్టగోడ పెళ్లలు



భాగ్యనగర్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం ఎలివేషన్ సెంట్రింగ్ పనులు చేస్తుండగా ఆరో అంతస్తుపై ఉన్న పిట్టగోడ కూలిపోయింది. దీంతో భవన నిర్మాణానికి ఏర్పాటు చేసిన గోవా కర్రలు విరిగిపోయాయి. ఈ ఘటనలో కర్రలపై నిల్చుని పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ముగ్గురు కార్మికులు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గురువారం ఉదయం 8.30 గంటలకు ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగుట్ట సొసైటీలోని ఓ భవన నిర్మాణం చేపడుతున్నారు. ఎలివేషన్ కోసం సెంట్రింగ్ పనుల్లో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆరుగురు కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారు. సెంట్రింగ్ తొలగిస్తున్న సమయంలో పిట్టగోడ కూలి సానియా బట్నాయక్ (19), సామ బట్నాయక్ (23), సానియా చలాన్ (20)లు మృతి చెందారు. వీరితో పాటు పని చేస్తున్న ముదాబత్ నాయక్, బలరాం, సుప్రా బట్నాయక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సామ బట్నాయక్, సానియా చలాన్‌లు అక్కడికక్కడే మృతి చెందగా, సానియా బట్నాయక్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. భవనం పిట్టగోడ కూలిన విషయం తెలుసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. జీహెచ్ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో గురువారం పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదమే తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. మృతదేహాలను పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ భవనం దాసరి సంతోష్, దాసరి సాయిరాం పేరుపై 2022 డిసెంబర్ 2వ తేదీన జీ+5 అంతస్తులకు అనుమతులు తీసుకున్నారు. అదనంగా మరో ఫ్లోర్ అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ అంతస్తులోనే పని చేస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది.

నాణ్యత లేకపోవడంతోనే..

ఆరో అంతస్తుపై పిట్టగోడ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకోకపోవటంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోడలు, గోవా కర్రలు తడిచి పోయాయి. పిట్టగోడ కోసం నిర్మించిన సిమెంట్ పెళ్లలు గోవా కర్రలపై పడిపోగా అవి విరిగి వాటిపై నిల్చుని పని చేస్తున్న కార్మికులు కింద పడిపోయారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా అంతస్తులు నిర్మాణం చేపట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ముందుగానే అక్రమ అంతస్తులను అధికారులు అడ్డుకొని ఉంటే ముగ్గురి ప్రాణాలు గాలిలో కలిసేవి కావంటున్నారు.



మృతులు సానియా చలాన్, సామ బట్నాయక్, సానియా బట్నాయక్



గాయపడిన కార్మికుడు ముదాబత్ నాయక్ | ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బలరాం

క్రిమినల్ కేసులు పెడతాం

ఈ ఘటనపై జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ హరికృష్ణ స్పందించారు. ఈ ఘటనలో ముగ్గురి కార్మికుల మృతికి కారణమైన భవన యజమానులు, ఆర్కిటెక్ట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. అనుమతులు పొందిన దానికంటే అక్రమంగా నిర్మించిన మరో ఫ్లోర్ నిర్మాణాన్ని పూర్తిగా కూల్చివేస్తామని పేర్కొన్నారు. గతంలోనే రెండుసార్లు భవన యజమానికి జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గాంధీ..

ప్రమాదవశాత్తు పిట్టగోడ కూలి ముగ్గురు కార్మికులు మృతి చెందడం, ముగ్గురు కార్మికులకు గాయాలు కావటం దురదృష్టకరమని స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. భవన యజమాని, బిల్డర్, సంబంధిత అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిజేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో ఇటువంటి ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తప్పవని ఆయన చెప్పారు.

అక్రమ నిర్మాణాలకు కార్మికుల ప్రాణాలు బలి

- ఏ ప్రమాదమైనా ఉల్లంఘనలే కారణం
- తూతూమంత్రంగా అధికారుల నోటీసులు
- ఘటన జరిగినప్పుడే హడావుడిగా ప్రకటనలు
- బల్దియా అక్రమాలకు అడ్డుకట్ట పడేనా?

ఈ పాపం ఎవరిదీ?

అక్రమాలు ప్రోత్సహించేందుకా అధికారాల వికేంద్రీకరణ?

సాక్షి, సిటీబ్యూరో: కూకట్‌పల్లిలో నిర్మాణంలో ఉన్న భవనం కూలి ముగ్గురు కూలీలు దుర్మరణం చెందడం జీహెచ్ఎంసీ అక్రమాలకు ఉదాహరణగా నగరవాసులు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు ఎక్కడ ఏ భవనం కూలినా, అగ్నిప్రమాదాలు జరిగినా నిబంధనల ఉల్లంఘనలు వెల్లడి కావడం ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. సాధారణ ప్రజలు స్వల్ప ఉల్లంఘనలకు పాల్పడితే కూల్చేంత దాకా వదలని, ముప్పు తిప్పలు పెట్టి పీడించే టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బడాబాబుల నిర్మాణాల్లో అక్రమాలు అడ్డగోలుగా చోటుచేసుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరిగినా నోటీసులిచ్చామనే సమాధానం రెడీగా ఉంటుంది. తమ తప్పిదం లేదని చెప్పుకొనేందుకే నోటీసులిస్తారు తప్ప.. అనంతరం చర్యలెందుకు తీసుకోవడం లేదని జనం ప్రశ్నిస్తున్నారు.



కాగితాలకే పరిమితమైన చర్యలు..

వాస్తవానికి భవన నిర్మాణానికి అనుమతులు జారీ అయ్యాక నిర్మాణం ప్రారంభించినప్పటి నుంచే వివిధ దశల్లో, నిర్ణీత వ్యవధుల్లో తమ అధికారులు తనిఖీలు చేస్తారని టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారులు ప్రకటించి ఏళ్లు గడుస్తున్నా అది అమలు కావడం లేదు. ఎక్కడైనా అనుమతుల ఉల్లంఘన జరిగినా, డీవియేషన్లు దృష్టికి వచ్చినా, తగిన భద్రత, పని చేసే కార్మికులకు రక్షణ ఏర్పాట్లు లేకున్నా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామన్న సర్క్యులర్లు కార్యరూపం దాల్చలేదు. వాటినే అమలు చేసి ఉంటే గురువారం కూకట్‌పల్లిలో ముగ్గురు కార్మికులు మృతి చెందే వారు కాదు. అనుమతి పొందింది అయిదంతస్తులకైతే కూలీలు కింద పడింది ఆరో అంతస్తు నుంచి. అన్ని అంతస్తులు పూర్తయ్యేంత దాకా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు బలం చేకూర్చుతోంది. అక్రమ నిర్మాణాలు వెలిసేంతదాకా నిద్రపోతున్నారా? అని హైకోర్టు సైతం గతంలో ప్రశ్నించడాన్ని నగర ప్రజలు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు.

వాణిజ్య భవనాలతో సహా జోన్లకే అధికారాలు కట్టబెట్టాక భవన నిర్మాణాల్లో అక్రమాలు విచ్చలవిడిగా పెరిగినా ఇటు ఉన్నతాధికారులు గాని అటు ప్రభుత్వ పెద్దలు గాని పట్టించుకున్న పాపాన పోలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారాల వికేంద్రీకరణ ద్వారా ప్రజలు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం దాకా వచ్చే ఇబ్బందులు తగ్గుతాయని, పనులు త్వరితంగా అవుతాయనే సదాశయంతో ప్రభుత్వం అధికారాలు జోన్లకు బదలాయించింది. కానీ.. అనుకున్నదొకటి.. అయ్యింది ఒకటి చందంగా మారింది పరిస్థితి. ప్రధాన కార్యాలయం నుంచి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతో జోన్లు, సర్కిళ్లలో ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. అసలు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకారంతోనే అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయనే ఆరోపణల గురించి పట్టించుకున్న వారు లేరు. ప్రమాదాలు జరిగిన ప్రతిసారీ పకడ్బందీ చర్యలనడం.. తర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది.

టాస్క్‌ఫోర్స్.. పెద్ద ఫార్స్

టీఎస్–బీపాస్ అమల్లోకి వచ్చాక అనుమతుల జారీ సరళీకరించారు. ఉల్లంఘనలను తనిఖీ చేసేందుకు టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఆ టాస్క్‌ఫోర్స్‌లు ఎన్ని నిర్మాణాలు తనిఖీలు చేశాయో, ఎన్ని ఉల్లంఘనలు గుర్తించి ఎన్ని చర్యలు తీసుకున్నాయో, ఏ నిర్మాణాల్ని అడ్డుకున్నాయో, ఏ అక్రమాలను కూల్చాయో వివరాలు మాత్రం వెల్లడించరు. అంతా గోప్యతే. దీంతో టౌన్‌ప్లానింగ్ అంటేనే అవినీతి మయమనే ముద్ర చెరగడం లేదు.

ఏమైందో ప్రత్యేక సాఫ్ట్‌వేర్

అక్రమ నిర్మాణాలకు సంబంధించి సర్కిళ్ల వారీగా ఎన్ని అక్రమ నిర్మాణాలు, డీవియేషన్లు ఉన్నాయో, ఎన్ని నోటీసులు జారీచేశారో, కోర్టు కేసులెన్ని ఉన్నాయో.. తదితర వివరాలు ఏరోజుకారోజు నమోదు చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి ,ప్రతిరోజూ ఈ సమాచారం అప్‌లోడ్ చేయాలని ఆదేశించినా అమలుకు నోచుకోలేదు.

స్టార్ రెజ్లర్ జాన్ సినా ఫైట్

నేడు నగరంలో డబ్ల్యూడబ్ల్యూఈ పోరు



జాన్ సినా

సాక్షి, హైదరాబాద్: నగరంలో ప్రతిష్టాత్మక వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) పోరుకు రంగం సిద్ధమైంది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగే ఈ ఈవెంట్ కోసం అభిమానులు పెద్ద సంఖ్యలో ఎదురు చూస్తున్నారు. 16 సార్లు ప్రపంచ చాంపియన్, రెజ్లింగ్ ఆల్‌టైమ్ గ్రేట్ జాన్ సినా ఇక్కడ బరిలోకి దిగనుండటమే అందుకు కారణం. అతని ఫైట్ చూసేందుకు పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ ఎగబడటంతో చాలా ముందుగానే 'బుక్ మై షో'లో టికెట్లన్నీ అమ్ముడుపోయాయి. జాన్ సినా భారత్‌లో బరిలోకి దిగడం ఇదే మొదటిసారి. 2017లో భారత్‌లో చివరిసారిగా డబ్ల్యూడబ్ల్యూఈ ఈవెంట్ జరగ్గా.. ఆరేళ్ల తర్వాత మన దేశంలో నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని ఇతర నగరాల నుంచి కూడా రెజ్లింగ్ ఫ్యాన్స్ ఈ ఫైట్‌ను తిలకించేందుకు వస్తున్నారు. 'సూపర్ స్టార్ స్పెక్టకిల్' పేరుతో నిర్వహిస్తున్న ఈ ఫైట్‌లో జాన్ సినాతో పాటు పలువురు ప్రముఖ రెజ్లర్లు పాల్గొంటున్నారు. ఫిన్ బాలర్, రియా రిప్లీ, సేట్ రోలిన్స్ ఈ జాబితాలో ఉన్నారు. టీమ్ ఈవెంట్‌లో ప్రపంచ హెవీవెయిట్ చాంపియన్ రోలిన్స్‌తో కలిసి జాన్ సినా.. గియోవానీ విన్సీ, లుడ్విగ్ కై సర్డ్ జోడీతో తలపడతారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ వరల్డ్ చాంపియన్ రియా రిప్లీ ప్రధాన ఆకర్షణ కానుంది. రాత్రి 7.30నుంచి ప్రారంభమయ్యే ఈ ఫైట్‌ను 'సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్'లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

మట్టి గణపతికే జైకొడదాం

- పర్యావరణ హితమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ
- పంపిణీకి సిద్ధంగా 3.10 లక్షల విగ్రహాలు


ఏ సైజువి	ఎన్ని
8 అంగుళాలవి	2,70,000
12 అంగుళాలవి (1 అడుగు)	30,000
18 అంగుళాలవి(1.5 అడుగులు)	10,000



సాక్షి, సిటీబ్యూరో: వినాయక చవితి పండగ కోసం ప్రజలకు మట్టి విగ్రహాలను పంపిణీ చేసేందుకు జీహెచ్ఎంసీ ఏర్పాట్లు ప్రారంభించింది. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రంగులతో తయారు చేసే వినాయక విగ్రహాల వల్ల చెరువులతో సహా పర్యావరణ కాలుష్యం పెరగనుండటంతో వాటిని నివారించే చర్యల్లో భాగంగా జీహెచ్ఎంసీ ఇందుకు సిద్ధమైంది. మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా పట్టించుకోరని, జీహెచ్ఎంసీయే పంపిణీ చేస్తే ఇటు పర్యావరణ పరిరక్షణతో పాటు అటు అవగాహన కలుగుతుందనే తలంపుతో గత ఏడాది నుంచి ఇందుకు సిద్ధమైంది. ఈ సంవత్సరం జీహెచ్ఎంసీ ద్వారా మూడు సైజుల్లో 3.10 లక్షల విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. వీటి ఉత్పత్తి, పంపిణీ చేసే సంస్థల ఎంపికకు టెండర్లను ఆహ్వానించింది. కోరిన ప్రమాణాలు, నాణ్యతతో అందరి కంటే తక్కువ ధరను కోట్ చేసిన వారిని గుర్తించి దానిని ఎల్–1 ధరగా నిర్ణయించి, అదే ధరకు సరఫరా చేసేవారితో జాబితా రూపొందించి పనుల ప్పగించాలని భావించింది. ఎల్– 1 ధరను కోట్‌చేసిన వారికి మిగతా వారికంటే అయిదు శాతం పనులు అదనంగా ఇవ్వనున్నారు. పనులు చేసేందుకు ముందుకొచ్చేవారు మూడు సైజుల్లోని విగ్రహాలను తయారు చేయాల్సి ఉంటుంది.

ఖర్చు తగ్గించుకోలేరా ?

మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించడం, పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పించడం బాగానే ఉన్నా, స్వచ్ఛందసంస్థల ద్వారా ఈపనులు చేయించే అవకాశం ఉన్నా ఆదిశగా జీహెచ్ఎంసీ దృష్టి సారించలేదు. ఇప్పటికే ఆదాయానికి మించి ఖర్చులు అధికంగా ఉండటంతో వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించలేక పోతున్నారు. బిల్లుల కోసం వారు ఆందోళనలకు దిగుతున్నారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు తమంత తాముగానే పర్యావరణ పరిరక్షణకు, మట్టి వినాయక విగ్రహాలను కొన్నేళ్లుగా ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. అలాంటి వాటిని సంప్రదిస్తే జీహెచ్ఎంసీకి ఖర్చు ఉండదు. సీఎస్సార్‌లో భాగంగా కార్పొరేట్ సంస్థలను కోరినా ముందుకొచ్చే అవకాశం ఉంది. అయినా జీహెచ్ఎంసీ వాటి గురించి ఆలోచించడం లేదు. ఖర్చు తగ్గించుకునే చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తొమ్మిదేళ్లలో 1,22,973 కేసుల పరిష్కారం

– రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తాను పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి(2014, ఆగస్టు 13) నుంచి ఇప్పటి (2023, సెప్టెంబర్ 1)వరకు దాదాపు 1,22973 కేసులను పరిష్కరించామని ప్రతాప్‌రెడ్డి తెలిపారు. తొమ్మిదేళ్ల పదవీ కాలం పూర్తయిన సందర్భంగా ఆయన బుధవారం ఓ ప్రకటనలో మీడియాకు పలు వివరాలు వెల్లడించారు. సీఎం కేసీఆర్ ఆశీస్సులతో విజయవంతంగా పదవీ బాధ్యతలు నిర్వర్తించానన్నారు. 1,03,335 క్రిమినల్ పిటిషన్లు, 13,063 క్రిమినల్ రివిజన్ పిటిషన్లు, 4,898 క్రిమినల్ అప్పీల్, 4 ట్రాన్స్‌ఫర్ క్రిమినల్ అప్పీల్ కేసులను పరిష్కరించామని చెప్పారు. తనకు విధుల్లో సహకరించిన న్యాయమూర్తులకు, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు.

లాభదాయకమైన ఇంధన వనరుల అభివృద్ధికి కృషి

ఉప్పల్: దేశంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా లాభదాయకమైన, పర్యావరణహితమైన ఇంధన వనరులను అభివృద్ధి చేసేందుకు ఎన్‌జీఆర్‌ఐ తోడ్పడుతుందని న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ భువన్ చంద్ర పాఠక్ అన్నారు.'వన్ వీక్–వన్‌ల్యాబ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎన్‌జీఆర్‌ఐలో స్టేక్ హోల్డర్ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యుత్‌రంగ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడంలో ఎన్‌జీఆర్‌ఐ సేవలు అమూల్యమన్నారు. ముఖ్యంగా సిస్మో– టెక్టోనిక్ అధ్యయనాలు, భూకంప సర్వేల్లో సంస్థ అందించిన సేవలను కొనియాడారు. ఎన్‌జీఆర్‌ఐ డైరెక్టర్ డా.ప్రకాశ్ కుమార్, దక్షిణ క్షేత్ర అడిషనల్ డైరెక్టర్ జనరల్ డా.వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

గేట్ వే ఐటీ పార్కు పనులు ప్రారంభం

మేడ్చల్ రూరల్: కండ్లకోయలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గేట్ వే ఐటీ పార్కు పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. కేటీఆర్ ఇన్‌ఫ్రా సీఆర్‌ఓ సుధాకర్, టీఎస్‌ఐఐసీ అధికారులు పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఐటీ పార్కు ఏర్పాటు స్థలంలో జేసీబీల సాయంతో చదును చేసి క్లీన్ చేశారు. త్వరలో అధికారికంగా పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. గతేడాది ఫిబ్రవరిలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఐటీ పార్కు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.

మీ ఆప్తుల అంత్యక్రియలు, శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి, జయంతిల ప్రకటనల కోసం సంప్రదించండి.

మీ ఆప్తులకై శ్రమించిన ఆత్మీయుల జ్ఞాపకాలు, నివాళులు బంధుమిత్రులకు మరియు శ్రేయోభిలాషులకు సాక్షిలో ప్రకటనల ద్వారా తెలియజేసే అవకాశం.

ఈ తరహా ప్రకటనలపై డిస్కౌంట్ కూడా కలదు

Ph: 040-23256000 Ext: 6344, 9912220352

కబ్జా చేస్తారా... ఓల్డ్ పేపర్స్ రెడీ!

- పాత స్టాంప్ పేపర్లు విక్రయిస్తున్న ముఠా
- బోగస్ డాక్యుమెంట్ల కోసం ముద్రలు సైతం
- చెక్ చెప్పిన సౌత్ జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: రాజధానిలో ల్యాండ్ బూమ్ ఏ స్థాయిలో పెరిగిందో భూ వివాదాలూ అదే స్థాయిలో పెరిగాయి. లిటిగేషన్లు సృష్టించే వారికి, కబ్జాకోరులకు అవసరమైన పాత స్టాంప్ పేపర్లు విక్రయిస్తున్న ముఠాకు దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు చెక్ చెప్పారు. ఇద్దరిని పట్టుకున్నామని, వారి నుంచి భారీగా పాత స్టాంప్ పేపర్లు, అధికారుల ముద్రలు స్వాధీనం చేసుకున్నామని అదనపు డీసీపీ ఏవీఆర్ నర్సింహ్మారావు బుధవారం తెలిపారు. బహదూర్‌పురలోని చందులాల్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సయీద్ అజరుద్దీన్ ప్రైవేట్ ఉద్యోగి. దూద్‌బౌలిలో నివసించే వస్త్ర వ్యాపారి మహ్మద్ ఇనాయత్ అలీ, ఫలక్‌నుమ ప్రాంతానికి చెందిన ఫెరోజ్‌లతో కలిసి ముఠా కట్టాడు. వీరంతా కలిసి 1969–2002 మధ్య కాలం నాటి రూ.100, రూ.50, రూ.20, రూ.10, రూ.5, రూ.2, రూ.1, 75 పైసల విలువైన ఖాళీ డాక్యుమెంట్లు, నోటరీ పత్రాలు విక్రయించడం మొదలెట్టారు. భూ వివాదాలు సృష్టించే వారు వీరిని ఆశ్రయిస్తే అవసరమైన తేదీలతో డాక్యుమెంట్లు సిద్ధం చేసి ఇవ్వడంతో పాటు ఎమ్మార్వో, వీఆర్‌ఓల స్టాంపులు వేసి, ఫోర్జరీ చేసి ఇవ్వడం చేస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో పత్రాన్ని రూ.లక్షకు విక్రయిస్తున్నారు. ఇలాంటి పత్రాలతో అనేక మంది కొన్ని భూములపై కోర్టు కేసులు వేస్తూ అసలు యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ ముఠా వ్యవహారాలపై దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. దీంతో ఇన్‌స్పెక్టర్ వై.అజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్సైలు కె.నర్సింహ్మలు, జి.ఆంజనేయులు, ఎన్.నవీన్ తమ బృందాలతో వలపన్నారు. ఫెరోజ్ మినహా మిగిలిన ఇద్దరినీ పట్టుకున్నారు. వీరి నుంచి 188 స్టాంప్ పేపర్లు, జీహెచ్‌ఎంసీ జారీ చేసిన ఇద్దరికి సంబంధించిన డెత్ సర్టిఫికెట్లు, 20 ఎమ్మార్వో, వీఆర్వో రౌండ్ సీళ్లు తదితరాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో ఆరు నెలల క్రితం చనిపోయిన తన గురువు నుంచి ఇవి తనకు అందాయని అజారుద్దీన్ చెప్పాడని పోలీసులు వివరిస్తున్నారు. పరారీలో ఉన్న ఫెరోజ్ కోసం గాలిస్తూ కేసును హుస్సేనిఆలం పోలీసులకు అప్పగించామని అధికారులు తెలిపారు.

వేగవంతంగా 'గృహలక్ష్మి' లబ్ధిదారుల ఎంపిక

– అధికారులకు మంత్రి తలసాని ఆదేశం



సాక్షి, సిటీబ్యూరో: గృహలక్ష్మి పథకం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గృహలక్ష్మి పథకం కార్యక్రమం అమలు, లబ్ధిదారుల ఎంపికపై హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేద ప్రజల ఇంటి నిర్మాణానికి ఆర్థికంగా చేయూత అందించాలన్న సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఒక్కో నియోజకవర్గ పరిధిలో 3 వేల మంది అర్హులకు ఒక్కొక్కరిరి రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో అర్హులైన వారిని గుర్తించేందుకు విచారణను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులు ఈ శనివారం లోగా పూర్తిస్థాయిలో దరఖాస్తులు చేసుకొనే విధంగా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మంత్రి కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో భాగంగా మొదటి విడతలో 11,700 మంది లబ్ధిదారుల ఎంపిక, కేటాయింపు ఎంతో పారదర్శకంగా నిర్వహించిన అధికారులను మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు సురభి వాణిదేవి, స్టీఫెన్సన్, ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్, జాఫర్ హుస్సేన్, ముంతాజ్ అహ్మద్ ఖాన్, బలాల, కౌసర్ మొహినుద్దీన్, మౌజం హుస్సేన్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ చంద్రకాంత్, హౌసింగ్ ఈఈ వెంకటదాస్‌రెడ్డి, ఆర్డీఓలు రవి, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' ఇండ్లపై 8 న సమావేశం

రెండో విడత డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కి సంబంధించి ఈ నెల 8 వ సచివాలయంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన నగరానికి చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, డిప్యూటీ మేయర్, కలెక్టర్లు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. రెండో విడత ఇండ్ల కేటాయింపు, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి 8 వ తేదీన జరిగే సమావేశంలో చర్చించి తేదీలను ఖరారు చేయనున్నట్లు మంత్రి తలసాని తెలిపారు.

ఫ్యూజీ ఫిల్మ్–జపాన్‌తో యశోద ఆసుపత్రి భాగస్వామ్యం



సాక్షి, సిటీబ్యూరో: అత్యాధునిక ఇంటర్వెన్షనల్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఇమేజింగ్‌లో ప్రపంచస్థాయి బోధన, శిక్షణ, పరిశోధన రంగాలకు సంబంధించి నగరానికి చెందిన యశోద హాస్పిటల్స్ హెల్త్ కేర్ ఇమేజింగ్, ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్‌లో అగ్రగామిగా ఉన్న ఫ్యూజీ ఫిల్మ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా బుధవారం హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎంఓయూపై యశోద మెడికల్ సర్వీసెస్, డైరెక్టర్ డాక్టర్.ఎ.లింగయ్య, టోక్యోకు చెందిన ఫ్యూజీ ఫిల్మ్ కార్పొరేషన్ ఎండోస్కోపీ విభాగం గ్లోబల్ హెడ్ తట్సుహికో సైకి సంతకాలు చేశారు. ఇరు సంస్థల ఒప్పందం ద్వారా వైద్య పరిజ్ఞానం పరస్పరం పంచుకోవడానికి, ఆవిష్కరణలు, ప్రయోగాలు, పరిశోధనల్లో విజయాలకు దోహదపడుతుందని ఈ సందర్భంగా వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరోగ్య రంగంలో హైదరాబాద్ ముందుంది

- చినజీయర్ స్వామి
- మెడికవర్ ఆసుపత్రిలో రోబో డావిన్సీ మెషీన్ ప్రారంభం



రోబో డావిన్సీ మెషీన్, దానికి సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేసిన చినజీయర్ స్వామి తదితరులు

మాదాపూర్: ఆరోగ్యమే మహాభాగ్యం..కానీ ఆరోగ్యాన్ని పాడుచేసుకునేది మనిషే అని, జంతువులు, పక్షులు ఆరోగ్యాన్ని పాడుచేసుకోవని చినజీయర్ స్వామి అన్నారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో బుధవారం అధునాతన డావిన్సీ రోబో మెషీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని, అధునాతన వైద్యంతో ఎన్నో రోగాలను నయం చేస్తున్నారని చెప్పారు. అలాగే ఆరోగ్య రంగంలో మన హైదరాబాద్ నగరం ముందు వరుసలో ఉందన్నారు.

- మెడికవర్ హాస్పిటల్స్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ తక్కువ కోతతో క్లిష్టమైన శస్త్ర చికిత్సలను సమర్థవంతంగా చేయడంలో రోబోటిక్ సర్జరీలు కీలకమన్నారు.

ముఖ్యంగా కేన్సర్ రోగులకు అత్యుత్తమ, అధునాతన, నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను అందించడానికి డావిన్సీ రోబో మెషీన్ సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హరికృష్ణ, డాక్టర్ కృష్ణకిరణ్, మోకాలిమార్పిడి నిపుణుడు డాక్టర్ మహేశ్ దగ్గుల్కర్, చీఫ్ బిజినెస్ ఆఫీసర్ డాక్టర్ రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

COMMERCIAL FOR SALE

■ ఆలేరు నుండి మోత్కూర్ వెళ్ళే 100 Ft రోడ్డుకి ఉన్న మా శ్రీగంధం ఫామ్‌ల్యాండ్ వెంచర్‌లో బైబ్యాక్ ఆఫర్‌తో ప్లాట్లు కలవు. పెట్టుబడి 6 లక్షల నుండి ప్రారంభం. సంప్ర: 8121400661 [G-3103]

Services

■ శ్రీ రామ్ గోల్డ్ మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించ లేకపోతున్నారా? తాకట్టులో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ :9133214214 [H-788622]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-788357]

BUSINESS OFFER

■ తెలంగాణ గోల్డ్ బయ్యర్స్: తాకట్టు పెట్టిన మీ బంగారాన్ని విడిపించాలనుకుంటున్నారా? మీ బంగారాన్ని అమ్మాలనుకుంటున్నారా? తక్షణమే నగదు. సంప్ర: 9000030022 [H-788412]

■ స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో కొత్త పాలసీ కోసం ఫోన్ చేయండి లేదా ఏజెంట్‌గా జాయిన్ కావటానికి సంప్రదించండి ఫోన్ : 9000543747 [HA-11731]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Raipole Jyothi W/o. Raipole srikanth aged about 45yrs H.No.1-10/1/a Plot No.3 behind madhu Residency, Madinaguda Serilingampally, 500049 I have Changed my name G Mutyalamma to RAIPOLE JYOTHI for all purpose [H-788625]

■ I, Chowjanya Sambangi W/o. Ravi Kumar Polnuru R/o. H.No. 5-7-9/2, Flat No.203, Green Oaks Apartment, Near Metro Cash And Carry, Sangeeth Nagar, Kukatpally, Hyderabad - 500072 have changed my name to Sowjanya Sambangi. [DA-28745]

■ I, Vijeta Rajesh Kumar Chawla W/o. Rajesh Kumar Bakhtomal Chawla R/o. Flat No.4a, Vajra Nest, Huda Colony, Church Road, Chandanagar, Ranga Reddy, Hyderabad, Telangana -500050 have changed my name to Vijeta Rajesh Kumar Chawla W/o. Rajesh Kumar Bakhturam Chawla. [DA-28689]

■ I, Kodemala Manmohan, S/o. Late. Kodemala Kishan Raj, 44yrs , R/o. Flat No:520, Sundaram Block, Ramaraja Nagar, Near Suchitra X Road, Jeedimetla Village, Secunderabad -67,I do hear by Declare that in my CBSE Memo(10th) School Certificate my name was mentioned as K K Man Mohan and my Aadhar Card, Pancard my name is mentioned as Kodemala Manmohan for all Record purpose and intend to keep my name as Kodemala Manmohan vide Affidavit No 3BAA 422029 Dt 02-09-2023 [H-189485]

■ I, PALAK SINGHANIA, Mother of Harshita Singhania (Minor) Rep by her mother - Palak Singhania R/o. H.No.8-2-309/12, Villa No.A4, Trendset Villa, Road No.3, Banjarahills, Hyd. My daughter old name is Harshita Agarwal hence she will be known as HARSHITA SINGHANIA D/o. Palak Singhania [H-11756]

OLD AGE HOME

■ వృద్ధులకు, బెడ్‌పేషెంట్స్‌కు, దీర్ఘ వ్యాధులతో ఉన్నవారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24గం॥ వైద్య, భోజనం వసతి ఉప్పల్, ECIL, Hyd సంప్ర: 9949520296, 7981467036. [H-189473]

WATER PROOFING

■ అంజనీ వాటర్ ప్రూఫింగ్: స్లాబ్ లీకేజీలు, బాత్ రూమ్స్, రూఫ్, ట్యాంక్స్, సైడ్ గోడ లీకేజీలను అధునాతన కెమికల్స్ టెక్నాలజీ ద్వారా 10 సం॥ గ్యారంటీతో బాగుచేయబడును. Ph: 8074400114 [HA-587]

Wanted

■ యాప్రాల్ నుండి ECILలో FMCG మార్కెట్ కోసం సేల్స్ ఆఫీసర్/ సేల్స్‌మ్యాన్ కమ్ డ్రైవర్ వెంటనే కావలెను. ఇంటర్వ్యూ కోసం కాల్: 7674076225 [WB-25040]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. ఫోన్ : 9640468899, 9640258899 [H-189329]

■ ప్రముఖ Shopping Mallలో పనిచేయుటకు సూపర్ వైజర్స్, లిఫ్ట్ ఆపరేటర్స్ కావలెను. కన్సల్టెన్సీ కాదు. Fresher's Also Apply. Sly: 15K-20K, At Kukatpally, Ph: 7671954016, 9989806121. [HA-11755]

■ ప్రముఖ ఆసుపత్రి సికింద్రాబాద్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సూపర్ వైజర్స్ (Q.డిగ్రీ) పురుషులు, సానిటేషన్ వర్కర్స్ కావలెను. ఫోన్.9346800433, 7207655369 [HA-1924]

■ శ్రీ సాయి హోం కేర్ 24/7 మా వద్ద వుండి మంచంమీద ఉన్న వృద్ధులకు సేవ చేయటానికి, పిల్లలను చూడటానికి పని వారు కావలెను. ఫోన్ : 9533909627, 9494071023 [H-189406]

■ వీడియో ఎడిటింగ్, వెబ్‌సైట్ డాటాఎంట్రీ, టెలికాలర్, రిసెప్షనిస్ట్, పాస్టర్స్, క్రిస్టియన్లు, డ్రైవర్, కుక్స్, హెల్పర్స్, సూ॥ వైజర్స్, ఫీల్డ్ ఆఫీసర్, గార్డెన్ వర్క్, వ: 18–72, జీ: 10–20K ఫోన్: 9505261777 [H-788306]

■ ప్రముఖ ప్రైవేట్ లిమిటెడ్ రియల్ ఎస్టేట్ కంపెనీ నందు ఉద్యోగం చేయుటకు అనుభవం గల ఫిమేల్ టెలికాలర్స్, మార్కెటింగ్ సిబ్బంది కావలెను. అర్హత : ఏదైనా డిగ్రీ, వయస్సు : 25-40 సం॥లు వివరాలకు సంప్ర. 89770 19891. [M-10255]

■ డ్రైవర్స్ కావలెను: ప్రముఖ కంపెనీలో ఓనర్ వద్ద ఆటోమేటిక్ లగ్జరీ కార్స్ నడుపుటలో 5సం॥ల అనుభవం (City & Highway), 35 లోపు వయస్సు, బంజారాహిల్స్ ఫోన్ : 9390113698 [HA-162]

■ Sales & Marketing Manager, Civil Engineers, Mechanical Engineers, Autocad Engs., Markt. Exe. Min 5yrs Exp. Ph: 9346349908, expeeengineeringhr@gmail.com [HA-11754]

■ Req.: Sale & Marktg Person for Textiles Whole Saler with 2yrs of Exp. & Part Time Lady Accountant with Tally @ Sec-bad. Ph: 8801805758 [H-796943]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

సాక్షి క్లాసిఫైడ్స్

3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

జోన్ సెంటర్స్

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/-

విచారణకు: 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

గల్లంతైన లక్ష్మి మృతదేహం లభ్యం



రోదిస్తున్న లక్ష్మి కూతుళ్లు

ముషీరాబాద్: నాలుగు రోజుల క్రితం కవాడిగూడ దామోదర సంజీవయ్య నగర్ బస్తీలో ప్రమాదవశాత్తు హుస్సేన్‌సాగర్ నాలాలో పడి కొట్టుకుపోయిన లక్ష్మి మృతదేహం బుధవారం ముసారాంబాగ్ నాలాలో లభ్యమైంది. స్థానిక పోలీసులు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది మొదట మహిళ మృతదేహం ఉందని గాంధీనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు లక్ష్మి కుటుంబ సభ్యులను పిలిపించారు. లక్ష్మి చేతిపైన ఉన్న కమల అనే పచ్చబొట్టు, ముక్కుపుడక ఆధారంగా ఆమెను గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు లక్ష్మి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కాగా లక్ష్మి చనిపోయిందని తెలిసి కుటుంబ సభ్యులు, కూతుళ్లు బోరున విలపించారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం వల్లే లక్ష్మి చనిపోయిందని, బాధిత కుటుంబానికి రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, ముషీరాబాద్ నియోజకవర్గం జోన్ కార్యదర్శి దశరథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు బాధితులకు ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేశారు. గత 25 సంవత్సరాలుగా హుస్సేన్ సాగర్ నాలాకు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు.

బాలుడిపై లైంగిక దాడి చేసిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

2018లో ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో ఘటన

హిమాయత్‌నగర్: అభం శుభం తెలియని బాలుడితో ఓ దుర్మార్గుడు నీచంగా వ్యవహరించాడు. లైంగిక దాడికి పాల్పడి హింసించాడు. ఈ వ్యవహారంపై ఫలక్‌నుమా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2018లో జరిగిన ఈ సంఘటనపై న్యాయస్థానం బుధవారం తీర్పు వెల్లడించింది. బాలుడిపై లైంగిక దాడికి పాల్పడిన మోల్వీ ఉర్ ఇర్ఫాన్ అనే వ్యక్తికి 20 ఏళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధించినట్లు క్రైం, ఉమెన్ సేఫ్టీ జాయింట్ సీపీ గజరావు భూపాల్ తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే..ఫలక్‌నుమా పోలీసుస్టేషన్ పరిధిలో నివసించే ఓ వ్యక్తికి కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులకు ప్రతిరోజూ సాయంత్రం సమీపంలో ఉన్న మసీదుకు వెళ్లడం అలవాటు. ఈ విషయాన్ని గమనించిన మోల్వీ ఉర్ ఇర్ఫాన్ అనే వ్యక్తి 2018 మార్చి 5వ తేదీన ఇద్దరిలో చిన్నవాడైన తొమ్మిదేళ్ల బాలుడికి మాయమాటలు చెప్పి బాత్రూంకు తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. తీవ్రంగా హింసించాడు. ఎవరికీ చెప్పొద్దని బెదిరించి బయటకు పంపాడు. దీంతో అస్వస్థతకు గురైన బాలుడు విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత బాలుడికి, కుటుంబ సభ్యులకు భరోసా టీం అండగా నిలిచి కౌన్సిలింగ్ ఇచ్చింది. బుధవారం నాంపల్లిలోని 12వ మెట్రోపాలిటన్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అనిత నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించింది. ఈ తరహా చేష్టలకు పాల్పడే వారికి ఇదొక హెచ్చరిక అంటూ జాయింట్ సీపీ గజరావు భూపాల్ వెల్లడించారు.

ఆ సెక్షన్ రద్దయినా 'క్వీర్'లకు దక్కని న్యాయం

సాక్షి, సిటీబ్యూరో: భారత అత్యున్నత న్యాయస్థానం 'ఐపీసీ సెక్షన్ 377'ను రద్దు చేసి ఐదేళ్లు కావస్తున్నా ఆ తీర్పును అమలు చేయకపోవడంతో 'క్వీర్' కుటుంబాలు సమాజం నుంచి వివక్ష, హేళనను ఎదుర్కొంటూనే ఉన్నాయని పలు స్వచ్ఛంద సంస్థలు పేర్కొన్నాయి. 'ఐపీసీ సెక్షన్ 377'ను రద్దు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం నగరంలోని మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ వేదికగా అస్తిత్వం ఫౌండేషన్, క్వీర్ పురుషుల హక్కుల కోసం పని చేస్తున్న సీబీఓ సంయుక్త ఆధ్వర్యంలో చర్చాగోష్టి నిర్వహించారు. క్వీర్ కమ్యూనిటీలకు చెందిన ప్రముఖ కార్యకర్తలు, మహిళా సంస్థల ప్రతినిధులు, సామాజిక వేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఎమ్ఎస్ఐ సిస్టర్ ఆరోక్య, సురక్ష సొసైటీ సభ్యులు చిన్ని కృష్ణ, ట్రాన్స్ జెండర్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు రచన ముద్రబోయిన, క్వీర్ పేరెంట్స్ అసోసియేషన్ ముకుంద మాల, మహిళా అండ్ ట్రాన్స్ జెండర్స్ జేఏసీ సభ్యురాలు సజయ, సత్యవతి, తాషి, అఖిలేష్, కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల ఆరోగ్యం–వికాసం అందరి బాధ్యత'

సాక్షి, సిటీబ్యూరో: ప్రతి చిన్నారి సంపూర్ణ ఆరోగ్యం, వికాసంతో పెరగాల్సిన అవసరం ఉందని, ఇవి పిల్లలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎక్స్‌టెప్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఇక్కడ నిర్వహించిన 'బచ్‌పన్ మనావో, బడ్తే జావో' కార్యక్రమంలో ఫౌండేషన్ సహ వ్యవస్థాపకురాలు రోహిణి నీలేకని మాట్లాడుతూ..బాలల అత్యున్నత జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.

నీటి సంపులో పడి వ్యక్తి దుర్మరణం



హయత్‌నగర్: నీటి సంపులో పడి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన బుధవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ మునుగనూరు యాదాద్రి కాలనీకి చెందిన కునపులి సోమయాజులు (57) బుధవారం ఇంటి వద్దనే ఉండగా...భార్య అశ్లేష కూలి పనికి వెళ్లింది. మధ్యాహ్నం భార్య ఫోన్ చేయగా సోమయాజులు స్పందించలేదు. దీంతో ఆమె పొరుగింటి వారికి ఫోన్ చేసి ఆరా తీయగా ఇంట్లో లేడని చెప్పారు. దీంతో సాయంత్రం ఇంటికి వచ్చిన అశ్లేష చుట్టుపక్కల భర్త కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో అనుమానం వచ్చి నీటి సంప్ మూత తెరిచి చూసింది. సంపులో సోమయాజులు శవమై తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రమాదవశాత్తు ఈ ఘటన జరిగినట్లుగా పోలీసులు అనుమానించి కేసు నమోదు చేశారు.

'టై' ఫైనల్ విజేతగా సాయిశ్రీ



గచ్చిబౌలి: టై (టీఐఈ: ది ఇండస్ ఎంటర్‌ప్రెన్యూర్స్) హైదరాబాద్ మహిళా విభాగం రీజనల్ ఫైనల్ విజేతను బుధవారం ప్రకటించారు. విజేతగా సాయిశ్రీ అకొండి నిలిచారు. ఆమె నవంబర్ మాసంలో సింగపూర్‌లో జరిగే టై గ్లోబల్ సమ్మిట్‌లో హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 మంది విజేతలతో పోటీ పడుతుందని నిర్వాహకులు వెల్లడించారు. సాయిశ్రీ డిసోల్ పేరిట స్టార్టప్‌ను రూపొందించారు. స్టార్టప్‌లపై ఆసక్తి పెంచేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నారు.

20 వేల మందికి మోకాలి నొప్పులకు చికిత్స



సాక్షి, సిటీబ్యూరో: శస్త్ర చికిత్స అవసరం లేకుండానే మోకాలి కీళ్ల నొప్పులకు విజయవంతంగా చికిత్స నిర్వహించినట్టు నగరంలోని ఇపియోన్ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ సుధీర్ ధారా, డాక్టర్ మీనాల్ చంద్రలు తెలిపారు. తమ దగ్గర చికిత్స పూర్తి చేసుకున్న రోగులు రోజువారీ కార్యకలాపాలను ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసుకోగలుగుతున్నారని, దేశంలోనే తొలి మల్టీ డిసిప్లినరీ పెయిన్ మేనేజ్‌మెంట్ సెంటర్ తమదని పేర్కొన్నారు. ప్రతి రోగికీ అనుకూలమైన ప్రోటోకాల్‌ను ఉపయోగించి ప్లాస్మా థెరపీ చేయడం తమ ప్రత్యేకతగా వివరించారు.

120 కిలోల గంజాయి పట్టివేత

రాజేంద్రనగర్: కారులో తరలిస్తున్న 120 కిలోల గంజాయిని రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మోకిల పోలీసులు పట్టుకున్నారు. వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ఘట్‌కేసర్‌కు చెందిన శ్రీకాంత్ కారుడ్రైవర్‌గా పనిచేస్తూ గంజాయికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శ్రీకాంత్ ఇటీవల విజయవాడకు వెళ్లి అక్కడ వెంకీ అనే వ్యక్తి వద్ద 120 కిలోల గంజాయిని కిలో రూ.500 చొప్పున కొనుగోలు చేశాడు. అనంతరం కారులో మంగళవారం నగరానికి బయలుదేరాడు. ఇతనికి శివారులో పాత స్నేహితులైన తమిళనాడుకు చెందిన ప్రేమ్‌కుమార్, జాన్‌లు జతకలిశారు. ఈ గంజాయిని వీరు బెంగళూరుకు తరలించాలని నిర్ణయించారు. దీనిపై పక్కా సమాచారం అందడంతో పోలీసులు ఔటర్‌పై కాపుకాసి పట్టుకున్నారు. నిందితుల నుంచి గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని ముగ్గుర్ని రిమాండ్‌కు తరలించారు.

ఇంజినీరింగ్ పీజీ కోర్సుల సెలెక్టడ్ జాబితా విడుదల

ఉస్మానియాయూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల్లో పీజీ కోర్సుల సీట్లు సాధించిన విద్యార్థుల మొదటి జాబితాను బుధవారం విడుదల చేశారు. ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మ, ఎంఆర్క్, ఫార్మ(పీబీ) కోర్సుల కన్వీనర్ కోటాలోని 7922 సీట్లలో 5662 సీట్లను విద్యార్థులకు కేటాయించినట్లు టీఎస్ పీజీఈసెట్–2023 కన్వీనర్ ప్రొ.రమేష్‌బాబు తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జాయినింగ్ లెటర్‌తో పాటు ట్యూషన్ ఫీజు రశీదును ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఆయా కాలేజీల్లో సమర్పించాలని పేర్కొన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఇంజినీరింగ్ పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 25 నుంచి తరగతులు ప్రారంభమవుతున్నట్లు తెలిపారు.

FORM NO. 14 [See Regulation 33(2)]
OFFICE OF THE RECOVERY OFFICER - I/II
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD (DRT 1)
3rd Floor, Triveni Complex Abids, Hyderabad-500001.

DEMAND NOTICE

NOTICE UNDER SECTIONS 25 TO 28 OF THE RECOVERY OF DEBTS & BANKRUPTCY ACT, 1993 AND RULE 2 OF SECOND SCHEDULE TO THE INCOME TAX ACT, 1961.

RC/1006/2018 31-08-2023

Andhra Bank
Versus
Ms Variegate Projects Pvt. Ltd.

To

(CD 1) Ms Variegate Projects Pvt Ltd, Plot No.436, Road No.60, Phase 3, Jubilee Hills, Hyderabad.

(CD 3) Gunreddy Ravindranath Reddy, H.No.3-74, Kasunur Village, Simhadripuram Mandal, Kadapa District, Andhra Pradesh-516454 Cuddapah, Andhra Pradesh.

(CD 6) Kotimreddy Anitha W/o. Kotimreddy Sridhar Reddy, Plot No.255 & 256, Flat No. 5A, Doyen Habitat Apartment Srinagar Colony, Hyderabad-500073, Hyderabad, Telangana.

(CD 7) Madala Saikumar S/o. Late Madala, Ramalingeswara Rao, Flat No.404, 416-47, Creative Avenue Apartments, Maridpalem, Vuda Layout, Visakhapatnam, Andhra Pradesh.

(CD 8) Ms Variegate Hotels India Pvt Ltd Plot No.564-A/17, 3rd Floor, Serenity Work Space, Road No.92, Jubilee Hills, Hyderabad-96, Telangana, Hyderabad, Telangana.

(CD 9) Ms Variegate Logistics And Warehousing Company, Plot No.436, Phase-III, Road No.60, Jubilee Hills, Hyderabad-500033, Hyderabad, Telangana.

This is to notify that as per the Recovery Certificate issued in pursuance of orders passed by the Presiding Officer, Debts Recovery Tribunal Hyderabad (DRT 1) in OA/514/2017 an amount of Rs.39,61,53,208.73 (Rupees Thirty Nine Crores Sixty One Lakhs Fifty Three Thousands Two Hundred Eight And Paise Seventy Three Only) along with pendentelite and future interest @ 12 % w.e.f. // till realization and costs of Rs 0 (Only) has become due against you (Jointly and severally/ Fully/Limited).

2. You are hereby directed to pay the above sum within 15 days of the receipts of the notice, failing which the recovery shall be made in accordance with the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993 and Rules there under.

3. You are hereby ordered to declare on an affidavit the particulars of yours assets on or before the next date of hearing.

4. You are hereby ordered to appear before the undersigned on 25/09/2023 at 10:30 a.m. for further proceedings.

5. In addition to the sum aforesaid, you will also be liable to pay: (a) Such interests as is payable for the period commencing immediately after this notice of the certificate / execution proceedings. (b) All costs, charges and expenses incurred in respect of the service of this notice and warrants and other processes and all other proceedings taken for recovering the amount due.

Given under my hand and the seal of the Tribunal, on this date: 31/08/2023

P.P
Recovery Officer
DEBTS RECOVERY TRIBUNAL HYDERABAD(DRT 1)

క్లుప్తంగా...

పౌష్టికాహారంపై అవగాహన

ఫిలింనగర్: పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం షేక్‌పేట మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫాతిమా బేగం ఫిలింనగర్‌లోని గౌతంనగర్, వినాయకనగర్, దుర్గా భవానీనగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొని పౌష్టికాహారం లభించే కూరగాయలు, ఆకుకూరలపై గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు అవగాహన కలిగించారు. ఆకుకూరల్లో ఎక్కువగా పోషకాలుంటాయని ఇవి తీసుకోవడం వల్ల రక్తహీనతను మెరుగుపర్చుకోవడమే కాకుండా ఆరోగ్యంగా ఉండవచ్చునని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోనే ఖాళీ స్థలం ఉంటే కూరగాయలు, ఆకుకూరలు పెంచుకోవాలని సూచించారు.

నిరాశ్రయుల తరలింపు



బంజారాహిల్స్: రోడ్లపై యాచకులు, నిరాశ్రయులు, పిచ్చివాళ్లు కనిపించకుండా వారిని ఆయా ఆశ్రమాలకు, హోమ్‌లకు తరలించాలని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా బంజారాహిల్స్‌లోని తాజ్‌కృష్ణ జంక్షన్‌లో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి కాలికి దెబ్బ తగిలి అటూ ఇటు తిరుగుతున్న విషయాన్ని కొంత మంది జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సర్కిల్–18 యూసీడీ విభాగం అధికారులు స్పందించి బుధవారం సదరు వ్యక్తిని యూసుఫ్‌గూడలోని సయోధ్య హోంకు తరలించారు. కార్యక్రమంలో సీవో భామ్‌సింగ్, విశ్వశాంతి పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

బంజారాహిల్స్: యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైఫాబాద్ సైన్స్ కాలేజీలో బుధవారం డిగ్రీ కొత్త కోర్సులలో చేరిన విద్యార్థులకు నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె.లక్ష్మణ్ నాయక్ ప్రారంభించారు. తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఐఐసీ ఎండీ ఇ. వెంకటనర్సింహారెడ్డి కంప్యూటర్లను కళాశాలకు అందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. నవనీత, ఎస్. వెంకటరమణ, డాక్టర్ పి.ఛాయ, డాక్టర్ సి.హెచ్. వెంకటేశ్వర్లు, ఎ. బాలకృష్ణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం



వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని వెంకటేశ్వరకాలనీ డివిజన్‌గౌరీ శంకర్ కాలనీలో బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి ప్రారంభించారు. డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నేతలు ధన్‌రాజ్ రాథోడ్, రమేష్ యాదవ్, అప్పారావు, మాణిక్యం, శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు విద్యుత్ వాహనాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని బంజారా ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు బుధవారం విద్యుత్ ఆధారిత వాహనాలను పంపిణీ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ లబ్ధిదారులకు వాహనాల పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

యువకులకు కౌన్సెలింగ్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ పోలీసులు మంగళవారం అర్ధరాత్రి జూబ్లీహిల్స్ రోడ్ నెం 5లో ఆపరేషన్ కార్డన్ పేరుతో తనిఖీలు నిర్వహించారు. అర్ధరాత్రి పనీపాటా లేకుండా ఆవారాగా తిరుగుతూ అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని గుర్తించారు. వీరందరికీ జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక్కడ హిజ్రాలు సంచరిస్తుండటంతో వారి కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది వరకు యువకులు వచ్చారు. అదే సమయంలో పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించగా వీరందరినీ పట్టుకొని మరోసారి ఇలా తిరిగితే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలి

వెంగళరావునగర్: వైఎస్సార్ టీపీ కో ఆర్డినేటర్ వాడుక రాజగోపాల్‌ను బుధవారం జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి కలిశారు. వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని సిద్ధార్థనగర్‌కాలనీలో ఉన్న రాజగోపాల్ గృహాన్ని విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ... నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవాన్ని తీసుకురావాలని, కాంగ్రెస్ జెండా రెపరెపలాడించాలని పేర్కొన్నారు.

వరద.. బురద...

లోతట్టుప్రాంతాలను వీడని వరద సమస్యలు ● ప్రజలకు తప్పని ఇబ్బందులు ● ముమ్మరంగా సహాయక చర్యలు

బంజారాహిల్స్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఖైరతాబాద్, ఎంఎస్ మక్తా, బీఎస్ మక్తా, ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45, 46 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వరద నీరు పేరుకుపోయింది. బుధవారం కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు ఆయా ప్రాంతాల్లో సహాయక చర్యలు నిర్వహించారు.

- ఖైరతాబాద్ గ్రంథాలయం వెనుక వీధిలో పెద్ద ఎత్తున వరద నీరు నిలిచిపోవడంతో గ్రంథాలయం ముందు రెండు భారీ మోటార్లు ఏర్పాటు చేసిన నాన్‌స్టాప్‌గా అధికారులు నీళ్లు పంపింగ్ చేయించారు.
- చాలా వీధుల్లో వరద నీరు పోయినా బురద మాత్రం పెద్ద ఎత్తున పేరుకుపోయింది.
- శ్రీకృష్ణానగర్‌లోని వీధులన్నీ ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. స్థానికంగా చాలా నివాసాల్లోకి వరద నీరు వెళ్లడంతో ఇంట్లోని సామాన్లు అన్నీ తడిసిపోయినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో నిలిచిపోయిన వరద నీటిలో వ్యర్థాలు తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది



ఖైరతాబాద్‌లోని ఓ వీధిలో పేరుకుపోయిన బురద



ఖైరతాబాద్: బురదను తొలగిస్తున్న సిబ్బంది

సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగు

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశ పెట్టిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడపడుచుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌కు చెందిన 19 మంది యువతులకు బుధవారం షాదీముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల కింద మంజూరైన నిధులకు సంబంధించిన చెక్కులను మాగంటి పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గోపీనాథ్ మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న ప్రజాసంక్షేమ పథకాలు దేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కోఆర్డినేటర్ విజయసింహ, నేతలు షరీఫ్, ధర్మ, దేవమణి, బాబురావు, యూసుఫ్, సాయిచరణ్, వంశీ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళితుల సామాజిక భద్రతను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం: సీపీఐ

హిమాయత్‌నగర్: దళితుల సామాజిక భద్రతలను కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలనరసింహ ఆరోపించారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని మఖ్దూం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వ సైద్ధాంతిక సంరక్షకులు నాగ్‌పూర్‌లో కూర్చుని రిజర్వేషన్ విధానాన్ని పూర్తిగా తొలగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అందులోనే భాగంగా ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసి ఎస్సీ, ఎస్టీ రేజర్వేషన్లను లేకుండా చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. బీజేపీ విషపూరిత చేర్యల వల్ల దళితులు సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా తమ గౌరవాన్ని, హక్కులను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బలమైన పోరాటాలు, ఉద్యమాలు ద్వారా భారత రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దళితుల హక్కులు రక్షింపబడుతాయన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మరుపాక మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు దళిత బంధు రెండో విడత నిధులు, ఎస్సీ ఇండస్ట్రియల్ పాలసీ క్రింద లబ్ధిదారులకు సబ్సిడీ రుణాలను, ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి పథకం సబ్సిడీ రుణాలను తక్షణమే విడుదల చేయాలన్నారు. డి.హెచ్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు కె. ఏసు రత్నం, బి.లక్ష్మీపతి, కె.సహదేవ్, జె.కుమార్ స్వామి, వై. ఉషశ్రీ, కె.రాములు పాల్గొన్నారు.

టీచర్లకు ప్రోత్సాహకాలు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 10 గాయత్రిహిల్స్‌లోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే కాకుండా వందకు వంద మార్కులు రావడంలో కృషిచేసిన హిందీ టీచర్ అర్షియా పర్వీన్‌కు, తెలుగు టీచర్‌కు అనూషకు రూ. 5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపాల్ అస్మతున్నీసా టీచర్లను శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రతియేటా పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి విద్యార్థులను టాపర్లుగా తీర్చిదిద్దడంలో కృషి చేసిన టీచర్లకు నగదు బహుమతులు అందజేస్తున్నాం అన్నారు. ఈ ప్రోత్సాహం వీరికి మరింత వెన్నుదన్నుగా ఉంటుందన్నారు. మరింత మంది ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు.

నేడు ఈఎన్‌టీ వైద్య శిబిరం

వెంగళరావునగర్: హెవెన్ హోమ్స్ సొసైటీ 11వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మధురానగర్‌కాలనీలోని విజ్ఞాన్‌జ్యోతి పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెగా ఈఎన్‌టీ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకురాలు జి.వరలక్ష్మి తెలిపారు. వాసవీ హాస్పిటల్స్ సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం కొనసాగుతుందనప్నారు. యూసుఫ్‌గూడ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మానసిక చికిత్సాలయంలో మహిళ అదృశ్యం



మాధవి

రహమత్‌నగర్: చికిత్స నిమిత్తం వచ్చిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మానసిన చికిత్సాలయం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ సమాచారం మేరకు... సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలానికి చెందిన మాధవి(30) ఆరు సంవత్సారాలుగా మానసిక పరిస్థితి బాగాలేక ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయంలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం మాదవి అక్క శ్రీలతతో కలిసి వైద్య పరీక్షలు నిర్వహించుకుని మాధవిని పక్కనే ఉన్న మెట్లపై కూర్చోబెట్టి మందుల కోసం మెడికల్ షాపుకు వెళ్లింది. తిరిగి వచ్చే చూసేసరికి మాధవి కనిపించలేదు. ఆస్పత్రి ఆవరణ, చుట్టు పక్క వీధుల్లో వెతికినా కనిపించక పోవడంతో బోరబండ స్టేషన్‌లో శ్రీలత ఫిర్యాదు చేసింది. ఎస్ఐ స్వప్నారెడ్డి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టారని ఇన్‌స్పెక్టర్ రవి కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని సంతోష్ దాబా సమీపంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందగా అదుపుతప్పిన వేగంతో బైక్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే... మాసబ్‌ట్యాంక్‌కు చెందిన వి.రాజు(29) రాత్రి బైక్‌పై రోడ్ నెం. 12 నుంచి దూసుకెళ్తుండగా అదే సమయంలో ఓ వ్యక్తి రోడ్డు దాటుతున్నాడు. వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో పాదాచారి మృతి చెందాడు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న రాజుకు కూడా తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. రాజు పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతి చెందిన వ్యక్తి హఫీజ్‌పేట్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి విరించి ఆస్పత్రి వద్ద దిగినట్లుగా జేబులో లభించిన బస్ టికెట్ ఆధారంగా పోలీసులు గుర్తించారు.

ద్విచక్ర వాహనాల దొంగల అరెస్ట్

బంజారాహిల్స్: ద్విచక్ర వాహనాలు తస్కరిస్తున్న ముగ్గురు దొంగలను బంజారాహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... మలక్‌పేట్‌కు చెందిన అబ్దుల్‌గౌస్ అలియాస్ అలీ డబీర్‌పుర షా కాలనీకి చెందిన సయ్యద్ రావిష్ మెహిది, హకీంపేటకు చెందిన మహ్మద్ అఫ్రోజ్, గత కొంత కాలంగా పార్కింగ్ చేసిన బైక్‌లను తస్కరిస్తూ విక్రయిస్తూ జల్సాలు చేస్తున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ అయిన మూడు బైక్‌లను స్వాధీనం చేసుకొని ఈ ముగ్గురిని రిమాండ్ చేశారు వాసిఫ్ అనే మరో దొంగ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మలక్‌పేట, అఫ్జల్‌గంజ్, చాదర్‌ఘట్, డబీర్‌పుర, సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వీరిపై దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే జమిలి డ్రామా

- ఫిరాయింపు నిరోధక చట్టాన్ని సంస్కరించాలి: గోనె ప్రకాష్‌రావు



పంజగుట్ట: ఎన్నికల సమయంలో బీజేపీ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జమిలి ఎన్నికలు అంటూ కొత్త డ్రామాలకు తెరతీశారని మాజీ ఎమ్మెల్యే, ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాష్‌రావు అన్నారు. దేశంలో అత్యధిక రాష్ట్రాల్లో సుమారు 15 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉందని, జమిలి ఎన్నికలు జరపాలనే ఆసక్తి ఉంటే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను రద్దు చేసి 2024 ఏప్రిల్, మేలో జరిగే సాధారణ ఎన్నికలతో ఈ రాష్ట్రలు కూడా ఎన్నికలు జరిపించవచ్చన్నారు. జమిలి ఎన్నికలు పక్కనపెట్టి ముందు ఫిరాయింపు నిరోధక చట్టాన్ని సంస్కరించాలని ఆయన హితవు పలికారు. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి లేఖ రాస్తున్నట్లు ఆయన వివరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జమిలి ఎన్నికలు జరపాలంటే పార్లమెంట్‌లో, రాజ్యసభలో అధికార పార్టీకి 2/3 మెజారిటీ ఉండాలని, ఈ మెజారిటీ రావాలంటే కొన్ని రాష్ట్రాల్లో కేసులు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రులను బ్లాక్‌మెయిల్ చేసి మద్దతు కూడగడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై త్వరలో ప్రధాని, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ఎన్నికల కమిషన్‌కు వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు.

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు



వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న శ్రీవారి పవిత్రోత్సవాలు బుధవారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం చతుస్థానార్చన సహస్రనామార్చన (మల్లెలతో) జపం, తర్పణం, అష్టోత్తర శతకలశాభిషేకం, మహాపూర్ణాహుతి, అవభృదం, పవిత్ర విసర్జన, కుంభోద్వాసన, కుంభప్రోక్షణ, రుత్విక్ సంభావన తదితర వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి పవిత్రోత్సవాలు ఆలయంలో ఆడంబరంగా నిర్వహిస్తున్నారు. స్వామివారిని ఆలయ ఈవో ఎస్. లావణ్య దర్శించుకొని విశేష పూజలు నిర్వహించారు.

బీజేపీ జూబ్లీహిల్స్ టికెట్ కోసం దరఖాస్తులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలంటూ జూబ్లీహిల్స్ రోడ్ నెం. 64కు చెందిన వ్యాపారి ఆలపాటి లక్ష్మీనారాయణ బుధవారం దరఖాస్తు అందజేశారు. పోటీకి తనకు అన్నీ అర్హతలున్నాయని నియోజకవర్గంలో బీజేపీకి రోజురోజుకూ విశేష ఆదరణ పెరుగుతున్నదని వెల్లడించారు. తనకు పోటీ చేసే అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని విజ్ఞప్తి చేశారు.



దరఖాస్తు చేసుకుంటున్న ఆలపాటి లక్ష్మీనారాయణ

సతీష్‌చారి దరఖాస్తు

రహమత్‌నగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసే నిమిత్తం బీజేపీ టికెట్ తనకు కేటాయించాలని బోరబండకు చెందిన హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమ్మరి సతీష్ చారి దరఖాస్తు చేసుకున్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

హిమాయత్‌నగర్: ఏఐవైఎఫ్ రాష్ట్ర 2వ మహాసభలను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర పిలుపునిచ్చారు. బుధవారం ఇందుకు సంబంధించన పోస్టర్‌లను అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రీతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ధర్మేంద్ర మాట్లాడుతూ... అక్టోబర్‌లో వరంగల్ జిల్లాలో ఈ 2వ మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ నిర్లకంటి శ్రీకాంత్, లింగం రవి, యుగంధర్, కార్యవర్గ సభ్యులు టి. సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లుడి రిపోర్టుల కోసం వస్తే అంతా దోచేశారు!

వెంగళరావునగర్: ఆస్పత్రిలో ఉన్న అల్లుడి రిపోర్టుల కోసం వచ్చిన మహిళ నుంచి దుండగులు నగలు, నగదు దోచుకున్న సంఘటన మధురానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణానికి చెందిన పి.పద్మ అనే మహిళ తన భర్త రామకృష్ణ, కుమార్తెతో కలిసి బుధవారం ఉదయం నగరానికి వచ్చారు. ఆమె కుమార్తె, అల్లుడు అమెరికాలో ఉంటున్నారు. ఇటీవల ఆమె అల్లుడు బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో వివిధ వైద్య పరీక్షలు చేయించుకుని తిరిగి అమెరికాకు వెళ్లిపోయాడు. ఆ రిపోర్టులను తీసుకుని అనంతరం షాపింగ్ చేయడం కోసం భర్త, కుమార్తెతో కలిసి ఆస్పత్రికి వచ్చారు. రిపోర్టులు తీసుకున్న తర్వాత ఆస్పత్రి నుంచి సాయంత్రం అమీర్‌పేటలోని జ్యువెలరీ దుకాణంలో షాపింగ్ చేయడానికి ఆర్టీసీ బస్సును ఎక్కారు. బస్సులో రద్దీ ఎక్కువగా ఉండటంతో నిలబడాల్సి వచ్చింది. మైత్రీవనం వద్దకు రాగానే వారు దిగే ప్రయత్నం చేస్తుండగానే నోటికి మాస్క్ ధరించిన పలువురు మహిళలు ఆమెను కిందకు తోసేశారు. తన భర్త, కుమార్తె కూడా బస్సు నుంచి కిందకు దిగి హ్యాండ్ బ్యాగును పరిశీలించుకోగా అందులో ఉన్న రూ. 5 లక్షల నగదు, నగలు (మంగళసూత్రం, బంగారు గొలుసు) కనిపించలేదు. వెంటనే తేరుకుని బస్సును వెంబడించారు. అయితే బస్సు వేగంగా వెళ్లిపోయింది. దాంతో బాధితులు మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌ల వద్ద జియోట్యాగింగ్

బంజారాహిల్స్: ప్రతి పోలింగ్ బూత్‌ను జియోట్యాగింగ్ చేస్తున్నారు. పోలింగ్ బూత్‌ల జియోట్యాగింగ్‌పై బుధవారం జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ పి.రవీంద్రప్రసాద్ పరిశీలన చేపట్టారు. జియో ట్యాగింగ్ సరిగ్గా అయిందా లేదా అన్నదానిపై ఆరా తీశారు. ఒక్క రోజే 50కి పైగా పోలింగ్ స్టేషన్లను క్షేత్ర స్థాయిలో పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు.

అప్పుల బాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

వెంగళరావునగర్: అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... తూర్పుగోదావరి జిల్లా వాడపాలెం గ్రామానికి చెందిన ఈతకోట గోవిందరాజు బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి కళ్యాణ్‌నగర్‌లో సెక్యూరిటీ గార్డుగా ఉంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి నాగరాజు, దుర్గాప్రసాద్ అనే ఇరువురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు దుర్గాప్రసాద్(22) సుస్మిత అనే అమ్మాయిని ప్రేమించి నాలుగు నెలల కిందట పెళ్లి చేసుకున్నాడు. వీరు ఇరువురు వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. దుర్గాప్రసాద్ ఫుడ్ డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం గడుపుతున్నాడు. మంగళవారం సాయంత్రం తన కుమారుడు ఇంట్లోనే చీరకు ఉరేసుకున్నాడని కోడలు సుస్మిత తెలియజేసింది. తనకు అప్పులు బాగా పెరిగిపోయాయని, అప్పు లు చెల్లించలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్ రాశాడు. తన కుమారుని మరణంపై ఎలాంటి సందేహాలు లేవని తండ్రి గోవిందరాజు పోలీసులకు తెలియజేశాడు. ఎస్ఐ బాలరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాధాకృష్ణులుగా అలరించిన విద్యార్థులు

పాఠశాలల్లో నేత్రపర్వంగా శ్రీకృష్ణజన్మాష్టమి సంబురాలు



బర్డ్స్ అండ్ బ్లూమ్స్ చిన్నారులు

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను బుధవారం ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులు చిన్నికృష్ణులు, గోపికలు, రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించారు. పాఠశాలల్లో పండగ వాతావరణం నెలకొంది. చిన్నారుల వేషధారణలను తిలకించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపారు. జూబ్లీహిల్స్ రోడ్ నెం.45లోని భారతీయ విద్యాభవన్స్ ఆత్మకూరి రామారావు స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలో విశేషంగా ఆకట్టుకున్నారు. ఆట, పాటలతో సందడిచేశారు. విద్యార్థుల నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలతా నాయర్ పాల్గొన్నారు.

ఫిలింనగర్/పంజగుట్ట/శ్రీనగర్‌కాలనీ/యూసుఫ్‌గూడ



భారతీయ విద్యాభవన్స్‌లో రాధాకృష్ణులుగా విద్యార్థులు



వేడుకల్లో సంస్కార్ స్కూల్ చిన్నారులు



ఆనంద్‌నగర్ కాలనీలో గోపిక వేషధారణలో



శ్రీకృష్ణానగర్‌లోని సాయిసరస్వతి స్కూల్ విద్యార్థులు



ఎస్‌వీఎస్ స్కూల్‌లో..

ప్రజలను బెదిరిస్తున్న ఇద్దరి అరెస్టు





నిందితులు బబ్లూ, సంతోష్

బంజారాహిల్స్: దుకాణం మూసేసిన తర్వాత సిగరెట్ కావాలని బెదిరించి ఇవ్వకపోవడంతో కత్తులతో దాడి చేసి పరారైన ఇద్దరు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్‌లోని సింగాడికుంటలో గతంలో నివాసం ఉన్న తురాకర్ అజయ్ అలియాస్ బబ్లూ, బంజారాహిల్స్‌కు చెందిన సంతోష్ అలియాస్ బంగారం కొంత కాలంగా రాత్రిపూట ఆవారాగా తిరుగుతూ గంజాయి సేవిస్తూ మద్యానికి బానిసలై ఈజీమనీ కోసం అలవాటు పడి దారికాచి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఇద్దరూ కలిసి కత్తులతో సంచరిస్తూ స్థానికులను భయభ్రాతులకు గురి చేస్తున్నారు. ఎమ్మెల్యే కాలనీలో ఓ వ్యాపారిని సిగరెట్ కోసం బెదిరించి కత్తితో దాడి చేశారు. రెండు రోజుల వ్యవధిలోనే వీరిద్దరూ రెండు కత్తిపోటు సంఘటనలకు కారణమయ్యారు. ఏడాది క్రితం బబ్లూ ఓ కేసులో కూడా నిందితుడిగా ఉండి బంజారాహిల్స్ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నాడు.రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో హత్య కేసులో జైలుకు కూడా వెళ్లాడు. వీరిద్దరినీ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

అరెస్టు.. పదేళ్ల జైలు!

లేదంటే చంద్రబాబుకు జీవిత ఖైదు విధించే అవకాశం | **ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎలాంటి పదవులూ చేపట్టకుండా అనర్హత వేటు పడుతుంది**

- ➤ గతంలో మాదిరిగా ఆయన ఈసారి తప్పించుకోలేరు
- ➤ ఐటీ నోటీసులో ఉన్నవి తీవ్ర ఆరోపణలు
- ➤ ఈ కేసులో స్టే తెచ్చుకోవడం సాధ్యం కాదు
- ➤ సాక్షుల వాంగ్మూలం, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ పక్కాగా ఉన్నాయి
- ➤ పన్ను ఎగవేతే కాకుండా.. రూ. కోట్లలో మనీ లాండరింగ్ జరిగింది
- ➤ ఈడీ, సీబీఐ దర్యాప్తునకు వెయ్యి శాతం అవకాశాలు
- ➤ ముఖ్యమంత్రిగా ఉంటూ చంద్రబాబు అధికారాన్ని దుర్వినియోగం చేశారు
- ➤ లాలూ ప్రసాద్ యాదవ్, జయలలితపైనా ఇదే తరహా కేసులు
- ➤ ఇది రూ.118 కోట్లతో ఆగేది కాదు.. ఇంకా చాలా స్కామ్‌లు బయటికొస్తాయ్
- ➤ నారా లోకేశ్ పాత్రపైనా ఆధారాలు.. విచారణ ఎదుర్కోక తప్పదు

'సాక్షి' ఇంటర్వ్యూలో ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు బీఎస్ రాంబాబు



సాక్షి, హైదరాబాద్

ప్రజాధనాన్ని కాజేసి పేదల ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టుల్లో రూ.వందల కోట్ల కుంభకోణానికి పాల్పడిన మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అరెస్టు ఖాయమని, ఈ కేసు నుంచి ఆయన బయటపడడం అసాధ్యమని ఆర్థిక, రాజకీయ విశ్లేషకుడు బీఎస్ రాంబాబు స్పష్టం చేశారు. తీవ్ర ఆర్థిక నేరానికి పాల్పడినందుకు చట్ట ప్రకారం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు విధించే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి సంబంధించి ఐటీ శాఖ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, సాంకేతికంగా మాత్రమే నేరం రుజువు కావాల్సి ఉందని వివరించారు. 'ఈ కేసును రాజకీయ కక్ష సాధింపు కోణంలో చూడలేం. ఆదాయపు పన్ను (ఐటీ) అధికారులు నమోదు చేసిన సెక్షన్లు ఎంతో తీవ్రమైన ఆరోపణలు. అందుకు వారి వద్ద ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, డాక్యుమెంటరీ ఆధారాలున్నాయి. ఇందులో భారీ అవినీతి దాగి ఉంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భవిష్యత్తులో ఏదైనా పదవిని పొందేందుకు సైతం చంద్రబాబు అనర్హుడు అవుతారు. ఈ కేసులో వెయ్యి శాతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐ దర్యాప్తు చేపట్టడం తప్పదు' అని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా తీవ్రచర్చ జరుగుతున్న చంద్రబాబు అవినీతి వ్యవహారాలు, ఐటీ నోటీసుల్లో ప్రధానాంశాలు, సాంకేతిక విషయాలపై మంగళవారం 'సాక్షి' ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన విశ్లేషించారు.

మాజీ సీఎం చంద్రబాబుకు ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో కీలక అంశాలేమిటి?

ఇది చాలా తీవ్రమైన ఆర్థిక నేరం. చంద్రబాబు నాయుడు రూ.118 కోట్ల ఆదాయాన్ని బహిర్గతం చేయకుండా దాచిపెట్టారన్న ఆరోపణ ఉంది. ఈ నేరానికి చట్ట ప్రకారం 10 ఏళ్ల వరకు జైలు శిక్ష లేదా జీవిత ఖైదు పడవచ్చు. ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం భవిష్యత్తులో ఆయన ఎలాంటి పదవులు పొందకుండా అనర్హుడు అవుతారని చట్టం చెబుతుంది. ఈ కేసులో కీలక వ్యక్తుల స్టేట్‌మెంట్లు ఉన్నాయి. డాక్యుమెంటరీ ఎవిడెన్స్ పక్కాగా ఉంది. సాంకేతికంగా మాత్రమే నేరం నిరూపణ కావాల్సి ఉంది. ఇప్పటికే ఐటీ శాఖ దగ్గర ఉన్న ఆధారాలను చూస్తే ఈ కేసులో ఆయనకు శిక్ష తప్పదని తెలుస్తోంది.

ఈ కుంభకోణంలో ప్రధాన ఉల్లంఘనలు ఏమిటి? ఐటీ అధికారులు నోటీసుల్లో ఏ అంశాలు పేర్కొన్నారు?

ఈ కేసును మూడు రకాల ఉల్లంఘనలుగా చూడవచ్చు. ఈ మూడు కూడా తీవ్రమైన నేరాలే. ఆదాయాన్ని దాచిపెట్టి ఇన్‌కమ్‌ట్యాక్స్ చట్టాన్ని మొదట ఉల్లంఘించారు. రెండోది.. ఈ డబ్బును విదేశాలకు పంపడం. అక్కడి నుంచి ఆ సొమ్ము విరాళాల రూపంలో మళ్లీ చంద్రబాబు ఖాతాలో, టీడీపీ ఖాతాలోకో వచ్చింది. అంటే మనీ లాండరింగ్ చట్టాన్ని ఉల్లంఘించినట్టు అయింది. ఇక ప్రజా ప్రతినిధిగా ఉంటూ తన ప్రతిజ్ఞకు భిన్నంగా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు కాబట్టి యాంటీ కరప్షన్ యాక్ట్ కింద చంద్రబాబు శిక్షార్హుడు అవుతారు. దీన్ని క్విడ్ ప్రోకోగా చూడవచ్చు.

ఐటీ శాఖ ఇచ్చిన నోటీసుల్లో తన పేరు లేదని చంద్రబాబు వాదిస్తున్నారు కదా? గతంలో ఇచ్చిన సమాధానాల్లో ఇదే ప్రధానంగా ప్రస్తావించారు..

ఈ వ్యవహారంలో తన పేరు లేదని చంద్రబాబు నాయుడు చెబుతున్నారు. కానీ ఇక్కడ వాస్తవం ఏమిటంటే ఏ నేరంలోనైనా ఒక వ్యక్తి పేరు లేనంత మాత్రాన అతడు నేరం చేయనట్టు కాదు. ఈ మొత్తం కుంభకోణంలో చంద్రబాబు పాత్రపై ప్రత్యక్ష సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాలున్నాయి. డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఉంది. ఈ సర్కమ్‌స్టాన్సియల్ ఎవిడెన్స్ (ప్రాసంగిక సాక్ష్యాలు) సైతం నిందితుడి పాత్రను నిరూపిస్తాయి కాబట్టి నా పేరు లేదు కదా.. అనే దానికి మినహాయింపులు ఉండవు. తన పేరు లేదని చంద్రబాబు స్టేట్మెంట్లు ఇచ్చినంత మాత్రాన కుదరదు. చట్ట ప్రకారం సర్కమ్‌స్టాన్సియల్ ఎవిడెన్స్, డాక్యుమెంటరీ ఎవిడెన్స్, ప్రత్యక్ష సాక్షులు చెప్పే సాక్ష్యాల ఆధారంగా ఎన్నో కేసులు నిరూపితమయ్యాయి. ఇవన్నీ ఐటీ అధికారుల దగ్గర పక్కాగా ఉన్నట్టు నోటీసుల ఆధారంగా తెలుస్తోంది. కాబట్టి చంద్రబాబునాయుడు తన పేరు లేదంటూ తప్పించుకోలేరు. ఐటీ సెక్షన్ 153 సీ, సెక్షన్ 142(1), 143(2) ప్రకారం మీకు జ్యూరిస్‌డిక్షన్ లేదని ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తే తమకు ఆ అధికారం ఉందని ఐటీ అధికారులు ఇప్పటికే తేల్చి చెప్పారు.

గతంలో తనపై దాఖలైన కేసుల్లో స్టేలు తెచ్చుకున్నట్లుగా చంద్రబాబు ఈ కేసులోనూ స్టే తెచ్చుకునే అవకాశం ఉందా..?

గతంలో మాదిరిగా చంద్రబాబు నాయుడు ఐటీ కేసులో స్టే తెచ్చుకోవడం సాధ్యం కాదు. ఐటీ కేసులకు ప్రత్యేకంగా ట్రిబ్యునల్ ఉంటుంది. ఇన్‌కమ్ ట్యాక్స్ అనేది హైకోర్టు, సుప్రీంకోర్టుల పరిధిలోకి ఇమీడియెట్‌గా రాదు. అక్కడ జ్యుడీషియల్ పవర్స్ ఉండే జ్యుడీషియల్ అధికారి ఉంటారు. ఆయన ట్రిబ్యునల్‌లో విచారిస్తారు. కాబట్టి మొదట ప్రొసీడింగ్స్ పూర్తి చేయాల్సిందే. జ్యుడీషియల్ పవర్స్ అన్నీ ఇన్‌కమ్ ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌కు ఉన్నాయి. ఈ కేసులో ఎంతో సీరియస్ అభియోగాలున్నాయి. నకిలీ ఇన్‌వాయిస్‌లతో ప్రజాధనాన్ని కొట్టేశారు. ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్లు ఉంది, డాక్యుమెంటరీ ఎవిడెన్స్ కూడా ఉంది. సర్కమ్‌స్టాన్షియల్ ఎవిడెన్స్ కూడా ఉంది. అందువల్ల స్టేలు ఇచ్చే ఆస్కారం ఏమాత్రం లేదు. గతంలో జయలలిత, లాలూ ప్రసాద్ యాదవ్‌లపైనా ఈ తరహా కేసులు నమోదయ్యాయి.

ఐటీ అధికారుల దర్యాప్తులో భారీ అక్రమాలు వెలుగు చూశాయి. విదేశాల్లోనూ చెల్లింపులు జరిగినట్లు ఆధారాలున్నాయి. ఐటీతోపాటు ఈడీ, సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేసే అవకాశం ఉందా..?

ఈ కేసులో కీలక నిందితుడు మనోజ్ వాసుదేవ్ పార్థసాని తన వాంగ్మూలంలో పలు కీలక విషయాలను వెల్లడించాడు. 'ఏం చేయాలో నా పీఎస్‌కు ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చా.. నా పీఎస్‌ను కలవండి..' అని చంద్రబాబు స్వయంగా తనకు చెప్పినట్లు పార్థసాని ఐటీ అధికారులకు ఇచ్చిన వాంగ్మూలంలో వెల్లడించారు. అంటే అది ప్రత్యక్ష సాక్ష్యం అవుతుంది. చంద్రబాబు ఆయన పీఎస్ శ్రీనివాస్ ద్వారా తమను వేధించడంతోనే డబ్బులు చెల్లించినట్లు పార్థసానితో పాటు ఇద్దరు చార్టెడ్ అకౌంటెంట్లు వారి వాంగ్మూలాల్లో అంగీకరించారు. ఇవన్నీ కీలక విషయాలే అవుతాయి. డబ్బులు చంద్రబాబుకు సంబంధించిన వ్యక్తులకు చేరడం.. తిరిగి అవి ఏ రూపంలో ఎవరెవరికి చెల్లించారు? చంద్రబాబుకు దుబాయ్‌లో పేమెంట్ చేయడం గురించి కూడా వారు చెప్పారు. అంటే ఇండియన్ కరెన్సీని బయటి దేశాలకు తరలించారు.. తిరిగి దాన్ని విరాళాల రూపంలో టీడీపీ ఖాతాల్లోకి చేర్చారు. ఈ మొత్తం వ్యవహారంలో మనీ లాండరింగ్ కోణం ఉంది కాబట్టి ఈ కేసులో వెయ్యి శాతం ఈడీ అధికారులు దర్యాప్తు చేపడతారు. సీబీఐ సైతం వంద శాతం దర్యాప్తు చేపడుతుంది. ఈ రెండు దర్యాప్తు సంస్థలు సుమోటోగా కేసును తీసుకోకపోయినా కేసు దర్యాప్తు సవ్యంగా జరిగేందుకు ఈడీ, సీబీఐని ఆదేశించాలని ఎవరైనా కోర్టులను కోరే అవకాశం ఉంది.

ఈ కేసులో ఇప్పటివరకు ఐటీ అధికారులు రూ.118 కోట్ల అక్రమాలను నిగ్గు తేల్చారు. దర్యాప్తులో ఇంకా కొత్త కుంభకోణాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందా..?

ఇది రూ.118 కోట్లతో ఆగేది కాదు. తవ్వితీస్తే ఇంకా చాలా కుంభకోణాలు బయటికి వస్తాయి. ఇందులో ఐటీ చట్టాలతోపాటు మనీ లాండరింగ్ జరిగింది. ప్రభుత్వ అధికారిక హోదాలో ఉంటూ అవినీతికి పాల్పడిన అంశం ఉంది. ఇలా భిన్న కోణాల్లో దర్యాప్తు జరగాల్సి ఉంది. తీగ లాగితే డొంక కదిలినట్టుగా మరిన్ని కుంభకోణాలు వెలుగులోకి రావచ్చు.

ఈ కేసులో నారా లోకేశ్ పాత్ర కూడా ఉన్నట్లు ఐటీ అధికారులు కీలక ఆధారాలను సేకరించారు. లోకేశ్‌ను విచారించే అవకాశం ఉందా?

ఐటీ అధికారులు తమ నోటీసులలో వెల్లడించిన ప్రకారం చూస్తే నారా లోకేశ్‌కు ఇందులో కీలకపాత్ర ఉన్నట్లు అన్ని ఆధారాలున్నాయి. చంద్రబాబు పీఎస్ శ్రీనివాస్‌కు సైతం లోకేశ్ అనేక విషయాల్లో ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉంది. కాబట్టి లోకేశ్ సైతం భవిష్యత్తులో ఈ కేసులో విచారణ ఎదుర్కోక తప్పదు.

ఈ మొత్తం వ్యవహారంలో అధికార దుర్వినియోగం స్పష్టంగా ఉంది. ఆ కోణంలో దర్యాప్తునకు అవకాశం ఉందా?

చంద్రబాబునాయుడు సీఎంగా ఉంటూ తన అధికారాన్ని దుర్వినియోగం చేశారనేందుకు డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఉంది. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్, జయలలితపైన నమోదైన కేసులను చూస్తే.. అధికారంలో ఉండగా వారు తీసుకున్న నిర్ణయాల మేరకు పెట్టిన కేసులే అవి. అదే మాదిరిగా చంద్రబాబు సైతం అధికారాన్ని దుర్వినియోగం చేసి డబ్బులు సంపాదించారని ఐటీ అధికారుల నోటీసులలో స్పష్టంగా ఉంది. బోగస్ ఇన్వాయిస్‌లను సీఎం హోదాలో చంద్రబాబు అంగీకరించి ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరిపారు. ఆ డబ్బులు రూపం మార్చుకుని తిరిగి చంద్రబాబు పార్టీ ఖాతాలోకే వచ్చాయి. అంటే ఎవరైతే నిర్ణయం తీసుకున్నారో వాళ్లకే తిరిగి లబ్ధి చేకూరింది. కాబట్టి అవినీతి నిరోధక చట్టాల కింద కూడా దర్యాప్తునకు అవకాశం ఉంది.

ఈ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టుకు అవకాశం ఉందా..?

ఐటీ అధికారులు తమ దర్యాప్తులో భాగంగా ట్రిబ్యునల్‌లో చార్జిషీట్ ఫైల్ చేస్తారు. ఆ తర్వాత చంద్రబాబును రిమాండ్‌కు అడగడం తప్పదు. ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారించకుండా నిజాలు బయటికి రావు కాబట్టి ఇప్పుడు షోకాజ్ నోటీసులు మాత్రమే ఇచ్చారు. చార్జిషీట్ దాఖలైన తర్వాత ట్రిబ్యునల్ ఆదేశం మేరకు అరెస్టుకు అవకాశం ఉంది. మనీలాండరింగ్, ఇతర అంశాలున్నందున ఈడీ అరెస్టు చేస్తుందా? లేదంటే సీబీఐ అరెస్టు చేస్తుందా? అన్నది పక్కన పెడితే ఈ మొత్తం వ్యవహారంలో చంద్రబాబు అరెస్టు ఖాయంగానే కనిపిస్తోంది. ఐటీ అధికారులు సైతం ఈ వ్యవహారంపై ఈడీకి సమాచారం ఇవ్వొచ్చు.



భక్తులకు చేతి కర్రలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

భక్తుల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే చేతి కర్రలు

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: అలిపిరి నడక మార్గంలో క్రూర మృగాల సంచారం నేపథ్యంలో అనేక భద్రతా చర్యలు తీసుకున్నామని, ఇందులో ఓ చర్యగా భక్తుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి చేతి కర్రలు అందజేస్తున్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. అలిపిరి పాదాల మండపం వద్ద టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి ఆయన బుధవారం భక్తులకు చేతి కర్రలను అందజేశారు. మీడియాతో భూమన మాట్లాడుతూ..చేతి కర్రలతో భక్తులు క్రూర మృగాలతో పోరాడతారని కాదని, చేతిలో కర్ర ఉంటే ఏ జంతువైనా వెనకాడుతుందని శాస్త్రీయ పరిశీలన ద్వారా రుజువైందని చెప్పారు. చేతి కర్రలను భక్తులకు ఉచితంగా అందిస్తామని, వీటిని అలిపిరిలో అందజేసి శ్రీనరసింహస్వామి వారి ఆలయం వద్ద తిరిగి తీసుకుంటామని తెలిపారు. టీటీడీ ఈవో ఏవీ. దర్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం తిరుమల శిలాతోరణం వద్ద, ఏడో మైలు వద్ద చిరుతల సంచారాన్ని గుర్తించామన్నారు. ఈ నేపథ్యంలో గాలిగోపురం నుంచి వంద మంది భక్తులను గుంపులుగా గోవింద నామస్మరణ చేసుకుంటూ వెళ్లాలని సూచించినట్లు తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్‌లోనున్న అలిపిరి నడక మార్గంలో ఇనుప కంచె వేయడానికి కేంద్ర అటవీ శాఖకు, వైల్డ్ లైఫ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాకు ప్రతిపాదనలు పంపామని, వారు తగిన డిజైన్లతో అంగీకారం తెలిపితే కంచె నిర్మిస్తామన్నారు. చేతి కర్రల కోసం రూ.45,000 ఖర్చయిందని తెలిపారు.

శ్రీవారికి 108 స్వర్ణ పుష్పాలు సమర్పణ

తిరుమల: తిరుమల శ్రీవారికి కడపకు చెందిన డాక్టర్ రాజారెడ్డి రూ.2కోట్ల విలువైన 108 స్వర్ణ పుష్పాలను బుధవారం సమర్పించారు. తొలుత దాత రాజారెడ్డి, లలిత జ్యువె లర్స్ అధినేత కిరణ్‌తో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో టీటీడీ అధికారులకు 108 బంగారు పుష్పాలను శ్రీవా రి సేవల కోసం వినియోగించాలని విరాళంగా అందించారు. ఆలయం వెలుపల లలిత జ్యువెలర్స్ అధినేత కిరణ్ మాట్లాడుతూ రాజారెడ్డి ఆర్డర్ మేరకు 108 బంగారు పుష్పాలను ఆరు నెలలపాటు తమ కార్మికులు కష్టించి తయారు చేశారని తెలిపారు.

ఎక్కడి దొంగలు.. అక్కడే!

అడ్డంగా దొరికి... అరెస్టు చేస్తారేమోనంటూ బాబు కొత్త మంత్రం

ఐటీ నోటీసులపై, అవినీతి వ్యవహారంపై ష్.. గప్‌చుప్

సాక్షి, అమరావతి: అధికారాన్ని అడ్డం పెట్టుకుని చంద్రబాబునాయుడు తన ఖాతాల్లోకి నేరుగా రప్పించుకున్న రూ.118 కోట్లకు సంబంధించి ఆదాయపు పన్ను శాఖ నోటీసులిచ్చినట్లు జాతీయ ఇంగ్లిష్ డైలీ 'హిందుస్థాన్ టైమ్స్' ప్రచురించి దాదాపు వారం దాటింది. నాటి నుంచీ ఈ నోటీసులతో పాటు బాబు హయాంలో కాంట్రాక్టు సంస్థల నుంచి ముడుపులు ఎలా అందుకున్నారో, ఖజానాను ఎలా కొల్లగొట్టారో వివరాలతో సహా వివిధ పత్రికల్లో వార్తలు వస్తూనే ఉన్నాయి. కాకపోతే ఊరూరా వెళుతున్న చంద్రబాబు నాయుడుగానీ... పాదయాత్రంటూ తిరుగుతున్న ఆయన తనయుడు లోకేశ్ గానీ.. షూటింగ్ గ్యాప్ తీసుకున్న పవన్ కల్యాణ్ గానీ ఎవ్వరూ దీనిపై మాట్లాడటం లేదు. ఇక అందరిపైనా ఉన్నవీ లేనివీ రాసే 'ఈనాడు', దాని తోకపత్రిక, తోక చానెళ్లు... ఏవీ ఈ అంశాన్నే ప్రస్తావించటం లేదు. ఆఖరికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వచ్చిన పురంధేశ్వరి కూడా దీన్నో సాధారణ అంశంగా తేల్చేశారు తప్ప బాబు అవినీతికి నిదర్శనంగా చూడటం లేదు.

ఏమయింది వీళ్లకి?

ఇక చంద్రబాబు విషయానికొస్తే అటు ఐటీ విభాగానికేమో.. 'నాకు నోటీసులిచ్చే అధికారం మీకెక్కడిది?' 'నాకు సాక్ష్యాధారాలు చూపించండి' 'ఫలానా సంవత్సరానికి ఇది వర్తించదు' అనే డొంకతిరుగుడు జవాబులిస్తున్నారు. ఇటు ప్రజల ముందేమో... 'నాపై కుట్ర చేస్తున్నారు' 'నన్ను అరెస్టు చేస్తారేమో' 'నన్ను ఏ క్షణాన్నైనా అరెస్టు చేయొచ్చు' అని నానా నంగనాచి కబుర్లు చెబుతున్నారు. అంతే తప్ప... ఆ నోటీసులు ఎందుకొచ్చాయి? తాను నిజంగా అవినీతి చేశాడా... లేదా? ఆ 118 కోట్లూ నిజంగా ముట్టాయా? కాంట్రాక్టు సంస్థలను బెదిరించటం అబద్ధమా? మనోజ్ పార్థసానితో తనకు సంబంధాలున్నాయా... లేవా? దుబాయ్‌లో డబ్బులు తీసుకున్నాడా.. లేదా? అనే ఏ విషయమూ చెప్పటం లేదు. పైపెచ్చు ఐటీ శాఖకే సమాధానాలిస్తారంటూ ఆయన తరఫున కొందరు బీరాలు పోవటమూ మొదలయ్యింది. కేంద్రం ప్రభుత్వ అధీనంలో పనిచేసే ఆదాయపు పన్ను శాఖ... రిటర్నుల్లో చూపించని మొత్తం ఎవరి లావాదేవీల్లోనైనా కనిపించినపుడు నోటీసులివ్వటం మామూలే. కాకపోతే చంద్రబాబుది రిటర్నుల్లో చూపించని మొత్తం మాత్రమే కాదు. అది అక్రమంగా ఆర్జించిన అవినీతి సొమ్ము. ప్రభుత్వ ప్రాజెక్టుల్ని కట్టబెట్టి.. లంచాల రూపంలో తన ఖాతాలోకి నేరుగా రప్పించుకున్న అక్రమార్జన. పైపెచ్చు ఆయన 40 ఇయర్స్ ఇండస్ట్రీ!!. ప్రజా జీవితంలో ఉన్న నాయకుడు. మరి ప్రజలకు జవాబుదారీయే కదా? బయట అన్ని సభల్లో మాట్లాడుతున్న చంద్రబాబుకు... తనపై వచ్చిన నోటీసులపై స్పందించాల్సిన ఆవశ్యకత లేదా? ఇలాంటి రాజకీయం ఎక్కడైనా ఉంటుందా? దొంగలంతా కలిసి... ఎక్కడి వారక్కడే గప్‌చుప్... అన్న తరహాలో నోరు మూసుకున్నంత మాత్రాన విషయం అందరికీ తెలియకుండా ఉంటుందా? జవాబు చెప్పాల్సిన బాధ్యత నుంచి చంద్రబాబు తప్పించుకోగలరా?

ఇదీ అసలు కథ...

అధికారాన్ని అడ్డం పెట్టుకుని యథేచ్ఛగా సాగించిన అవినీతి బండారం బట్టబయలవుతున్న కొద్దీ బాబులో ఆందోళన రెట్టింపు అవుతోంది. ఇన్నాళ్లూ ప్రతి వ్యవస్థలో తన మనుషుల్ని పెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేయడం ద్వారా 'నిప్పు'లా చెలామణి అయిన బాబుకు... రోజులన్నీ ఒకేలా ఉండవని ఇప్పుడు అర్థమవుతోంది. రూ. 8వేల కోట్ల కాంట్రాక్టుల కేటాయింపులో షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌లతో సాగించిన అవినీతిని ఐటీ శాఖ నిగ్గు తేల్చింది. నోటీసులిచ్చింది. ఆధారాలూ చూపించింది. తప్పించుకునేందుకు బాబు వేసిన ఎత్తుల్ని తిప్పికొట్టింది. దీంతో బాబుకు దారులు మూసుకుపోయాయి. మరోవైపు రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణంలో చంద్రబాబు అవినీతిని సీఐడీకి చెందిన సిట్ బృందం ఆధారాలతో సహా వెలికితీసింది. ఆ రెండు వ్యవహారాల్లోనూ షెల్ కంపెనీలు, బోగస్ ఇన్వాయిస్‌ల ద్వారా కొల్లగొట్టిన ప్రజాధనం హైదరాబాద్‌లోని చంద్రబాబు బంగ్లాకే చేరిందన్నది బట్టబయలైంది. ఈ స్కిల్ స్కామ్‌లో హవాలా దందా నిగ్గు తేల్చడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కూడా దిగింది.

అదే కుతంత్రం...మళ్లీ మళ్లీ

పరిస్థితి చేయి దాటిపోతోందని గ్రహించిన చంద్రబాబు... తన అవినీతి బాగోతం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మళ్లీ పాత దారే ఎంచుకున్నారు. తనను రెండు రోజుల్లో అరెస్టు చేయవచ్చంటూ వ్యాఖ్యానించారు. దానిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు స్పందించి రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ఇతర నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పరోక్షంగా ఆదేశించారు. తద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించాలన్నది బాబు పన్నాగం. తాను ఇబ్బందుల్లో పడిన ప్రతిసారీ చంద్రబాబు అనుసరించే దిగజారుడు రాజకీయ ఎత్తుగడ ఇదే. 2015లో హైదరాబాద్‌లో ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిపోయినపుడూ ఇదే చేశారు. తెలంగాణ పోలీసులు తనను అరెస్టు చేస్తారేమో అని చెబుతూ రాత్రికి రాత్రి హైదరాబాద్ విడిచిపెట్టి అమరావతి వచ్చేశారు. పైపెచ్చు రాష్ట్రం నుంచే పరిపాలన చేసేందుకే వచ్చేశానని చెప్పుకొచ్చారు. పైగా తనపై కేసు పెట్టడాన్ని ఆంధ్రప్రదేశ్‌పై తెలంగాణ ప్రభుత్వం చేసిన దాడిగా వక్రీకరించారు. అంతేతప్ప తాను ఎమ్మెల్సీ ఎన్నికల్లో అడ్డదారిలో గెలిచేందుకు కోట్ల రూపాయలు లంచంగా ఇస్తూ పట్టుబడ్డానన్న వాస్తవాన్ని మాత్రం ఒప్పుకోలేదు. ఇప్పుడూ అదే సూత్రం అమలు చేస్తున్నారు. ఇటీవల అన్నమయ్య, చిత్తూరు జిల్లాల పర్యటనల్లో పోలీసులపై దాడులకు పాల్పడేలా టీడీపీ నేతలు, కార్యకర్తలను ప్రేరేపించారు. తాజాగా భీమవరంలోనూ అదే రీతిలో ఘర్షణలు సృష్టించారు. ఇప్పుడు తనను అరెస్టు చేస్తారని వ్యాఖ్యానిస్తూ కార్యకర్తల్ని రెచ్చగొడుతున్నారు.

ఇదీ చంద్రబాబు అవినీతి నెట్‌వర్క్

అటు అమరావతిలో తాత్కాలిక రాజధాని భవనాలు, టిడ్కో గృహ నిర్మాణ ప్రాజెక్టులు ఇటు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ రెండింట్లోనూ చంద్రబాబు ఒకే అవినీతి నెట్‌వర్క్‌ను ఉపయోగించారు. రెండుచోట్లా తానే సూత్రధారిగా ఉంటూ... నిధులను చేర్చడంలో పాత్రధారులుగా యోగేశ్ గుప్తా, షాపూర్జీ-పల్లోంజీ కంపెనీ ప్రతినిధి మనోజ్ వాసుదేవ్ పార్థసాని, చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌లను పెట్టారు. అదెలాగంటే...

- జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా దాని సహ భాగస్వామిగా డిజైన్ టెక్ కంపెనీని రంగంలోకి దింపి ఏపీఎస్ఎస్‌డీసీతో ఒప్పందం చేశారు చంద్రబాబు. రూ.3,300 కోట్ల మేర కాగితాలపై ప్రాజెక్టును చూపించి డిజైన్ టెక్ సంస్థ తన వాటా 90 శాతంలో ఒక్క రూపాయి ఖర్చు పెట్టకపోయినా సరే రాష్ట్ర ప్రభుత్వం వాటా 10 శాతం కింద జీఎస్టీతో సహా రూ.371 కోట్లు విడుదల చేశారు. అందులో సాఫ్ట్‌వేర్ కొనుగోలుకు రూ.56 కోట్లు చెల్లించి... మిగిలిన రూ.315 కోట్లను షెల్ కంపెనీల ద్వారా బోగస్ ఇన్వాయిస్‌లు సమర్పించి తమ ఖాతాల్లోకి తరలించేసుకున్నారు. దళారుల కమీషన్లు పోనూ చంద్రబాబుకు నికంగా రూ.241 కోట్లు చేరాయని సిట్ నిర్ధారించింది.

అక్రమ నిధుల ఎలా తరలించారంటే...

- రాష్ట్ర ప్రభుత్వం పుణేకు చెందిన డిజైన్ టెక్ కంపెనీకి రూ.371 కోట్లు చెల్లించింది.
- డిజైన్ టెక్ కంపెనీ నుంచి పుణేలోని పీవీఎస్పీ అనే షెల్ కంపెనీకి రూ.238.29 కోట్లు, ఢిల్లీలోని ఏసీఐకి రూ.2.71 కోట్లు అంటే మొత్తం మీద రూ.241 కోట్లు తరలించారు.
- పీవీఎస్పీ కంపెనీ నుంచి మళ్లీ ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లలో ఉన్న వివిధ షెల్ కంపెనీలతో పాటు దుబాయి, సింగపూర్‌లోని కంపెనీలకు నిధుల తరలింపు ఇలా సాగింది...

ఏసీఐ: రూ.56 కోట్లు.
నాలెడ్జ్ పోడియమ్: రూ.45.28 కోట్లు.
ఈటా: రూ.14.1 కోట్లు
పాట్రిక్స్: రూ.3.13 కోట్లు
ఐటీ స్మిత్: రూ.3.13 కోట్లు
భారతీయ గ్లోబల్: రూ.3.13 కోట్లు
ఇన్‌వెబ్: రూ.1.56 కోట్లు
పోలారీస్: రూ.2.2 కోట్లు
కెడెన్స్ పార్ట్‌నర్స్: రూ.12 కోట్లు

- మొత్తం రూ. 140.53 కోట్లను ఆ కంపెనీల బ్యాంకు ఖాతాల నుంచి డ్రా చేసి యోగేశ్ గుప్తా మనోజ్ వాసుదేవ్ పార్థసానికి అందించారు. మనోజ్ పార్థసాని ఆ నగదును చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు హైదరాబాద్‌లో అందించారు. అంటే ఆ రూ.140. 53 కోట్లను చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- ఇక మిగిలిన రూ.100.47 కోట్లను పీవీఎస్పీ కంపెనీ దుబాయ్, సింగపూర్‌లోని కంపెనీలకు మళ్లించింది. ఆ నిధులు మళ్లీ హవాలా మార్గంలో హైదరాబాద్‌కు తరలించారు. మనోజ్ పార్థసాని ద్వారా చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్‌కు అందించారు. అక్కడ నుంచి చంద్రబాబు బంగ్లాకు చేర్చారు.
- అంటే ఏపీఎస్ఎస్‌డీసీకి చెందిన రూ.241 కోట్లు అవినీతి నెట్‌వర్క్ ద్వారా గుట్టుగా చంద్రబాబు బంగ్లాకు వచ్చి చేరాయి.

16న జాతికి అంకితం

▶ మొదటి పేజీ తరువాయి

'పల్లె పల్లెనా పల్లేర్లు మొలిసే.. పాలమూరులోనా' అంటూ పాటలు కూడా రాశారు.

బంగారు తెలంగాణ సంపూర్ణమవుతుంది

పాలమూరులో నాటి పాలకులు మొదలుపెట్టిన నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులను తెలంగాణ వచ్చాక యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేశాం. పాలమూరు జిల్లా పచ్చబడింది. వలసలు ఆగిపోయాయి. ప్రాజెక్టును పూర్తి చేసుకుంటే ఇంకెంత గొప్ప అభివృద్ధి అవుతుందో ఊహించుకోవచ్చు. తెలంగాణ వ్యవసాయం రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయి. సమ్మిళిత, సమగ్ర వ్యవసాయ రంగాభివృద్ధిని సాధిస్తుంది. రైతుల లోగిళ్లు బంగారు పంటలతో తులతూగుతాయి. బంగారు తెలంగాణ లక్ష్యం సంపూర్ణం కానుంది.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా..

ప్రాజెక్టుపై స్వయానా పాలమూరు జిల్లా నేతలే వందల కేసులు పెట్టడం దురదృష్టకరం. వారు జిల్లా ప్రజలకు శాపంలా పరిణమించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం పట్టుదలతో ముందుకు వెళ్లింది. పర్యావరణ అనుమతులు రావడంతో ప్రాజెక్టుకు అడ్డంకులు తొలగిపోయాయి. ఆ దిశగా కృషి చేసిన నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్, ఈఎన్సీ మురళీధర్, సలహాదారు పెంటారెడ్డి, సీఈలు హమీద్‌ఖాన్, రమణారెడ్డిల కృషిని అభినందిస్తున్నాం.

కృష్ణా జలాలతో మొక్కులు తీర్చుకోవాలి

మనందరి కృషికి దైవ కృప తోడు కావడంతోనే ప్రాజెక్టు పనులు కొలిక్కి వచ్చాయి. ఉద్యమ కాలంలో కృష్ణా నదిలో నాణేలు వేసి నీటి కోసం మొక్కాం. కృష్ణమ్మ ఎత్తిపోతల జలాలతో దేవుళ్ల పాదాలు కడుగుతామన్నాం. మనందరం ఆ మొక్కులను తీర్చుకోవాల్సి ఉంది. రెండు ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చే సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజలు తమతో తెచ్చుకున్న కలశాలతో కృష్ణా జలాలను తీసుకెళ్లి దేవుళ్ల పాదాలకు అభిషేకం చేయాలి. కొబ్బరికాయలు కొట్టి, పూలుచల్లాలి. పెద్ద ఎత్తున ఊరేగింపులు నిర్వహించి సంబురాలు జరుపుకోవాలి'' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

భారీగా బహిరంగ సభ

'పాలమూరు' ప్రాజెక్టును ప్రారంభించుకునే చరిత్రాత్మక వేళ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లోని ప్రతి పల్లె నుంచి సర్పంచులు, గ్రామస్తులు ఈ సభకు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవం, బహిరంగసభ నిర్వహణ, ప్రజలకు రవాణా, భోజన ఏర్పాట్లపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వ సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు.

ఒక్కోటీ 12 కిలోల బోల్టులు

ప్రపంచంలో మరెక్కడా లేనివిధంగా 145 మెగావాట్ల భారీ సింగిల్ పంపులను 'పాలమూరు-రంగారెడ్డి' ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్నట్టు అధికారులు సీఎం కేసీఆర్‌కు వివరించారు. వాటికి బిగించే ఒక్కో బోల్టు బరువే 12 కిలోలు ఉంటుందని, దాని రూటర్ 80 టన్నులు ఉంటుందని తెలిపారు. 240 టన్నుల బరువుండే దాదాపు 34 పంపులను వినియోగిస్తున్నామని.. ఇంకా ఎన్నో సమ్మక్యం గాని సాంకేతిక అంశాలున్నాయని వివరించారు. కాగా.. కాళేశ్వరం ప్రాజెక్టు స్ఫూర్తితో 'పాలమూరు' పనులను పూర్తి చేయాలని, కాల్వల నిర్మాణానికి వెంటనే టెండర్లు పిలవాలని అధికారులను సీఎం ఆదేశించారు. భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చి గతంలో అనుసరించిన పద్ధతులనే అవలంబించాలని సూచించారు. అచ్చంపేట, ఉమామహేశ్వరం పనులు ప్రారంభించాలన్నారు. రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో కాల్వల పనులను మంత్రులు, ఇరిగేషన్ అధికారులు కలసి పర్యవేక్షించాలని కోరారు. తర్వాత ప్రాజెక్టుకు విద్యుత్ సరఫరా ఏర్పాట్లపై ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్‌రావుతో, తాగునీటి తరలింపు చర్యలపై మిషన్ భగీరథ ఈఎన్సీ కృపాకర్ రెడ్డితోనూ సీఎం సమీక్షించారు.

పోలీసులు తీవ్రంగా కొట్టారు



గాయాలతో విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్/ఎంజీ ఎం: పోలీసులు తమను తీవ్రంగా కొట్టారని ఏబీవీ పీ నాయకులు వాంగ్మూ లం ఇవ్వగా, జడ్జి వైద్యపరీక్షలకు రెఫర్ చేశారు. హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ 2 కేటగిరీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని, ఆ అడ్మిషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5న ప్రిన్సిపాల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగిన సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం పోలీసులు ఆయా విద్యార్థి సంఘాల నాయకులను హనుమకొండ జిల్లా మూడో మున్సిఫ్ కోర్టులో జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు. తమను పోలీసులు తీవ్రంగా కొట్టారని జడ్జి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన ఆదేశాల మేరకు పోలీసులు వరంగల్ ఎంజీఎంకు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. వారికి సిమెంట్ పట్టివేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేశ్‌రెడ్డి పరామర్శించారు. సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు విద్యార్థి నాయకులను చితకబాదారని ఆయన ఆరోపించారు.



● ఎంపికైన విద్యార్థులతో ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి

అమెరికాలో చదువుకుని వస్తాం

సీఎం సార్... ఆశీర్వదించండి

ఆంధ్రప్రదేశ్ గురుకులం విద్యార్థులు అరుదైన అవకాశం చేజిక్కించుకున్నారు.
అగ్రరాజ్యం అమెరికా వెళ్లి అక్కడ 10 నెలలు ఉండి పాఠాలు చదువుకోబోతున్నారు.
ఈ గొప్ప అవకాశం వారి జీవితాలను మార్చనుంది.
ఇందుకు కారణమైన ఏ.పి. సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం అంటున్నారు.
'ఏ.పి గురుకులాలను సి.ఎం గారు ఆధునికంగా తీర్చిదిద్దడం వల్లే మాకు ఈ అవకాశం దక్కింది' అంటున్నారు.
'కెనడీ లుగర్-యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ ప్రోగ్రామ్' కింద అమెరికా వెళ్లిన విద్యార్థుల మనోగతాలు...

మా దేశానికి అధ్యయానికి రండి అంటూ అగ్ర దేశం అమెరికా నుంచి వచ్చిన ఆహ్వానం ఏ.పి. గురుకుల పాఠశాలల్లో సీనియర్ ఇంటర్ చదువుతున్న ఐదుగురు విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా చేసింది. నెలకు కనీసం రూ.10 వేలు కూడా సంపాదన లేని కుటుంబాల నుంచి వచ్చిన ఈ విద్యార్థులు అమెరికాను చూడటమే కాదు అక్కడ పది నెలలు ఉండి చదువుకునే అవకాశం పొందడం వారి జీవితాలను మార్చనుంది. ఇలా పేదపిల్లలకు పెద్ద అవకాశం దక్కడం వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెచ్చిన చదువుల మహాయజ్ఞం కీలక పాత్ర పోషించిందన్నది జగమెరిగిన సత్యం. 'నాడు-నేడు'తో రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల రూపురేఖలు అధునాతంగా మారిపోవడంతో పాటు అన్ని వసతులూ సమకూరాయి. ఇంగ్లిష్ విద్య, నాణ్యమైన విద్యాబోధన, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, ఆన్‌లైన్ క్లాసులు, ట్యాబ్‌లు వంటి ఎన్నో సౌకర్యాలతో పేదపిల్లల పెద్ద చదువుకు కొత్త బాటలు పరుస్తున్నారు.

థాంక్యూ సీఎం సార్



అమెరికా చదువులకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. విద్యా వ్యవస్థలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన విప్లవాత్మక చర్యల వల్లే నాకు ఈ అవకాశం దక్కింది. విశాఖపట్నం జిల్లా గాజువాక మండలం పెదగంట్యాడ మా ఊరు. మా నాన్న ప్రవీణ్ రాజ్ నెలకు రూ.7 వేలు సంపాదించే ప్రైవేటు ఉద్యోగి. తల్లి సుకాంతి గృహిణి. ఇల్లు గడవడమే కష్టమైన పరిస్థితిలో గురుకులం ద్వారా ప్రభుత్వం నాకు మంచి విద్యావకాశాలు కల్పించింది.

- **రోడా ఇవాంజిలి,** మధురవాడ గురుకులం, విశాఖ జిల్లా.

విద్యాలయాల్లో మెరుగైన సదుపాయాలు



మా వంటి పేద వర్గాల పిల్లలు చదివే విద్యాలయాలను సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో బాగా తీర్చిదిద్దారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి మా గ్రామం. మా నాన్న దార కేశయ్య పదవ తరగతి చదివి వ్యవసాయ పనులతో నెలకు రూ.10 వేలు సంపాదిస్తాడు. ఐదవ తరగతి చదివిన అమ్మ ఆదిలక్ష్మమ్మ గృహిణి. పేదరికం కారణంగా ప్రకాశం జిల్లా మార్కాపురం గురుకులంలో 5 వ తరగతిలో చేరిన నేను ప్రస్తుతం సీనియర్ ఇంటర్ చదువుతున్నా.

- **డి.నవీన,** మార్కాపురం గురుకులం

ఆనందంగా ఉంది



ప్రభుత్వ గురుకులంలో చదివే నేను అమెరికా చదువులకు ఎంపిక కావడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారు, ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహాన్ని ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. విజయవాడ గుణదల ప్రాంతం మాది. మా నాన్న చొక్కా సురేష్ అటెండర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మా అమ్మ వనజ గృహిణి.

- **సీహెచ్ ఆకాంక్ష,** ఈడుపుగల్లు ఐఐటీ-ఎన్ఐటీ అకాడమి, కృష్ణా జిల్లా



Class: Sr Inter -MPC
School: Dr. B.R Ambedkar Gurukulam, IIT-NEET Academy, Eedupugallu, Krishna
Year of Joining Gurukulam: 2022-23 (Earlier studied in a private school)
Category: SC
Contact no: [illegible]
Sibling: 1 younger brother
Address: H.no 46-4-21/B, Bethlehem nagar, Gunadala, Vijayawada, District: NTR
Parents Background:

	Name	Education	Occupation	Income
Father	Chokka Suresh.	Class 10	Attender in APTPC	Rs. 15000 per month
Mother	Chokka Vanaja	Class 7	Housewife	-



పేద పిల్లల చదువులకు సీఎం శ్రద్ధ చూపిస్తున్నారు



పేద పిల్లల ఉన్నత చదువుల కోసం సీఎం వైఎస్ జగన్ శ్రద్ధ చూపిస్తున్నారు. పేదవర్గానికి చెందిన నేను అమెరికా చదువులకు ఎంపిక అయ్యానంటే మా చదువులకు సీఎం సార్ అందించిన ప్రోత్సాహమే కారణం. చాలా సరదాగా మాతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న సీఎం గారు మాకు రూ.లక్ష సాయం, ట్యాబ్‌లు అందించారు. సత్యసాయి జిల్లా, ధర్మవరం మండలం, మల్లెనిపల్లి మా గ్రామం. మా నాన్న నరసింహులు ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి నాగమణి గృహిణి.

-**హాసిని బలిగా,** ఈడుపుగల్లు ఐఐటీ-నీట్ అకాడమి, ఎస్సీ గురుకుల

కలలో కూడా ఊహించలేదు



నేను అమెరికా చదువుకు ఎంపిక అవుతానని కలలో కూడా ఊహించలేదు. ప్రభుత్వం, ఉపాధ్యాయులు అందించిన సహకారం వల్లే ఈ అవకాశం దక్కింది. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం జి.కొత్తూరు మా ఊరు. మా నాన్న ఎస్.కృష్ణ మృతి చెందడంతో అమ్మ రాము రోజువారీ కూలీగా నెలకు ఆరు వేలు సంపాదిస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. 2017లో గురుకులంలో 6వ తరగతిలో చేరి ప్రస్తుతం సీనియర్ ఇంటర్ చదువుతున్నాను.

- **ఎస్. జ్ఞానేశ్వరరావు,** శ్రీకృష్ణాపురం గురుకులం, విశాఖ జిల్లా.

తొమ్మిది దశల వడపోత

ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో అంతర్జాతీయ అవగాహనలో భాగంగా యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) గత కొన్నేళ్లుగా కెన్నడీ లుగర్-యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ (కేఎల్ - వైఈఎస్) ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో ప్రతి యేటా ఎంపికైన విద్యార్థులు పది నెలల పాటు అమెరికాలో ఉంటారు. దీనికి ఎంపిక కావాలంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లోని విద్యాసంస్థలకు చెందిన విద్యార్థుల నుంచి గట్టి పోటీ ఉంటుంది. మొదట బయోడేటా నుంచి చివరి ఇంటర్వ్యూల వరకు తొమ్మిది దశల్లో కఠినతరమైన వడపోత కొనసాగుతుంది. దాదాపు తొమ్మిది నెలలపాటు కొనసాగే అన్ని అర్హత పరీక్షల ప్రక్రియను విజయవంతంగా దాటుకుని రాష్ట్రానికి చెందిన ఎస్సీ గురుకుల విద్యార్థులు డి.నవీన, ఎస్. జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిలి, బి.హాసిని, సీహెచ్. ఆకాంక్షలు అవకాశాన్ని దక్కించుకున్నారు. వారంతా ఇటీవలే అమెరికాకు పయనమై వెళ్లారు. వారిని అక్కడ ఎంపిక చేసిన పాఠశాలలోచేర్పిస్తారు. ఆ విద్యార్థులు పరీక్షలు, క్రీడలతోపాటు మొత్తం పాఠశాల ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ఆ విద్యార్థులకు అమెరికాలో ఎంపిక చేసిన కుటుంబాలు ఆతిథ్యం ఇస్తాయి. విద్యార్థులు ఒక్కొక్కరికీ దాదాపు 200 డాలర్లు (సుమారు రూ. 16,500) నెలవారీ ఆర్థిక తోడ్పాటు (స్టైపెండ్)ను అందిస్తారు.

సీఎంకు కృతజ్ఞతలు

2023-24 విద్యా సంవత్సరానికి 'కెన్నడీ లుగర్-యూత్ ఎక్స్ఛేంజ్ అండ్ స్టడీ' కోసం ఆఫ్రికా, పశ్చిమాసియా, దక్షిణాసియాలోని 38 దేశాల విద్యార్థులను ఎంపిక చేశారు. వారిలో మన దేశానికి చెందిన 30 మంది ఎంపిక కాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉండటం గర్వకారణం. వీరికి కావలసిన నిత్యావసరాలు, దుస్తులు, బ్యాగులు, మొబైల్‌ఫోన్‌ల కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ ఆర్థికసాయం అందిస్తోంది. కేఎల్-వైఈఎస్ ప్రోగ్రామ్‌లో అమెరికా చదువులకు వెళ్తున్న ఐదుగురు విద్యార్థులు డి. నవీన, ఎస్.జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిలి, బి.హాసిని, సీహెచ్ ఆకాంక్ష సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ఆగస్టు 31న కలిశారు. వారితోపాటు గతేడాది అమెరికా వెళ్లి కోర్సు పూర్తిచేసుకుని వచ్చిన విద్యార్థులు కె.అక్ష, సి.తేజ కూడా సీఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కుటుంబ నేపథ్యం తదితర వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. యూఎస్ఏ లో చదువులు పూర్తై వచ్చిన తర్వాత కూడా వారి చదువులు కొనసాగించేలా నిరంతరాయంగా వారిని పర్యవేక్షించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వారికి ట్యాబ్‌లను అందజేశారు.

- **యిర్రింకి ఉమమహేశ్వరరావు,** సాక్షి ప్రతినిధి, అమరావతి

న్యూస్‌మేకర్

పెళ్లిచూపులు ఎంత సబబు?

ఇంటికొచ్చిన అపరిచిత పురుషులు, స్త్రీలు. వారితో పాటు పెళ్లికొడుకు. వారి ముందుకు టీ కప్పుల ట్రేతో పెళ్లికూతురు రావాలి. తర్వాత ప్రశ్నలు ఉంటాయి. 'ఇంటికెళ్లి ఏ సంగతీ చెప్తాం' అని వాళ్లు వెళ్లిపోతారు. సంబంధం ఖాయమా కదా అనే టెన్షన్. చెడితే మళ్లీ మొత్తం సీన్ రిపీట్ చేయాలి. ఆడపిల్లలను ప్రదర్శనకు పెట్టి బాధ పెట్టే ఈ పెళ్లిచూపుల తంతును మార్చలేమా అని ప్రశ్నిస్తూ తీసిన మరాఠీ సినిమా 'స్థల్' టొరెంటో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైంది. సెప్టెంబర్ 7-18 తేదీల్లో 'స్థల్' అక్కడ ప్రదర్శితం కానుంది.



● 'స్థల్' చిత్రంలో ఓ సన్నివేశం



● 'స్థల్' కథానాయిక నందిని చిట్కె

1970లలో 80 లలో సినిమాల్లో పెళ్లిచూపులు ఎలా ఉండేవో ఇప్పటికీ అలాగే ఉన్నాయి. నగరాల్లో అయితే ఒకలాగా... పల్లెల్లో అయితే ఒకలాగా.. కొద్ది మార్పులతో. అప్పుడైనా ఇప్పుడైనా 'ఎంచేవాడు' అబ్బాయే అవుతున్నాడు. 'అబ్బాయి వాళ్లు ఓకే అంటే చాలు' అనుకునే ఆడపిల్లల తల్లిదండ్రులు ఎక్కువమంది ఉన్నారు. అసలు అమ్మాయిని చూడటానికి రావడంలోనే మగపెళ్లివారి పైచేయి ఉంది. ఇన్నేళ్ల గడిచినా అబ్బాయిని చూసుకోవడానికి అమ్మాయి వాళ్లు తరలి రావడం వినడం లేదు. పెళ్లి అంటే అబ్బాయి, అమ్మాయి ఒకరికొకరు నచ్చాలి. కాని అమ్మాయి ఔను/కాదులకు ప్రాధాన్యం లేదు. ఈ పద్ధతి ఇంకా ఎంతకాలం అని ప్రశ్నిస్తోంది మరాఠి సినిమా 'స్థల్'. ఆ మాటకు 'పెళ్లి సంబంధం' అని అర్థం.

పత్తి రైతు ఇంట్లో అమ్మాయి

'స్థల్' సినిమా కథ మహారాష్ట్రలోని విదర్భజిల్లాలో దోంగర్ గావ్ అనే ఊళ్లో జరుగుతుంది. ఈ ప్రాంతమంతా పత్తి రైతులు. వయసొచ్చిన ఆడపిల్లకు తొందరగా పెళ్లి చేయాలని భావిస్తారు. అయితే ఆడపిల్లవాళ్లు అనుకున్నంత మాత్రాన ఆడపిల్లల పెళ్లిళ్లు జరిగిపోవు. దానికి సవాలక్ష కుదరాలి. ముందు పెళ్లిచూపుల తంతు జరగాలి. ఈ సినిమాలో బి.ఏ చదివిన సవిత అనే అమ్మాయి 'పి.జి చదువుతాను మొర్రో' అని మొత్తుకుంటున్నా వినకుండా తల్లిదండ్రులు పెళ్లి సంబంధాలు చూడటం మొదలెడతారు. అక్కడి నుంచి రకరకాల అనుభవాలు ఆమెకు ఎదురవుతుంటాయి. విదర్భ ప్రాంతంలో పెళ్లి చూపులకు వచ్చిన వారికి పెళ్లికూతురు 'పోహా' తీసుకెళ్లి ఇవ్వడం ఆనవాయితీ. దీని 'పోహా కార్యక్రమం' అంటారు. ఆ పోహాతో మొదలెట్టి పెళ్లి చూపుల తంతు అయ్యేంత వరకూ ముళ్ల పీఠంపై కూర్చున్నట్టు పెళ్లి కూతురు ఎదుర్కొనే శల్య పరీక్షలను ప్రశ్నిస్తుంది ఈ సినిమా.

ఎన్నో లోపాలు, వంకలు


పెళ్లిసంబంధాల్లో పెళ్లికూతురిలో వంకలు, లోపాలు వెతకడం కొనసాగుతూనే ఉంది. దీని గురించి జయంత్ సోమల్కర్ మాట్లాడుతూ 'చదువు, ఉద్యోగం, రంగు, ఎత్తు... వీటన్నింటి మీద అబ్బాయి తరపు వాళ్లకు ఒక అభిప్రాయం ఉంటుంది. పెళ్లికూతురిలో ఆ మేరకు లోపం వెతకడానికి చూస్తారు. వంకలు పెడతారు. ప్రతి పెళ్లి చూపుల్లో అవే ప్రశ్నలు. పెళ్లికూతురు జవాబు చెప్పి చెప్పి విసిగిపోవాలి. అసలు అంతమంది వచ్చి కూచుని ఒకమ్మాయిని గుచ్చి గుచ్చి చూస్తూ ప్రశ్నలు సంధిస్తూ ఉంటే ఎంత ఇబ్బందిగా ఉంటుందో ఎప్పుడైనా ఆలోచించామా? నా చిన్నప్పుడు మా అక్కలకు ఇలాగే పెళ్లిచూపులు జరుగుతుంటే చూసేవాణ్ణి. ఇటీవల మా కజిన్‌ను చూడటానికి అబ్బాయి వస్తే అదే తంతు. సినిమా తీయాలనిపించింది' అన్నాడు.

ఊరివాళ్లే నటులు


జయంత్ సోమల్కర్ విదర్భ ప్రాంతం వాడే. తన సొంత ఊళ్లో షూటింగ్ మొత్తం చేశాడు. ఊరి వాళ్లనే నటీనటులుగా ఎంపిక చేసుకున్నాడు. రియలిస్టిక్‌గా అనిపించేందుకే అలా చేశాడు. 'షూటింగ్ మధ్యలో పొలానికి నీళ్లు పెట్టి వస్తానని, బర్రెకు గడ్డి వేసి వస్తానని నటీనటులు వెళ్లిపోకుండా చూడటం నాకు పెద్ద సమస్య అయ్యింది' అంటాడు జయంత్ నవ్వుతూ. ముఖ్యపాత్రను ఊరి అమ్మాయి నందిని చిట్కె అద్భుతంగా చేయడం కూడా యూనిట్‌కు ఆశ్చర్యమే. 'పెళ్లి చూపుల తంతును సహజమైన హాస్యంతో నేను చూపించినా సంబంధాలు వద్దనేకొద్దీ పెళ్లికూతురిలో వచ్చే తిరుగుబాటును, ఆమెలో వచ్చే ఆగ్రహాన్ని చూపించాను. నన్ను తిట్టుకున్నా సరే... పదిమందైనా మారితే అదే పదివేలు' అంటాడు జయంత్.

ప్రతిష్టాత్మక 48వ టొరెంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'డిస్కవరీ సెక్షన్'లో భారతదేశం నుంచి 'స్థల్' ఒక్కటే ఎంపికైంది. ఇక్కడ ప్రదర్శితమయ్యాక ఇండియాలో రిలీజ్ చేయడానికి దర్శకుడు సిద్ధమవుతున్నాడు.

కిచెన్ టిప్స్



మార్కెట్ నుంచి తెచ్చిన పచ్చిమిరపకాయలను శుభ్రంగా కడిగి ఆరబెట్టాలి. తడిలేకుండా ఆరిన మిరపకాయల తొడిమలు తీసేసి టిష్యూపేపర్‌లో వేసి చుట్టి, జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేయాలి. ఇలా పెట్టిన పచ్చి మిరపకాయలు నెలరోజులపాటు పాడవకుండా చక్కగా ఉంటాయి.



ఇంట్లో చేసే నూడుల్స్ రెస్టారెంట్లలోలాగా పొడిపొడిగా రావాలంటే... నీటిలో రెండు టీస్పూన్ల నూనె, కొద్దిగా ఉప్పువేసి నూడుల్స్‌ను మరిగించాలి. నూడుల్స్ చక్కగా ఉడికిన తరువాత వేడి నీటి నుంచి తీసి చల్లటి నీటితో కడగాలి. నీరంతా పోయేలా వంపేసి నూడుల్స్ పైన టీస్పూన్ నూనెను వేసి కలుపుకుంటే నూడుల్స్ పొడిపొడిగా వస్తాయి. వీటికి మసాలా జోడిస్తే ఎంతో రుచిగా ఉంటాయి.



పనీర్‌ను నీటిలో వేసి, పైన కాటన్ వస్త్రాన్ని కప్పి ఉంచి రిఫ్రిజిరేటర్‌లో ఉంచితే రెండు మూడు వారాలపాటు తాజాగా ఉంటుంది. పనీర్ ముక్కలు మునిగే అన్ని నీళ్లు పోయాలి. ఈ నీటిని రెండు మూడు రోజులకొకసారి మార్చుకుంటూ ఉంటే మరిన్ని రోజులపాటు తాజాగా ఉంటుంది.

సైబర్ టాక్

వ్యక్తిగత డేటా సురక్షితమేనా?!

వ్యక్తిగత డేటా సేఫ్‌గా ఉండకపోతే స్కామర్ల చేతిలో నష్టపోవాల్సి ఉంటుంది. డేటా దొంగిలించడం అనే కారణంతో ఇటీవల సైబర్‌మోసాలు పెరుగుతున్నాయి. మన వ్యక్తిగత డేటాను స్కామర్లు ఏ విధంగా దొంగిలిస్తారు, ఈ సమస్య నుంచి మనల్ని మనం కాపాడుకోవాలంటే ఏం చేయాలి..

డేటా ఎప్పుడూ సురక్షితంగా ఉండేలా చూసుకోవడానికి సాంకేతిక, సంస్థాగత, చట్టపరమైన రక్షణ తీసుకోవాల్సి ఉంటుంది.

వ్యక్తిగత డిజిటల్ హక్కులలో...

యాక్సెస్ పొందే హక్కు, నిర్ధారించే హక్కు, సరిచేసే హక్కు, పోర్టబిలిటీ హక్కు, మర్చిపోవడం, ఆమోదం తెలిపే హక్కు ఉంటాయి.

వ్యక్తిగత డేటా సమాచారం వారి ప్రయోజనాల కోసం ఉపయోగపడాలి. వ్యక్తులు, వ్యాపారులు తమకు సంబంధించిన డేటా రక్షణగా ఉంటే ఆర్థిక, పరువు, చట్టపరమైన బాధ్యత వంటి నష్టాలను తగ్గించడంలో సహాపడుతుంది. డేటా ఉల్లంఘనలు, సైబర్ నేరాల సంఘటనలు పెరుగుతున్నందన చట్ట ప్రకారం అవసరమైన జనరల్‌డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) చర్యలను అమలు చేస్తుంటారు. డేటా దొంగిలించడం జరిగినప్పుడు దానికి సంబంధించిన వ్యక్తులు అధికారులకు తెలియజేయడం తప్పనిసరి. జీడీపీఆర్ ప్రకారం డేటా ఉల్లంఘన జరిగితే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

మీ డేటాను వివిధ కంపెనీలు ఎలా తీసుకుంటాయంటే...

ఆన్‌లైన్ షాపింగ్: పేరు, జెండర్, ఇమెయిల్, చిరునామా, డెలివరీ, ఫోన్ నెంబర్, క్రెడిట్‌కార్డ్ వివరాలు, ప్రొడక్ట్ హిస్టరీ, తరుచూ కొనుగోలు చేసే వస్తువులు, షాపింగ్ విలువ, ఎక్కువ శాతంలో బ్రౌజ్ చేస్తున్న ప్రొడక్ట్స్, మీ ఐపీ అడ్రస్... ఈ వివరాలన్నీ వ్యక్తిగత డేటా జాబితాలోకి వస్తాయి.

డేటింగ్‌యాప్‌లు...
పేరు, జెండర్, వయసు, సెక్యువల్ ఓరియెంటేషన్, ఫోన్ నెంబర్, ప్రైవేట్ చాట్, పొలిటికల్ వ్యూస్, వ్యక్తిగత ఫొటోలు, ఇష్టాలు, స్వైప్స్, డిజిటల్ డివైజ్ సమాచారం, ఐపీ అడ్రస్.. ఈ యాప్ ద్వారా బహిర్గతం అవుతాయి.

సెర్చ్ ఇంజిన్లు..
ఆన్‌లైన్ సెర్చింగ్, బ్రౌజింగ్ హిస్టరీ, ఆన్‌లైన్ ఆసక్తులు, షాపింగ్ అలవాట్లు, ఐపీ చిరునామా, ప్లేస్, పాస్‌వర్డ్‌లు, క్రెడిట్ కార్డులు, పరికర సమాచారం, డౌన్‌లోడ్ చేసిన ఫైల్స్, ఉపయోగించే బ్రౌజర్ యాడ్-ఆన్‌లు.. ద్వారా జరుగుతుంటుంది.

సోషల్ మీడియా..
పోస్టులు, ఫొటోలు, వీడియోలు, మెసేజ్‌లు, ఫైల్స్, ఫోన్ పరిచయాలు, పేరు, జెండర్, ఇమెయిల్, ప్లేస్, ఫోన్ నెంబర్, పుట్టిన తేదీ, ఫ్రెండ్స్ గ్రూప్, గ్రూప్ చాట్స్, పోస్టులు, ట్యాగ్ చేసిన ఫొటోలు అండ్ వీడియోలు.. సోషల్ మీడియా ద్వారా జరుగుతుంటాయి.


గుర్తించదగిన సమాచారం..
మీ పుట్టిన రోజు లేదా ఫోన్ నెంబర్ వంటివి పబ్లిక్ రికార్డ్‌లో ఉండవచ్చు. ఒకసారి మీ వివరాలు బయటకు వచ్చాక దాడి చేసేవారు ఉండవచ్చు. సోషల్ ఇంజనీరింగ్ మోసాలకు వ్యక్తిగత డేటా సులభంగా ఉపయోగించుకోవచ్చు.

సురక్షిత చర్యలు..
చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌పై ఆధారపడి డేటా రక్షణ సూత్రాలు కొద్దిగా మారుతూ ఉంటాయి. అవి సాధారణంగా కింది అంశాలను కలిగి ఉంటాయి... ● చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, పారదర్శకంగా వ్యక్తులకు ప్రయోజనం కలిగేలా ప్రాసెస్ చేయాలి ● వ్యక్తిగత డేటా విషయంలో కచ్చితత్వం పాటించాలి. అదే విధంగా ఇతరులు యాక్సెస్ చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి ● అనధికార లేదా చట్టవిరుద్ధమైన ప్రాసెసింగ్ ద్వారా నష్టం కలిగితే నియంత్రణ అధికారులకు తెలపాలి.

భారతదేశంలో డేటా రక్షణ కోసం చట్టం..
మన దగ్గర ఉన్న ఏకైక డేటా రక్షణ చట్టం.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000 (ఐటీ చట్టం). దీని ప్రకారం డేటా చౌర్యం జరిగితే రక్షణ కోసం ఉపయోగించే కొన్ని సెక్షన్లు ఎ)సెక్షన్ 69 బి) సెక్షన్ 69ఎ సి) సెక్షన్ 69 బి.. ఉన్నాయి. అయితే, ముందస్తుగా డేటా గోప్యతను రక్షించడానికి చట్టం లేదు.

తమ డేటాను రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు..
● బలమైన పాస్‌వర్డ్‌లను ఉపయోగించాలి. ఆల్ఫాన్యూమరిక్ వర్డ్స్ ఉపయోగించాలి. ప్రత్యేక అక్షరాలను చేర్చాలి ● రెండు కారకాల ప్రమాణీకరణను ప్రారంభించాలి ● ఓటీపీ లేదా అథెంటికేటర్ యాప్ ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి ● పేరొందిన సెక్యూరిటీ, యాంటీవైరస్, యాంటీ మాల్వేర్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలి. ఫిషింగ్ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి ● చిన్న లింక్‌లపై ఎప్పుడూ క్లిక్ చేయరాదు. డేటా కేర్ సాఫ్ట్‌వేర్/యాప్స్‌ని చట్టబద్ధమైన మూలాల నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి ● మీ బ్రౌజర్‌ని అప్‌డేట్ మోడ్‌లో ఉంచాలి. https://తో ప్రారంభమయ్యే సురక్షిత వెబ్‌సైట్‌లను మాత్రమే యాక్సెస్ చేయాలి ● https://mxtoolbox.com/EmailHeaders.aspx ఉపయోగించి ఇమెయిల్ పూర్తి హెడర్‌ను చెక్ చేయాలి ● మీ యాప్‌లు మీ డేటాను ఎలా యాక్సెస్ చేస్తున్నాయో చెక్ చేయాలి. అందుకు.. https://reports.exodus-privacy.eu.org/en/, https://smsheader.trai.gov.in/ని ఉపయోగించి ఎసెమ్మెస్ సరైనదేనా అని ధృవీకరించుకోవచ్చు.

మీ డేటా చౌర్యం జరిగిందీ లేనిదీ తెలుసుకోవడానికి చెక్ చేయాలంటే..
మీ ఇమెయిల్ లేదా ఫోన్ నెంబర్ డేటా ఉల్లంఘనలో భాగమైందో లేదో తనిఖీ చేయడానికి మీరు ఈ వెబ్‌సైట్‌ల్‌లో సెర్చ్ చేయచ్చు.
(a) https://amibeingpwned.com
(b) https://snusbase.com
(c) https://leakcheck.net
(d) https://leaked.site
(e) https://leakcorp.com/login
(f) https://haveibeensold.app.





ఇన్‌పుట్స్: **అనీల్ రాచమల్ల,** డిజిటల్ వెల్‌బియింగ్ ఎక్స్‌పర్ట్, ఎండ్ నౌ ఫౌండేషన్



తొమ్మిదో స్థానంలో అర్జున్

టాటా స్టీల్ ఇండియా చెస్ ఓపెన్ ర్యాపిడ్ టోర్నీలో ఆరు రౌండ్లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 2.5 పాయింట్లతో 9వ స్థానంలో ఉన్నాడు. కోల్‌కతాలో 10 మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరుగుతున్న ఈ టోర్నీలో బుధవారం 3 రౌండ్లు జరిగాయి. నాలుగో గేమ్‌లో గ్రిప్‌చుక్ (రష్యా) చేతిలో 55 ఎత్తుల్లో ఓడిన అర్జున్... ఐదో గేమ్‌లో 67 ఎత్తుల్లో విదిత్ (భారత్)పై గెలిచాడు. గుకేశ్ (భారత్)తో జరిగిన ఆరో గేమ్‌ను అర్జున్ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. విదిత్, ప్రజ్ఞానంద, గుకేశ్ 3 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నారు.

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శుబ్‌మన్ గిల్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ శుబ్‌మన్ గిల్ 750 రేటింగ్ పాయింట్లతో కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆసియా కప్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో గిల్ అజేయ అర్ధ సెంచరీ చేశాడు. ఇషాన్ కిషన్ 12 స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ 24వ ర్యాంక్‌ను అందుకున్నాడు. పాకిస్తాన్ కెప్టెన్ బాబర్ ఆజమ్ 882 రేటింగ్ పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



భారత జట్టుకు కాంస్యం



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు మరోసారి కాంస్య పతకంతో సంతృప్తి పడింది. బుధవారం జరిగిన సెమీఫైనల్లో భారత్ 0–3తో చైనీస్ తైపీ చేతిలో ఓడిపోయింది. ఆచంట శరత్ కమల్, సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్ తమ ప్రత్యర్థుల చేతుల్లో ఓడిపోయారు. 2021 ఆసియా చాంపియన్‌షిప్‌లోనూ భారత జట్టు సెమీఫైనల్లో ఓడిపోయి కాంస్య పతకం దక్కించుకుంది.

లంక మాజీ క్రికెటర్ సేనానాయకే అరెస్ట్



కొలంబో: మ్యాచ్ ఫిక్సింగ్ ఆరోపణలపై శ్రీలంక మాజీ క్రికెటర్ సచిత్ర సేనానాయకేను క్రీడా అవినీతి దర్యాప్తు సంస్థ అరెస్ట్ చేసింది. 2020లో జరిగిన లంక ప్రీమియర్ లీగ్‌లో ఆటగాళ్లను సంప్రదించి మ్యాచ్‌లను ఫిక్స్ చేసేందుకు ప్రయత్నించాడనేది అతనిపై ప్రధాన ఆరోపణ. ఇదే ఆరోపణలపై అతడు దేశం విడిచి వెళ్లరాదంటూ మూడు వారాల క్రితమే కోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 15 వరకు సేనానాయకే పోలీసులలో అదుపులో ఉంటాడు. అతనిపై క్రిమినల్ కేసు కూడా నమోదు కానుంది. 38 ఏళ్ల సేనానాయకే ఆఫ్ స్పిన్నర్‌గా 2012–2016 మధ్య శ్రీలంకకు ఒక టెస్టు, 49 వన్డేలు, 24 టి20ల్లో ప్రాతినిధ్యం వహించి మొత్తం 78 వికెట్లు పడగొట్టాడు. 2014లో టి20 వరల్డ్ కప్ నెగ్గిన లంక జట్టులో అతను సభ్యుడు. 2013 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు తరఫున ఎనిమిది మ్యాచ్‌లు ఆడి తొమ్మిది వికెట్లు తీశాడు.

సాత్విక్–చిరాగ్ జోడీ ఓటమి

చాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్–1000 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ రెండో ర్యాంక్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి 17–21, 21–11, 17–21తో షోహిబుల్ ఫిక్రి–మౌలానా బగస్ (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ జంట 15–21, 16–21తో చెన్ టాంగ్ జియె–తో ఈ వె (మలేసియా) జోడీ చేతిలో పరాజయం పాలైంది.

'రికార్డు'తో సెమీస్‌లోకి జొకోవిచ్

కెరీర్‌లో 47వసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీస్ చేరిన సెర్బియా స్టార్

- క్వార్టర్ ఫైనల్లో ఫ్రిట్జ్‌పై గెలుపు
- అన్‌సీడెడ్ బెన్ షెల్టన్ జోరు



న్యూయార్క్: ఈ ఏడాది వరుసగా నాలుగో గ్రాండ్‌స్లామ్ టోర్నీలోనూ ఫైనల్ చేరడానికి సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ మరో విజయం దూరంలో నిలిచాడు. టెన్నిస్ సీజన్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో రెండో సీడ్ జొకోవిచ్ 13వసారి సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. భారత కాలమానం ప్రకారం మంగళవారం అర్ధరాత్రి దాటాక ముగిసిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 2 గంటల 35 నిమిషాల్లో 6–1, 6–4, 6–4తో తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)పై గెలుపొందాడు. ఫ్రిట్జ్‌తో గతంలో ఆడిన ఏడుసార్లూ గెలుపొందిన జొకోవిచ్ ఎనిమిదోసారి కూడా అదే ఫలితాన్ని పునరావృతం చేశాడు. ఏడు ఏస్‌లు సంధించిన జొకోవిచ్ ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. ఆరుసార్లు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఈ సెర్బియా స్టార్ నెట్ వద్దకు 17 సార్లు దూసుకొచ్చి 13 సార్లు పాయింట్లు గెలిచాడు. 2016 వింబుల్డన్ టోర్నీ మూడో రౌండ్‌లో సామ్ క్వెరీ (అమెరికా) చేతిలో ఓడిన జొకోవిచ్ ఆ తర్వాత అమెరికా ఆటగాళ్లతో 30 సార్లు తలపడినా ఒక్క మ్యాచ్‌లోనూ ఓడిపోలేదు. ఫ్రిట్జ్‌పై విజయంతో జొకోవిచ్ రికార్డు పుస్తకాల్లోకి కూడా ఎక్కాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో అత్యధికసార్లు గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో సెమీఫైనల్ చేరిన ప్లేయర్‌గా జొకోవిచ్ రికార్డు నెలకొల్పాడు. ఓవరాల్‌గా కెరీర్‌లో 47వ సారి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్న జొకోవిచ్ స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (46 సార్లు) పేరిట ఉన్న రికార్డును బద్దలు కొట్టాడు.

2011 తర్వాత సెమీస్‌లోకి బోపన్న

పురుషుల డబుల్స్ విభాగంలో ఆరో సీడ్ రోహన్ బోపన్న (భారత్)–మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ సెమీఫైనల్లోకి అడుగు పెట్టింది. 43 ఏళ్ల బోపన్న 2011 తర్వాత యూఎస్ ఓపెన్ డబుల్స్‌లో సెమీఫైనల్ చేరుకోవడం విశేషం. క్వార్టర్ ఫైనల్లో బోపన్న–ఎబ్డెన్ జంట 7–6 (12/10), 6–1తో లామోన్స్–జాక్సన్ విత్రో (అమెరికా) ద్వయంపై గెలిచింది.

వరుసగా మూడో ఏడాది...

మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ అరీనా సబలెంకా (బెలారస్) ఈ టోర్నీలో వరుసగా మూడో ఏడాది సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా 6–1, 6–4తో కిన్వెన్ జెంగ్ (చైనా)పై గెలిచింది. తొమ్మిదో సీడ్, ఈ ఏడాది వింబుల్డన్ చాంపియన్ మర్కెటా వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్), 17వ సీడ్ మాడిసన్ కీస్ (అమెరికా) మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ విజేతతో సెమీఫైనల్లో సబలెంకా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో పదో సీడ్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్) 6–0, 6–3తో సొరానా క్రిస్టియా (రొమేనియా)పై గెలిచి తొలిసారి యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్‌కు చేరింది.



షెల్టన్

ఐదో అన్‌సీడెడ్ ప్లేయర్‌గా...

మరో క్వార్టర్ ఫైనల్లో 20 ఏళ్ల అన్‌సీడెడ్ అమెరికా ప్లేయర్ బెన్ షెల్టన్ 3 గంటల 7 నిమిషాల్లో 6–2, 3–6, 7–6 (9/7), 6–2తో అమెరికాకే చెందిన పదో సీడ్ ఫ్రాన్సెస్ టియాఫోను ఓడించి కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గత 23 ఏళ్లలో ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరిన ఐదో అన్‌సీడెడ్ ప్లేయర్‌గా షెల్టన్ గుర్తింపు పొందాడు. ఈ జాబితాలో టాడ్ మార్టిన్ (అమెరికా; 2000లో), రాబీ జినెప్రి (అమెరికా; 2005లో), మిఖాయిల్ యూజ్నీ (రష్యా; 2006లో), దిమిత్రోవ్ (బల్గేరియా; 2019లో) ఉన్నారు. సెమీఫైనల్లో జొకోవిచ్‌పై షెల్టన్ గెలిస్తే 1996లో మార్క్ ఫిలిప్పోసిస్ (ఆస్ట్రేలియా) తర్వాత యూఎస్ ఓపెన్‌లో ఫైనల్ చేరిన తొలి అన్‌సీడెడ్ ప్లేయర్‌గా ఘనత సాధిస్తాడు.

పాక్ సులువుగా...

- 'సూపర్–4' మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఘనవిజయం
- నాలుగు వికెట్లతో మెరిసిన రవూఫ్
- ఇమామ్, రిజ్వాన్ అర్ధ సెంచరీలు



ఇమామ్, రిజ్వాన్

లాహోర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన పాకిస్తాన్ జట్టు ఆసియా కప్ టోర్నీ 'సూపర్–4' దశలో శుభారంభం చేసింది. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లో పాకిస్తాన్ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ 38.4 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పాకిస్తాన్ పేస్ బౌలర్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హారిస్ రవూఫ్ (4/19), నసీమ్ షా (3/34) బంగ్లాదేశ్‌ను దెబ్బ కొట్టారు. 47 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన బంగ్లాదేశ్‌ను కెప్టెన్ షకీబుల్ హసన్ (57 బంతుల్లో 53; 7 ఫోర్లు), ముష్ఫికర్ రహీమ్ (87 బంతుల్లో 64; 5 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 100 పరుగులు జోడించారు. అయితే షకీబ్ అవుటయ్యాక బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ మళ్లీ తడబడింది. మూడు పరుగుల తేడాలో బంగ్లాదేశ్ చివరి నాలుగు వికెట్లను కోల్పోయింది. 194 పరుగుల లక్ష్యాన్ని పాకిస్తాన్ 39.3 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఇమామ్ ఉల్ హఖ్ (84 బంతుల్లో 78; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), మొహమ్మద్ రిజ్వాన్ (79 బంతుల్లో 63 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించి పాక్ విజయంలో కీలకపాత్ర పోషించారు. పాక్ ఇన్నింగ్స్ సమయంలో గడాఫీ స్టేడియంలోని ఒక ఫ్లడ్‌లైట్ కాసేపు మొరాయించింది. దాంతో అరగంటపాటు ఆటకు అంతరాయం కలిగింది. 'సూపర్–4'లోని తదుపరి మ్యాచ్‌లన్నీ ఇక శ్రీలంకలోని కొలంబోలో జరుగుతాయి. ఈనెల 9న బంగ్లాదేశ్‌తో శ్రీలంక తలపడుతుంది.

స్కోరు వివరాలు

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: నయీమ్ (సి అండ్ బి) రవూఫ్ 20; మిరాజ్ (సి) ఫఖర్ (బి) నసీమ్ షా 0; లిటన్ దాస్ (సి) రిజ్వాన్ (బి) షాహీన్ 16; షకీబ్ (సి) ఫఖర్ (బి) అష్రఫ్ 53; తౌహిద్ (బి) రవూఫ్ 2; ముష్ఫికర్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 64; షమీమ్ (సి) ఇమామ్ (బి) ఇఫ్తికార్ 16; అఫీఫ్ (సి) అష్రఫ్ (బి) నసీమ్ షా 12; టస్కిన్ అహ్మద్ (సి) రిజ్వాన్ (బి) రవూఫ్ 0; షోరిఫుల్ (బి) నసీమ్ షా 1; హసన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (38.4 ఓవర్లలో ఆలౌట్) 193.** **వికెట్ల పతనం:** 0–1, 2–31, 3–45, 4–47, 5–147, 6–174, 7–190, 8–190, 9–192, 10–193. **బౌలింగ్:** షాహీన్ అఫ్రిది 7–1–42–1, నసీమ్ షా 5.4–0–34–3, రవూఫ్ 6–0–19–4, అష్రఫ్ 7–0–27–1, షాదాబ్ 7–0–35–0, ఆగా సల్మాన్ 1–0–11–0, ఇఫ్తికార్ 5–0–20–1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ జమాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) షోరిఫుల్ 20; ఇమామ్ (బి) మిరాజ్ 78; బాబర్ ఆజమ్ (బి) టస్కిన్ 17; రిజ్వాన్ (నాటౌట్) 63; ఆగా సల్మాన్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (39.3 ఓవర్లలో ఏడు వికెట్లకు) 194.** **వికెట్ల పతనం:** 1–35, 2–74, 3–159. **బౌలింగ్:** టస్కిన్ 8–1–32–1, షోరిఫుల్ 8–1–24–1, హసన్ 7–0–46–0, మిరాజ్ 10–0–51–1, షకీబ్ 5.3–0–31–0, షమీమ్ 1–0–8–0.

మరో 4 లక్షల టికెట్లు!



న్యూఢిల్లీ: వన్డే వరల్డ్ కప్ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకొని టికెట్లు దక్కని అభిమానులకు ఊరట కలిగించే ప్రకటన బీసీసీఐ నుంచి వచ్చింది. అభిమానుల కోసం మరో 4 లక్షల టికెట్లను అమ్మకానికి ఉంచుతున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. ఈ నెల 8న రాత్రి 8 గంటల నుంచి అధికారిక వెబ్‌సైట్ https://tickets.cricketworldcup.comలో టికెట్లు కొనుక్కోవచ్చు. భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అభిమానుల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. టికెట్లు అమ్మకానికి ఉంచిన గంటల్లోనే 'సోల్డ్ అవుట్' అని రావడం, అన్ని వైపుల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో రాష్ట్ర సంఘాలతో చర్చించి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఏ మ్యాచ్ కోసం ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయో, అందులో భారత్ ఆడే మ్యాచ్‌లకు ఎంత శాతం టికెట్లు కేటాయించారనేదానిపై మాత్రం ఎలాంటి స్పష్టత లేదు.

సినిమా

రీల్స్

స్కంద రెడీ



రామ్, శ్రీలీల

వారాంతపు సెలవులను, గాంధీ జయంతి సెలవుని క్యాష్ చేసుకోవడానికి 'స్కంద' రెడీ అయ్యాడు. రామ్ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్కంద'. శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 28న విడుదల కానుంది. రిలీజ్ డేట్‌ని బుధవారం అధికారికంగా ప్రకటించింది చిత్ర యూనిట్. ''మా 'స్కంద' గురువారం విడుదల కానుంది. వారాంతపు సెలవులు, ఆ తర్వాత సోమవారం గాంధీ జయంతి సెలవు, ఆ తర్వాత వచ్చే దసరా సెలవులు ఇవన్నీ మా సినిమాకు కలిసి వస్తాయి. అందుకే 28 పర్ఫెక్ట్ రిలీజ్ అనుకుని ఆ డేట్‌ని లాక్ చేశాం. రామ్ కెరీర్‌లోనే అత్యధిక బడ్జెట్‌తో రూపొందించిన చిత్రం ఇది. ఇప్పటికే విడుదలైన పాటలు, టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చింది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో సినిమాని రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: తమన్, కెమెరా: సంతోష్ డిటాకే, సమర్పణ: జీ స్టూడియోస్ సౌత్, పవన్ కుమార్.

మా అమ్మానాన్న కూడా అడగలేదు!



తమన్నా

'మీ పెళ్లెప్పుడు' అనే ప్రశ్న లైఫ్‌లో ఒక దశలో దాదాపు అందరికీ ఎదురవుతుంటుంది. సెలబ్రిటీలను అయితే ప్రతి ఇంటర్వ్యూలో, బయటికి వెళ్లినప్పుడు.. ఇలా తరచూ ఈ ప్రశ్న వెంటాడుతుంటుంది. ఇటీవల తమన్నాని ఓ అభిమాని, ''పెళ్లెప్పుడు చేసుకుంటారు? తమిళ అబ్బాయిలెవరైనా నచ్చారా?'' అని అడిగితే.. ''ఇప్పటివరకూ మా అమ్మానాన్న కూడా అడగలేదు'' అంటూ ఈ బ్యూటీ కాస్త అసహనంగా సమాధానం ఇచ్చారు. ఇక తమిళ అబ్బాయిలు ఎవరైనా నచ్చారా? అనే ప్రశ్నని ఉద్దేశించి ''ప్రస్తుతం చాలా ఆనందంగా ఉన్నాను. నా జీవితం చాలా ఆనందంగా సాగుతోంది'' అని పేర్కొన్నారామె. నెగటివిటీని ఎలా హ్యాండిల్ చేస్తారు? అనే ప్రశ్నకు – ''విమర్శలు, ప్రశంసలు.. రెండూ వస్తుంటాయి. విమర్శలు వచ్చినప్పుడు ఎందుకు అలా అన్నారా? అని ఆలోచిస్తాను. అయితే విమర్శ, ప్రశంస.. ఏదైనా వారి వ్యక్తిగత అభిప్రాయమే. అందుకని పెద్దగా పట్టించుకోను'' అన్నారు తమన్నా.

టీజర్ వైవిధ్యంగా ఉంది

- ఏఎం రత్నం



బిష్ణు అధికారి, ఏఎం రత్నం

''హిట్ మ్యాన్' సినిమా టీజర్ చాలా వైవిధ్యంగా ఉంది. యాక్షన్ సీక్వెన్సులు ఆకట్టుకుంటున్నాయి. బిష్ణు చేస్తోన్న ఈ తొలి ప్రయత్నం పెద్ద సక్సెస్ కావాలి'' అని నిర్మాత ఏఎం రత్నం అన్నారు. బిష్ణు అధికారి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ మ్యాన్'. అదితీ శర్మ, ఆంచల్ శర్మ హీరోయిన్లు. 99 సినిమాస్‌పై దీపక్ అధికారి నిర్మించిన ఈ సినిమా నవంబర్‌లో రిలీజ్ కానుంది. ఈ సినిమా టీజర్‌ను ఏఎం రత్నం విడుదల చేశారు. ఈ సందర్భంగా బిష్ణు అధికారి మాట్లాడుతూ– ''హిట్ మ్యాన్' ఒక స్పై థ్రిల్లర్. న్యూ ఏజ్ మూవీ. ఈ సినిమాను మూడు భాగాలుగా చిత్రీకరిస్తున్నాం. తొలి భాగాన్ని నవంబర్‌లో తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ''ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి'' అన్నారు డైరెక్టర్ సముద్ర. ''మా 'హిట్ మ్యాన్' సినిమాకు సహకారం అందిస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు చిత్ర సహ నిర్మాత సిప్రా మిశ్రా, సంగీత దర్శకుడు 'మంత్ర' ఆనంద్. ఈ చిత్రానికి లైన్ ప్రొడ్యూసర్: రోహిత్ ఇంగ్లే, అసోసియేట్ ప్రొడ్యూసర్: సన్నీ లల్వానీ, కెమెరా: వైఆర్ శేఖర్.

కథ బోల్డ్‌గా ఉంటుంది కానీ..

- పి. మహేశ్‌బాబు



''జీవితంలో పెళ్లి చేసుకోకూడదు అనే ఆలోచన ఉన్న ఒక అమ్మాయి పెళ్లి కాకుండా తల్లి అవడంలో సంతోషాన్ని కోరుకుంటుంది. అందుకోసం ఒక అబ్బాయి సహాయం తీసుకుంటుంది. ఇలా మొదలైన వీరి జర్నీ ఎక్కడ ముగిసింది? వారికి ఎదురైన పరిణామాలు ఏంటి?'' అనేది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' చిత్రకథ'' అని డైరెక్టర్ పి. మహేశ్‌బాబు అన్నారు. నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు పి. మహేశ్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ– ''నాకు దర్శకత్వంపై ఆసక్తి ఉండటంతో ఇంజినీరింగ్ టైమ్‌లోనే కథలు రాసేవాణ్ణి. దర్శకుల్లో మణిరత్నం, కృష్ణవంశీ, రామ్‌గోపాల్ వర్మగార్లంటే ఇష్టం. రాంబాబుగారి వద్ద 'బావ' చిత్రానికి, కృష్ణవంశీగారి వద్ద 'మొగుడు' సినిమాకి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా నా తొలి చిత్రం 'రారా కృష్ణయ్య'. రెండో చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. నేను ఈ చిత్రకథ చెప్పగానే అనుష్కగారికి నచ్చేసింది. ఆ తర్వాత నవీన్‌గారికి కథ చెప్పాను. వంశీ, ప్రమోద్‌గార్లకు కూడా కథ, నా విజన్ నచ్చడంతో రాజీ పడకుండా ఈ మూవీ తీశారు. ఈ సినిమాలో బోల్డ్ కంటెంట్ ఉంటుంది కానీ అడల్ట్ కంటెంట్ ఉండదు. అనుష్క, నవీన్‌గార్లకు ఒక ఇమేజ్, క్రెడిబులిటీ ఉంది. కథ బాగా లేకుంటే వాళ్లే ఈ సినిమా ఒప్పుకోరు కదా? కొత్త తరహా కథలు చేసేందుకు అలాంటి స్టార్స్ సిద్ధంగా ఉన్నారు కాబట్టే మాలాంటి డైరెక్టర్స్ స్క్రిప్ట్స్ రాయగలుగుతున్నాం. చిరంజీవిగారు మా సినిమా చూసి నన్ను, నవీన్‌ను ఇంటికి పిలిచి అభినందించారు. పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో టెన్షన్‌గా ఉన్న మాకు ఆయన ప్రశంసతో పెద్ద సక్సెస్ కొట్టిన అనుభూతి కలిగింది. మన నేటివిటీకి దగ్గరగా ఉన్న కథ ఇది.. అందుకే హిందీలో రిలీజ్ చేయడం లేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తున్నాం'' అన్నారు.

అలా నిన్ను చేరి..



క్రిష్, దినేష్ తేజ్

దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ లీడ్ రోల్స్‌లో నూతన దర్శకుడు మారేష్ శివన్ తెరకెక్కించిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది. సుభాష్ ఆనంద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అలా నిన్ను చేరి..' అంటూ సాగే టైటిల్ సాంగ్‌ని డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి విడుదల చేసి, మాట్లాడుతూ– ''ఈ పాట చాలా బాగా వచ్చింది. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టు అద్భుతమైన విజువల్స్‌తో చిత్రీకరించిన ఈ పాటకు మంచి స్పందన వస్తుందనుకుంటున్నాను'' అన్నారు. ''లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందింది. కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమిది. ఈ సినిమాలో అన్ని పాటలను చంద్రబోస్ రాయడం విశేషం. దినేష్ తేజ్, పాయల్‌పై వచ్చే ఈ పాట సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

అక్టోబర్‌లో మామా....



సుధీర్‌బాబు

సుధీర్ బాబు హీరోగా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న తాజా చిత్రం 'మామా మశ్చీంద్ర'. హర్షవర్ధన్ దర్శకత్వంలో సోనాలి నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఇందులో స్థూలకాయుడు దుర్గగా, ఓల్డ్ డాన్ పరశురామ్‌గా, డీజేగా సుధీర్‌బాబు మూడు భిన్నమైన పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని అక్టోబర్ 6న విడుదల చేయనున్నట్లు బుధవారం చిత్ర యూనిట్ ప్రకటించింది. మృణాళినీ రవి, ఈషా రెబ్బా హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: చేతన్ భరద్వాజ్, కెమెరా: పీజీ విందా.

అక్టోబర్‌లో ఎవరు?



జేడీ చక్రవర్తి

జేడీ చక్రవర్తి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'హూ'. శుభ రక్ష, నిత్య హీరోయిన్లుగా నటించారు. రెడ్డమ్మ కె. బాలాజీ నిర్మించారు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ భాషల్లో అక్టోబర్ మొదటి వారంలో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. రెడ్డమ్మ కె. బాలాజీ మాట్లాడుతూ– ''ఎమోషనల్ థ్రిల్లర్ మూవీ 'హూ'. ఇందులో యాక్షన్ సన్నివేశాలు ఒళ్లు గగుర్పొడిచేలా ఉంటాయి. క్లాస్, మాస్ ప్రేక్షకులను అలరించేలా కథ విషయంలో జాగ్రత్తలు తీసుకున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఈశ్వర్ చంద్, కెమెరా: ఎంబీ అల్లికట్టి.

వాస్తవ ఘటనతో...



పోసాని కృష్ణమురళి

సాయి పవన్, ప్రియాంక జంటగా సత్య సలాది దర్శకత్వం వహించిన చిత్రం 'వారెవ్వా జతగాళ్లు'. పోసాని కృష్ణమురళి, గుండు మురళి, భాస్కర్, రాబర్ట్ లూయిస్, మమత కీలక పాత్రల్లో నటించారు. బండారు నాగబాబు (రాజు), దొడ్డి వీర ప్రభాకర్, గరగ వీరబాబు నిర్మించిన ఈ సినిమాని ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. సత్య సలాది మాట్లాడుతూ– ''తమిళనాడులో జరిగిన ఒక వాస్తవ ఘటన స్ఫూర్తితో ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేసి ఈ కథ తయారు చేశాను. ఆటలు, పాటలు, విద్య వంటి ప్రాథమిక హక్కులు సైతం నిషేధించిన ఒక గ్రామంలో నలుగురు కుర్రాళ్లు చేసిన పోరాటమే ఈ చిత్రకథ'' అన్నారు. ''ఈ నెల 22న తెలుగులో, ఆ తర్వాత ఇతర భాషల్లో రిలీజ్ చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

మాస్ మహారాజు



సందీప్, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్, సందీప్ మాధవ్ హీరోలుగా సీహెచ్ సుధీర్ రాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మాస్ మహారాజు'. సిమ్రత్ కౌర్, సట్న టీటస్, సంపద హీరోయిన్లు. స్వాతి రాజు నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటోంది. ''1980 నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రమిది. యాక్షన్, ఫ్యామిలీ ఎలిమెంట్స్ ఉంటాయి. ప్రస్తుతం చివరి షెడ్యూల్ జరుపుకుంటున్న ఈ సినిమా విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మణిశర్మ.

పక్కా మాస్



ఉపేంద్ర, సావిత్రి

కంచర్ల ఉపేంద్ర హీరోగా, సావిత్రి కృష్ణ హీరోయిన్‌గా, ఆర్యన్ సుభాన్ ఎస్.కె. దర్శకత్వంలో కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న చిత్రం 'ఉపేంద్రగాడి అడ్డా'. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ– ''ప్రస్తుతం హీరో హీరోయిన్ల మీద సీన్స్ చిత్రీకరిస్తున్నాం. సింగిల్ షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేయాలనుకుంటున్నాం. ఈ చిత్రంలో 4 పాటలు ఉన్నాయి'' అన్నారు. ''ఇందులో హీరో పక్కా మాస్ అయితే హీరోయిన్ డబ్బున్న క్లాస్ అమ్మాయి'' అన్నారు ఆర్యన్ సుభాన్.

సాక్షి బిజినెస్
గురువారం
7-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲ 100	నిఫ్టీ ▲ 36
65,881	19,611

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి పది గంటలకు మార్కెట్ ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,834	▼ 183
డోజోన్స్	34,349	▼ 23
ఎఫ్‌టీఎస్ఈ 100	7,426	▼ 12
డాక్స్	15,741	▼ 30
షాంఘై	3,154	▲ 4
నికాయ్	33,241	▲ 204

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,329	▼ 27
బంగారం (99.5 స్వచ్ఛత)	59,091	▼ 27
వెండి (కిలో)	72,065	▼ 166

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.27	83.94
£	బ్రిటన్ పౌండ్	102.78	106.21
€	యూరో	87.65	90.76
¥	జపాన్ ఎన్ (100)	55.48	57.21
AUS	ఆస్ట్రేలియా డాలర్	51.91	54.90
S$	సింగపూర్ డాలర్	60.07	62.01
SAR	సౌదీ రియాల్	21.21	22.84
UAE D	యూఏఈ దిర్హామ్	21.74	23.53
¥	చైనా యువాన్	10.26	12.34

పెట్రోల్, డీజిల్ ధరలకు రెక్కలు!

2023లో మొదటిసారి 90 డాలర్ల పైకి క్రూడ్



న్యూఢిల్లీ: సౌదీ అరేబియా, రష్యా తమ ఉత్పత్తి–ఎగుమతి కోతల విధానాన్ని ఏడాది చివరి వరకు పొడిగించడంతో అంతర్జాతీయంగా చమురు ధరలు బ్యారెల్‌కు దాదాపు 90 డాలర్ల పైకి చేరాయి. ఇది 10 నెలల గరిష్ట స్థాయి. దీనితో దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోగా, మరింత పెరిగే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. చమురు అవసరాల కోసం 85 శాతం కంటే ఎక్కువ దిగుమతులపై భారత్ ఆధారపడుతున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయంగా క్రూడ్ ధర పెరిగితే, దేశంపై దిగుమతుల భారం మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గకపోగా, పెరిగే అవకాశాలే ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి. రష్యాతో కలిసి కూటమిగా ఉన్న ఒపెక్ (ఓపీఈసీ– పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ)కు నాయకత్వం వహిస్తున్న సౌదీ అరేబియా డిసెంబర్ చివరి వరకు ప్రపంచ మార్కెట్‌కు సరఫరాలో రోజుకు ఒక మిలియన్ బ్యారెల్స్ తగ్గింపును కొనసాగించాలని ఇటీవల నిర్ణయించింది. అటు తర్వాత బ్రెంట్ ధర గత వారంలో 6.5% పెరిగింది. ఇక రష్యా కూడా ఇటీవలి నెలల్లో చమురు ఎగుమతులపై కోతలకు నిర్ణయం తీసుకుంది.

భారత్ బిల్లు బ్యారెల్ సగటు 89.81 డాలర్లు!

తాజా పరిణామాలతో మంగళవారం మొదటిసారి ఈ సంవత్సరంలో బ్రెంట్ బ్యారెల్ ధర మొదటిసారి 90 డాలర్లు దాటింది. బుధవారం కూడా ఈ వార్త రాసే 11 గంటల సమయంలో అదే స్థాయిలో ట్రేడవుతోంది. చమురు మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురు బాస్కెట్ ఆగస్టులో 86.43 డాలర్లు. ఈ నెలలో 89.81 డాలర్లకు పెరుగుతుందని అత్యున్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. మేలో ఈ ధర 73 నుంచి 75 డాలర్ల శ్రేణిలో తిరిగింది. అయితే జూలైలో 80.37 డాలర్లకు తాజాగా 90 డాలర్లకు పెరిగింది. దీనితో దేశీయంగా రేట్లు తగ్గవచ్చన్న అంచనాలకు ముగింపు పడినట్లయ్యింది. నిజానికి గత సంవత్సరం తీవ్ర స్థాయికి ధరలు చేరినప్పుడు ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు తీవ్ర నష్టాలను చవిచూశాయి. ఈ యేడాది మేలో పరిస్థితి కొంత మెరుగుపడుతోందనుకుంటుండగా, ధరలు మళ్లీ దూసుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలో నిజానికి 17 నెలల నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో నిలకడగా కొనసాగుతున్నాయి. రాజధాని న్యూఢిల్లీలో లీటరు పెట్రోల్ ధర రూ.96.72 పలుకుతుండగా, డీజిల్ ధర రూ.89.62 వద్ద కొనసాగుతోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఇంధన రిటైలర్లు అంతర్జాతీయ ఇంధన ధరల బెంచ్‌మార్క్ 15 రోజుల రోలింగ్ యావరేజ్ ఆధారంగా ప్రతిరోజూ పెట్రోల్, డీజిల్ ధరలను సవరించాలి. అయితే ఆయా సంస్థలు 2022 ఏప్రిల్ 6 నుంచి అలాంటి నిర్ణయం తీసుకోలేదు. అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల తర్వాత రిటైల్ రేట్ల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఉపశమనం కలిగించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పుడు మే 22న చివరిసారిగా ధరలు మారాయి. అంతర్జాతీయ చమురు ధరలు బ్యారెల్ ధర 73–74 డాలర్ల శ్రేణిలో ఉంటే, చమురు కంపెనీలు రోజువారీ ధరల సవరణను మళ్లీ ప్రారంభించేవని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పుడు ఇక తగ్గింపు అవకాశాలే సన్నగిల్లాయన్నది నిపుణుల అంచనా.

అధిక ధరల పరిస్థితుల్లో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) వంటి దేశీయ ఉత్పత్తి సంస్థలు అధిక ఆదాయాలను పొందుతాయి. దీనితో పెరుగుతున్న ఆదాయాల నుంచి ప్రభుత్వం విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ రూపంలో భారీ మొత్తాలను పొందే అవకాశం ఉంది. దేశీయంగా ఉత్పత్తి అయిన ముడి చమురుపై స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్ఏఈడీ) రూపంలో విధించే పన్ను సెప్టెంబర్ 2 నుండి టన్నుకు రూ. 6,700కి తగ్గింది. ఇది గతంలో టన్నుకు రూ.7,100గా ఉంది. రానున్న నెలల్లో

భారీ 'విండ్‌ఫాల్' ఆదాయం!

మళ్లీ పెంపు బాట పట్టవచ్చు. భారత్ 2022 జూలై 1వ తేదీన విండ్‌ఫాల్ ప్రాఫిట్ ట్యాక్స్ విధానాన్ని ప్రవేశపెట్టింది. చమురు ఉత్పత్తిదారులు ప్రతి బ్యారెల్‌కు 75 డాలర్ల కంటే ఎక్కువ ధరను పొందే సందర్భంలో వారు పొందే విండ్‌ఫాల్ లాభాలపై ప్రభుత్వం పన్ను విధింపు దీని లక్ష్యం. తద్వారా అంతర్జాతీయంగా ధరలు పెరుగుదల వల్ల ఇంధన కంపెనీలకు అనూహ్యంగా వచ్చే భారీ లాభాలపై పన్ను విధిస్తున్న పలు దేశాల సరసన చేరింది. అంతర్జాతీయ చమురు ధరలకు అనుగుణంగా ప్రతి పదిహేను రోజులకు ఈ పన్ను మదింపు, నిర్ణయం జరుగుతోంది. అటువంటి లెవీ ప్రస్తుతం ఉన్న అన్ని ఇతర పన్నులకు అదనం. క్రూడ్ ఆయిల్, పెట్రోలియం ప్రొడక్టుల ఎగుమతులపై విధించిన ఈ ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం (ఎస్ఏఈడీ) వల్ల 2022–23 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ఖజానాకు దాదాపు రూ.40,000 కోట్ల ఆదాయం లభించింది. 2023–24లో దాదాపు రూ.15,000 కోట్ల ఆదాయం వస్తుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా ప్రస్తుత అంచనా.

బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థకు రూ. 3,760 కోట్లు



న్యూఢిల్లీ: దేశీయంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ ఏర్పాటు కోసం రూ. 3,760 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) ఇచ్చే ప్రతిపాదనకు కేంద్ర క్యాబినెట్ ఆమోదించింది. 2030–31 వరకు దీన్ని అయిదు విడతల్లో విడుదల చేయనున్నట్లు సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. 4,000 మెగావాట్ అవర్స్ స్థాయిలో శక్తిని నిల్వ చేసే సామర్థ్యాలను సమకూర్చుకునేందుకు ఇది ఉపయోగపడగలదని ఆయన పేర్కొన్నారు. ఈ వీజీఎఫ్‌తో రూ. 9,500 కోట్ల మేర పెట్టుబడులకు అవకాశం లభించగలదని ఠాకూర్ వివరించారు.

రిలయన్స్ రిటైల్‌లో ఖతర్ రూ. 8,278 కోట్ల పెట్టుబడులు

న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ వెంచర్స్‌లో (ఆర్ఆర్‌వీఎల్) ఖతర్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) పెట్టుబడులకు సంబంధించి రూ. 8,278 కోట్లు అందినట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. డీల్ ప్రకారం సుమారు 1 శాతం వాటా కింద 6.86 కోట్ల షేర్లను క్యూఐఏకి కేటాయించినట్లు వివరించింది. రూ. 8.278 లక్షల కోట్ల (100 బిలియన్ డాలర్లు) వ్యాల్యూయేషన్‌తో క్యూఐఏకి చెందిన అనుబంధ సంస్థ ఆర్ఆర్‌వీఎల్‌లో ఇన్వెస్ట్ చేసినట్లు రిలయన్స్ పేర్కొంది. ఆగస్టు 23న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఈ డీల్ గురించి వెల్లడించింది.

సాయి లైఫ్ సైన్సెస్ కొనుగోలుకు తీవ్ర పోటీ

ముంబై: ఫార్మా కంపెనీ సాయి లైఫ్ సైన్సెస్‌ను కొనుగోలు చేసేందుకు అరడజను పైగా సంస్థలు పోటీపడుతున్నాయి. బ్లాక్‌స్టోన్, కార్లైల్, పీఏజీ, సీవీసీ క్యాపిటల్, బేరింగ్ పీఈ ఆసియా ఈక్విటీ, బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్, ఎపాక్స్ పార్ట్‌నర్స్ వీటిలో ఉన్నట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన ఈ సంస్థలో ప్రైవేట్ ఈక్విటీ సంస్థ టీపీజీ క్యాపిటల్‌కు 43.3 శాతం వాటాలు ఉండగా, స్విస్ హెల్త్‌కేర్ ఫండ్ హెచ్‌బీఎంకు తన ఇండియా పీఈ ఫండ్ ద్వారా 6 శాతం వాటాలు ఉన్నాయి. మిగతా వాటాలు ప్రమోటర్లయిన కనుమూరి కుటుంబానికి ఉన్నాయి.

ఏథర్‌కు రూ.900 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఏథర్ ఎనర్జీ తాజాగా రూ.900 కోట్ల నిధులను అందుకుంది. కంపెనీ వాటాదారులు అయిన హీరో మోటోకార్ప్, జీఐసీ నుంచి రైట్స్ ఇష్యూ ద్వారా ఈ మొత్తాన్ని కంపెనీ సేకరించింది. కొత్త ఉత్పత్తుల విడుదలతోపాటు చార్జింగ్ మౌలిక వసతులు, రిటైల్ నెట్‌వర్క్ విస్తరణకు ఈ నిధులను వెచ్చించనున్నట్టు ఏథర్ సీఈవో, కో–ఫౌండర్ తరుణ్ మెహతా వెల్లడించారు.

రిలయన్స్ రిటైల్ చేతికి 'ఎడ మామ'

అలియాభట్ కిడ్స్‌వేర్ బ్రాండ్ కొనుగోలు



న్యూఢిల్లీ: రిలయన్స్ రిటైల్ మరో కొనుగోలుకు తెర తీసింది. బాలీవుడ్ నటి అలియాభట్ ప్రమోట్ చేసిన చిన్నారుల కిడ్స్, మెటర్నిటీ వేర్ బ్రాండ్ 'ఎడ మామ'లో 51 శాతం వాటాను కొనుగోలు చేసేందుకు రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ (రిలయన్స్ రిటైల్ మాతృ సంస్థ) ఒప్పందం చేసుకుంది. అలియాభట్‌కు చెందిన కాన్షియస్ క్లాతింగ్ బ్రాండ్‌తో జాయింట్ వెంచర్ ఒప్పందంపై సంతకాలు చేసింది. ఎడమామ బ్రాండ్‌ను చురుకైన వృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే తమ లక్ష్యమని రిలయన్స్ ప్రకటించింది.

మూడేళ్లలో హోండా ఎలివేట్ ఈవీ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా ఎలివేట్ ప్లాట్‌ఫామ్‌పై ఎలక్ట్రిక్ వెహికిల్‌ను అభివృద్ధి చేస్తోంది. మూడేళ్లలో ఈ మోడల్‌ను మార్కెట్లోకి తేనున్నట్టు సంస్థ నేషనల్ సేల్స్ హెడ్ నిఖిల్ సరీన్ బుధవారం వెల్లడించారు. ఎస్‌యూవీ ఎలివేట్‌ను హైదరాబాద్ విపణిలో ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రాడక్ట్ ప్లానింగ్ హెడ్ గుర్మీత్ సింగ్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్యాసింజర్ కార్ల రంగంలో 40% వాటా చేజిక్కించుకున్న ఎస్‌యూవీ విభాగంపై పెద్ద ఎత్తున ఫోకస్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్, కమ్యూనికేషన్స్ జీఎం సబా ఖాన్ కూడా పాల్గొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	483–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	495–00
విజయవాడ	495–00
రిటైల్ ధర (డజను)	72.00
6-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	455–00
వరంగల్	457–00
రిటైల్ ధర	5.15

సెన్సెక్స్ లాభం 100 పాయింట్లు

- 19,600 పైకి నిఫ్టీ
- నాలుగో రోజూ లాభాలే



ముంబై: ఆఖర్లో వినిమయ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు నాలుగోరోజూ లాభపడ్డాయి. ఉదయం ఫ్లాటుగా ప్రారంభమైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 292 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి 100 పాయింట్లు పెరిగి 65,881 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 36 పాయింట్లు బలపడి 19,611 వద్ద నిలిచింది. వినిమయ షేర్లతో పాటు ఎఫ్ఎంసీజీ, ఫార్మా, ఇంధన షేర్లు లాభపడ్డాయి. కమోడిటీ, ఫైనాన్స్, పరిశ్రమ, ఐటీ, బ్యాంకులు, క్యాపిటల్ గూడ్స్, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్ నాలుగు రోజుల వరుస ర్యాలీతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.317.33 లక్షల కోట్లకు చేరింది. క్రూడాయిల్ ధరలు పది నెలల గరిష్టానికి చేరుకోవడం, చైనా సేవల రంగం 8 నెలల కనిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

గంటలోనే ట్రేడ్ సెటిల్‌మెంట్

- ఆ ఆర్థిక సంవత్సరం చివరికి ఆరంభం
- చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్



ముంబై: తక్షణ ట్రేడ్ సెటిల్‌మెంట్ అమలు దిశగా సెబీ తన చర్యలు మొదలుపెట్టింది. వచ్చే ఏడాది ఆరంభం నాటికి ఒక గంట ట్రేడ్ సెటిల్‌మెంట్ విధానాన్ని తీసుకొస్తామని సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బుచ్ ప్రకటించారు. దీనివల్ల లావాదేవీలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతాయన్నారు. ముంబైలో జరుగుతున్న ఫిన్‌టెక్ ఫెస్టివల్‌లో భాగంగా ఆమె ఈ అంశాన్ని ప్రస్తావించారు.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆధ్వర్యంలో.. Police, SSC, RRB, Bank ఉద్యోగాలకు అత్యంత తక్కువ ధరకే కోచింగ్.. పూర్తి వివరాలు తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీఎస్ఆర్‌టీసీ, నెల్లూరు జోన్‌లో 300 అప్రెంటిస్‌లు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఏపీఎస్ఆర్‌టీసీ).. నెల్లూరు జోన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **నెల్లూరు జోన్ పరిధిలోని జిల్లాలు:** చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, ప్రకాశం.
» **మొత్తం ఖాళీల సంఖ్య:** 300
» **జిల్లాల వారీగా ఖాళీలు:** చిత్తూరు–46, తిరుపతి–102, నెల్లూరు–96, ప్రకాశం–56.
» **ట్రేడులు:** డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫిట్టర్, మెషినిస్ట్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్. » **అర్హత:** సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో వచ్చిన మార్కులు, ఇంటర్వ్యూ, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపల్, ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, కాకుటూరు, నెల్లూరు చిరునామాకు పంపించాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.09.2023
» **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 11.09.2023
» **సర్టిఫికేట్‌లు పరిశీలించే స్థలం:** ఆర్‌టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ, కాకుటూరు, నెల్లూరు.
» **వెబ్‌సైట్:** www.apprenticeshipindia.gov.in

నాబార్డ్, ముంబైలో 150 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

ముంబైలోని నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్).. దేశవ్యాప్తంగా ఉన్న నాబార్డ్ శాఖల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 150
» **విభాగాలు:** జనరల్, కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫైనాన్స్, కంపెనీ సెక్రటరీ, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, జియో ఇన్ఫర్మేటిక్స్,ఫారెస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్, స్టాటిస్టిక్స్,మాస్ కమ్యూనికేషన్/మీడియా స్పెషలిస్ట్.
» **అర్హత:** పోస్టును అనుసరించి 60% మార్కులతో జనరల్ డిగ్రీ, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, బీఎస్సీ బీబీఏ, బీఎంఎస్, పీజీ డిప్లొమా, ఎంబీఏ, ఐసీఏఐ, సీఎఫ్ఏ, ఏసీఎంఏ, ఎఫ్‌సీఎంఏ, ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పే స్కేల్:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్ ఎగ్జామినేషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.09.2023
» **ఫేజ్–1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 16.10.2023.
» **వెబ్‌సైట్:** www.nabard.org

టీచర్ కొలువుకు.. సిద్ధమేనా!

» తెలంగాణలో 6,612 పోస్టుల భర్తీకి ఆమోదం
» మరికొద్ది రోజుల్లో డీఎస్సీ నోటిఫికేషన్
» బీఈడీ, డీఈడీ అర్హతతో పోటీ పడే అవకాశం

టీచర్ రిక్రూట్‌మెంట్... బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు వేయి కళ్లతో ఎదురు చూసే నోటిఫికేషన్! ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్, ఎల్‌పీ.. ఇలా పలు రకాల సర్కారీ టీచర్ పోస్టుల కోసం లక్షల మంది సన్నద్ధమవుతుంటారు. వీరంతా ఇప్పుడు తమ ప్రిపరేషన్‌కు మరింత పదును పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. తెలంగాణ ప్రభుత్వం తాజాగా 6,612 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో టీచర్ రిక్రూట్‌మెంట్ తాజా సమాచారం, అర్హతలు, పరీక్ష విధానంతోపాటు విజయానికి మెలకువలు..



టీఎస్.. డీఎస్సీ..

మొత్తం 6,612 పోస్టులు

రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ ప్రకటించిన వివరాల ప్రకారం–మొత్తం 6,612 టీచర్ పోస్టులకు త్వరలో నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది.ఇందులో సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జీటీ)–2,575 పోస్టులు; స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ)–1,739 పోస్టులు;లాంగ్వేజ్ పండిట్స్(ఎల్‌పీ)–611పోస్టులు;ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ (పీఈటీ)–164 పోస్టులు; స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్–1,523 పోస్టులు ఉన్నాయి.

ఒక్కో పోస్టుకు 61 మంది పోటీ!

మొత్తం 6,612 పోస్టులకు నిర్వహించనున్న టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లో ఒక్కో పోస్టుకు దాదాపు 61 మంది పోటీ పడే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలో టెట్ ఉత్తీర్ణుల సంఖ్య దాదాపు 3.5 లక్షలు. వీరంతా దరఖాస్తు చేసుకోవడం ఖాయం. దీంతో.. ఒక్కో పోస్టుకు 61 మంది పోటీ పడే పరిస్థితి ఉంది.

రాత పరీక్ష గతంలో మాదిరిగానే

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను గతంలో మాదిరిగానే నిర్వహించే అవకాశముంది. 2017లో తొలిసారిగా టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో టీచర్ నియామకాలు చేపట్టారు. అందుకోసం టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సారి టీఎస్‌పీఎస్సీకి బదులుగా పాఠశాల విద్యా శాఖ ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయిలో జరిగే పరీక్ష ఆధారంగా జిల్లాల వారీగా మెరిట్ జాబితా రూపొందించి.. ఆ తర్వాత డిపార్ట్‌మెంటల్ సెలక్షన్ కమిటీ నేతృత్వంలో నియామకాలు ఖరారు చేయనున్నారు.

వెయిటేజీ విధానం

టెట్‌కు వెయిటేజీ ఇచ్చే విధానాన్ని యథాతథంగా అమలు చేసే అవకాశం ఉంది. రాత పరీక్షకు 80 శాతం; టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఇచ్చి.. తుది జాబితా రూపొందిస్తారు. గత రిక్రూట్‌మెంట్ విధానాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ సారి కూడా వెయిటేజీని అమలు చేస్తారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అర్హతలు

- **సెకండరీ గ్రేడ్ టీచర్స్:** ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. (లేదా) నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత (లేదా) ఎన్‌సీటీఈ నిబంధనలు–2002 ప్రకారం–45 శాతం మార్కులతో ఇంటర్ తత్సమాన కోర్సులో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ పాసవ్వాలి. దీంతోపాటు టీఎస్ టెట్ లేదా ఏపీ టెట్ పేపర్–1లో లేదా సీటెట్‌లో అర్హత సాధించాలి.
- **స్కూల్ అసిస్టెంట్స్:** సంబంధిత సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ/పీజీ ఉత్తీర్ణతతోపాటు సంబంధిత సబ్జెక్ట్ మెథడాలజీగా బీఈడీ ఉత్తీర్ణత ఉండాలి(లేదా) యాభై శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్ట్‌తో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఈడీ పాసవ్వాలి. దీంతోపాటు సంబంధిత సబ్జెక్ట్‌తో టెట్ పేపర్–2లో అర్హత సాధించాలి.
- **ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్:** ఫిజికల్ ఎడ్యుకేషన్ ఒక ఎలక్టివ్ సబ్జెక్ట్‌గా 50 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి (లేదా) ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సులో 50 శాతం మార్కులతో పాసవ్వాలి (లేదా) ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత సాధించాలి.
- **ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్(ప్రాథమిక పాఠశాలలు):** తెలంగాణ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి యాభై శాతం మార్కులతో ఇంటర్మీడియెట్‌తోపాటు ఎన్‌సీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా ఉండాలి.
- **లాంగ్వేజ్ పండిట్స్(భాష పండితులు):** సంబంధిత భాష ఒక ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ లేదా సదరు భాష సాహిత్యంలో 50 శాతం మార్కులతో బ్యాచిలర్ (లేదా) పీజీ ఉత్తీర్ణత (లేదా) బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత ఉండాలి. బీఈడీలో సంబంధిత భాషను మెథడాలజీగా చదివి ఉత్తీర్ణత సాధించి ఉండాలి (లేదా) యాభై శాతం మార్కులతో తెలుగు మెథడాలజీలో నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీ ఇంటిగ్రేటెడ్ డిగ్రీ పాసవ్వాలి. దీంతోపాటు టీఎస్ టెట్ లేదా ఏపీ టెట్ పేపర్–2లో అర్హత సాధించాలి (లేదా) మ్యాథమెటిక్స్; సైన్స్ లేదా సోషల్ స్టడీస్ ఒక ఆప్షనల్‌గా సీటెట్‌లో అర్హత పొందాలి.
- పైన పేర్కొన్న పోస్టులకు సంబంధించిన గరిష్ట అర్హత మార్కులు జనరల్ కేటగిరీకి నిర్దేశించినవి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు ఉంటుంది.

80 మార్కులకు రాత పరీక్ష

టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పరీక్షను 80 మార్కులకు నిర్వహించే అవకాశముంది. ఎస్‌జీటీ పోస్టులకు 8 విభాగాల నుంచి ప్రశ్నలు అడిగే వీలుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్, విద్యా దృక్పథాల నుంచి 20 ప్రశ్నలు చొప్పున, లాంగ్వేజ్–1, లాంగ్వేజ్–2, మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్ స్టడీస్ సబ్జెక్ట్‌ల నుంచి ఒక్కో సబ్జెక్ట్‌లో 18 ప్రశ్నలు చొప్పున అడగనున్నారు.

అదే విధంగా టీచింగ్ మెథడాలజీ నుంచి 30 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 8 విభాగాల్లో 160 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారని తెలుస్తోంది.

ఎస్ఏ రాత పరీక్ష

స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు కూడా 160 ప్రశ్నలతో 80 మార్కులకు పరీక్ష జరుగుతుంది. జీకే అండ్ కరెంట్ అఫైర్స్(20 ప్రశ్నలు–10 మార్కులు); విద్యా దృక్పథాలు (20 ప్రశ్నలు–10 మార్కులు); సంబంధిత సబ్జెక్ట్ కంటెంట్ (88 ప్రశ్నలు–44 మార్కులు); టీచింగ్ మెథడాలజీ (32 ప్రశ్నలు–16 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఈ సారి పరీక్షను ఆన్‌లైన్ టెస్ట్‌గా నిర్వహించే వీలుంది.

సన్నద్ధమవ్వండిలా

ఎస్‌జీటీ అభ్యర్థులు

ఎస్‌జీటీ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ప్రధానంగా మూడు అంశాలపై దృష్టి పెట్టాలి. అవి.. విద్యా దృక్పథాలు, కంటెంట్, మెథడాలజీ. విద్యా దృక్పథాలకు సంబంధించి వర్తమాన భారతదేశంలో విద్యా సంబంధ అంశాలు; దేశంలో విద్యా చరిత్ర; ఉపాధ్యాయ సాధికారత, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, విద్యాహక్కు చట్టం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. కంటెంట్ కోసం పదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను చదవాలి. సోషల్‌లో భూగోళశాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం, అర్థశాస్త్రం; మ్యాథ్స్‌లో సంఖ్యామానం, అంకగణితం, బీజగణితం, సమితులు–సంబంధాలు, క్షేత్రగణితం, రేఖాగణితం; తెలుగులో కవులు–కావ్యాలు, భాషా రూపాలు, పరుషాలు–సరళాలు; ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, టెన్సెస్, వొకాబ్యులరీ, ఆర్టికల్స్–ప్రిపొజిషన్స్ తదితర అంశాలపై దృష్టిసారించాలి. మెథడాలజీని ప్రత్యేక దృష్టితో చదవాలి. బోధనా లక్ష్యాలు, భాషా నైపుణ్యాలు, బోధనా ప్రణాళిక, మూల్యాంకనం తదితర అంశాలను కంటెంట్‌లోని టాపిక్స్‌తో అన్వయించుకుంటూ చదవాలి.

స్కూల్ అసిస్టెంట్.. ప్రతి సబ్జెక్ట్‌కు ప్రత్యేకంగా

- స్కూల్ అసిస్టెంట్ పోస్టుల అభ్యర్థులు తమకు అర్హత ఉన్న సబ్జెక్ట్ పరంగా ప్రత్యేక దృక్పథంతో చదవాలి.
- సోషల్ స్టడీస్ ఎస్ఏ పోస్టులకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు.. కంటెంట్ పరంగా.. భూగోళశాస్త్రం : సౌర కుటుంబం–భూమి; భూ ఉపరితల స్వరూపాలు–వర్గీకరణ; ప్రపంచ ప్రకృతి సిద్ధ మండలాలు; ఖండాలు; భారతదేశ ఉనికి–భౌతిక అమరిక; వాతావరణం; సముద్రాలు; తెలంగాణ భౌగోళిక అంశాల గురించి అవగాహన పొందాలి. చరిత్రకు సంబంధించి మధ్యయుగ ప్రపంచం; ప్రాచీన భారతీయ నాగరికతలు; ఢిల్లీ సుల్తానులు; మొఘలుల సామ్రాజ్యం; భారతదేశంలో స్వాతంత్ర్య ఉద్యమం; ఆధునిక ప్రపంచం; ఆర్థిక, సామాజిక రంగాల్లో మార్పులపై ప్రత్యేక దృష్టితో చదవాలి. పౌరశాస్త్రంలో భారత రాజ్యాంగం; లౌకికత్వం–భారతదేశం; ప్రపంచ శాంతి–భారతదేశం పాత్ర; ఐక్యరాజ్య సమితి–విధి విధానాలపై అవగాహన పొందాలి. ఎకనామిక్స్ నుంచి ద్రవ్యోల్బణం; ఆర్థికాభివృద్ధి; భారతదేశ ఆర్థిక వ్యవస్థ లక్షణాలు; జాతీయ ఆదాయం; ద్రవ్యం వంటి బేసిక్ కాన్సెప్ట్స్‌పై అవగాహన పొందాలి. సోషల్ స్టడీస్ మెథడాలజీలో సాంఘిక అధ్యయన బోధనా ఉద్దేశాలు; విలువలు; విద్యా ప్రణాళిక; ఉపాధ్యాయుడు; బోధ నోపకరణాలు; మూల్యాంకనం తదితర పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- మ్యాథమెటిక్స్ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు.. కంటెంట్ పరంగా బీజ గణితం, వ్యాపార గణితం, క్షేత్ర గణితం, రేఖా గణితం, త్రికోణమితి, శ్రేఢులు, సమితులు–సంబంధాలు వంటి అంశాలపై పట్టుసాధించాలి. మెథడాలజీలో.. గణితశాస్త్ర బోధనా లక్ష్యాలు, బోధనా విలువలు, బోధనా ప్రణాళిక, బోధనా పద్ధతులు, మూల్యాంకనం వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- బయాలజీ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు కంటెంట్ పరంగా.. జీవ శాస్త్రం–ఆధునిక పద్ధతులు, జీవ ప్రపంచం, సూక్ష్మ జీవుల ప్రపంచం, జంతు ప్రపంచం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. ఈ సబ్జెక్ట్‌లో మెథడాలజీకి సంబంధించి జీవశాస్త్ర బోధనా లక్ష్యాలు, విజ్ఞానశాస్త్ర పాఠ్యప్రణాళిక, జీవశాస్త్ర ఉపగమాలు–పద్ధతులు గురించి తెలుసుకోవాలి.
- ఫిజికల్ సైన్సెస్ స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు.. మెజర్‌మెంట్స్, యూనిట్స్, డైమెన్షన్స్, సహజ వనరులు, మన విశ్వం, కాంతి సిద్ధాంతం, ఉష్ణం, ధ్వని విభాగాలకు సంబంధించి ఉండే అన్ని అంశాలను అప్లికేషన్ విధానంలో నేర్చుకోవాలి. అదే విధంగా అయస్కాంతత్వం, విద్యుదయస్కాంతత్వం, ఆధునిక భౌతిక శాస్త్రానికి సంబంధించిన అంశాలపై లోతైన అవగాహన పెంచుకోవాలి. ఫిజికల్ సైన్సెస్‌లో మెథడాలజీకి సంబంధించి బోధన పరికరాలు, మూల్యాంకన పద్ధతులు, బోధనలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాలపై పట్టు సాధించాలి.


అసంపూర్తిగా ఉన్న వంతెన

రియల్ బాహుబలి సీన్

జ్వరంతో బాధపడుతున్న చంటి బిడ్డ

- చేతులపై ఎత్తుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటించిన బాబాయి
- అసంపూర్తిగా ఉన్న వంతెనతో జనం అవస్థలు



కెరమెరి(ఆసిఫాబాద్): కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్‌లో బాహుబలి సినిమాలో జరిగినట్లు ఓ ఘటన చోటు చేసుకుంది. ఆ సినిమాలో మహేంద్ర బాహుబలిని శివగామి తన చేతిలో పట్టుకుని నదిని దాటినట్లుగా.. లక్మాపూర్ వాగులో ఓ వ్యక్తి చంటి బిడ్డను ఇలా చేతుల్లో పట్టుకుని వాగు దాటాడు. గ్రామానికి చెందిన రాథోడ్ కృష్ణ, సుజాత దంపతుల కూతురు (8 నెలలు) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. మరోవైపు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రామ శివారులోని వాగు ఉప్పొంగుతోంది. దీంతో పాపను ఆస్పత్రికి తీసుకెళ్లే వీల్లేక మూడు రోజులు వేచి చూశారు. చిన్నారి పరిస్థితి విషమించడంతో బుధవారం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యారు. సాయంకోసం కృష్ణ తన తమ్ముడు సాయిప్రకాశ్‌ను తీసుకుని బయల్దేరారు. అయితే వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సాయిప్రకాశ్ చిన్నారిని తన చేతుల్లోకి తీసుకుని గొంతు వరకు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటారు. తర్వాత చిన్నారి తల్లిదండ్రులు కూడా వాగుదాటారు. అనంతరం ముగ్గురూ కెరమెరిలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తిరిగి ఇదే రీతిలో వాగుదాటి ఇంటికి వెళ్లారు. కాగా, ఈ వాగుపై 2016లో వంతెన నిర్మాణం ప్రారంభించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇప్పటికీ పనులు పూర్తి కాలేదని ఆ ప్రాంతవాసులు చెపుతున్నారు. దీంతో ఏటా వానాకాలంలో కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోందని లక్మాపూర్ వాసులు వాపోతున్నారు.



వాగు దాటాలన్నా చావే..

భారీ వర్షాలతో తెగిన వంతెన ● వాగులోంచి మృతదేహం తరలింపు

కరకగూడెం: చర్ల మండలంలో మంగళవారం పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని జెట్టీ కట్టి అడవిలో నడుచుకుంటూ మోసుకెళ్లగా.. బుధవారం కరకరగూడెం మండలంలో ఓ మృతదేహాన్ని వాగులో నుంచి మోసుకెళ్లాల్సి వచ్చింది. కరకగూడెం – చిరుమళ్ల గ్రామాల మధ్య గల పెదవాగుపై వంతెన గత జూలైలో కురిసిన భారీ వర్షాలతో కోతకు గురైంది. కాగా, రాయనపేట గ్రామానికి చెందిన కొమరం లక్ష్మి జ్వరంతో భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి కుటుంబసభ్యులునానా అవస్థలు పడ్డారు. ఓ మోస్తరుగా ప్రవహిస్తున్న వాగులో నుంచి మృతదేహాన్ని అవతలి వైపు మోసుకెళ్లి.. అక్కడి నుంచి ట్రాక్టర్‌లో ఇంటికి తరలించారు. పది రోజుల క్రితం కూడా ఓ బాలింతను చంటి బిడ్డతో ఇలాగే వాగు దాటించారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వంతెనకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


మూషిక జింకలను వదులుతున్న అధికారులు

జింకల పునరుత్పత్తి కేంద్రంగా కవ్వాల్

పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్

జన్నారం: గడ్డి మైదానాలు, నీటి వనరులు ఎక్కువగా ఉన్న కవ్వాల్ అభయారణ్యం జింకల పునరుత్పత్తికి అనువైన ప్రదేశమని రాష్ట్ర అటవీ ముఖ్య సంరక్షణ అధికారి (పీసీసీఎఫ్) లోకేశ్ జైశ్వాల్ అన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోని జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ పరిధిలో జింకలు, మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. గడ్డి క్షేత్రాల నిపుణుడు జీడీ ముర్తక్‌ర్, సీసీఎఫ్ వినోద్‌కుమార్‌తో కలిసి జింకలు, మూషిక జింకలను కేంద్రాల్లోకి వదిలారు. అనంతరం గడ్డి క్షేత్రాలను పరిశీలించి, నీటి వసతులపై ఆరా తీశారు. జింకలు, మూషిక జింకల పునరుత్పత్తి కేంద్రాలను పరిశీలించారు. హైదరాబాద్ జూ నుంచి తీసుకువచ్చిన జింకలను పునరుత్పత్తి కేంద్రంలో ఉంచి వాటి సంతతి పెంచుతున్నట్లు తెలిపారు. పులుల అభయారణ్యంలో జింకల ఉత్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతంలో వీటిని వదులుతామని తెలిపారు.

బంగారం తెచ్చి.. చెత్తబుట్టలో వేసి

- ఇద్దరి అరెస్ట్.. 933 గ్రాముల బంగారం స్వాధీనం



శంషాబాద్: కస్టమ్స్ తనిఖీలు తప్పించుకుని బంగారాన్ని బయటికి తరలించేందుకు స్మగ్లర్లు కొత్తకొత్త మార్గాలను ఆశ్రయిస్తున్నారు. విదేశాల నుంచి వచ్చిన ప్రయాణికులే బంగారాన్ని బయటికి తీసుకురాకుండా, ఎయిర్‌పోర్టు ఉద్యోగులతో బయటికి తరలిస్తున్న సంఘటనలు బయటపడుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడు కస్టమ్స్ తనిఖీలకు రాకముందు అరైవల్‌లో ఉన్న మరుగుదొడ్డిలోకి వెళ్లాడు. అక్కడి ఓ చెత్త డబ్బాలో తాను తీసుకొచ్చిన బంగారాన్ని వేసి యథాతథంగా కస్టమ్స్ తనిఖీలకు వెళ్లాడు. తనిఖీల్లో ఏమీ దొరక్కపోయినా అనుమానించిన అధికారులు అతడిని విచారించడంతో తాను తీసుకొచ్చిన బంగారాన్ని చెత్తడబ్బాలో వేసినట్లు చెప్పాడు. దానిని ఎయిర్‌పోర్టు ఉద్యోగి బయటికి తీసుకెళ్లనున్నట్లు చెప్పడంతో అప్రమత్తమైన అధికారులు వెంటనే బంగారాన్ని తరలించేందుకు వెళ్లిన సదరు ఎయిర్‌పోర్టు ఉద్యోగిని కూడా అరెస్ట్ చేశారు. 933 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఉదయం కూడా ఇదే తరహాలో కువైట్ నుంచి వచ్చిన ప్రయాణికుడు 1,300 గ్రాముల బంగారాన్ని చెత్తడబ్బాలో దాచిపెట్టడంతో కస్టమ్స్ అధికారులు దానిని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే.

నైరుతి వానలన్నీ పడ్డట్టే!

- మొత్తం సీజన్ సాధారణ వర్షపాతానికి సరిపడా ఇప్పటికే కురిసిన వానలు
- సెప్టెంబర్ 30 వరకు కురవాల్సింది 72.1 సెంటీమీటర్లు..
- ఇప్పటికే కురిసినది 74.35 సెంటీమీటర్లు
- ఇకపై రాష్ట్రంలో పడేదంతా అధిక వర్షపాతమేనన్న వాతావరణ నిపుణులు


సాక్షి, హైదరాబాద్: నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి వర్షపాతం సంతృప్తికర స్థాయికి చేరింది. మొత్తం సీజన్‌లో పడాల్సిన సాధారణ వర్షపాతం అంతా ఇప్పటికే నమోదైంది. ఇకపై రాష్ట్రంలో కురిసే వర్షాలన్నీ అధిక వర్షాలుగా పరిగణించవచ్చని వాతావరణ నిపుణులు చెప్తున్నారు. ఏటా జూన్ 1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30వరకు ఉన్న కాలాన్ని నైరుతి రుతపవనాల సీజన్‌గా పేర్కొంటారు. ఈ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో 72.10 సెంటీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదవుతుంది. అదే ఈసారి ఇప్పటికే (సెప్టెంబర్ 6 నాటికే) 74.35 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కంటే 1.03 శాతం ఎక్కువగానే పడింది. ఇకపై కురిసే వానలన్నీ అదనంగా కురిసే వానలేనని చెప్తున్నారు.

కొంత కలవరపెట్టినా..

నిజానికి ఈసారి నైరుతి సీజన్ వర్షాలు ఆలస్యంగా మొదలయ్యాయి. జూన్ నెలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులను చూసి రైతులు ఆందోళన చెందారు. పంటల సాగు కూడా ఆలస్యమైంది. అయితే జూలై మొదటి నుంచే పరిస్థితి మారిపోయింది. ఏకంగా రెట్టింపు వర్షపాతం నమోదైంది. మళ్లీ ఆగస్టులో లోటు వర్షపాతం నమోదవగా.. సెప్టెంబర్‌లో వానలు ఊపందుకున్నాయి.

గతేడాది 40శాతం అధికంగా..

రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా నైరుతి సీజన్ వర్షపాతం అధికంగానే నమోదవుతూ వస్తోంది. 2021లో ఏకంగా 49శాతం అధిక వర్షపాతం నమోదుకాగా.. 2022లో 40శాతం అధికంగా (100.97 సెంటీమీటర్లు) వానలు పడ్డాయి. ఈ ఏడాది ఇప్పటికే 74.35 సెంటీమీటర్లు కురవగా.. నెలాఖరు నాటికి ఎంత వర్షపాతం నమోదవుతుందన్నది ఆసక్తికరంగా మారింది. ఈసారి కూడా గణనీయంగానే అధిక వర్షపాతం నమోదుకావొచ్చని అధికారులు భావిస్తున్నారు.



నాలుగు జిల్లాల్లో సాధారణంగా..

రాష్ట్రవ్యాప్తంగా వానలు పడటంతో జిల్లాల వారీగా కూడా లోటు వర్షపాతం లేకుండా పోయింది. అయితే నాగర్‌కర్నూల్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మాత్రం వర్షపాతం కాస్త తక్కువగా, మిగతా జిల్లాల్లో 20శాతం కంటే అధికంగా నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు సిద్దిపేట జిల్లాలో అత్యధిక వర్షపాతం, 22 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదవగా.. మిగతా 10 జిల్లాలు సాధారణ వర్షపాతం కేటగిరీలో ఉన్నాయి.

నేడు, రేపు మోస్తరు వానలు

రాష్ట్రంలో గురు, శుక్రవారాల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపింది. వాయవ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన అల్పపీడనం బుధవారం బలహీనపడిందని.. దక్షిణ ఒడిశా పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వెల్లడించింది. వీటి ప్రభావంతో రెండ్రోజుల పాటు వానలు పడతాయని పేర్కొంది.

వరద గోదావరి ఉగ్ర రూపం

ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

సాక్షి, హైదరాబాద్: నదీ పరీవాహక ప్రాంతంలో ఏకధాటిగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి పోటెత్తింది. ప్రధాన పాయ ప్రాణహితతో పాటు ఇతర ఉప నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన శ్రీరాంసాగర్ నుంచి దిగువన సీతమ్మసాగర్ బ్యారేజీ వరకు గోదావరిపై తెలంగాణలోని అన్ని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేయడంతో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం 11 గంటలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 89 వేల క్యూసెక్కుల వరద పోటెత్తగా, 21 గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేశారు. రాత్రి 10 గంటలకు 59 వేల క్యూసెక్కులకు తగ్గిపోవడంతో ఐదు గేట్లు మూసివేశారు. ప్రాజెక్టులో నీటి నిల్వ పూర్తిస్థాయిలో 90.313 టీఎంసీలకు చేరింది. ఇక కడెం ప్రాజెక్టుకు వరద ప్రవాహం 39 వేల క్యూసెక్కులకు పెరగడంతో 3 గేట్లను ఎత్తారు. ఎస్సారెస్పీ, కడెం నుంచి ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా 2,33,845 క్యూసెక్కుల వరద చేరుతుండగా..20 గేట్లను ఎత్తి 2,02,956 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కాళేశ్వరంలో అంతర్భాగమైన పార్వతి(సుందిళ్ల) బ్యారేజీ నుంచి 2,02,000 క్యూసెక్కులు, సరస్వతి (అన్నారం) బ్యారేజీ నుంచి 1,43,578 క్యూసెక్కులు, మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీ నుంచి 2,30,320 క్యూసెక్కులు, తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజీ నుంచి 4,97,750 క్యూసెక్కులు, దుమ్ముగూడెం వద్ద సీతమ్మసాగర్ బ్యారేజీ నుంచి 3,08,005 క్యూసెక్కుల వరద వచ్చింది వచ్చినట్టుగా దిగువకు వదిలేస్తున్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటిన ఎన్‌సీసీ కేడెట్ ప్రేమ్ కృతిక



సాక్షి, హైదరాబాద్: నగరానికి చెందిన ఎన్‌సీసీ గర్ల్ కేడెట్ గురుగుబెల్లి ప్రేమ్ కృతిక జాతీయ స్థాయిలో సత్తాచాటింది. గత ఆగస్టు 5 నుంచి 19 వరకు లండన్‌లో నిర్వహించిన 'యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్'లో భాగంగా భారత్ నుంచి హాజరైన పది మంది ఎన్‌సీసీ కేడెట్ల బృందంలో ప్రేమ్ కృతిక కూడా ఒకరు. లండన్ పర్యటన తర్వాత హైదరాబాద్‌కు వచ్చిన కృతికను ఎన్‌సీసీ తెలంగాణ, ఏపీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, ఎయిర్ కమోడోర్ వీఎం రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు బుధవారం కృతికను సికింద్రాబాద్‌లోని ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. 2018 నుంచి జూనియర్, సీనియర్ వింగ్ కేడెట్‌గా ఎన్‌సీసీలో తన అనుభవాలను ఆమె పంచుకున్నారు. ఇప్పటికే రెండు సార్లు ఢిల్లీలోని రిపబ్లిక్ డే పరేడ్‌లోనూ పాల్గొన్న కృతిక హైదరాబాద్‌లోని కేశవ్ మెమోరియల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ సైన్స్‌లో బీఎస్సీ బయోటెక్నాలజీ చదువుతున్నారు.

18న వినాయక చవితి.. 28న నిమజ్జనం

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ్ సమితి వెల్లడి

హిమాయత్‌నగర్(హైదరాబాద్): ఈనెల 18వ తేదీన వినాయకచవితి... 28న నిమజ్జనం ఉంటాయని భాగ్యనగర్ గణేశ్‌ఉత్సవ్ సమితి ప్రకటించింది. బుధవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కో–ఆర్డినేషన్ సమావేశంలో అధికారులకు తాము కొన్ని సూచనలు ఇవ్వగా, వారు సానుకూలంగా స్పందించినట్టు ఉత్సవ్ సమితి అధ్యక్షుడు డాక్టర్ భగవంత్‌రావు తెలిపారు. వినాయకచవితి పర్వదినాన్ని 18న లేదా 19వ తేదీన జరుపుకోవాలనే విషయంలో భక్తులు గందరగోళంలో ఉండటాన్ని ఆయన గుర్తు చేశారు. పంచాంగకర్తలు, శృంగేరి పీఠాధిపతులు, కంచి పీఠాధిపతులు 18న పండుగ నిర్వహించాలని సూచించినందున భక్తులంతా ఆ రోజే వినాయకుడిని ప్రతిష్ఠించాలని పిలుపునిచ్చారు. ఖైరతాబాద్ పెద్ద వినాయకుడు మొదలు గల్లీలతో కలిపి దాదాపు 3 లక్షల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్టు చెప్పారు. గత ఏడాది తలెత్తిన సమస్యలేవీ ఇప్పుడు పునరావృతం కాకుండా చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈసారి ఖైరతాబాద్‌లో 63 అడుగుల విగ్రహం ప్రతిష్ఠిస్తామని తెలిపారు. 28వ తేదీ ఉదయం సమయంలోనే ఖైరతాబాద్ వినాయక విగ్రహ నిమజ్జనం ఉంటుందన్నారు. ఉదయం పూట అయితే భక్తులంతా వీక్షిస్తారని అధికారులు చెప్పిన కారణంగా అంగీకరించామని చెప్పారు. నగర రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయని, గణేశ్ విగ్రహాలను తీసుకొచ్చే సమయంలో వీటివల్ల ప్రమాదాలు ఏర్పడే అవకాశాలున్నాయని అధికారులకు సూచించినట్టు భగవంత్‌రావు తెలిపారు. పండుగకు వారం ముందే గుంతల రోడ్లకు మరమ్మతులు చేస్తామని కమిషనర్ రోనాల్డ్‌రోస్ హామీ ఇచ్చారన్నారు.

వర్షం ఉంటే బడులకు సెలవులివ్వండి

జిల్లా అధికారులకు విద్యాశాఖ ఆదేశం

- ఒక్కో జిల్లాలో ఒక్కోలా వర్ష ప్రభావం
- పరిస్థితిని బట్టి జిల్లా యంత్రాంగమే నిర్ణయం తీసుకోవాలని సూచన
- సాధారణ సెలవులు తగ్గించి సిలబస్ పూర్తి చేయాలని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో స్కూళ్లను నడపాలా? వద్దా? అనే విషయాన్ని జిల్లా యంత్రాంగమే నిర్ణయించుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి డీఈవోలకు అంతర్గత ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో ప్రాంతంలో వర్షం ప్రభావం ఒక్కోలా ఉంటోంది. కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలతో ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండగా, కొన్నిచోట్ల వర్ష ప్రభావం అంతగా ఉండటం లేదు. ఈ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటించడం సరికాదని ఉన్నతాధికారులు అభిప్రాయపడుతున్నారు. వాతావరణ శాఖ నివేదికను పరిగణనలోనికి తీసుకుని రాష్ట్రవ్యాప్తంగా సెలవులు ఇవ్వాలన్న ఉపాధ్యాయ సంఘాల డిమాండ్‌ను విద్యాశాఖ తిరస్కరించింది. హైదరాబాద్‌లో తీవ్ర స్థాయిలో వర్షం ఉన్నప్పటికీ, కొన్ని జిల్లాల్లో వర్షం ఏమాత్రం లేదని అధికారులు చెబుతున్నారు. కొన్ని జిల్లాల్లో వర్షం కారణంగా స్కూళ్లు నడపలేని పరిస్థితి ఉన్నప్పుడు, మరికొన్ని జిల్లాల్లో సాధారణ పరిస్థితులు ఉంటున్నాయని గుర్తించారు. వర్షం తీవ్రంగా ఉండి, వరదలు, వాగులు పొంగడం వంటి పరిస్థితులు ఉన్నప్పుడు విద్యార్థులు స్కూళ్లకు రాలేరని విద్యాశాఖ భావిస్తోంది. అలాంటప్పుడు జిల్లావ్యాప్తంగా సెలవు ప్రకటించే అధికారం ఆ జిల్లా యంత్రాంగానికే ఉంటుందని, ఈ దిశగా స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామని ఓ అధికారి తెలిపారు. వర్షాలతో ఎక్కువ రోజులు సెలవులు ఇచ్చిన పక్షంలో ఇతర సాధారణ సెలవులు తగ్గించి, సిలబస్ పూర్తికి చర్యలు తీసుకోవాలని, అవసరమైనప్పుడు ప్రత్యేక క్లాసులు కూడా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించింది.

ఒకే కుటుంబం.. 78 మంది ఉపాధ్యాయులు

గురుపూజోత్సవ వేళ అపూర్వ సమ్మేళనం



హన్మకొండ చౌరస్తా: ఒక కుటుంబంలో ఒకరు లేదా ఇద్దరు.. మహా అయితే నలుగురు ఒకే వృత్తిని ఎంచుకోవడం సాధారణం. కానీ ఒకే కుటుంబం నుంచి ఏకంగా 78 మంది ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. బెంజిమన్ అనే వ్యక్తికి చెందిన నాలుగు తరాలకు చెందిన 78మందికి బుధవారం హనుమకొండ కంచరకుంటలోని సెయింట్‌పాల్ హైస్కూల్ చైర్మన్ ఎం.ఆనంద్ ఆహ్వానం పంపగా 22మంది హాజరయ్యారు. వీరిని గురుపూజోత్సవం సందర్భంగా సన్మానించారు. బెంజిమన్ తండ్రి మోజెస్ బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. 1901లో బెంజిమన్ కుటుంబ సమేతంగా హనుమకొండలో స్థిరపడ్డారు. ఆయనకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వాతావరణాన్ని తట్టుకునేలా వ్యవసాయం

- జీ–20 వ్యవసాయ సాంకేతిక వర్క్‌షాప్ లక్ష్యం ఇదే
- హైదరాబాద్‌లో ముగిసిన జీ–20 సదస్సు


ఎస్కే చౌదరి

సాక్షి, హైదరాబాద్: వాతావరణాన్ని తట్టుకునేలా వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని జీ–20 వ్యవసాయ సదస్సు పిలుపునిచ్చింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్), కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు 'వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయం'పై జీ–20 టెక్నికల్ వర్క్‌షాప్ హైదరాబాద్‌లో జరిగింది. ఈ సదస్సుకు జీ–20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థలతో సహా దాదాపు 100 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వ్యవసాయం, జలశక్తి మంత్రిత్వ శాఖ నుంచి సీనియర్ అధికారులు, కెమికల్స్, ఫెర్టిలైజర్స్, ఎర్త్ సైన్సెస్ అధికారులు కూడా హాజరయ్యారు. వాతావరణ మార్పులు, వ్యవసాయ పరిశోధనకు సంబంధించి వివిధ సమస్యలపై తమ అభిప్రాయాలను నివేదించారు. మూడు రోజులపాటు జరిగిన సదస్సులో చర్చించిన అంశాలపై భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐకార్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్కే చౌదరి, క్రిడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్, ఐకార్ ఏడీజీలు డాక్టర్ రాజ్‌బీర్ సింగ్, డాక్టర్ బికాశ్ మండల్ వెల్లడించారు. ఈ మేరకు వారు బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ జీ–20 టెక్నికల్ వర్క్‌షాప్ ఉద్దేశం భూమి–కుటుంబం–భవిష్యత్తు అని, ఇది ప్రపంచానికి ఉజ్వల భవిష్యత్తును నిర్ధారించడానికి జరిగిన కీలకమైన సదస్సు అని పేర్కొన్నారు. వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయం కోసం అప్‌స్కేలింగ్ క్లైమేట్ రెసిలెంట్ అగ్రికల్చర్–కేస్ స్టడీస్ పైనా నిపుణులు చర్చించారన్నారు. అందుకు సంబంధించి సాంకేతిక ప్రదర్శనలను సదస్సులో ఇచ్చారు. చివరి రోజు బుధవారం హయత్‌నగర్‌లోని క్రిడా రీసెర్చ్ ఫాంను సందర్శించారని వెల్లడించారు.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.